సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 179

శుక్రవారం 19-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



ఈ బామ్మ రోజూ జైలుకు వెళుతుంది!

ఎనభై మూడు సంవత్సరాల అరుణ నరీన్ రోజూ జైలుకు వెళుతుంది. అలాగని ఆమె బంధువులు ఎవరూ జైలులో లేరు. గత పాతిక సంవత్సరాలుగా అరుణ జైలుకు వెళ్లడానికి కారణం ఖైదీలకు యోగా నేర్పించడం, సాధనం చేయించడం!

- వివరాలు 13లో


'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 179

శుక్రవారం 19-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఈపీఎఫ్‌వో 'పాస్‌బుక్ లైట్'

ఒకే లాగిన్‌తో ఎన్నో సేవలు. ప్రధాన పోర్టల్‌లో అందుబాటులోకి. -15లో



అదానీకి సెబీ క్లీన్‌చిట్

నిబంధనల ఉల్లంఘన జరిగిందన్న హిండెన్‌బర్గ్ ఆరోపణలపై క్లియరెన్స్. -15లో

న్యూస్‌రీల్

అన్ని మతాలనూ గౌరవిస్తా



అన్ని మతాలనూ తాను గౌరవిస్తానని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పష్టం చేశారు. విష్ణుమూర్తిపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సోషల్ మీడియాలో తనపై వస్తున్న ఆరోపణలపై ఆయన గురువారం స్పందించారు.

- వివరాలు 6లో

21 నుంచి దసరా సెలవులు



తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 21 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకూ ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. జూనియర్ కాలేజీలకు ఈ నెల 28 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకూ సెలవులు ఉంటాయి.

- వివరాలు 2లో

అన్ని ప్రాంతాలను సమదృష్టితో చూడాలి



ఫ్యూచర్ సిటీతోపాటు పాతబస్తీ కూడా అభివృద్ధి చెందాలని, ప్రభుత్వం అన్ని ప్రాంతాలను సమదృష్టితో చూడాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. ప్రధాని చెప్పిన 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' ఉద్దేశం అదేనన్నారు.

- వివరాలు 16లో

ప్రాణహిత-చేవెళ్ల..

రూ.35 వేల కోట్లు!

- ప్రాజెక్టుకు కొత్తగా ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు
- రీ ఇంజనీరింగ్‌లో తొలగించిన 9 ప్యాకేజీల పనుల పునరుద్ధరణకు కసరత్తు
- 9 ప్యాకేజీల అంచనాలు సవరిస్తే వ్యయం ఈ మేరకు పెరిగే అవకాశం
- మొత్తం పనులను 3 విభాగాలుగా చేసి పీఎఫ్‌ఆర్‌లో ప్రతిపాదనలు!
- తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బరాజ్.. 80 టీఎంసీల తరలింపు లక్ష్యం
- ఉమ్మడి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు



ఆదిలాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి సమీపంలోని ప్రాణహిత నదిపై ప్రతిపాదిత బరాజ్ నిర్మాణ ప్రాంతం (ఫైల్)

సాక్షి, హైదరాబాద్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అంచనాలు సవరిస్తూ కొత్త ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు (పీఎఫ్‌ఆర్) సిద్ధమవుతోంది. గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగమైన 1, 2, 3, 4, 5, 23, 24, 25, 26 ప్యాకేజీల పనులను మళ్లీ పునరుద్ధరించడానికి ప్రీ ఫీజిబిలిటీ నివేదికను సిద్ధం చేయాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కసరత్తు ప్రారంభించిన అధికారులు..పెరిగిన ధరల ప్రకారం ఈ 9 ప్యాకేజీల పనుల అంచనాలను సవరిస్తే, ప్రాజెక్టు వ్యయం ఐదారు రెట్లు పెరిగి రూ.35 వేల కోట్లకు చేరే అవకాశం ఉందనే ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు తెలిసింది.

మూడు కాంపొనెంట్లుగా విభజన: ఈ 9 ప్యాకేజీల పనులను మూడు విభాగాలుగా పీఎఫ్‌ఆర్‌లో ప్రతిపాదిస్తున్నట్టు సమాచారం. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణం, బరాజ్ నుంచి గ్రావిటీ ద్వారా 20 టీఎంసీలను ఆదిలాబాద్ జిల్లాకు తరలించి 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి డి్స్ట్రిబ్యూటరీల నిర్మాణం, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కొండపోచమ్మసాగర్ నుంచి రంగారెడ్డి జిల్లాలో 2.47 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేసేందుకు కాల్వలు, డి్స్ట్రిబ్యూటరీల నిర్మాణం పనులను ప్రతిపాదిస్తున్నట్టు తెలిసింది. ప్యాకేజీలు-1, 2, 3, 4, 5 పూర్తైతే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చెన్నూరు, బెల్లంపల్లి, సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లోని

మిగతా 12వ పేజీలో ▶



జలమయమైన హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్-మహావీర్ ఆస్పత్రి రహదారి

ఉక్కపోత.. కుండపోత

- ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడి ప్రతాపం
- సాయంత్రం 4 తర్వాత భారీ వర్షం

హైదరాబాద్‌లో భారీ ట్రాఫిక్‌జామ్.. నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరంలో ఒకేరోజు మిశ్రమ వాతావరణం కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు భానుడు ప్రతాపం చూపగా.... ఆ తర్వాత ఒకేసారి ఆకాశం మేఘావృతమై వరుణ దేవుడు విశ్వరూపం ప్రదర్శించాడు. భారీ వర్షానికి హైదరాబాద్ అతలాకుతలమైంది. గురువారం గంటన్నర పాటు కురిసిన కుండపోత వర్షానికి నగర జీవనం కకావికలమైంది. ఆకాశానికి చిల్లు పడినట్లు వర్షం పడింది. అత్యధికంగా పాతబస్తీ బహదూర్‌పురాలోని జూపార్క్ వద్ద 8.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ప్రధాన రహదారులు చెరువులను తలపించగా లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. బస్తీల్లోని నివాసాల్లో వరద నీరు వచ్చి చేరింది. వాహనాలు

మిగతా 5వ పేజీలో ▶

గతి తప్పిన జలచక్రం

- ఇటు కుంభవృష్టి, అటు కటిక కరువు
- ప్రపంచ వాతావరణ సంస్థ నివేదిక

12లో

నైపుణ్య నిరూపణకు ఒక్క అవకాశమివ్వండి



- శిక్షణ ఇవ్వండి.. ఆ సమయంలో బాగా చేస్తే వేతనం ఇవ్వండి
- మంచి నైపుణ్యం ప్రదర్శిస్తే కొలువు ఇవ్వండి
- ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం కంపెనీలకు జేఎన్‌టీయూహెచ్ లేఖలు
- మార్కెట్ అవసరాలకు తగ్గట్లుగా స్కిల్స్ అందించాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల నైపుణ్యానికి మెరుగుపెట్టేందుకు జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. వర్సిటీ పరిధిలో చదివే విద్యార్థులకు డిగ్రీ పూర్తయ్యేలోగా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్స్ అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పలు కంపెనీలకు ప్రత్యేకంగా లేఖలు రాసినట్టు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థలతో పాటు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి సంస్థలు, బీహెచ్ఈఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను అధికారులు ఎంపిక చేశారు. ఇంజనీరింగ్ సహా వివిధ వృత్తి విద్యా కోర్సులు చేస్తున్న విద్యార్థులకు కోర్సు పూర్తయ్యేలోగా నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఈ అంశాన్ని కీలకంగా భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై

మిగతా 3వ పేజీలో ▶

పోలీస్ శాఖలో 12,452 ఉద్యోగ ఖాళీలు

- అత్యధికంగా 8,442 సివిల్ పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు
- 3,271 ఏఆర్ కానిస్టేబుల్, సివిల్ ఎస్సై కేటగిరీలో 677 ఖాళీలు
- జాబ్ క్యాలెండర్‌లో చేర్చేందుకు ప్రభుత్వం చర్యలు - 2లో



అమెరికా పోలీసుల కాల్పుల్లో పాలమూరు యువకుడి మృతి



నిజాముద్దీన్ (ఫైల్)

- రూమ్‌మేట్‌తో గొడవపడి కత్తితో పొడిచిన నిజాముద్దీన్
- లొంగిపోవాలన్నా వినకపోవడంతో పోలీసుల కాల్పులు
- ఈ నెల 3న కాలిఫోర్నియా శాంటాక్లారాలో ఘటన
- బంధువులకు సమాచారమివ్వని అక్కడి అధికారులు
- మృతుని తండ్రికి ఓ విద్యార్థి తాజాగా ఫోన్ చేయడంతో విషయం వెలుగులోకి

5లో

పార్టీ తప్పులే శత్రువుకు ఆయుధాలయ్యాయి

మావోయిస్టు అగ్రనేత మల్లోజుల లేఖ?

అంతా గందరగోళం

మావోయిస్టుల లేఖల కలకలం

గతానికి భిన్నంగా వెలువడుతున్న వైనంపై చర్చ.. లేఖల్ని నిర్ధారించని పోలీసులు, పౌరహక్కుల నేతలు

రాజ్యానికి చంపే హక్కు లేదు

శాంతి చర్చల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్, ప్రొ. హరగోపాల్

- వివరాలు 3లో

ఓట్ల దొంగలకు ఎన్నికల సంఘమే అండ



- సాఫ్ట్‌వేర్, తప్పుడు దరఖాస్తులతో ఓట్ల తొలగింపు
- ఓట్ల చోరులను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కాపాడుతున్నారు
- దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం

6లో

ఆన్‌లైన్‌లో ఓట్లు తొలగించడం సాధ్యం కాదు

రాహుల్ గాంధీ ఆరోపణలు నిరాధారం: ఈసీ స్పష్టీకరణ


క్లుప్తంగా...

21 నుంచి దసరా సెలవులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 21 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకూ ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. జూనియర్ కాలేజీలకు ఈనెల 28 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకూ సెలవులు ఉంటాయి. దసరా సెలవుల్లో ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లో ఎలాంటి తరగతులు నిర్వహించవద్దని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. దసరా సెలవుల్లో అవసరమైన పునశ్చరణకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని విద్యాశాఖ సూచించింది. ప్రతీ విద్యార్థికి కొంత హోం వర్క్ ఇవ్వాలని స్పష్టం చేసింది.

ఒకేసారి 404 కేసుల విచారణా?

ఆర్టీఐ కమిషన్ తీరును తప్పుబట్టిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఒకేసారి 404 కేసులు ఎలా విచారణ చేస్తారని.. ఏఏ కేసులు విచారణ చేస్తున్నారో తెలియజేయాలి కదా అని సమాచార హక్కు కమిషన్ తీరును హైకోర్టు తప్పుబట్టింది. ప్రజా సంబంధాల అధికారులు, మొదటి అప్పిలేట్ అధికారులు తగిన సమాచారం ఇవ్వకపోవడంతో శ్యామ్ అనే వ్యక్తి రాష్ట్ర సమాచార కమిషన్‌లో సెకండ్ అప్పీల్ దాఖలు చేశారు. ఇలా 404 కేసులు వేశారు. వీటిలో వాదనలు సమర్పించేందుకు రావాలంటూ శ్యామ్‌కు కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఇన్ని కేసుల విచారణ ఒకే రోజు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ అతను హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి గురువారం విచారణ చేపట్టారు. కమిషన్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 17 వేల కేసుల పెండింగ్ భారాన్ని తగ్గించేందుకు కమిషన్ చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే ఎక్కువ అప్పీళ్లు వేసిన పిటిషనర్‌కు నోటీసులు జారీ చేసిందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఒకేసారి ఇన్ని కేసుల్లో పిటిషనర్ ఎలా వాదనలు వినిపిస్తారని ప్రశ్నించారు. నోటీసులను కొట్టివేస్తూ.. పూర్తి వివరాలతో మరోసారి జారీ చేయాలని కమిషన్‌ను ఆదేశించారు.

ఆర్టీఐ అప్పీళ్లపై తొలిసారి ఫుల్ బెంచ్ విచారణ

సాక్షి, హైదరాబాద్: సమాచార హక్కు చట్టం ప్రకారం దాఖలైన రెండో అప్పీళ్లపై కమిషన్ ఫుల్ బెంచ్ గురువారం విచారణ చేపట్టింది. సమాచార ప్రధాన కమిషనర్ జి.చంద్రశేఖర్‌రెడ్డితో పాటు కమిషనర్లు పీవీ శ్రీనివాస్‌రావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, పర్వీన్, దేశాల భూపాల్, వైష్ణవి మేర్ల.. ఈ అప్పీళ్లపై విచారణ చేపట్టారు. వందలాది అప్పీళ్లు దాఖలు చేసిన శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్, అష్రాఫ్‌లకు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిపించారు. సమాచారం కోరుతూ ఏటా దాదాపు 1.2 లక్షల దరఖాస్తులు వస్తున్నాయని, 90 శాతం ప్రజా సంబంధాల అధికారి(పీఐఓ) వద్దే పరిష్కారం అవుతుండగా, 8 శాతం రెండో అప్పీల్‌కు వస్తున్నాయని కమిషన్ అభిప్రాయపడింది.

ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా జలాల్‌పురంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎస్.కిశోర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 18 – 30 ఏళ్ల మధ్య వయసుండాలని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామని వివరించారు. శిక్షణ పూర్తి చేసుకొన్న అభ్యర్థులకు ఉద్యోగం కూడా కల్పిస్తామని తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్ ప్రతులతోపాటు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 23న సంస్థలో నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నో ఆల్కహాల్ ప్లెడ్జ్!



నాన్-ఆల్కహాల్ వైపు సోషల్ డ్రింకింగ్ కల్చర్ | మాక్‌టెయిల్స్‌కు మిలీనియల్స్, జెన్-జీ చీర్స్ | మారుతున్న పట్టణ యువత ఆలోచనా ధోరణి

సాక్షి, స్పెషల్ డెస్క్

అసలే యూత్.. ఆపై ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యత. ఇంకేముంది భారతీయ మిలీనియల్స్ (29–44 సంవత్సరాల వయసు), జెన్-జీ తరం (13–28 ఏళ్లు) ఆల్కహాల్ లేని లేదా తక్కువ ఆల్కహాల్ ఉన్న పానీయాలను ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఈ ధోరణి ముఖ్యంగా మెట్రో నగరాల్లో బాగా కనిపిస్తోంది. సరదాగా గడిపేందుకు ఆల్కహాల్ మాత్రమే పరిష్కారం కాదన్నది యువతరం మాట.

సోషల్ డ్రింకింగ్ కల్చర్ భారత్‌లో క్రమంగా మారుతోంది. నీల్సన్‌ఐక్యూ తాజా అధ్యయనం ప్రకారం.. సర్వేలో పాలుపంచుకున్న భారతీయ వినియోగదారుల్లో 24% మంది ఆల్కహాల్ రహిత లేదా తక్కువ ఆల్కహాల్ ప్రత్యామ్నాయాలను ఆస్వాదిస్తున్నారు. ఈ విషయంలో ప్రపంచ సగటు 17% ఉంది. ఆల్కహాల్ రహిత లేదా తక్కువ ఆల్కహాల్ ఉన్న పానీయాలను తీసుకుంటున్నవారిలో సగానికి పైగా జెన్-జీ, మిలీనియల్స్ ఉన్నారు. ఫిలిప్పీన్స్ తర్వాత ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ఇలాంటి మాక్‌టెయిల్స్‌కు (ఆల్కహాల్ రహిత పానీయాలు) భారత్ రెండో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించింది. మనదేశంలో ఉత్తరాదిలో దాదాపు 54% మంది, తూర్పు భారతంలో 50%, పశ్చిమాన 43%, దక్షిణాన 37% మంది ఆల్కహాల్ పానీయాలను ఇష్టపడుతున్నారని నివేదిక తెలిపింది.

ప్రపంచవ్యాప్తంగా నాన్ ఆల్కహాలిక్ మార్కెట్ 13 బిలియన్ డాలర్లు. 2023-27 మధ్య ఏటా 7 శాతం వృద్ధికి అవకాశం.

భారత్‌లో ఈ మార్కెట్ విలువ రూ.67,000 కోట్లు. వీటిలో.. కార్బొనేటెడ్ సాఫ్ట్ డ్రింక్స్, ప్యాకేజ్డ్ వాటర్, పళ్ల రసాలు, స్పోర్ట్స్ డ్రింక్స్ ఉన్నాయి.

భారత్, చైనా, యూకే, యూఎస్‌లో ఆల్కహాల్ రహిత పానీయాలను ఆస్వాదిస్తున్న వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది.

ట్రెండ్‌గా మారుతోంది

సాంస్కృతిక, సామాజిక వైఖరుల్లో వస్తున్న మార్పులు దేశంలో మద్యపాన రహిత జీవనశైలికి మార్గం సుగమం చేస్తున్నాయి. మద్యపానానికి దూరంగా ఉండటం అనేది గతంలో మతపరమైన లేదా ఆరోగ్య కారణాలతో ముడిపడి ఉండేది. ప్రస్తుతం ట్రెండ్‌గా మారుతోంది. ఏం తీసుకుంటున్నాం, వాటి ప్రభావం ఏమిటో తెలుసుకుని మరీ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. మిలీనియల్స్, నిపుణులు, పట్టణ వినియోగదారుల నుంచి ఆల్కహాల్ రహిత పానీయాలకు డిమాండ్ పెరుగుతోంది. సంప్రదాయ బీర్ అనుభవాన్ని రాజీ పడకుండా మెట్రోలలో ఈ డిమాండ్‌ను తీర్చడానికి కంపెనీలు కూడా నూతన ఆవిష్కరణలు చేస్తున్నాయి.

జీబ్రా స్ట్రిప్పింగ్ ట్రెండ్

జెన్-జీ అంటేనే సరికొత్త కోరికలు, ఆవిష్కరణలకు పెట్టింది పేరు. వారు ఇటీవలి కాలంలో జీబ్రా స్ట్రిప్పింగ్ ట్రెండ్‌ను ఎక్కువగా అనుసరిస్తున్నారు. అంటే ప్రతి ఆల్కహాలిక్ డ్రింక్ తర్వాత ఆల్కహాల్ రహిత పానీయాలను తీసుకుంటున్నారు. యూత్ ఎక్కువగా కాక్‌టెయిల్స్, ప్రీమియం డ్రింక్స్ తాగుతున్నారు. విలువ పరంగా చూస్తే వీటి విలువ ఎక్కువే కావడం గమనార్హం. అందుకే, కొన్ని కంపెనీలు ఆల్కహాల్ లేని పానీయాల్లో పెట్టుబడులు కూడా పెడుతున్నాయి.

ఆల్కహాల్ రహితంవైపు..

నీల్సన్‌ఐక్యూ అధ్యయనం ప్రకారం భారతదేశంలో 53% మంది పూర్తిగా తాగనివారు లేదా చాలా తక్కువ తాగేవారు.. చట్టబద్ధంగా తాగే వయస్సు కలిగి ఉన్నారు. అంటే.. వీళ్లంతా 18–34 ఏళ్ల లోపు వారన్నమాట. ఇక, ఈ కేటగిరీలో ఉన్న 35–54 ఏళ్లవారు 35 శాతం కాగా, 55 ఏళ్లకుపైబడిన వారు 13 శాతం. ఆల్కహాల్ రహిత పానీయాల వైపు యువత ఆకర్షితులవుతుండటంతో ఈ మార్కెట్ దేశంలో ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. ప్రధానంగా ఈ ట్రెండ్ మెట్రోల్లో ఎక్కువగా కనిపిస్తోంది. నాన్ ఆల్కహాలిక్ స్పిరిట్స్ లభ్యత గతంలో చాలా పరిమితంగా ఉండేది. ప్రస్తుతం ఇవి విరివిగా లభిస్తుండడం సైతం డిమాండ్‌కు ఆజ్యం పోస్తోంది. పైగా క్విక్ కామర్స్ కంపెనీలు వీటిని నేరుగా కస్టమర్లకు 10 నిమిషాల్లో డెలివరీ చేస్తున్నాయి. హైదరాబాద్, గోవా, బెంగళూరు, పుణే, ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లోని బార్లు సరికొత్త మాక్‌టెయిల్స్‌ను తమ కస్టమర్లకు అందిస్తున్నాయి. కోలా పానీయాలు, తాజా లైమ్ సోడా, మొహిటో వంటి ఆల్కహాల్ రహిత పానీయాలు మెనూలో వెనుక భాగంలో ఉండే రోజులు పోయాయన్నది మార్కెట్ వర్గాల మాట.

మీడియా స్వేచ్ఛను గౌరవించే పరిస్థితిలో ప్రభుత్వాలు లేవు

ప్రొఫెసర్ హరగోపాల్



సాక్షి, హైదరాబాద్: మీడియాను సహించే పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఉండడం లేదని ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై ఏపీ పోలీసులు కేసులు నమోదు చేయడంపై స్పందిస్తూ.. 'మీడియాకు, జర్నలిస్టుకు ఒక హక్కు, స్వేచ్ఛ ఉంటుందన్న విషయాన్ని గౌరవించే పరిస్థితుల్లో ఇప్పుడు కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వాలైనా లేవు. జర్నలిస్టులను గౌరవించాలన్న విషయాన్ని వదిలేస్తున్నాయి. అందుకే ఇలాంటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి' అని వ్యాఖ్యానించారు.





కేసులతో భయపెట్టే ప్రయత్నమే ఇది: జస్టిస్ చంద్రకుమార్

సమాజ శ్రేయస్సుకు ప్రజాస్వామిక విలువలు, వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం, స్వతంత్ర్య ఎన్నికల వ్యవస్థ ఎంతో అవసరమని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. 'పత్రికా స్వేచ్ఛ వాక్ స్వతంత్ర్యంలో ఒక భాగం. మీడియా అనేది ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య కళ్ల మాదిరిగా పనిచేస్తుంది. ఎక్కడో జరిగే అక్రమాలు, అన్యాయాలను మీడియా బట్టబయలు చేస్తుంది. దానివల్ల ప్రభుత్వాలకు, అధికారులకు తాము చేస్తున్న పొరపాట్లను సరిదిద్దుకునే అవకాశం కలుగుతుంది. కానీ, ప్రభుత్వానికి ఇష్టంలేని, నాయకులకు ఇష్టం లేని వార్తలు వచ్చినప్పుడు విలేకరులపై, ఎడిటర్లపై కేసులు పెట్టడం అంటే పత్రికా స్వేచ్ఛపై దెబ్బకొట్టడమే. విలేకరులపై, ఎడిటర్లపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తే ఇలాంటి వార్తలు రాకుండా చేయవచ్చన్నది వాళ్ల ప్రయ త్నం. కానీ, అది అప్రజా స్వామికం. ఈ చర్యలు వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తాయి. అదేవిధంగా పత్రికా స్వేచ్ఛను హరిస్తాయి. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం' అని విమర్శించారు.

'సాక్షి' ఎడిటర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి

ఖమ్మంలో అఖిలపక్ష పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష పార్టీల నేతలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'సాక్షి'ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై ఏపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలో గురువారం జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. 'సాక్షి'ఎడిటర్‌తో పాటు ఖమ్మంలో టీన్యూస్ ప్రతినిధి సాంబశివరావు, ఆ మీడియా సిబ్బందిపై పెట్టిన అక్రమ కేసులను ప్రభుత్వాలు వెంటనే ఎత్తివేయాలని నాయకులు డిమాండ్ చేయగా.. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నేతలు సంఘీభావం తెలిపారు. బీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజాసంఘాల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియాను నిర్బంధాలతో లోబర్చుకోవాలనే ఆలోచనను ప్రభుత్వాలు మానుకోవాలని హెచ్చరించారు. సీపీఐ నేత హేమంతరావు, మాస్‌లైన్ నేత పోటు రంగారావు, సీపీఎం నేత కల్యాణం వెంకటేశ్వరరావు, న్యూడెమోక్రసీ నాయకుడు మోహన్‌రావు, బీఆర్‌ఎస్ నేత పగడాల నాగరాజు, ఐజేయూ నేతలు రాంనారాయణ, వెంకటేశ్వరరావు, టీజేఎఫ్ నేత ఆదినారాయణ, జేఏసీ చైర్మన్ తిరుమలరావు తదితరులు భేటీలో పాల్గొన్నారు.

రిసెప్షన్ చేయం.. యూరియాకు సాయం

మిర్యాలగూడ ఎమ్మెల్యే రూ.2 కోట్ల విరాళం

- కొడుకు పెళ్లి రిసెప్షన్ మొత్తంతో రైతు సంక్షేమం



సీఎం రేవంత్‌రెడ్డికి రూ.2 కోట్ల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుటుంబసభ్యులు

మిర్యాలగూడ: తన నియోజకవర్గంలోని రైతుల సంక్షేమం కోసం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రూ.2 కోట్ల విరాళాన్ని గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. ఇటీవల తన కుమారుడు వివాహం జరగగా.. రిసెప్షన్ కోసం ఖర్చు చేయాలనుకున్న రూ.2 కోట్లను రైతుల సంక్షేమం కోసం అందజేశారు. నియోజకవర్గంలో లక్ష మంది రైతులకు ఒక బస్తా యూరియాను ఉచితంగా అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కుమారుడు, కోడలు సాయిప్రసన్న, వెన్నెల వివాహం గత నెలలో జరిగింది. రిసెప్షన్ ఈ నెల 12న ఘనంగా చేయాలని భావించారు. అయితే తమకు వేడుక వద్దని.. ఆ డబ్బును రైతుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని కొడుకు, కోడలు కోరారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు గురువారం కుటుంబ సభ్యులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డికి చెక్కు అందజేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఆయన సతీమణి మాధవి, పెద్ద కుమారుడు, కోడలుతో పాటు చిన్న కుమారుడు సాయిఈశ్వర్‌రెడ్డి తదితరులు నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని సీఎం నివాసానికి వెళ్లి చెక్కు అందజేశారు.

దసరాకు 7,754 ప్రత్యేక బస్సులు

బతుకమ్మ సందర్భంగా ఈ నెల 20 నుంచే ప్రారంభం

- అక్టోబర్ 2 వరకు హైదరాబాద్ నుంచి స్పెషల్ సర్వీసులు
- ప్రజలను క్షేమంగా గమ్యస్థానాలకు చేరుస్తాం: ఆర్టీసీ ఎండీ సజ్జనార్



సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రజలకు రవాణాపరంగా ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) చర్యలు చేపట్టింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 7,754 స్పెషల్ బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. వీటిలో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ ప్రత్యేక బస్సులను నడపనుంది. ఈ నెల 30న సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 2న దసరా పండుగలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 27 నుంచే చాలామంది సొంతూళ్లకు వెళ్లే అవకాశం ఉండటంతో ఆర్టీసీ ఈ ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకురానుంది. తిరుగు ప్రయాణానికి సంబంధించి అక్టోబర్ 5, 6 తేదీల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రత్యేక బస్సులను హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్‌తోపాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ తదితర ప్రాంతాల నుంచి నడిపిస్తారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు ఈ బస్సులు నడుపుతోంది.

దసరా స్పెషల్ బస్సుల్లో ధరల సవరణ..: దసరా స్పెషల్ బస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం టికెట్ ధరలను సవరించనున్నారు. తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు ఈ సవరణ ఉంటుంది. ఈ నెల 20 నుంచి 30 వరకు, అక్టోబర్ 1, 5, 6 తేదీల్లో నడిపే స్పెషల్ బస్సుల్లోనే సవరణ చార్జీలు అమల్లో ఉంటాయి. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యులర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు.

ప్రయాణికులకు సకల సౌకర్యాలు

'బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా ప్రజలకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడానికి సంస్థ సిద్ధంగా ఉంది. గత దసరా కంటే ఈసారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, సంతోష్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కుర్చీలు, తాగునీరు తదితర వసతులతోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీచేశాం. ప్రతి రద్దీ ప్రాంతంలో పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నాం. ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతారు'అని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. వైట్ నంబర్ ప్లేట్ గల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ఇబ్బందులు పడొద్దని సూచించారు. టీజీఎస్‌ఆర్టీసీలో ఎంతో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని తెలిపారు. ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను సంస్థ అధికారిక వెబ్‌సైట్ [illegible] జీ లో చేసుకోవాలని సూచించారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని తెలిపారు.

శశికళ కేసులో హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

కెనరా బ్యాంకును రూ.200 కోట్లు మోసం చేసినట్లు ఆరోపణలు

సాక్షి, హైదరాబాద్: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళ,మరికొందరిపై సీబీఐ నమోదు చేసిన రూ.200 కోట్ల బ్యాంకు మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించింది. చెన్నైతోపాటు హైదరాబాద్‌లోని మార్గ్ గ్రూప్ సంస్థకు చెందిన జీఆర్‌కే రెడ్డి సహా మరికొందరి ఇళ్లలో ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. కెనరా బ్యాంకులో జరిగిన రూ.200 కోట్ల మోసానికి సంబంధించి గతంలో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది.

అక్టోబర్‌లో బీసీ రాజ్యాధికార సమితి ప్లీనరీ

సాక్షి, హైదరాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి దింపే లక్ష్యంతో అక్టోబర్‌లో రాష్ట్ర సర్వసభ్య సమావేశం, ప్రధాన కార్యవర్గ ప్లీనరీ నిర్వహించనున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ తెలిపారు. దశాబ్దం పాటు సాగిన బీసీ రాజ్యాధికార సమితి పోరాటాలు.. జాతీయ పార్టీల విధానాలపై గణనీయమైన మార్పులు తెచ్చాయని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్లీనరీలో జాతీయ స్థాయిలో ప్రభావశీల బీసీ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

పీఏఎఫ్ఐ సదస్సుకు సీఎం రేవంత్

విజన్ తెలంగాణ రైజింగ్ అంశంపై ప్రత్యేక చర్చ నేడు

సాక్షి, న్యూఢిల్లీ: పబ్లిక్ ఎఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా (పీఏఎఫ్ఐ) 12వ వార్షిక సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ప్రజా వ్యవహారాల్లో జాతీయ, అంతర్జాతీయ, భారీ, మధ్య తరహా సంస్థల భాగస్వామ్యంతో పనిచేస్తున్న పీఏఎఫ్ఐ.. ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ వేదికగా రెండు రోజుల సదస్సు నిర్వహిస్తోంది. కార్యక్రమానికి తెలంగాణ భాగస్వామ్య రాష్ట్రంగా ఉంది. రెండోరోజు శుక్రవారం సదస్సు ముగియనుంది. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు జరగనున్న ఈ సదస్సులో 13వ సెషన్‌లో భాగంగా 'విజన్ తెలంగాణ రైజింగ్'అంశంపై ప్రత్యేక చర్చ ఉంటుంది. ఈ మేరకు ఆయన గురువారం ఢిల్లీకి చేరుకున్నారు. సదస్సు అనంతరం లేదా శనివారం పలువురు కేంద్ర మంత్రులను సీఎం కలిసి.. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించే అవకాశం ఉంది.

వివేక్‌పై సీఎంవోలో మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు!

తన శాఖ అంశంపై అటవీ అధికారులతో మంత్రి వివేక్ భేటీపై సీరియస్



సాక్షి, హైదరాబాద్: కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామిపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ.. ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో)లో ఫిర్యాదు చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. తన శాఖకు సంబంధించిన అంశంపై తమ శాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, దీనిపై కనీస సమాచారం సంబంధిత శాఖ మంత్రిగా తనకు తెలియజేయకపోవడంపై మంత్రి సురేఖ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ సమావేశానికి సంబంధించిన సమాచారం తమ శాఖ అధికారుల ద్వారా తెలుసుకోవాల్సి రావడంపై మంత్రి సురేఖ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో మంత్రి వివేక్‌పై ఆమె సీఎంవోలో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ సమావేశం 2,3 రోజుల క్రితం జరగగా, ఆ తర్వాత మంత్రి సురేఖ సీఎంవోలో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. చెన్నూరు నియోజకవర్గంలోని అటవీ భూముల గుండా వెళుతున్న రహదారులకు ఫారెస్ట్ క్లియరెన్స్, పోడు భూముల సమస్యలపై సచివాలయంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అటవీ శాఖ అధికారులతో మంత్రి వివేక్ సమావేశం నిర్వహించడాన్ని కొండా సురేఖ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది.

పోలీస్ శాఖలో 12,452 ఉద్యోగ ఖాళీలు

అత్యధికంగా 8,442 సివిల్ పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు

- 3,271 ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులు.. సివిల్ ఎస్సై కేటగిరీలో 677 ఖాళీలు
- జాబ్ క్యాలెండర్‌లో పొందుపర్చేందుకు ప్రభుత్వం చర్యలు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ ఖాళీలపై ప్రభుత్వం దృష్టి సారించింది. శాఖల వారీగా వివరాలను సేకరిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీసు శాఖ ప్రభుత్వానికి ఖాళీల వివరాలను సమర్పించింది. దీని పరిధిలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ (నేరుగా నియామకాలు) పద్ధతిలో మంజూరైన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న వారి సంఖ్య, ఖాళీల వివరాలను తెలియజేసింది. ప్రస్తుతం రాష్ట్ర పోలీసు విభాగం పరిధిలో వివిధ కేటగిరీల్లో 12,452 ఉద్యోగ ఖాళీలున్నాయి. ఇందులో అత్యధికంగా పోలీస్ కానిస్టేబుల్ (సివిల్) కేటగిరీలో 8,442 పోస్టులు ఉండగా, పోలీస్ కానిస్టేబుల్ (ఏఆర్) కేటగిరీలో 3,271 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సబ్ ఇన్‌స్పెక్టర్ సివిల్ కేటగిరీలో 677, ఏఆర్ కేటగిరీలో 40, టీజీఎస్పీ కేటగిరీలో 22 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖకు నివేదించింది.

పోలీసు శాఖలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కేటగిరీలో పోస్టులు



కేటగిరీ	మంజూరు	వర్కింగ్	వేకెంట్
పోలీస్ కానిస్టేబుల్ (సివిల్)	32,923	24,481	8,442
సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్)	3,852	3,175	677
పోలీస్ కానిస్టేబుల్ (ఏఆర్)	18,506	15,235	3,271
సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఆర్)	532	492	40
పోలీస్ కానిస్టేబుల్ (టీజీఎస్పీ)	10,281	10,281	-
సబ్ ఇన్‌స్పెక్టర్ (టీజీఎస్పీ)	550	528	22

అన్ని శాఖల సమాచారం రావాలి

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో కేడర్ల వారీగా మంజూరైన పోస్టులు, పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య, ఖాళీలు, డిప్యుటేషన్, సెలవులపై వెళ్లిన ఉద్యోగులు.. ఇలా వివిధ కోణాల్లో సమగ్ర సమీక్ష కోసం ప్రత్యేకంగా మాజీ సీఎస్ శాంతికుమారి నేతృత్వంలో సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తోంది. ప్రధానంగా పని భారానికి తగినట్లుగా పోస్టులున్నాయా? లేనట్టైతే డిమాండ్ ఏ విధంగా ఉంది? అనే అంశాల ప్రాతిపదికన నిశిత పరిశీలన చేస్తోంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ శాఖలు స్పష్టమైన సమాచారాన్ని కమిటీకి అందించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్ని విభాగాధిపతులకు ప్రత్యేకంగా సర్క్యులర్ జారీ చేశారు. ఈ సమీక్షలు పూర్తయి కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన తర్వాత ఆయా ఖాళీలతో జాబ్ క్యాలెండర్‌కు రూపకల్పన జరుగుతుంది. ఆ తర్వాత ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే రాష్ట్ర పోలీసు శాఖకు సంబంధించి ఉద్యోగ ఖాళీల లెక్కలు తేలగా మిగిలిన శాఖల సమాచారం అందాల్సి ఉంది.

సిరిసిల్ల కలెక్టర్‌పై ప్రభుత్వం సీరియస్

17న జాతీయ జెండా ఆవిష్కరణలో ప్రొటోకాల్ ఉల్లంఘన



సాక్షి, హైదరాబాద్: రాజన్న సిరిసిల్ల కలెక్టర్ ప్రొటోకాల్ ఉల్లంఘనలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సిరిసిల్లలో జరిగిన ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. అయితే పతాకావిష్కరణ కార్యక్రమానికి కలెక్టర్ సందీప్‌కుమార్ సకాలంలో హాజరు కాకుండా ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కలెక్టర్ కారు పది నిమిషాల ముందే అక్కడ ఉన్నా.. జాతీయ పతాకావిష్కరణ సమయంలో నిబంధనలు పాటించకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా తప్పుపట్టింది. ఈ మేరకు కలెక్టర్‌కు సీఎస్ రామకృష్ణారావు నోటీసులు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలలోగా తన సంజాయిషీని పంపించాలని ఆదేశించారు. కలెక్టర్ ఇచ్చే వివరణను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటాం

ఐటీబీపీ జవాన్లతో కేంద్ర మంత్రి బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: దేశ సరిహద్దుల్లో ఎముకలు కొరికే చలిలో ప్రాణాలకు తెగించి దేశ సేవ చేస్తున్న ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) జవాన్లను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్పారు. ఐటీబీపీ జవాన్ల త్యాగాలు భారతీయుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయన్నారు. హరియాణాలోని భానులో ఉన్న ఐటీబీపీ బేసిక్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం ఆయన 9 నివాస భవన సముదాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... దేశ భద్రతా వ్యవస్థకు ఆత్మగా నిలిచిన ఐటీబీపీ హిమవీరుల మధ్య నిలబడటం గర్వంగా ఉంది. దేశ భవిష్యత్తు కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు శిరస్సు వంచి నివాళులర్పిస్తున్నాను'అని అన్నారు.

తెలుగు 'వారియర్స్'తో..

హరియాణా పర్యటనలో భాగంగా బండి సంజయ్ శిక్షణలో ఉన్న కానిస్టేబుల్ అభ్యర్థులతో ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన వారితో ప్రత్యేకంగా ముచ్చటించారు. మహిళా అభ్యర్థులు మొబైల్ టాయిలెట్లు కావాలని కోరగా, వాటిని తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ మహిళా కానిస్టేబుళ్లు సెప్టెంబర్ 29, 30 తేదీల్లో బతుకమ్మ వేడుకలు జరుపుకోవడానికి అనుమతి కోరగా, వేడుకలను సంప్రదాయ బద్ధంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

పార్టీ తప్పులే శత్రువుకు ఆయుధాలయ్యాయి

మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు లేఖ?

- పరిస్థితులను అర్థం చేసుకోవడంలో పార్టీ విఫలమైంది
- భవిష్యత్తులో సరైన మార్గంలో ముందుకు వెళ్లాలి
- చైనా పంథా, రష్యా పంథా అనే పిడివాద ఆచరణకు స్వస్తి చెప్పాలి
- భారతదేశ స్థల, కాల పరిస్థితులకు తగిన పంథా అనుసరించాలి
- తాత్కాలికంగా సాయుధ పోరాట విరమణను ప్రజలు అర్థం చేసుకోవాలి



సాక్షి, హైదరాబాద్: 'మావోయిస్టు పార్టీ అనుసరించిన అతివాద, దుందుడుకువాద చర్యలన్నీ ఎక్కడికక్కడే అంతిమంగా శత్రువుకు ఉపయోగపడే ఆయుధాలయ్యాయి. వాటి ద్వారా శత్రువు దండకారణ్యం మినహా మిగతా ప్రాంతాలలో తక్కువ కాలంలోనే ఉద్యమాలను దెబ్బ తీయడంతో పాటు మమ్మల్ని బలపడకుండా చేయగలిగాడు. చాలా కాలం క్రితమే బలహీనతలు ముందుకు వచ్చినప్పటికీ సకాలంలో వాటిని అర్థం చేసుకోలేకపోయాం. సరిదిద్దుకోలేకపోయాం. నిలకడైన, బలమైన సంఘటిత విప్లవోద్యమాన్ని నిర్మించలేకపోయాం. ఇప్పటికైనా పంథా మార్చుకోవాలి. అందుకు వీలుగా, తాత్కాలికంగా చేస్తున్న సాయుధ పోరాట విరమణను ప్రజలు అర్థం చేసుకోవాలి..'అని మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ సోను పేరిట విడుదలైన ఒక లేఖ పేర్కొంది. తమ తప్పులకు బాధ్యత వహిస్తూ ప్రజలకు క్షమాపణ చెప్పుకుంటున్నట్టు అందులో పేర్కొన్నారు. ఈ ఆరు పేజీల లేఖ గురువారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే సాధారణంగా మావోయిస్టులు విడుదల చేసే లేఖ మాదిరి ఇది లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. లేఖలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

సరైన మార్గంలో ముందుకు వెళదాం

గత 20 మాసాలకు పైగా భారత దోపిడీ పాలకవర్గాలు కొనసాగిస్తున్న చుట్టుముట్టి మట్టుబెట్టే దాడులను మనమంతా అసమాన త్యాగాలతో ఎదుర్కొంటున్నాం. ఈ దాడులలో పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు సహా వందలాది మంది కామ్రేడ్లు, విప్లవ ప్రజా సంఘాలు, ప్రజా మిలీషియా, జనతన సర్కార్ల కార్యకర్తలను, విప్లవ ప్రజలనూ కోల్పోయాం. విప్లవోద్యమం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేస్తున్న అమర వీరులందరికీ పేరు పేరునా విప్లవ జోహార్లు అర్పిద్దాం. వారి ఆశయాల సాధనకై భవిష్యత్తులో సరైన మార్గంలో ముందుకు పోదాం.

కొత్త వెలుగులు నింపినా..

ఐదు దశాబ్దాలకు పైగా పోరాటాలు ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులను, ఆశలను నింపాయి. ముఖ్యంగా మహిళలు తమ సమరశీల పోరాటాల ద్వారా పితృస్వామ్యంపై సాధించిన విజయాలు వారి జీవితాలలో పెను మార్పులకు దారి తీసి మహిళా విముక్తికి పునాదులు వేసి బలోపేతం చేశాయి. అయితే పార్టీ సాధిస్తున్న విజయాలు ఎంత గొప్పవో, చేస్తున్న తప్పులూ అంతకన్నా తీవ్రమైనవి కావడంతో, దేశంలోని ఏ ప్రాంతంలోనూ సాపేక్షికంగా నిలకడైన, బలమైన సంఘటిత విప్లవోద్యమాన్ని నిర్మించలేకపోయామన్నది ఒక చేదు వాస్తవం. ప్రపంచంలో, దేశంలో మారుతున్న సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవడంలో పార్టీ తొలి నుంచి చాలా వెనుకబడుతూ వస్తోంది. శత్రువు బలాన్ని, విప్లవ శక్తుల బలాన్ని సరిగా అంచనా వేసుకొని తగిన ఎత్తుగడలతో విప్లవోద్యమాన్ని నిర్మించడంలోనూ తప్పులు చేస్తూ వస్తోంది. మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుంటూ దెబ్బతిన్న ప్రాంతాలలో తిరిగి విప్లవోద్యమాన్ని నిర్మించడంలో ఇప్పటివరకూ పార్టీ జయప్రదం కాలేదు. ప్రజల అపార సానుభూతి ఉన్నా ఎట్టకేలకు ఒంటరిగానే మిగిలిపోతున్నాం. ఓటమికి శత్రువు గొప్పతనం కన్నా మా బలహీనతలు, తప్పులే ప్రధానమైనవని ఒప్పుకుంటున్నాం.

విప్లవోద్యమ నిర్మాణానికే విరమణ

ప్రజలు, కేడర్ల అసమాన త్యాగాల నుంచైనా మేం సకాలంలో గుణపాఠాలు తెలుసుకోని ఫలితంగా, దేశ పీడిత ప్రజలను తీవ్ర నిరాశ నిస్పృహల్లోకి, అవిశ్వాసం, ఆందోళనలోకి నెట్టాం. ఇలాంటి పరిస్థితుల్లో తిరిగి విప్లవోద్యమాన్ని నిర్మించడానికి తాత్కాలికంగా సాయుధ పోరాట విరమణ తప్పదని తేలిపోయింది. ఇప్పటికైనా దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా అంటూ, సాయుధ పోరాటం అంటూ, పరిస్థితుల్లోని మార్పులతో, స్థల, కాలాలతో నిమిత్తం లేకుండా, చైనా పంథా, రష్యా పంథా అనే పిడివాద ఆచరణకు స్వస్తి చెప్పాలి. భారతదేశ స్థల, కాల పరిస్థితులకు తగిన పంథాలో భారత విప్లవాన్ని జయప్రదం చేయడానికి పూనుకోవడమే పార్టీ ముందు మిగిలిన ఏకైక కర్తవ్యం. ఇందుకు వీలుగా మేం తాత్కాలికంగా సాయుధ పోరాట విరమణ చేయడాన్ని ప్రజలు సహృదయంతో అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ నిర్ణయం తీసుకోకపోతే రక్తసిక్తం అవుతున్న అడవులను శాంతి వనాలుగా మార్చలేం. మిగిలిన విప్లవ శక్తులనైనా కాపాడుకోలేం. జరిగిన తప్పులకు బాధ్యత వహిస్తూ ప్రజలకు క్షమాపణలు చెప్పుకుంటున్నాం.

యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు: సీఈవో

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 477 ఎంప్యానల్డ్ హాస్పిటళ్ల లో, అధిక శాతం ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేవలం 50 లోపు ఆసుపత్రులలోనే వైద్య సేవలు నిలిచిపోయాయని వివరించారు. వాటిలో కూడా సేవలు కొనసాగించాలని ఆయన ఆయా ఆసుపత్రులకు విజ్ఞప్తి చేశారు. ఆయా ఆసుపత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సేవలు నిలిపివేయాలని ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మనుషుల్ని చంపే హక్కు రాజ్యానికి లేదు

శాంతి చర్చల కమిటీ స్పష్టీకరణ

- ఎన్‌కౌంటర్ల పేరిట ఇప్పటికే ఎన్నో విలువైన ప్రాణాలు బలి తీసుకున్నారు
- మావోయిస్టులతో చర్చలకు కేంద్రం ఎందుకు అంగీకరించడం లేదు?
- ఇరుపక్షాల మధ్య సయోధ్య కోసం మా వంతు పాత్ర పోషిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ బి.చంద్రకుమార్. చిత్రంలో హరగోపాల్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాజ్యానికి (ప్రభుత్వానికి) మనుషులను చంపే హక్కు లేదని, మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల పేరిట ఇప్పటికే ఎన్నో విలువైన ప్రాణాలు బలి తీసుకున్నారని శాంతిచర్చల కమిటీ ఆరోపించింది. ఓవైపు మావోయిస్టులు శాంతి చర్చలకు తాము సిద్ధమేనని ప్రకటిస్తున్నా..కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించింది. ఇందులో కార్పొరేట్ శక్తులకు అటవీ సహజ సంపద, ఖనిజాలు అప్పగించాలన్న కేంద్ర ప్రభుత్వ దురుద్దేశం అర్థం అవుతోందని పేర్కొంది. చర్చలతోనే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేసింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శాంతి చర్చల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్, ఉపాధ్యక్షులు కందిమల్ల ప్రతాప్‌రెడ్డి, బి.దుర్గారావు, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ తదితరులు మాట్లాడారు.

కేంద్రమంత్రులు అందుబాటులోకి రాలేదు..

మావోయిస్టులతో చర్చలకు తెలంగాణ ప్రభుత్వం సూచనప్రాయంగా అంగీకరించినా.. కేంద్ర ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదని వారు అన్నారు. మావోయిస్టులపై హింస అంతటితో ఆగదని వివిధ రూపాల్లో సమాజంలోకి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మావోయిస్టులు స్వ ప్రయోజనాల కోసం కాకుండా పీడిత ప్రజల కోసం ఒక సిద్ధాంతంతో పనిచేసే సంస్థ అని కేంద్ర ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. వారిని ఇతర నేరస్తులతో కలిపి చూడవద్దని విజ్ఞప్తి చేశారు. నెల రోజుల పాటు కాల్పుల విరమణ పాటిస్తే తాము ప్రభుత్వంతో శాంతి చర్చలకు సిద్ధమేనని ఇప్పటికే మావోయిస్టులు ప్రకటించిన విషయాన్ని వారు గుర్తుచేశారు. శాంతి చర్చలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలు పెట్టుకోవచ్చని, తాము సైతం శాంతి చర్చల కమిటీ తరఫున ఇరు పక్షాల మధ్య సయోధ్యకు అవసరమైన పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ విషయంపై శాంతి చర్చల కమిటీ తరఫున.. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించినా వారు అందుబాటులోకి రాలేదని వెల్లడించారు. ఇటీవల మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావుతో సహా ఆరుగురు సీసీ సభ్యులను కూడా ఎన్‌కౌంటర్ పేరిట చంపారని, వందలాది మంది ఆ పార్టీ కార్యకర్తలు, సాధారణ ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం యథేచ్ఛగా కాల్పులు జరుపుతోందని ఆరోపించారు. ఇటీవలి కాలంలో సీసీ సభ్యులు మోడెం బాలక్రిష్ణ వంటి వారి హత్యలను శాంతి చర్చల కమిటీ ఖండిస్తోందని తెలిపారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి ఎంత మాత్రం మంచిది కాదని పేర్కొన్నారు.

అంతా గందరగోళం

- మావోయిస్టుల లేఖల కలకలం
- గతానికి భిన్నంగా వెలువడుతున్న వైనంపై చర్చ
- లేఖల్ని నిర్ధారించని పోలీసులు, పౌరహక్కుల నేతలు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టుల పేరిట గత కొద్ది రోజులుగా విడుదలవుతున్న లేఖలు తీవ్ర గందరగోళం సృష్టిస్తున్నాయి. ఒక వైపు ఆపరేషన్ కగార్ పేరిట సాయుధ పోలీసు బలగాలు మావోయిస్టుల వేట కొనసాగిస్తుండగా..మరోవైపు మావోయిస్టుల వైపు నుంచి శాంతి చర్చల ప్రతిపాదనలు తెరపైకి వస్తున్నాయి. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా మావోయిస్టు కీలక నేతల పేరిట విడుదలవుతున్న లేఖలు, ఆడియోలు కొత్త చర్చకు తెరతీశాయి. ఆయుధాలు వదిలేందుకు సిద్ధమంటూ మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ ఆగస్టులో రాసినట్టుగా చెబుతున్న లేఖ ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఇది బయటపడిన 24 గంటల్లోనే అభయ్ పేరిట మరో ఆడియో సందేశం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. తాజాగా గురువారం మరో సెంట్రల్ కమిటీ సభ్యుడు సోను అలియాస్ మల్లోజుల వేణుగోపాల్‌రావ్ పేరిట లేఖ విడుదలైంది. అభయ్ పేరిట విడుదలైన లేఖపైనే పలు అనుమానాలు ఉన్నాయనుకుంటే..వేణుగోపాల్ పేరిట తాజాగా వెలుగులోకి వచ్చిన లేఖ అంతకు మించి అన్నట్టుగా ఉంది. గతానికి భిన్నంగా ఆ లేఖ పీడీఎఫ్ ఫార్మాట్‌లో ఉంది. పై భాగంలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) కేంద్ర కమిటీ అనే ఎర్రని అక్షరాలు లేవు. సాదాసీదాగా 'విప్లవ ప్రజలకు విజ్ఞప్తి' అన్న వాక్యంతో ప్రారంభమైంది. ఆగస్టు అని నెల పేరు ఉంది కానీ తేదీ లేదు.

విరమణ అంటే సాధారణ నిర్ణయం కాదు..

మావోయిస్టుల పేరిట విడుదలవుతున్న లేఖలను అటు పోలీసులు కానీ, ఇటు పౌరహక్కుల సంఘాల నేతలు కానీ ధ్రువీకరించడం లేదు. మావోయిస్టు పార్టీ మొత్తంగా ఆయుధాలు వీడేందుకు సిద్ధమని ప్రకటించడం అంటే సాధారణ నిర్ణయం కాదని.. పార్టీ అగ్ర నాయకత్వంతో పాటు కీలక నేతలుగా కూర్చుని చర్చించిన తర్వాతే తీసుకునే నిర్ణయంగా పౌరహక్కుల నేత ఒకరు తెలిపారు. ఇంత పెద్ద నిర్ణయం తీసుకునేందుకు వారంతా కలిసే అవకాశం ప్రస్తుత పరిస్థితుల్లో లేదని ఆయన పేర్కొన్నారు. ఇక సోను పేరిట విడుదలైన లేఖలో పూర్తిగా మావోయిస్టు పార్టీ వైఫల్యాలను ఎత్తి చూపుతున్నట్టుగా ఉండటం గమనార్హం. ఉద్యమ ప్రస్థానంలో తాము చేసిన తప్పులపై ప్రజలకు బహిరంగ లేఖ రాసినట్టుగా ఉంది. ఇలా రోజుకో లేఖ తెరపైకి వస్తుండడం.. మావోయిస్టుల అంశంపై పౌర సమాజంలో, ప్రధాన మీడియా, సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీస్తోంది.



ఉత్తమ్ తండ్రికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్ తదితరులు

ఉత్తమ్ తండ్రికి ప్రముఖుల నివాళి

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి.. నలమాద పురుషోత్తంరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని ఒక కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభాపతి ప్రసాద్ రావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వివేక్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ నేతలు కె.జానారెడ్డి, టి.జీవన్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

వామనరావు దంపతుల హత్యపై

సీబీఐ దర్యాప్తు షురూ



కల్వచర్ల వద్ద వామనరావు దంపతులను హత్య చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న సీబీఐ అధికారులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: హైకోర్టు న్యాయవాద దంపతులు వామనరావు, నాగమణిల హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించటంతో గురువారం సీబీఐ అధికారులు రామగుండం కమిషనరేట్‌కు వచ్చారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఒక హెడ్ కానిస్టేబుల్‌తో కూడిన బృందం సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిసింది. కమిషనరేట్‌లో వారికి ముందే ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని అప్పగించారు. సీబీఐ అధికారులతో సమన్వయం చేసుకునేందుకు గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌ను నియమించారు. అనంతరం సీబీఐ అధికారులు వామనరావు–నాగమణి హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించారు. వామనరావు స్వగ్రామం గుంజపడుగులో ఆయన తండ్రి కిషన్‌రావుతో మాట్లాడి పలు విషయాలు సేకరించారు. అంతకుముందు మంథని కోర్టు దగ్గర కూడా ఈ జంట హత్యలపై ఆరా తీశారు. 2021 ఫిబ్రవరి 17న వామనరావు దంపతులను పెద్దపల్లి– మంథని ప్రధాన రహదారిపై కల్వచర్ల సమీపంలో వేటకత్తులతో నరికి చంపిన విషయం తెలిసిందే. గుంజపడుగు గ్రామంలో ఆలయ నిర్మాణంపై నెలకొన్న వివాదమే ఈ హత్యలకు కారణమని వార్తలు వచ్చాయి. గుంజపడుగు గ్రామానికే చెందిన కుంట శ్రీనివాస్, అక్కపాక కుమార్, చిరంజీవులు ఈ హత్యలు చేశారని గుర్తించి అరెస్టు చేశారు. ఈ హత్యలకు సూత్రధారి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అని, కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని అప్పట్లో కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.

నైపుణ్య నిరూపణకు ఒక్క అవకాశమివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక దృష్టి పెట్టినట్టు అధికారులు తెలిపారు.

ప్రయోజనం లేని పట్టాలు

ఏఐసీటీఈ గణాంకాల ప్రకారం తెలంగాణ వ్యాప్తంగా ఇంజనీరింగ్, పోస్టు–గ్రాడ్యుయేట్, డిప్లొమా వంటి సాంకేతిక కోర్సులు చేస్తున్న విద్యార్థుల సంఖ్య 1.55 లక్షల వరకూ ఉంటుంది. వీరిలో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు ఏటా లక్ష మంది ఉంటారు. వీరిలో కేవలం 8 శాతం మందే స్కిల్డ్ ఉద్యోగాలు పొందుతుండగా.. 80 శాతం మంది చిన్నస్థాయి ఉద్యోగం పొందడానికీ కష్టపడాల్సి వస్తోంది. కోడింగ్ రాకపోవడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతపై సాధికారత లేకపోవడం ఉపాధి అవకాశాలను దూరం చేస్తున్నాయి. ఇంజనీరింగ్ పూర్తవ్వగానే ఉద్యోగం వెతుక్కోవడానికి ఏడాది కాలం వృథా అవుతోంది. స్కిల్ ఉద్యోగం కోసం మరికొన్ని కోర్సులు చేయాల్సి వస్తోంది. అప్పటికే టెక్నాలజీ మారుతోంది. దీంతో కొలువు కష్టమవుతోంది.

కంపెనీల్లోనే శిక్షణ

విద్యార్థుల నైపుణ్య సామర్థ్యం పెంపునకు ఒక్క అవకాశం ఇవ్వాలని కంపెనీలను జేఎన్‌టీయూహెచ్ కోరుతోంది. వర్సిటీ పంపిన లేఖల్లో ఈ అంశాలను స్పష్టంగా వివరించింది. విద్యార్థులు మెరిట్‌తో ఇంజనీరింగ్‌లో చేరుతున్నారని, ప్రాజెక్టు వర్క్ చేసే శక్తి ఉందని, ఒక్క అవకాశమిస్తే సామర్థ్యం నిరూపించుకుంటారని భరోసా ఇస్తోంది. కొద్దిరోజులు శిక్షణ ఇస్తే కంపెనీలకు మానవ వనరుల కొరత తీరే అవకాశం దొరుకుతుందని స్పష్టం చేస్తోంది. శిక్షణ కాలంలో వారి పని విధానం నచ్చితే ఎంతో కొంత వేతనం ఇవ్వాలని సూచిస్తోంది. శిక్షణ పూర్తయ్యేలోగా మంచి నైపుణ్యం ప్రదర్శించిన వారికి సంస్థలో ఉద్యోగాలు ఇవ్వొచ్చని చెప్పింది. తమ ప్రతిపాదనపై కొన్ని కంపెనీలు స్పందిస్తున్నాయని, భవిష్యత్‌లో దీన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని అధికారులు చెబుతున్నారు. అయితే, ఐటీ కంపెనీలు మాత్రం ఇంజనీరింగ్ విద్యార్థులను ఇంటర్న్‌షిప్ ప్రామాణికంగా చేర్చుకునేందుకు కొంత వెనుకాడుతున్నాయి. సరైన వ్యక్తిగత షూరిటీ ఇవ్వాలని కోరుతున్నాయి. అన్ని కోణాల్లోనూ వారిని పరిశీలించాకే అవకాశం ఇవ్వగలమని చెబుతున్నాయి.

ఇదో వినూత్న కార్యక్రమం: ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి (వీసీ, జేఎన్‌టీయూహెచ్)

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు బహుళ జాతి సంస్థల సహకారం కోరుతున్నాం. అన్ని కంపెనీలను గుర్తించి లేఖలు రాస్తున్నాం. సంస్థల నుంచీ మంచి స్పందన వస్తోంది. ఇంజనీరింగ్ పూర్తయ్యేలోగా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం పొందేందుకు ఇది తోడ్పడుతుంది. ఇందులో విజయవంతమైన విద్యార్థులకు మంచి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.

హెడ్ కానిస్టేబుల్‌కు కత్తిపోటు

- కుభీర్ పోలీసుస్టేషన్‌లో కలకలం
- పరారీలో నిందితుడు



హెడ్ కానిస్టేబుల్ నారాయణ

కుభీర్: నిర్మల్ జిల్లా కుభీర్ పోలీసుస్టేషన్‌లో ఒక హెడ్ కానిస్టేబుల్‌పై గురువారం రాత్రి ఒక వ్యక్తి కత్తితో దాడి చేయడం కలకలం రేపింది. రాత్రి 10 గంటల ప్రాంతంలో కత్తితో పోలీస్ స్టేషన్‌లోకి వచ్చిన ఆ వ్యక్తి.. నేరుగా ఎస్‌ఐ గదిలోకి వెళ్తుండగా హెడ్‌కానిస్టేబుల్ టి.నారాయణ అడ్డుకున్నారు. దీంతో తన వద్ద ఉన్న కత్తితో ఆయన కడుపు పైభాగంలో పొడిచాడు. అక్కడే ఉన్న హోంగార్డు గిరిధారి అడ్డుకోవడానికి రాగా, బలంగా తోసేయడంతో అతని చేతులకు గాయాలయ్యాయి. వీరి అరుపులకు మిగతా సిబ్బంది, స్టేషన్ వెనుక క్వార్టర్లలోని పోలీసులు రావడంతో ఆ వ్యక్తి పారిపోయాడు. ఎస్‌ఐ కృష్ణారెడ్డి, మిగతా పోలీసులు నిందితుని కోసం గాలిస్తున్నారు. గాయపడిన నారాయణ, గిరిధారిలకు కుభీర్‌లో ప్రాథమిక చికిత్స అందించి, భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. భైంసా రూరల్ సీఐ నైలు కుభీర్ చేరుకుని పరిస్థితి సమీక్షిస్తున్నారు. దాడికి పాల్పడిన వ్యక్తి మహారాష్ట్ర ప్రాంతం నుంచి వలస వచ్చినట్లు భావిస్తున్నారు.

మైనార్టీ గురుకులంలో వేతనాల కోత!

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో 30 శాతం కట్ చేసిన ప్రభుత్వం

ఉద్యోగుల ఆందోళనతో సాయంత్రం సవరణ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో అధికార యంత్రాంగం కోత పెట్టింది. ఏకంగా 30 శాతం మేర తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయా ఉద్యోగుల్లో తీవ్ర గందరగోళం ఏర్పడింది. ఫలితంగా ఉద్యోగులంతా మూకుమ్మడిగా సెలవుపెట్టి నాంపల్లిలోని మైనార్టీ గురుకుల సొసైటీ కార్యాలయాన్ని చుట్టుముట్టి ఆందోళన చేపట్టారు. ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఇతర బీసీ సంఘాల నేతలు ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో దిగివచ్చిన యంత్రాంగం... వేతనాలను పాత పద్ధతిలోనే చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం తర్వాత ఆందోళన సద్దుమణిగింది.

సమాచారం లేకుండానే కోత..

కొన్నేళ్లుగా మైనార్టీ గురుకుల సొసైటీ పరిధిలోని పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో వివిధ కేడర్లలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వీరి సర్వీసును రాష్ట్ర ప్రభుత్వం ఏటా పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తుంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఏప్రిల్ 1వ తేదీ నుంచి ముగింపు తేదీ మార్చి 31 వరకు వీరి సర్వీసు కొనసాగుతుంది. వేసవి సెలవులు మినహా... మిగిలిన పనిదినాలకు వీరికి ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తుంది. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఈ ఉద్యోగుల సర్వీసును కొనసాగిస్తూ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా రెండ్రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్లో 31 కేటగిరీలకు సంబంధించి వేతనాలను కూడా ప్రస్తావించారు. గతేడాది ఈ ఉద్యోగులకు నిర్దేశించిన వేతనాలతో పోలిస్తే దాదాపు 30 శాతం కోతపడింది. ఇలా దాదాపు అన్ని కేటగిరీల్లో వేతనాలను భారీగా కుదించడంతో తీవ్రస్థాయిలో గందరగోళానికి గురయిన ఉద్యోగులు సొసైటీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగులు సెలవు పెట్టి రావడం సొసైటీ అధికారులకు తలనొప్పిగా మారింది. మరోవైపు ప్రభుత్వం నుంచి కూడా తీవ్ర ఒత్తిడి పెరగడంతో వేతనాలను సవరిస్తూ పాతపద్ధతిలోనే చెల్లింపులు చేస్తామని సొసైటీ కార్యదర్శి షఫీయుల్లా ఆందోళన చేస్తున్న ఉద్యోగుల వద్దకు వచ్చి హామీ ఇచ్చారు.

ఓ నా కుమారా! నమాజ్‌ను స్థాపించు, ధర్మాన్ని ఆదేశించు, అధర్మాన్ని నిషేధించు, ఆపదలో సహనం వహించు. నిశ్చయంగా, ఇవి ఎంతో గట్టిగా ఆజ్ఞాపించబడిన విషయాలు.

– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 19 సెప్టెంబర్ 2025

ట్రంప్‌తో బ్రిటన్‌కు మేలేనా?

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండు రోజుల బ్రిటన్ పర్యటన గురువారం పూర్తయింది. ఇరు దేశాల మధ్యా సుదీర్ఘకాలంగా ఎంతో గాఢమైన అనుబంధం ఉన్నదని, ట్రంప్ హయాంలో అది మరింత విస్తరించిందని ఉమ్మడి మీడియా సమావేశంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కొనియాడారు. అది నిజమే. ఎందుకంటే వేరేచోట పెట్టుబడులు పెట్టొద్దని తమ దిగ్గజ సంస్థల్ని డిమాండు చేస్తున్న ట్రంప్ బ్రిటన్‌లో దాదాపు 15,000 కోట్ల పౌండ్ల విలువైన పెట్టుబడులకు సిద్ధపడ్డారు. ఇందుకు సంబంధించిన ఒప్పందాలపై ఇరు దేశాల మధ్యా సంతకాలయ్యాయి. అలాగే రక్షణ సాంకేతిక ఒప్పందం కూడా కుదిరింది. బ్రిటన్ తన డిమాండ్లన్నిటికీ తలొగ్గి అందరి కన్నా ముందు మొన్న ఫిబ్రవరిలోనే వాణిజ్యం ఒప్పందానికి సై అనటం, మరో మూడు నెలల్లో ఒప్పందాన్ని ఖరారు చేసుకోవటం ట్రంప్‌కు నచ్చింది. దానికితోడు ప్రధాని కీర్ స్టార్మర్ అమెరికా వెళ్లినప్పుడు అధికారిక పర్యటనకు రావాలంటూ బ్రిటన్ రాజు చార్లెస్... స్టార్మర్ ద్వారా ఆహ్వానం పంపటం ఆయన్ను మరింత ఉక్కిరిబిక్కిరి చేసివుంటుంది. ఎందుకంటే అమెరికా అధ్యక్షుడిని రాజసౌధం రెండోసారి అధికారిక పర్యటనకు ఆహ్వానించటం, ఘనమైన విందునీయటం ఇదే తొలిసారి. గత ఏలుబడిలో ట్రంప్ 2019లో బ్రిటన్‌లో అధికారిక పర్యటన జరిపారు. జార్జి డబ్ల్యూ బుష్, ఒబామాలకు ఆ అదృష్టం మొదటి దఫాలో మాత్రమే దక్కింది. రెండోసారి నాటి బ్రిటిష్ రాణి నుంచి విందు ఆహ్వానాలు మాత్రమే అందాయి.

కానీ ట్రంప్ షరతులన్నిటికీ తలొగ్గటం ద్వారా బ్రిటన్ ప్రయోజనాలను స్టార్మర్ దెబ్బతీశారని జనం ఆగ్రహించారు. వాణిజ్య ఒప్పందంలో అమెరికా సరుకులపై 10 శాతం మించి సుంకాలు విధించబోమని ఒప్పుకుని, తమ దేశం నుంచి అమెరికాకు ఎగుమతయ్యే స్టీల్, అల్యూమినియంలపై మాత్రం 25 శాతం సుంకాలు విధించినా మౌనంగా ఉండిపోయారని ఆ విమర్శల సారాంశం. దీన్ని పునఃపరిశీలించాలని బ్రిటన్ కోరినా ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పటం తప్ప 25 శాతం సుంకాలపై ట్రంప్ మరే హామీ ఇవ్వలేదు. బహుశా ఆయన దృష్టిలో ఆదుకోవటమంటే 15,000 కోట్ల పౌండ్ల పెట్టుబడులు పెట్టడం కావొచ్చు. వీటి ద్వారా దేశంలో 7,600 ఉద్యోగాలు వస్తాయని బ్రిటన్ ఆశిస్తోంది. ఇరు దేశాలకూ అనేక అంశాల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. నాటో, ఉక్రెయిన్, పశ్చిమాసియా, చైనా తదితర అంశాల్లో రెండు దేశాలకూ ఏకీభావం ఉన్నా విభేదాలు కూడా ఉన్నాయి. లోగడ స్టార్మర్ ప్రకటించిన ప్రకారం వచ్చేవారం పాలస్తీనాను బ్రిటన్ గుర్తించాల్సి ఉంది. ఆ పనిచేస్తే హమాస్ ఉగ్రవాదానికి మద్దతు పలికినట్టే అవుతుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఇటీవల హెచ్చరించారు. ట్రంప్ పర్యటనలో కూడా దీనిపై ఇరు దేశాధినేతల మధ్యా చర్చ జరిగింది. ఈ విషయంలో విభేదాలున్నాయని ఇద్దరూ అంగీకరించారు. బ్రిటన్ తాజా నిర్ణయమేమిటన్నది చూడాల్సి ఉంది.

రెండు దేశాలూ ఒకప్పుడు ప్రపంచాన్ని శాసించేవి. ప్రపంచ సమస్యల పరిష్కార బాధ్యత భారం తమదేనని భావించేవి. కనీసం అలా చెప్పుకొనేవి. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అవి సమష్టిగా పనిచేశాయి. ధిక్కరించిన దేశాలపై నాటో మాటున దాడులు కూడా చేశాయి. ప్రపంచంలోనే చైనా రెండో శక్తిమంతమైన ఆర్థిక శక్తిగా ఎదిగాక పరిస్థితి తలకిందులైంది. పశ్చిమాసియా మొదలుకొని ప్రపంచమంతటా ఎటుచూసినా విధ్వంసం, నిరాశా నిస్పృహలు ఆవరించాయి. యుద్ధాలు, వాణిజ్య యుద్ధాలు, వలసదారులపై ఆంక్షలు, ప్రజాస్వామ్య దేశాల్లో నియంతల హవా తదితరాలు వర్తమాన దుఃస్థితికి అద్దం పడుతున్నాయి. సమస్యలొస్తే ఇప్పుడెవరూ అమెరికా, బ్రిటన్‌ల వైపు చూడటం లేదు. అవి చక్కదిద్దుతాయన్న భ్రమలేవీ లేకపోగా... చాలా సమస్యలకు అమెరికా కారణమైతే, బ్రిటన్ వైఖరి కూడా అందుకు దోహదపడుతోందన్న అభిప్రాయమే అనేకుల్లో ఉంది. పైగా నిలకడ లేని ట్రంప్‌కు విశ్వసనీయత తక్కువ. భారత్ తమకు అత్యంత సన్నిహితమని, ప్రధాని మోదీ కావాల్సినవారనీ మీడియా సమావేశంలో చెప్పిన ట్రంప్... ఉక్రెయిన్ విషయంలో ఆ దేశంతో కఠినంగా ఉండక తప్పడంలేదని గొప్పగా చెప్పుకొన్నారు. ఇలా మాట్లాడేవారిని ఏ దేశ ప్రజలైనా విశ్వసిస్తారా? మొత్తానికి ట్రంప్ తాజా పర్యటన వల్ల బ్రిటన్‌కు లాభించేది అంతంత మాత్రమేనని చెప్పాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.11.43 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.8.52 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.9.01 నుండి 10.38 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.19 నుండి 1.07 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.14 నుండి 8.50 వరకు.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.58
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

సమయం



సమయ నిర్వహణలోని సమస్య ఏమిటంటే, సమయాన్ని మనం నిర్వహించలేం! ఉన్న సమయం నుండి మీరు ఎప్పటికీ ఎక్కువ పొందలేరు. కాబట్టి మీ సమస్య, మీ సమయాన్ని వృథా చేసే ఇతరులతోనే! లేదంటే మీ సొంత ఎంపికలతోనే మీకు సమస్య.

– బ్రియాన్ నార్టన్, ఇంటర్నెట్ పర్సనాలిటీ

జ్వాలలు



కారుణ్యానికి అడవి మంటలా వ్యాపించే గుణం ఉంది. ఒక వ్యక్తి కరుణ చూపటం మొదలు పెడితే, వ్యక్తి నుండి వ్యక్తికి అది వ్యాప్తి చెందుతుంది. ఆ జ్వాలలు మానవ హృదయాలను కదిలి, సహాయం చేసే చేతులుగా వెయ్యి నాల్కలను చాస్తాయి.

– రేచల్ స్కాట్, అమెరికన్ జర్నలిస్ట్

పరిస్థితులు



నేను దిండ్ల కుప్పల మధ్య, తలను కడుపులో దాచుకుని పడుకుంటాను. కాబట్టి, ఎవరైనా లోపలికి వచ్చి నన్ను చంపాలని చూస్తే బెడ్ పైన నేను ఉన్నానో లేదో తెలియక వెళ్లిపోతారు. చెప్పటం ఏమిటంటే, పరిస్థితులే మీకు అన్నీ నేర్పిస్తాయి.

– విజ్ ఖలీఫా, ర్యాపర్

మూడోది!



జీవిత బీమా తీసుకుంటే తీసుకోండి కానీ, మంచి మెడికల్ కవరేజ్ ఉండటం అయితే ముఖ్యం. ఆసుపత్రి అవసరం మనకు ఎక్కువగా అనారోగ్యాలకు, ప్రమాదాలకు గురైనప్పుడు ఉంటుంది. ఆ దురదృష్టకరమైన మూడో కారణానికి కాదు.

– మోనికా హలన్, ఫైనాన్సియల్ అడ్వైజర్

సంతోషం



నిజం చెప్పాలంటే నేను డైట్ విషయంలో అంత క్రమశిక్షణతో ఉండను. సాధారణంగా, జీవితంలో నాకు సంతోషాన్నిచ్చేది నేను చేస్తాను. ఆహారం నన్ను చాలా సంతోషపరుస్తుంది! ఆహారం పట్ల ఆసక్తి కనబరిచే వారిని చూసినా నాకు హ్యాపీగా అనిపిస్తుంది.

– అనా డి అర్మాస్, క్యూబా నటి

జీవితం



నా 21 ఏళ్ల వయసులో, ఒక షాపింగ్ సెంటర్‌లో శాంతా క్లాజ్ పాత్రను పోషించే ఉద్యోగం వచ్చింది. నేను చాలా సన్నగా ఉన్నాను. నా దుస్తుల లోపల సోఫా కుషన్ దోపుకోవలసి వచ్చింది. మనకు అర్హత లేకున్నా జీవితం కొన్నిసార్లు మనకు ఉపాధిని ప్రసాదిస్తుంది.

– టామ్ హాంక్స్, హాలీవుడ్ నటుడు

సాంకేతిక సమానత్వ యోధుడు

అభిప్రాయం



అశ్వినీ వైష్ణవ్

ప్రభుత్వ ధ్రువీకరణ పత్రం పొందడమనే ఓ సుదీర్ఘ ప్రక్రియ మీకు గుర్తుందా? పదేపదే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు, కొండవీటి చాంతాడులా బారులు తీరిన జనాలు, అడపాదడపా రుసుముల చెల్లింపులు... ఇప్పుడివన్నీ మాయమై, మీ అరచేతిలోని ఫోన్లో సాక్షాత్తూ ప్రపంచమే ఇమిడిపోయింది. ఇది ఎంతమాత్రం ఆకస్మిక పరిణామం కాదు.

ప్రధానమంత్రి మోదీ ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని భారతదేశపు సమానత్వ ఆయుధంగా మలిచారు. కార్పొరేట్ ప్రపంచంలోని ఓ ఉన్నతాధికారి తరహాలో ముంబయిలోని ఒక వీధి వ్యాపారి కూడా నేడు అదే యూపీఐ చెల్లింపు వ్యవస్థను ఉపయోగించగలడు. ఈ పరిణామం మోదీ అనుసరించే అంత్యోదయ సూత్రం కీలక లక్షణాన్ని ప్రతిబింబిస్తుంది. కాబట్టే, వరుసలో చివరి వ్యక్తికీ సాంకేతికత చేరువైంది.

బీజం పడింది అక్కడే!

మోదీ ముఖ్యమంత్రి హోదాలో తొలుత సాంకేతికత, ఆవిష్కరణల వినియోగం ద్వారా గుజరాత్ రూపాంతరీకరణకు కృషి చేశారు. 'జ్యోతిగ్రామ్' పేరిట ఆయన 2003లో ప్రారంభించిన పథకం 'ఫీడర్ సెపరేషన్ టెక్నాలజీ'ని విజయవంతంగా ఉపయోగించింది. తద్వారా నిర్దిష్ట సమయం ప్రకారం వ్యవసాయ విద్యుత్ సరఫరాతో భూగర్భ జల క్షీణత అదుపులోకి వచ్చింది. మరోవైపు 24 గంటల విద్యుత్ సౌకర్యం గ్రామీణ పరిశ్రమలకు ఉత్తేజమిచ్చింది. చిన్న వ్యాపారాల విస్తృతితో వలసలు తగ్గాయి. ఒక అధ్యయనం ప్రకారం ఈ పథకంపై పెట్టిన రూ.1,115 కోట్ల పెట్టుబడి కేవలం రెండున్నరేళ్లలో తిరిగి వచ్చింది.

నర్మదా నది కాలువపై 2012లో సౌర ఫలకాల ఏర్పాటుకు ఆయన నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 16,000 ఇళ్లకు ఏటా 1.6 కోట్ల యూనిట్ల విద్యుదుత్పాదన సాధ్యమైంది. మరోవైపు కాలువలో నీరు ఆవిరయ్యే ప్రక్రియ మందగించి, రైతులకు నీటి లభ్యత పెరిగింది. సాంకేతికతపై మోదీ దార్శనికతకు ఈ జోడు ప్రయోజనాల విధానమే నిదర్శం. ఇక 'ఇ-ధర' వ్యవస్థ ద్వారా భూ రికార్డుల డిజిటలీకరణ చేపట్టారు. 'స్వాగత్' పేరిట పౌరులకు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ముఖ్యమంత్రితో నేరుగా ముచ్చటించే వీలు కలిగింది. ఆన్‌లైన్ టెండర్లతో అవినీతి అంతమైంది.

జాతీయ యవనికపై...

గుజరాత్‌లో సముపార్జించిన అనుభవాన్ని, ఆచరణాత్మక విధానాలను ఆయన 2014లో ఢిల్లీకి తెచ్చారు. అనతి కాలంలోనే డిజిటల్ సార్వజనీన మౌలిక సదుపాయాలతో 'ఇండియా స్టాక్' రూపుదిద్దుకుంది. జన్‌ధన్, ఆధార్, మొబైల్ త్రయమే వీటికి పునాది.

దేశవ్యాప్తంగా 53 కోట్ల మందికిపైగా ప్రజలను జన్‌ధన్ ఖాతాలు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తెచ్చాయి. వీధి వ్యాపారులు, రోజుకూలీలు సహా పూర్తిగా నగదు లావాదేవీలు నిర్వహించే గ్రామీణులకూ ఇవాళ బ్యాంకు ఖాతాలున్నాయి. ఆధార్ పౌరులకు డిజిటల్ గుర్తింపునిచ్చింది. ఇప్పటివరకు 142 కోట్ల ప్రజలు దాని కింద నమోదు చేసుకున్నారు. ఆధార్ ద్వారా ప్రభుత్వ సేవలు సులభంగా అందుబాటులోకి వచ్చాయి. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) ద్వారా మధ్యవర్తుల జోక్యం తొలగి, నిధులు పక్కదారి పట్టడం తగ్గింది. డీబీటీని అవలంబించడం ద్వారా ఇప్పటివరకు దాదాపు రూ. 4.3 లక్షల కోట్ల ప్రజాధనం ఆదా అయ్యింది.



◆ సాంకేతిక పరిజ్ఞానాన్ని భారతదేశపు సమానత్వ ఆయుధంగా మలిచారు మోదీ. కార్పొరేట్ ప్రపంచంలోని ఓ ఉన్నతాధికారి తరహాలో ముంబయిలోని ఒక వీధి వ్యాపారి కూడా నేడు అదే యూపీఐ చెల్లింపు వ్యవస్థను ఉపయోగించగలడు. ఈ పరిణామం మోదీ అనుసరించే అంత్యోదయ సూత్రపు కీలక లక్షణం.

యూపీఐ ద్వారా దేశంలో చెల్లింపుల తీరులో సమూల మార్పులొచ్చాయి. ఇది ప్రారంభించినప్పటి నుంచి 55 కోట్లకు పైగా వినియోగదారులు లావాదేవీలు నిర్వహించారు. ఒక్క 2025 ఆగస్టులోనే 20 బిలియన్లకు పైగా లావాదేవీలు జరిగాయి. వీటి విలువ రూ. 24.85 లక్షల కోట్లు.

నేడు ప్రపంచవ్యాప్తంగా రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో సగం భారత్‌లోనే జరుగుతున్నాయి. డిజిటల్ లావాదేవీలు నిర్వహించాల్సిందిగా కోవిడ్ సమయంలో ఆయన కోరిన వేళ, ఆర్థిక వ్యవస్థలో ఆ దిశగా సానుకూల వాతావరణం ఏర్పడింది. ఫలితంగా, ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు వీసా కన్నా యూపీఐ ఎక్కువ లావాదేవీలను ప్రాసెస్ చేస్తోంది. ఇప్పుడొక చిన్న మొబైల్ ఫోనే ఓ బ్యాంకు.

సాంకేతికత అందరిదీ!

సాంకేతికత వల్ల వ్యవసాయం, ఆరోగ్య రక్షణ రంగాల్లో సమూలమైన మార్పులు వచ్చాయి. హరియాణాలో ఉండే ఓ రైతు జగదేవ్ సింగ్ విషయమే తీసుకోండి! ఆయనిప్పుడు ఏఐ యాప్‌లను ఉపయోగించి పంట సంబంధిత నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని, భూసారానికి సంబంధించిన డేటాను తన ఫోన్‌లోనే తెలుసుకుంటున్నారు.

పీఎం-కిసాన్ పథకం 11 కోట్ల రైతులకు డిజిటల్ పద్ధతిలో నేరుగా ఆర్థిక చేయూతను అందిస్తోంది. డిజి లాకర్‌కు ఇప్పుడు 57 కోట్లకు పైగా వినియోగదారులున్నారు. 967 కోట్ల పత్రాలు అందులో డిజిటల్‌గా నిల్వ అయి ఉన్నాయి. మీ డ్రైవింగ్ లైసెన్సు, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్, ఇతర అధికారిక పత్రాలు భద్రంగా మీ ఫోన్‌లోనే ఉంటాయి. ఇకపై రోడ్డు మీద పోలీసు తనిఖీల్లో భౌతిక పత్రాల కోసం తడబడాల్సిన అవసరం లేదు. డిజి లాకర్ నుంచి మీ డిజిటల్ లైసెన్సును చూపించండి చాలు. తక్షణ ఆధార్ ధ్రువీకరణ ద్వారా... ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలు సులభతరమైంది.

అసాధ్యం అనిపించిన దానిని భారతదేశం సాధించింది. మొదటి ప్రయత్నంలోనే అంగారక గ్రహాన్ని... అది కూడా హాలీవుడ్ సినిమా కంటే తక్కువ బడ్జెట్‌తో చేరుకుంది. ప్రపంచ స్థాయి ఫలితాలను అందిస్తూ భారతీయ ఇంజినీరింగ్ సామర్థ్యాన్ని నిరూపించిన మార్స్ ఆర్బిటర్ మిషన్‌పై చేసిన వ్యయం రూ. 450 కోట్లు మాత్రమే. చంద్రయాన్-3 భూ ఉపగ్రహంపై దిగిన నాలుగో దేశంగా భారత్‌ను నిలబెట్టింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన మొదటి దేశంగా భారత్ చరిత్రకెక్కించింది.

ఒకే మిషన్‌లో 104 ఉపగ్రహాలను ప్రయోగించి ఇస్రో ప్రపంచ రికార్డు సృష్టించింది. భారతదేశ రాకెట్లు ఇప్పుడు 34 దేశాల ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్తున్నాయి. 'గగన్‌యాన్' మిషన్‌తో స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అంతరిక్షంలోకి మానవులను పంపిన నాలుగో దేశంగా కూడా భారత్ నిలవనుంది.

పీఎం గతిశక్తి పోర్టల్ అపూర్వమైన స్థాయిలో జీఐఎస్ టెక్నాలజీని ఉపయోగిస్తోంది. ప్రతి మౌలిక సదుపాయాల ప్రాజెక్టునూ డిజిటల్‌గా మ్యాప్ చేస్తారు. రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు, ఓడరేవులన్నీ కలిసి సమన్వయ ప్రణాళికగా రూపొందిస్తారు. ఇకపై సమన్వయ లోపం వల్ల జరిగే ఆలస్యం ఉండదు.

ఇండియా ఏఐ మిషన్ ద్వారా, 38,000 జీపీయూలు మూడింట ఒక వంతు ప్రపంచ ధరతో అందుబాటులో ఉన్నాయి. ఇది స్టార్టప్‌లకు, పరిశోధకులకు, విద్యార్థులకు సిలికాన్ వ్యాలీ స్థాయి కంప్యూటింగ్‌ను గంటకు సగటున రూ. 67 రేటుతో అందించింది.

మానవ అనుసంధానం

ప్రధాని మోదీకి సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసు. కానీ ఆయన ప్రజలను మరింత బాగా అర్థం చేసుకున్నారు. అంత్యోదయకు సంబంధించి ఆయన దార్శనికత ప్రతి ఒక్క డిజిటల్ కార్యక్రమాన్నీ ముందుకు నడిపిస్తోంది. యూపీఐ బహుళ భాషల్లో అందుబాటులో ఉంది. అత్యంత ధనిక పారిశ్రామికవేత్తతో సమానమైన డిజిటల్ గుర్తింపును నిరుపేద రైతు కూడా కలిగి ఉన్నాడు.

సింగపూర్ నుంచి ఫ్రాన్స్ వరకు ఎన్నో దేశాలు యూపీఐతో అనుసంధానమైనాయి. సమ్మిళిత వృద్ధికి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అవసరమని జీ20 ఆమోదించింది. దీనికి జపాన్ పేటెంట్ మంజూరు చేసింది. భారత్ పరిష్కారంగా ప్రారంభమైన యూపీఐ డిజిటల్ ప్రజాస్వామ్యానికి ప్రపంచ నమూనాగా మారింది.

గుజరాత్‌లో మోదీ చేసిన ప్రారంభ ప్రయోగాల నుంచి డిజిటల్ ఇండియా వరకు... ఈ ప్రయాణం జీవితాలను మార్చే సాంకేతిక పరిజ్ఞాన శక్తిని ప్రదర్శిస్తుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆయన తన పాలన సారాంశంగా మార్చారు. పాలకులు మానవీయ కోణంలో సాంకేతికతను స్వీకరించినప్పుడు, మొత్తం దేశాలు భవిష్యత్తులోకి దూసుకెళ్లగలవని ఆయన నిరూపించారు.

వ్యాసకర్త కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సమాచార – ప్రసార శాఖ మంత్రి

భావ ప్రకటన స్వేచ్ఛను బంధిస్తారా?



పత్రికా స్వేచ్ఛకు సంబంధించి భారత రాజ్యాంగంలో ప్రత్యేకించి ప్రస్తావించక పోయినప్పటికీ, 19(1)(ఎ) అధికరణం ద్వారా భావ ప్రకటన స్వేచ్ఛను పొందుపరిచారు. తద్వారా పాత్రికేయులు, రచయితలు, కవులు, కళాకారులు, సృజనాత్మక నిపుణులు తమ భావాలను నిర్ద్వంద్వంగా స్పష్టం చేసే హక్కులు పొందారు.

ప్రభుత్వాన్ని ఏ పార్టీ నడిపిస్తున్నప్పటికీ సహేతుకమైన విమర్శలను సాదరంగా ఆహ్వానించాల్సిందే. అర్థవంతమైన సూచనలను పరిగణనలోకి తీసుకోవాల్సిందే. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీతనం వహించాలి. పత్రికలు సామాజిక బాధ్యతగా ప్రభుత్వానికీ, ప్రజలకూ మధ్య వారధిగా నిలబడాలి. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చేర వేయాలి. మీడియా ప్రచురించిన వార్తల్లో వాస్తవాలను గ్రహించి ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పాలనలో దిద్దుబాట్లకు శ్రీకారం చుట్టాలి. అంతేగానీ తాము చేసేదంతా మంచేననీ, దాన్నెవరూ ప్రశ్నించకూడదనీ ప్రభుత్వాలు భావిస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది.

ఈ మధ్యకాలంలో జరిగిన ఒక సంఘటన విస్తుగొలిపేలా ఉంది. 'ఫలానా ప్రమోషన్లలో అవినీతి జరిగిందని' ఎవరో మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ 'సాక్షి' పత్రిక రాసిన వార్త మీద పోలీసులు కేసు నమోదు చేయడం; ఎడిటర్, రిపోర్టర్లకు పోలీసులు నోటీసులు జారీ చేసి పోలీసు స్టేషన్‌లో ప్రశ్నించడం ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందనడానికి సహేతుకమైన సంకేతం. ఎడిటర్ ఇంట్లో సోదాలు నిర్వహించడం నిర్ద్వంద్వంగా నియంతృత్వ పోకడే. ప్రతిష్ఠాత్మక 'ఇండియా టుడే' మీడియా గ్రూపు కన్సల్టెంట్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ సైతం ఈ చర్యల పట్ల ధర్మాగ్రహం వ్యక్తం చేశారంటే సమస్య తీవ్రత ఎంతటిదో అర్థమవుతుంది. 'పీ4 పథకం ముఖ్యనేత పిచ్చికి పరాకాష్ఠ' అనీ, 'ఎమ్మెల్యేలు అందరూ అవినీతిపరులే'ననీ రాసిన పత్రిక మీద మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అంటే సదరు పత్రిక రాసినవి వాస్తవాలని ప్రభుత్వం ఒప్పుకున్నట్టేనా? మరెందుకు కొన్ని పత్రికల పట్ల పక్షపాత వైఖరి?

నిస్సందేహంగా మీడియాకు 'లక్ష్మణ రేఖ' అవసరమే. అయితే ఇది స్వీయ నియంత్రణ రేఖ కావాలే కానీ, భావప్రకటన కుత్తుక మీద కత్తిలా ఉండకూడదు. మీడియాను బందిఖానాలో ఉంచాలనుకుంటే రౌడీలు రాజ్యమేలతారు. అది మరింత ప్రమాదకరం!

– ప్రొ॥ పీటా బాబీవర్ధన్
జర్నలిజం విభాగ పూర్వాధిపతి, ఆంధ్ర విశ్వవిద్యాలయం

దళిత ఆత్మగౌరవ పతాక

ఇన్ బాక్స్

వి'దళితుల' హృదయాల్ని మేలుకొలిపి, వారి ఆత్మగౌరవ పతాకాన్ని నింగిని తాకించిన పద్మభూషణుడు బోయి భీమన్న. ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న కళాప్రపూర్ణుడాయన. పద్యం, గద్యం, గేయం, నాటకం, నాటిక, వచన కవిత వంటి పలు సాహితీ ప్రక్రియల్లో 70కి పైగా రచనలను వెలువరించిన భీమన్న భావం సున్నితం, భాష సుందరం, ఆశయం అద్భుతం!

'బానిసతనమును బాపుమురా/ భారత భూమికి భాగ్యము తేరా!/ సకల దేశముల సర్వ మానవుల/ సామ్యము సాధింపుమురా' అంటూ తన రచనలతో అణగారిన సమాజాన్ని ప్రేరేపించిన సమరసతా సాహిత్య సిద్ధాంతకర్త భీమన్న. పేదరికం, అంటరానితనం, అవమానాల స్వానుభవాలతో అక్షరాలే ఆయుధంగా అనుక్షణం ఉద్యమించిన ఈ సాహితీవేత్త, 1911 సెప్టెంబరు 19న జన్మించారు. తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు ఆయన స్వస్థలం. విద్యాభ్యాసం పూర్తయిన తొలిరోజుల్లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. ఆ తర్వాత 'జనవాణి', 'జయభేరి', 'ప్రజామిత్ర', 'నవజీవన్', 'ఆంధ్రప్రభ' పత్రికల్లో పనిచేశారు. అంబేడ్కర్ రాసిన 'ఎనిహిలేషన్ ఆఫ్ ద క్యాస్ట్' గ్రంథాన్ని 'కుల నిర్మూలన'గా తెలుగులోకి అనువదించారు. అంతే త్రికరణశుద్ధితో అంబేడ్కర్ సిద్ధాంతవాదాన్ని అనుసరించి, ప్రచారం చేశారు. 'వ్యక్తుల వికాసమే జాతి. జాతుల వికాసమే వసుధ. వసుధైక సామ్రాజ్యమే మానవలోక సంపూర్ణ ఫలం' అన్నది భీమన్న తాత్త్విక భూమిక.



బోయి భీమన్న

భీమన్న నాటకాల్లో ప్రత్యేకమైంది 'రాగవాసిష్ఠం'. పౌరాణిక ఇతివృత్తాన్ని తీసుకుని సమాజంలో వేళ్లూనుకున్న కులసమస్యను కూలంకషంగా చర్చించి, జాతీయవాదాన్ని నిరూపించే నాటకంగా రాగవాసిష్ఠాన్ని అభివర్ణించవచ్చంటారు నార్ల వెంకటేశ్వరరావు. 'పెరుగుదలలో పరిసరాల ప్రాచుర్యం మినహాయిస్తే, మానవజాతి అంతా ఒక్కటే కదా!' అని ఈశ్వరుడి పాత్రతో పలికిస్తారు భీమన్న.

సంస్కరణ, జాతీయవాద దృష్టి కలగలిసిన సమరసతా కవితామూర్తి భీమన్న. సమాజంలో సంఘర్షణలకు కారణమైన కుల, మత, వర్గ విభేదాలను అధిగమించాలంటే, అందరూ విద్యావంతులు కావాలంటారాయన. సామాజిక సమరసత, సాహితీ సమర్చన రెండు కళ్ళుగా జీవించారు బోయి భీమన్న. 2005 డిసెంబరు 16న తుదిశ్వాస విడిచిన ఆయన తన రచనల్లో కులమతాల కంటే మానవతకు ప్రాధాన్యాన్నిచ్చారు. భీమన్న చూపిన మార్గంలో సమైక్య, సమరస భారతాన్ని నిర్మిద్దాం.

– సాకి । జూలపల్లి
(నేడు బోయి భీమన్న జయంతి)

డేటా పాయింట్

పట్టణాల్లో జనన రేటు తక్కువే!

కేంద్ర ప్రభుత్వ శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్‌ఆర్‌ఎస్)– 2023 ప్రకారం, దేశంలో జననాల రేటు (ఒక మహిళకు ఉండే పిల్లలు) గ్రామాలతో పోలిస్తే పట్టణాల్లో తక్కువగా ఉంది. ఇది గ్రామాల్లో... ఏపీ, తెలంగాణల్లో 1.6. పట్టణాల్లో ఏపీలో 1.3, తెలంగాణలో 1.5.

రాష్ట్రాల వారీగా జననాల రేటు

	గ్రామీణ	పట్టణ
బిహార్	2.9	2.2
యూపీ	2.7	2.2
మధ్యప్రదేశ్	2.6	1.8
ఛత్తీస్‌గఢ్	2.5	1.6
రాజస్థాన్	2.4	2.1
ఝార్ఖండ్	2.3	1.7
గుజరాత్	2.1	1.6
హరియాణా	2.1	1.7
ఒడిశా	1.8	1.2
ఉత్తరాఖండ్	1.8	1.6

క్షీరసాగర మథనం

జ్యోతిర్మయం

మరణంలేని జీవనం లక్ష్యంగా... దేవదానవులు క్షీరసాగర మథనానికి సన్నద్ధమయ్యారు. ప్రతీకాత్మకమైన క్షీరసాగర గాథలోని జీవన మూలాలు, అందులోని నాయకత్వ లక్షణాలు అవగాహన చేసుకొని వాటిని ఆచరణలో పెట్టడం ప్రయోజన కారి. ఆశ వేరు, ఆశయం వేరు. ఆశలో స్వార్థముంటుంది. ఆశయంలో తపన ఉంటుంది. దేవతలు, దానవులు తమ అంతర్గత భేదాభిప్రాయాలను పక్కన పెట్టి సమున్నతమైన అమృత సాధన అనే సమష్టి 'లక్ష్యాన్ని' ఏర్పరచు కున్నారు. ఇందులో దేవతలకు, దానవులకు 'ఆశ' ఉన్నది. వారికి మార్గదర్శన చేసిన విష్ణువులో 'ఆశయం' ఉన్నది. బృంద సభ్యులకు అర్హత ప్రాతిపదికగా బాధ్యతలు అప్పగించాడు. లక్ష్య సాధనా మార్గంలో ఎదురైన ప్రతి అడ్డంకినీ తప్పించాడు. ఫలితాన్ని సాధించాడే కానీ తానా ఫలితాన్ని ఆశించలేదు.

ప్రజా ప్రయోజనాలకై అవసరమైతే నాయకుడు ఆత్మ త్యాగానికైనా సిద్ధపడాలి. అందుకే శంకరుడు అమృత సాధనలో జనించిన హాలాహలాన్ని మింగాడు. సముద్ర మథనంలో కల్పవృక్షం, కామధేనువు, అప్సరసలు, ఐరావతం లాంటివి వచ్చాయి. వాటిని ఇంద్రుడు, బలి... తీసుకున్నారు. చివరివరకూ అప్రమత్తంగా ఉండాల్సిన దానవులు... అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ... అహంభావం వల్ల మోహ జలధిలో మునిగి, ఇంద్రియాలకు బానిసలై అమృత భాండాన్ని మోహినికి అప్పగించారు. సాధించిన విజయాన్ని నిరర్థక విజయంగా మార్చుకున్నారు.

ఇంద్రియాలకు అధిపతియైన ఇంద్రుడు ఇంద్రియ నిగ్రహంతో ప్రజ్ఞను ఆశ్రయించిన వేళ స్వర్గాధిపత్యాన్ని పొందాడు. అధికారం అహంకారాన్ని ఆవేశించగా... కామక్రోధాదులు కమ్ముకున్నాయి. అవే ఆసురీశక్తులు. వాటి విజృంభణ వల్ల ప్రజ్ఞ మసకబారింది. పిదప గురు ప్రబోధ వల్ల 'యెఱుక' జాగృతమయింది. నారాయణ సాంగత్యం లభిస్తుంది. నారము అనగా జ్ఞానము. దానివల్ల మనిషిలోని మానవత వెలుగుచూస్తూ... దానవత్వాన్ని అణిచివేసింది. ఇదే క్షీరసాగర మథన గాథలోని అంతర్గత బోధ.

– పాలకుర్తి రామమూర్తి

సాగర్‌లో 20 గేట్లు ఎత్తివేత

- శ్రీశైలంలో ఏడు గేట్లు ఎత్తివేత



నాగార్జునసాగర్/దోమలపెంట: ఎగువ నుంచి వరద పోటెత్తడంతో నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లోకి మళ్లీ భారీగా నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం సాగర్ జలాశయానికి ఎగువ నుంచి 2,05,796 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గురువారం ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్ గేట్లు ఎత్తి 1,57,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పాదన ద్వారా 32,886 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 587.90 అడుగులు ఉంది. శ్రీశైలం ఆనకట్ట వద్ద ఏడు గేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాలలో ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 1,77,710, విద్యుదుత్పత్తి చేస్తూ 30,422, సుంకేసుల నుంచి 20,196, హంద్రీ నుంచి 2,000 కలిపి మొత్తం 2,91,234 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తోంది. దీంతో ఆనకట్ట వద్ద ఏడు గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,94,600 క్యూసెక్కులు, భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 65,928 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.4 అడుగుల వద్ద 212.4385 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

60 మందిని కరిచిన పిచ్చికుక్క

సిరిసిల్ల టౌన్: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం పిచ్చికుక్క వీరంగం వేసి.. సుమారు 60 మందికి పైగా కరిచింది. స్థానికులు తెలిపిన వివరాలివి. సిరిసిల్లలో గురువారం సాయంత్రం ఒక పిచ్చికుక్క ఇందిరానగర్, తారకరామానగర్, బీవై నగర్, గణేశ్‌నగర్, మార్కెట్‌పల్లి, సాయినగర్, మార్కెట్ కమిటీ తదితర ప్రాంతాల్లో విరుచుకుపడింది. మనుషులు కనిపిస్తే చాలు.. ఉక్రోషంతో ఊగిపోతూ దాడి చేసింది. సుమారు 60 మందికి పైగా దాడి చేయగా.. బాధితుల్లో ఏడాదిన్నర వయసున్న పాప, మరో ఇద్దరు మూడేళ్లలోపు చిన్నారులు, పదమూడేళ్లలోపు ఏడుగురు ఉన్నారు. బాధితులు వరుసగా జిల్లా ఆస్పత్రికి బారులు తీరారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు 50 మందికి పైగా చికిత్స అందించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. క్షతగాత్రులు ఎంతమంది ఉన్నా.. చికిత్స అందించేందుకు ఆస్పత్రి సిబ్బందిని 24గంటల పాటు అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆస్పత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి.. పరిస్థితిని తెలుసుకున్నారు. క్షతగాత్రులకు పూర్తిస్థాయిలో చికిత్స అందించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.ఎ.ఖదీర్‌పాషా ఆదేశాలతో సిబ్బంది పిచ్చికుక్క కోసం గాలింపు చేపట్టారు.



టీచర్లను వాగు దాటిస్తున్న గ్రామస్తులు

రాత్రంతా బడిలోనే..

వాగు పొంగడంతో ఇళ్లకు వెళ్లలేకపోయిన ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్ రూరల్: పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయినులు.. వాగు ఉప్పొంగడంతో బడిలోనే రాత్రంతా గడపాల్సి వచ్చింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. ఆసిఫాబాద్ మండలం వాడిగొంది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వాతి, సుమలత, చెల్కగూడ ప్రాథమిక పాఠశాలలో హరిప్రకాశ్, జాలింషా పని చేస్తున్నారు. వీరు బుధవారం ఉదయం ఆసిఫాబాద్ నుంచి మార్గమధ్యలోని వాగు దాటి విధులకు వెళ్లారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి సాయంత్రం వాగు ఉప్పొంగడంతో.. వరద దాటలేక రాత్రంతా చెల్కగూడ ప్రాథమిక పాఠశాలలోనే ఉండిపోయారు. గురువారం మధ్యాహ్నం వరద కాస్త తగ్గుముఖం పట్టడంతో గ్రామస్తుల సాయంతో వాగు దాటారు. కాగా, ఆసిఫాబాద్ మండలం గుండి, అప్పపల్లి, టెమ్రెస్ మోవాడ్, చోపన్‌గూడ, డొర్రిగూడ, గోగిన్ మోవాడ్, వాడిగొంది, చెల్కగూడ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వర్షాకాలంలో వాగులు దాటి వెళ్లి పాఠాలు బోధిస్తున్నారు. ప్రవాహం ఎక్కువగా ఉంటే వాగుల వద్దే గంటల తరబడి వేచి చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండి గ్రామంలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రోజూ తెప్పలపై వాగు దాటి విధులకు హాజరవుతున్నారు.

ఉక్కపోత.. కుండపోత

▶ మొదటి పేజీ తరువాయి

ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సాయంత్రం వేళ విద్యాసంస్థలు వదలడంతో విద్యార్థులు, డ్యూటీలు ముగించుకొని ఇంటి దారి పట్టిన ఉద్యోగులు ట్రాఫిక్‌లో గంటల కొద్దీ నరక యాతన పడ్డారు. వరద ఉధృతికి రోడ్లపై అడుగు పెడితే కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో రోడ్ల పక్కన నిలిపిన ఆటోలు, ద్విచక్ర వాహనాలు వరదలో కొట్టుకొని పోయాయి. జీహెచ్ఎంసీ, జలమండలి, పోలీసు, హైడ్రా బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి.

హైదరాబాద్‌లో ఆయా ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం (సెం.మీ.లో)....	
జూపార్క్	8.6
దూద్‌బౌలి	8.4
రూపాల్ బజార్	7.7
చార్మినార్	6.8
బేగంబజార్	6.7
గన్‌ఫౌండ్రీ	6.7
కాప్రా	6.2
బండ్లగూడ	6.1



హైదరాబాద్ మహావీర్ ఆస్పత్రి వద్ద ట్రాఫిక్ జామ్

నాలుగు దిక్కులా చక్ర బంధం: భారీ వర్షానికి హైదరాబాద్ నలుదిక్కులా చక్రబంధంగా ట్రాఫిక్ స్తంభించి పోయింది. నాంపల్లి నుంచి మాసాబ్‌ట్యాంక్, లక్డీకాపూల్ నుంచి ఖైరతాబాద్, సోమాజిగూడ నుంచి మియాపూర్, సచివాలయం నుంచి ట్యాంక్‌బండ్, బేగంపేట నుంచి సికింద్రాబాద్, మెహిదీపట్నం నుంచి రాయదుర్గం, చాంద్రాయణ గుట్ట నుంచి మలక్‌పేట, ఎల్‌బీనగర్ నుంచి ఉప్పల్ తదితర మార్గాల్లో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ అయింది. గంటల కొద్దీ వాహనదారులు నరకయాతన పడ్డారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: పొన్నం

మూడు రోజుల్లో పడాల్సిన వర్షం 30 నిమిషాల్లోనే కుంభవృష్టిగా కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రావద్దని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరుతున్న ప్రాంతాల్లో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

అమెరికా పోలీసుల కాల్పుల్లో పాలమూరు యువకుడి మృతి

- రూమ్మేట్‌తో గొడవపడి కత్తితో పొడిచిన నిజాముద్దీన్
- లొంగిపోవాలని చెప్పినా వినకపోవటంతో పోలీసుల కాల్పులు



కాల్పులు జరుపుతున్న పోలీసు(బాడీ కెమెరా ఫొటో)

మహబూబ్‌నగర్ క్రైం: అమెరికాలో పోలీసుల కాల్పుల్లో మహబూబ్‌నగర్‌కు చెందిన యువకుడు మృతి చెందాడు. ఘటన జరిగిన 2 వారాల తర్వాత ఈ విషయంలో వెలుగులోకి వచ్చింది. మహబూబ్‌నగర్ పట్టణంలోని బీకే రెడ్డి కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు హసానుద్దీన్, ఫర్జానాబేగం దంపతుల కుమారుడు మహ్మద్ నిజాముద్దీన్ (29) ఈ నెల 3న అమెరికాలోని కాలిఫోర్నియా శాంటా క్లారా ఏరియాలో తనతోపాటు గదిలో అద్దెకు ఉంటున్న రూమ్మేట్‌తో ఏసీ విషయంలో గొడవపడ్డాడు. ఆవేశంలో కూరగాయలు కోసే కత్తితో అతడిని పొడిచాడు. వారి గది నుంచి శబ్దాలు రావటాన్ని గమనించిన చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు.. లొంగిపోవాలని హెచ్చరించినా నిజాముద్దీన్ వినకపోటంతో 4 రౌండ్ల కాల్పులు జరిపారు. కాల్పుల్లో నిజాముద్దీన్ అక్కడికక్కడే మరణించాడు. గాయపడిన అతడి రూమ్మేట్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం కర్ణాటకకు చెందిన ఒక విద్యార్థి నిజాముద్దీన్ తండ్రి హసానుద్దీన్‌కు ఫోన్ చేసి చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నిజాముద్దీన్ 2016లో ఎంఎస్ చేయడానికి అమెరికా వెళ్లి, పదేళ్లుగా అక్కడే ఉంటున్నాడు. ఇటీవల తల్లిదండ్రులతో మాట్లాడిన అతడు.. త్వరలో ఇండియాకు వస్తానని చెప్పాడు. కొడుకు మరణంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు.

మాకు న్యాయం చేయాలి



నా కొడుకు 2016లో అమెరికా వెళ్లాడు. ఫ్లోరిడాలో రెండేళ్లు చదువుకున్న తర్వాత ఏడాదిపాటు వెదకగా జాబ్ వచ్చింది. నాలుగేళ్లు పని చేసిన తర్వాత 2023లో ప్రమోషన్‌తో కాలిఫోర్నియాకు వచ్చాడు. వీసా గడువు ముగియడంతో పొడిగిస్తామని చెప్పిన కంపెనీవాళ్లు ఆపని చేయలేదు. ప్రభుత్వ అనుమతితో ఆరు నెలలుగా అక్కడే ఉంటున్నాడు. అయితే, రూమ్మేట్ తరుచుగా ఏసీ బంద్ చేస్తుండటంతో గొడవ జరిగిందని చెబుతున్నారు. మా బాబు స్నేహితుడు రాయచూర్‌కు చెందిన సయ్యద్ మొయినుద్దీన్ గురువారం ఉదయం ఫోన్ చేసి విషయం చెప్పింది. అంతవరకు మాకు సమాచారం లేదు. ఏం జరిగిందో తెలియాలి. న్యాయం చేయాలి. దీనిపై విదేశాంగమంత్రికి ఫిర్యాదు చేస్తాం.

– హసానుద్దీన్, నిజాముద్దీన్ తండ్రి

ఆటో డ్రైవర్ నిర్లక్ష్యానికి ముగ్గురు బలి

- రెండు ఆటోలు ఢీకొని ముగ్గురు ప్రయాణికుల దుర్మరణం
- మహబూబ్‌నగర్ జిల్లా తుల్జాభవానితండా వద్ద ఘటన

భూత్పూర్: ఓ ఆటోడ్రైవర్ నిర్లక్ష్యానికి ముగ్గురి ప్రాణాలు బలయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని తుల్జాభవానితండా వద్ద ఈ ఘటన జరిగింది. భూత్పూర్ సీఐ రామకృష్ణ కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండల కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ నర్సింహులు గురువారం ఉదయం ముగ్గురు ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకుని భూత్పూర్ వస్తున్నాడు. అదే సమయంలో హన్వాడకు చెందిన ట్రాలీ ఆటోలో భూత్పూర్ నుంచి కొత్తమొల్గరకు కూల్‌డ్రింక్స్ తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు తుల్జాభవానితండా వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఖిల్లాఘనపురం నుంచి వస్తున్న ఆటోలోని ప్రయాణికులు నర్సింహారెడ్డి (56), వంశీ (23), పాత్లావత్ సక్రి (34) అక్కడికక్కడే మృతిచెందగా.. ఆటో నడుపుతున్న డ్రైవర్ నర్సింహులు గాయపడ్డాడు. మరో ఆటోడ్రైవర్ ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు గాయపడ్డ నర్సింహులును అంబులెన్స్‌లో జనరల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. కాగా ఆటోడ్రైవర్ నర్సింహులు చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని ఆటోను నిర్లక్ష్యంగా నడిపినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రాలీ ఆటో డ్రైవర్ ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. అతివేగమే ప్రమాదానికి కారణమని చెపుతున్నారు.



సక్రి



వంశీ



నర్సింహారెడ్డి

పెద్దల పండుగకు వచ్చి వెళ్తూ..

భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఖిల్లాఘనపురంలో ఉండే చెల్లెలు పెద్దల పండుగ చేయడంతో అక్కడికి వెళ్లాడు. తిరిగి హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.

కుమార్తెలను తీసుకురావడానికి వెళ్తూ..

ఖిల్లాఘనపురం మండలం దొంతికుంటతండాకు చెందిన పాత్లావత్ సక్రి.. జడ్చర్ల సమీపంలోని ఆశ్రమ పాఠశాల నుంచి తన ఇద్దరు కూతుళ్లను ఇంటికి తీసుకువచ్చేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

కూలీ పనుల కోసం..

ఖిల్లాఘనపురం మండలం గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన వంశీ (23) కూలీ పనులకోసం ఆటోలో వెళ్తూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు సంబంధించి ఖిల్లాఘనపురం ఆటో డ్రైవర్ నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

స్కూటీపై మృతదేహం తరలింపు...

ఎల్లారెడ్డి: వాహనాలు అందుబాటులో లేక.. మరో మార్గం లేక స్కూటీపై మృతదేహాన్ని తరలించారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం కల్యాణి గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన బండారి సాయిలు (42) మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శవానికి పంచనామా నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. శవాన్ని తరలించేందుకు ట్రాక్టర్లు లేదా ఇతర వాహనాల కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నించగా దొరకలేదు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తన మూడు చక్రాల స్కూటీపై మరొకరి సహాయంతో.. శవాన్ని ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా పోలీసులకు విషయం తెలిసింది. అప్పటికే గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలోని తిమ్మారెడ్డి గేట్ వరకు వెళ్లారు. పోలీసులు వెంటనే ట్రాక్టర్‌ను పంపించి.. శవాన్ని ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు.



స్కూటీపై మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

సరికొత్త ఆయుధం ఐరన్‌బీమ్

లేజర్‌బీమ్ సహిత గగనతల రక్షణ వ్యవస్థ 'ఐరన్‌బీమ్'ను మోహరించిన ఇజ్రాయెల్


సైన్స్‌ఫిక్షన్ సినిమాల్లో మాత్రమే సాధ్యమయ్యే కొత్తశకం ఆయుధాలను ఇజ్రాయెల్ ఈ తరంలోనే తీసుకొచ్చి మరోసారి ప్రపంచ రక్షణరంగాన్ని ఔరా అనిపించింది. శత్రు దేశాల యుద్ధ విమానాలపై క్షిపణులను ప్రయోగించకుండా నేరుగా లేజర్ కాంతిపుంజాన్ని ప్రయోగించి విమానాలను నేలకూల్చే వ్యవస్థను ఇజ్రాయెల్ రంగంలోకి దింపింది. అత్యంత ప్రభావవంతంగా ఇది పనిచేస్తోందని, సమరక్షేత్రంలోనూ దీని సత్తాను పరీక్షించామని ఇజ్రాయెల్ తాజాగా ప్రకటించింది. దీనిని ఐరన్‌బీమ్ అని పేరు పెట్టింది. శత్రుసేనల డ్రోన్ల దండును ఒకేసారి వందలాది చిన్నపాటి క్షిపణులతో నేలమట్టం చేసే ఐరన్‌డోమ్ గగనతల రక్షణ వ్యవస్థతో ఇజ్రాయెల్ ఇప్పటికే ఆధునిక తరం ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్‌ల మోహరింపులో తన పైచేయి సాధించింది. వందలాది హమాస్ రాకెట్లను గాల్లోనే తుత్తునియలు చేసి ఈ ఐరన్‌డోమ్ ఇప్పటికే తన సత్తా చాటింది. దీనికి తోడుగా ఇప్పుడు లేజర్‌కాంతిపుంజ సహిత ఐరన్‌బీమ్ వ్యవస్థను సంసిద్ధం చేశామని ఇజ్రాయెల్ రక్షణవర్గాలు ప్రకటించాయి. ఎప్పటికప్పుడు కొత్త రకం ఆయుధాలతో దేశ సైనికరక్షణ వ్యవస్థను ఇజ్రాయెల్ పటిష్టం చేసుకుంటూ దూసుకుపోతోంది. ఈ ఐరన్‌బీమ్‌ను రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్ సంస్థ తయారుచేసింది.

కేవలం రెండు డాలర్లతో మటాష్

విధ్వంసం సృష్టించేందుకు నేలమీదకు దూసుకొచ్చే శత్రువుల డ్రోన్లు, క్షిపణులు, రాకెట్లు, మానవరహిత విహంగాలు, మోర్టార్లను గాల్లోనే అడ్డుకునేందుకు ఉపయోగించే సంప్రదాయక క్షిపణి నిరోధక వ్యవస్థను ఒక సందర్భంలో ఉపయోగిస్తే ఏకంగా 60,000 డాలర్లు అంటే రూ.53 లక్షలు ఖర్చవుతుంది. శత్రువుల రాకెట్లను అడ్డుకునేందుకు చిన్నపాటి రాకెట్లు, ఇతరత్రా ఆయుధాలను ప్రయోగించాల్సి రావడం వల్లే ఇంతటి ఖర్చు అవుతుంది. కానీ కొత్తగా రణరంగంలోకి దిగిన ఈ ఐరన్‌బీమ్‌ను ఒకసారి ఉపయోగిస్తే కేవలం 2 డాలర్లు మాత్రమే ఖర్చవుతుంది. మెరుపువేగంతో అమితమైన విద్యుత్‌ను ఉపయోగించుకుని కొత్త కాంతిపుంజాన్ని వదులుతుంది. అందుకే అత్యల్ప ఖర్చుతోనే అత్యధిక ప్రయోజనాన్ని పొందొచ్చు. సంప్రదాయక గగనతల రక్షణవ్యవస్థలో ప్రయోగించే కొన్ని చిన్నపాటి రాకెట్లు గురితప్పొచ్చు. వృథా ఖాయం. కానీ ఐరన్‌బీమ్ కాంతిపుంజాన్ని గురిచూసి ప్రయోగిస్తారు. కాంతిమాదిరిగా అత్యంత కచ్చితత్వంతో సరళరేఖ మాదిరి ఈ కాంతిపుంజం దూసుకుపోతుంది. దీంతో దిశ మారే అవకాశమే లేదు. ఏ పాయింట్ వద్ద కొడతామో అక్కడే విమానం, డ్రోన్, క్షిపణి ముక్కలుచెక్కలుకావడం ఖాయం. బీమ్ ప్రయోగానికి అది లక్ష్యాన్ని ఛేదించడానికి మధ్య సెకన్ల వ్యవధి కూడా పెద్దగాఉండదని ఇజ్రాయెల్ మాజీ ప్రధానమంత్రి నాఫ్తాలీ బెన్నెట్ చెప్పారు.

ఉన్న వాటితో కలుపుకుని పోతూ..

ఐరన్‌బీమ్‌ను అందుబాటులోకి తెచ్చినంత మాత్రాన ఐరన్‌డోమ్, డేవిడ్ స్లింగ్, యారో సిస్టమ్ వంటి ఇతర గగనతల రక్షణ వ్యవస్థలను ఇజ్రాయెల్ పక్కనబెట్టబోదు. యుద్ధ రీతి, అవసరానికి అనుగుణంగా వీటినీ మోహరిస్తుంది. అవసరమైతే ఐరన్‌డోమ్‌కు తోడుగా ఐరన్‌బీమ్ కదనరంగంలో రణానికి సిద్ధంకానున్నాయి. ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వ శాఖలోని పరిశోధనాభివృద్ధి విభాగం, ఇజ్రాయెల్ వాయుసేన, రఫేల్, ఎల్బిట్ సిస్టమ్స్ సంయుక్తంగా నెలల తరబడి కష్టపడి ఐరన్‌బీమ్‌ను సాకారంచేశాయి. దీనిని ఇప్పటికే దక్షిణ ఇజ్రాయెల్‌లో పలుమార్లు విజయవంతంగా పరీక్షించారు. రఫేల్ అడ్వాన్స్‌డ్ సంస్థలోని అడాప్టివ్ ఆప్టిక్స్ సాంకేతికతను సైతం ఐరన్‌బీమ్‌కు జోడించారు.



ఐరన్‌బీమ్‌తో యుద్ధ విమానాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం. ఐరన్‌బీమ్(ఇన్‌సెట్లో)

- సాక్షి, నేషనల్ డెస్క్

భారతీయ సంస్థల అధికారుల వీసాలు రద్దు

- ట్రంప్ ప్రభుత్వం కఠిన నిర్ణయం
- మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడితే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరిక

సాక్షి, న్యూఢిల్లీ: ప్రమాదకరమైన ఫెంటానిల్ మాదకద్రవ్యం తయారీలో ఉపయోగించే రసాయనాల అక్రమ రవాణాతో ప్రమేయం ఉన్న భారతీయ కంపెనీల ఉన్నతాధికారులపై అమెరికా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. పలువురు వ్యాపారవేత్తలు, కార్పొరేట్ ఉన్నతాధికారుల వీసాలను రద్దు చేసినట్లు న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం గురువారం ప్రకటించింది. ట్రంప్ పరిపాలన విధానాల్లో భాగంగా అమెరికన్లను ప్రమాదకరమైన సింథటిక్ నార్కోటిక్స్ నుండి రక్షించే ప్రయత్నంలో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా ఎంబసీ పేర్కొంది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదలచేసింది. కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లతోపాటు వారి కుటుంబ సభ్యులను అమెరికాకు ప్రయాణించడానికి అనర్హులుగా ప్రకటించింది. ఇప్పటికే వాళ్లలో అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్ల అభ్యర్థనలను తిరస్కరించామని పేర్కొంది. యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్‌లోని 221(ఐ), 212(ఎ)(2)(సీ), 214(బీ) సెక్షన్లకు అనుగుణంగా ఈ చర్యలు తీసుకున్నట్లు రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఫెంటానిల్ రసాయనాల స్మగ్లింగ్ చేసే కంపెనీలకు చెందిన ఇతర ఎగ్జిక్యూటివ్‌లు భవిష్యత్తులో వీసా కోసం దరఖాస్తు చేస్తే లోతైన పరిశీలన, అధ్యయనం తప్పవని యూఎస్ రాయబార కార్యాలయ ప్రతినిధి జోర్గాన్ ఆండ్రూస్ చెప్పారు.

ఓట్ల దొంగలకు ఈసీ అండ

- సాఫ్ట్‌వేర్, తప్పుడు దరఖాస్తులతో ఓట్ల తొలగింపు
- ఓట్ల చోరులను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కాపాడుతున్నారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆగ్రహం
- త్వరలో బాంబు పేలుస్తానని వెల్లడి



ప్రజాస్వామ్యాన్ని ప్రజలే కాపాడుకోవాలి

దేశంలో రాజ్యాంగబద్ధ సంస్థలు వాటి విధులు సరిగ్గా నిర్వర్తించడం లేదు. అందుకే న్యాయ వ్యవస్థ సహా ఇతర విభాగాలు జోక్యం చేసుకోవాలి. పరిస్థితిని చక్కదిద్దాలి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఓట్ల చోరులను, రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేవారిని కాపాడుతున్నారు. నేను ప్రతిపక్ష నేతను. ఈ విషయం మామూలుగా చెప్పడం లేదు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థను కొందరు హైజాక్ చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని ప్రజలే కాపాడుకోవాలి. నేను నిజాన్ని మాత్రమే చూపించగలను. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఖూనీ అవుతున్నాయని ప్రజలు అర్థం చేసుకున్నరోజు వాటిని కాపాడుకోవడానికి వారే నడుం బిగిస్తారు. అందుకు నేను పునాది వేస్తున్నా. ఈ ఉద్యమం కొనసాగుతుంది.

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)పై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఓట్ల దొంగలకు యథేచ్ఛగా సహకరిస్తోందని మండిపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఓట్ల చోరులను కాపాడుతున్నారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో వ్యవస్థీకృతంగా ఓట్లను తొలగిస్తున్నారని ధ్వజమెత్తారు. గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో రాహుల్ మీడియాతో మాట్లాడారు. ఓట్ల చోరీని బహిర్గతం చేస్తూ తెరపై ప్రజంటేషన్ ఇచ్చారు. ఓటర్ల జాబితా నుంచి తమ పేర్ల తొలగింపు కోసం దరఖాస్తు చేసినట్లుగా ఎన్నికల సంఘం చెబుతున్న వ్యక్తులు సైతం వేదికపైకి వచ్చారు. నిజానికి వారు ఎలాంటి దరఖాస్తు చేయలేదు. వారి పేరిట ఇంకెవరో దరఖాస్తు చేశారు. ఓట్ల చోరీపై తాను బయటపెట్టిన నిజాలు హైడ్రోజన్ బాంబు కాదని రాహుల్ వెల్లడించారు. త్వరలో నిజాలు బయటపెడతానని, బాంబు పేలుస్తానని అన్నారు. రాహుల్ ఏం మాట్లాడారంటే...

ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్‌తో...

''కర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 6,018 ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగింది. కాంగ్రెస్‌కు బలం ఉన్న పోలింగ్ బూత్‌లను లక్ష్యంగా చేసుకున్నారు. అక్కడే ఓట్లను తొలగించేందుకు కుట్రలు సాగించారు. ఓట్లు అత్యధికంగా తొలగింపునకు గురైన టాప్–10 బూత్‌లు కాంగ్రెస్‌కు బలం ఉన్నవే. 2018లో ఈ పదింటిలో ఎనిమిది బూత్‌లను కాంగ్రెస్ గెలుచుకుంది. మహారాష్ట్రలోని రాజురా అసెంబ్లీ నియోజకవర్గంలో ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్ సాయంతో 6,850 మంది ఓటర్లను మోసపూరితంగా చేర్చారు. ఇదే సాఫ్ట్‌వేర్‌ను హరియాణా, ఉత్తరప్రదేశ్, బిహార్‌లోనూ ఉపయోగించారు. దానిపై మావద్ద ఆధారాలున్నాయి.

సీఐడీకి ఆధారాలివ్వడానికి భయమెందుకు?

కర్ణాటకలో ఓట్ల చోరీపై ఫిర్యాదు చేశాం. దీనిపై రాష్ట్ర సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కొన్ని ఆధారాలు ఇవ్వాలని అధికారులు 18 నెలల్లో ఎన్నికల సంఘానికి 18 లేఖలు రాస్తే ఇప్పటికీ స్పందించలేదు. ఎన్నికల సంఘం ఆధారాలు ఎందుకు ఇవ్వడం లేదు? ఆధారాలిస్తే ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్నది ఎవరో తెలిసిపోతుంది కాబట్టి భయపడుతున్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఇప్పటికైనా నోరువిప్పాలి. ఆయన సక్రమంగా విధులు నిర్వర్తించాలి. సీఐడీ దర్యాప్తును అడ్డుకొనే ప్రయత్నం చేయొద్దు. సీఐడీకి వారం రోజుల్లోగా ఆధారాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. లేకపోతే రాజ్యాంగాన్ని హత్య చేయడానికి ఎన్నికల సంఘం సహకరిస్తున్నట్లేనని భావిస్తాం. ఓట్ల దొంగతనాన్ని ఇకనైనా ఆపాలని కోరుతున్నాం.

వ్యతిరేకుల ఓట్లే టార్గెట్

మన దేశంలో ఎన్నికలను ఎలా రిగ్గింగ్ చేస్తున్నారో కొన్ని రోజులుగా యువతకు తెలియజేస్తున్నా. అందులో ఈరోజు మరో మైలురాయి. ఓట్ల తొలగింపు అనేది అనుకోకుండా జరుగుతున్నది కాదు. దేశవ్యాప్తంగా వ్యతిరేకుల ఓట్లను ఒక పద్ధతి ప్రకారం టార్గెట్ చేస్తున్నారు. మైనార్టీలు, దళితుల ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారు. ఇందుకోసం సాఫ్ట్‌వేర్‌ను వాడుకోవడంతోపాటు తప్పుడు దరఖాస్తులు సమర్పిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన ఫోన్ నెంబర్లను వాడుకుంటున్నారు. ప్రతిపక్షాలకు బలం ఉన్న ప్రాంతాల్లో లక్షలాది ఓట్లు గల్లంతవుతున్నాయి. ఓట్ల తొలగింపు కోసం దరఖాస్తును పూరించడం సాఫ్ట్‌వేర్‌తో సెకండ్లలోనే పూర్తయిపోతోంది. తెల్లవారుజామునే ఇది జరుగుతోంది. మరోవైపు నకిలీ వ్యక్తులు అసలైన ఓటర్ల ముసుగులో రంగ ప్రవేశం చేస్తున్నారు. తమ ఓట్లు తొలగించాలంటూ తప్పుడు పత్రాలతో దరఖాస్తులు సమర్పిస్తున్నారు. ఓట్ల చోరీపై మా దగ్గర 100 శాతం కచ్చితమైన ఆధారాలున్నాయి. నేను నా దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రేమిస్తున్నా. వాటిని కాపాడుకోవడానికి పోరాటం సాగిస్తా'' అని రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు.

ఆన్‌లైన్‌లో ఓట్లు తొలగించడం సాధ్యం కాదు

రాహుల్ ఆరోపణలు నిరాధారం: ఈసీ

న్యూఢిల్లీ: ఓట్ల చోరీ జరుగుతోందని, ఓట్ల దొంగలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కాపాడుతున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఖండించింది. అందులో ఏమాత్రం వాస్తవం లేదని, రాహుల్ నిరాధార ఆరోపణలు చేశారని తేల్చిచెప్పింది. ఆన్‌లైన్‌లో ఓట్లను తొలగించడం సాధ్యం కాదని పేర్కొంది. ఎవరి ఓటునైనా తొలగించాలనుకుంటే వారి వాదన తప్పనిసరిగా వింటామని వెల్లడించింది. సంప్రదించి అభిప్రాయం తెలుసుకోకుండా ఓటును తొలగించే ప్రసక్తే లేదని స్పష్టంచేసింది. సామాన్య ప్రజలు ఆన్‌లైన్‌లో తమ ఓటును తొలగించుకోలేరని వివరణ ఇచ్చింది. రాహుల్ చెబుతున్నదాంట్లో నిజం లేదని తెలియజేసింది. 2023లో కర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపునకు కొందరు ప్రయత్నాలు చేసినప్పటికీ అవి సఫలం కాలేదని పేర్కొంది. దీనిపై తాము దర్యాప్తు చేస్తున్నట్లు వివరించింది. అలంద్‌లో 2018లో బీజేపీ, 2023లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిచినట్లు గుర్తుచేసింది. అక్కడ ఓట్ల తొలగింపునకు జరిగిన ప్రయత్నాలకు సంబంధించి తమ వద్ద ఉన్న సమాచారాన్ని 2023 సెప్టెంబర్ 6న పోలీసులకు ఇచ్చామని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఓట్లు తొలగించాలంటూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించగా 24 మాత్రమే అసలైనవని, 5,994 తప్పుడు దరఖాస్తులేనని తేలినట్లు తెలిపింది. తప్పుడు దరఖాస్తులను తిరస్కరించామని, ఓట్లను తొలగించలేదని పేర్కొంది.

కుంభవృష్టి గుప్పిట్లో ఉత్తరాఖండ్

- కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఆరుగురు జాడ గల్లంతు
- ఇద్దరు మృతి
- ఐదుగురిని రక్షించిన సహాయక బలగాలు

గోపేశ్వర్(ఉత్తరాఖండ్): ఉత్తరాఖండ్‌ను మళ్లీ కుంభవృష్టి గట్టిగా పలకరించింది. పలు ప్రాంతాల్లో భారీస్థాయిలో వానలు కురిశాయి. ముఖ్యంగా ఛమోలీ జిల్లాలో గురువారం కురిసిన భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఆరుగురి జాడ గల్లంతైంది. 12 మంది గాయపడ్డారు. నందనగర్ పరిధిలోని 4 గ్రామాలపై కొండచరియలు పడిన ప్రభావం అతిగా ఉంది. కుంటారీ లగాఫలీ, కుంటారీ లగాసర్పానీ గ్రామాల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఒక చిన్నారి, ఇద్దరు మహిళలు సహా ఐదుగురిని శిథిలాల నుంచి కాపాడారు. కుంటారీ లగాఫలీ, కుంటారీ లగాసర్పానీ, ధుర్మా గ్రామాల్లో మొత్తంగా ఆరుగురి జాడ తెలీకుండా పోయిందని డెహ్రాడూన్‌లోని ఉత్తరాఖండ్ రాష్ట్ర అత్యయక నిర్వహణ కేంద్రం ప్రకటించింది. ఈ కుంటారీ లగాఫలీ, కుంటారీ లగాసర్పానీ, ధుర్మా, సేరా గ్రామాల్లో మొత్తంగా కొండచరియలు పడడంతో 40 ఇళ్లు, పలు దుకాణాలు, పశువులకొట్టాలు మట్టిలో కలిసిపో యాయి. అంతకుముందు అందిన సమాచారం మేరకు కొండచరియలు పడిన ఘటనల్లో 14 మంది జాడ గల్లంతైందని రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ ప్రకటించడం తెల్సిందే. వర్షసంబంధ ఘటనల్లో 200 మందికిపైగా ప్రజలు గాయాలు, ఇతరత్రా సమస్యలతో తీవ్ర అవస్థలు పడ్డారు. పలువురి జాడ గల్లంతవడంతో వారిని కనిపెట్టేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఐటీబీపీ, రాష్ట్ర పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి.



నందనగర్‌లో ఇళ్లను ముంచేసిన మట్టి, బురద

తృటిలో తప్పించుకున్న ఎంపీ

కొండచరియలు విరిగి పడటంతో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు గురువారం ఘటనాస్థలికి చేరుకున్న బీజేపీకి చెందిన గర్వాల్ నియోజ కవర్గ ఎంపీ అనిల్ బలూనీ తృటిలో కొండచరియలు విరిగి పడిన ఘటన నుంచి తప్పించుకున్నారు. రోడ్డు పక్కన నిలబడి అక్కడి సహాయక చర్యలను గమనిస్తుండగా ఆయన నిల్చున్న రోడ్డు పక్క కొండ నుంచి సైతం బండరాళ్లు, మట్టి కిందకు దూసుకొచ్చాయి. వెంటనే అప్రమత్తమై ఎంపీ, ఆయన వ్యక్తిగత సహాయకులు దూరంగా పరుగెత్తారు. ఈ దృశ్యాల వీడియో ఇప్పుడు సామాజిక మాధ్య మాల్లో తెగ షేర్ అవుతోంది. '' ఎక్కడ ఎప్పుడు ఏ కొండ ప్రకంపనలతో బండరాళ్లను కిందకు పడేస్తుందో ఎవరికీ తెలీదు. అయినాసరే తెగించి రోడ్డుపై మట్టి, రాళ్లను తొలగిస్తున్న రోడ్ క్లియరెన్స్ సిబ్బంది అంకితభావాన్ని మెచ్చుకోవాల్సిందే''అని ఎంపీ తర్వాత 'ఎక్స్'లో అన్నారు. గర్వాల్ నియోజకవర్గంలో తరచూ భారీ వర్షాలు, కొండచరియలు పడిన ఘటనలు జరుగుతున్నాయి.

ప్రధాని మోదీకి సుశీలా కర్కి ఫోన్

కాఠ్మండు: నేపాల్ ఆపద్ధర్మ ప్రధానిగా ఇటీవల నియమితులైన సుశీలా కర్కి గురువారం ప్రధాని మోదీతో ఫోన్‌లో సంభాషించారు. ప్రాధాన్యతాంశాలను అమలు చేయడంలో ఆపద్ధర్మ ప్రభుత్వానికి తోడ్పాటునిస్తామని ఆమెకు మోదీ హామీ ఇచ్చారు. బాధ్యతలు చేపట్టాక కర్కి ఒక విదేశీ ప్రభుత్వాధినేతకు చేసిన మొట్టమొదటి ఫోన్ కాల్ ఇదే కావడం గమనార్హం. సామాజిక మాధ్యమాలపై నిషేధంతోపాటు ప్రభుత్వంలో అవినీతికి వ్యతిరేకంగా యువత ఆధ్వర్యంలో జరిగిన జెన్ జడ్ నిరసనలు హింసాత్మక రూపం దాల్చడంతో ప్రధాని కేపీ శర్మ ఓలి గద్దెదిగగా, కర్కి ఆపద్ధర్మ ప్రధానిగా బాధ్య తలు చేపట్టడం తెల్సిందే. గురువారం ఫోన్ కాల్ సందర్భంగా నేపాల్‌కు మొట్టమొదటి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కర్కికి ప్రధాని మోదీ అభినందనలు తెలిపారని విదేశాంగ శాఖ తెలిపింది. ఎన్నికల నిర్వహణే తమ ఆపద్ధర్మ ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉంటుందని కర్కి తెలిపారు.

ఉగ్రవాదుల అంత్యక్రియలకు వెళ్లాలని పాక్ ఆర్మీ చీఫ్ చెప్పారు

కొత్త విషయాలు బయటపెట్టిన జైషే టాప్ కమాండర్ ఇలియాస్ కశ్మీరీ

లాహోర్: పాకిస్తాన్ ఆర్మీ, జైషే మొహమ్మద్ ఉగ్రసంస్థలు చెట్టాపట్టాల్‌వేసుకుని తిరిగారని, కష్టకాలంలో ఒకరిని మరొకరు ఓదార్చారని బట్టబయలైంది. ఈ వివరాలను జైషే ఉగ్రసంస్థ టాప్ కమాండర్ మసూద్ ఇలియాస్ కశ్మీరీ వెల్లడించాడు. ఇలియాస్ కశ్మీరీ సెప్టెంబర్ ఆరున పాక్ పంజాబ్ ప్రావిన్స్‌లోని మిషన్ ముస్తాఫా కాన్ఫరెన్స్ బహిరంగ సభలో ప్రసంగిస్తూ కొన్ని అంశాలను బట్టబయలు చేశాడు. అందులోని మరికొన్ని అంశాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. పాకిస్తాన్‌లో పాతికేళ్లుగా ఉగ్రకార్యకలాపాలు నిర్వహిస్తున్నా ఇటీవలే తమకు పాకిస్తాన్ ఆర్మీ నుంచి అధికారికంగా మద్దతు లభించిందని ఇలియాస్ కశ్మీరీ అన్నాడు. '' 25 ఏళ్ల జిహాదీ సైద్ధాంతిక ఉద్యమం తర్వాత ఎట్టకేలకు పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం నుంచి జైషే మొహమ్మద్‌కు మద్దతు లభించింది. ఆర్మీ మాత్రమే కాదు పాక్ వాయుసేన, నావికాదళం సైతం జిహాదీ సిద్ధాంతాన్ని బలంగా నమ్మడం మొదలెట్టాయి. అందుకే మే 7వ తేదీన భారత వాయుసేన పాక్‌లోని జైషే శిక్షణ, స్థావరాలపై దాడులు చేస్తే ప్రతీకారం తీర్చుకునేందుకు పాక్ ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ ముందుకొచ్చాయి. ఇది నిజమే కదా!'' అని సభకు వచ్చిన వాళ్లతో ఇలియాస్ కశ్మీరీ వ్యాఖ్యానించాడు. '' లాహోర్‌కు 400 కి.మీ.ల దూరంలోని బహావల్పూర్‌లోని జైషే ప్రధానకార్యాలయంపై భారత్ దాడిచేసింది. ఆ దాడిలో చనిపోయిన జైషే ఉగ్రవాదుల అంత్యక్రియలు, ఖనన కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొనాలని పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ సైన్యాధికారులు, జవాన్లను ఆదేశించారు. ఈ మేరకు బహావల్పూర్‌లోని పాక్‌ఆర్మీ జనరల్ హెడ్‌క్వార్టర్స్ కోర్ కమాండర్, సైనికులకు ఆదేశాలు వచ్చాయి. అందుకే ఆరోజు ఖనన తంతులో పాక్ ఆర్మీ జనరల్స్, సీనియర్ పోలీస్ ఆఫీసర్లు, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్వయంగా హాజరై మా ఉగ్రవాదులకు నివాళులర్పించారు. ప్రత్యేక ప్రార్థనల్లోనూ పాల్గొన్నారు. పుష్పగుచ్ఛాలు ఉంచారు'' అని ఇలియాస్ కశ్మీరీ చెప్పాడు.

అన్ని మతాలనూ గౌరవిస్తా

- విష్ణుమూర్తిపై నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు
- సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వివరణ



న్యూఢిల్లీ: తాను అన్ని మతాలనూ గౌరవిస్తానని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పష్టం చేశారు. విష్ణుమూర్తిపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సోషల్ మీడియాలో తనపై వస్తున్న ఆరోపణల పట్ల ఆయన గురువారం స్పందించారు. ఆరోపణలను ఖండించారు. తన వ్యాఖ్య లను తప్పుగా అర్థం చేసుకున్నారంటూ వివరణ ఇచ్చారు. మధ్యప్రదేశ్‌లో యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన ఖజు రహో ఆలయ ప్రాంగణంలో ఉన్న జవేరీ టెంపుల్‌లో భగవాన్ విష్ణుమూర్తి వి గ్రహం దెబ్బతిన్నదని, ఆలయాన్ని పునర్ నిర్మించి, అక్కడ మరో విగ్రహాన్ని ఏర్పా టు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ రాకేశ్ దలాల్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. దీనిపై సీజేఐ జస్టిస్ గవాయ్‌తోపాటు జస్టిస్ కె.వినో ద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ నెల 16న విచారణ చేపట్టింది. పిటిషన్‌ను తిరస్కరించింది. అది ప్రచార ప్రయోజన వ్యాజ్యం అంటూ ఆక్షేపించింది. విగ్రహం విషయంలో మీరు ఆరాధిస్తున్న విష్ణుమూర్తినే ఏదో ఒకటి చేయమని అడగండి అంటూ పిటిషనర్‌కు జస్టిస్ గవాయ్ సూచించారు. అలా చేస్తే మీరు నిజమైన విష్ణు భక్తులవుతారు అని చెప్పారు. దేవుడిని ప్రార్థించి, తర్వాత యోగా చేయండి అని పేర్కొన్నారు. శివుడికి మీరు వ్యతిరేకం కాకపోతే అక్కడే ఖజురహోలో పెద్ద శివలింగం ఉంది, దాన్ని పూజించండి అని జస్టిస్ గవాయ్ చెప్పారు. విష్ణుమూర్తి విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో జనం తప్పుపట్టారు. జస్టిస్ గవాయ్‌కి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అండగా నిలిచారు. జస్టిస్ గవాయ్ తనకు చాలా ఏళ్లుగా తెలుసని, ఆయన అన్ని మతాల ఆధ్యాత్మిక, పవిత్ర క్షేత్రాలను దర్శిస్తుంటారని చెప్పారు. అన్ని మతాలను సమానంగా భావిస్తుంటారని తెలిపారు. భగవంతుడిని కించపర్చడం ఆయన ఉద్దేశం కాదని అన్నారు. న్యూటన్ నియమం ప్రకారం ఒక చర్యకు అంతే సమానమైన ప్రతిచర్య ఉంటుందని వివరించారు. కానీ, ఇప్పుడు సోషల్ మీడియా కాలంలో ఒక చర్యకు తప్పుడు అతి ప్రతిస్పందన ఉంటుందని పేర్కొన్నారు. జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలను వక్రీకరించడం దురదృష్టకరమని స్పష్టంచేశారు. సోషల్ మీడియా పోస్టులను జస్టిస్ వినోద్ చంద్రన్ ఖండించారు. సోషల్ మీడియా యాంటీ సోషల్ మీడియా మారిందని విమర్శించారు.

వార్ ఆపుతానని వంచించాడు

- పుతిన్ చేతిలో మోసపోయా
- యుద్ధం ఆపకుండా ఎంతో మందిని బలితీసుకుంటున్నాడు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య
- అక్రమ వలసల కట్టడికి ఆర్మీని వాడాలని బ్రిటన్ ప్రధానికి హితవు

లండన్: ఉక్రెయిన్‌పై దురాక్రమణ జెండా ఎత్తి భీకర యుద్ధంచేస్తున్న రష్యా అధ్యక్షుడు పుతిన్ చర్చల వేళ సమరానికి స్వస్తి పలుకుతానని చెప్పి తనను నమ్మించి మోసంచేశాడని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బ్రిటన్‌లో రెండ్రోజుల పర్యటనలో రాజు ఛార్లెస్ కుటుంబం, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌లతో వరుస భేటీలతో బిజీగా గడిపిన ట్రంప్ మరోవైపు 'ఎక్స్'లో పుతిన్‌పై విమర్శలుచేశారు. ''పుతిన్ ఎంతో మందిని చంపేస్తున్నారు. అంత కంటే ఎక్కువ మందిని దూరంచేసుకుంటున్నారు. మోసం చేసి నన్ను కూడా ఆయన దూరం చేసుకుంటున్నారు. చర్చల వేళ యుద్ధం ఆపేస్తానని చెప్పి పుతిన్ నన్ను దారుణంగా మోసంచేశారు. ఎంతో మనస్తాపానికి గురయ్యా''అని ట్రంప్ అన్నారు. ఈ ఏడాది ఆగస్టులో అలాస్కా భేటీలో ట్రంప్, పుతిన్ అత్యంత ఆర్భాటంగా కలిసినా ఎలాంటి సంయుక్త ప్రకటన విడుదల చేయకపోవడంతో ప్రపంచదేశాలు ఉసూరుమన్న విషయం తెల్సిందే. రష్యాపై ఒత్తిడి పెంచేందుకు భారత్‌పై టారిఫ్‌ల భారం మోపడాన్ని ట్రంప్ సమర్థించుకున్నారు. ''సులభమైన పద్ధతిలో చెప్పాలంటే ఒకవేళ ముడిచమురు ధరలు భారీగా తగ్గిపోతే చమురును అమ్ముకుంటున్న రష్యాకు లాభాలు అడుగంటిపోతాయి. ఆయుధాలకు డబ్బుల్లేక చివరకు యుద్ధాన్ని ఆపుతుంది. చమురు ధర అంతర్జాతీయంగా దిగివస్తోంది. మరింతగా దిగివచ్చేలా నేను చేస్తా'' అని అన్నారు.



బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో భేటీ తర్వాత మీడియాతో ట్రంప్ మాట్లాడారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎలా ఆపుతారన్న మీడియా ప్రశ్నకు ట్రంప్ సమాధానం దాటవేసి పాత కయ్యాలకు రాజీ కుదిర్చానని చెప్పారు. '' పరిష్కారం కనుగొనడం అసాధ్యం అనుకునే 7 సంక్షోభాలకు ముగింపు పలికా. ఇకమీదటా మరో శుభవార్త వినగలమనే అనుకుంటున్నా. ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం ప్రత్యక్షంగా అమెరికాపై పడట్లేదు. ఉక్రెయిన్ యుద్ధం అంతానికి ఒక అవరోధం అడ్డుపడుతోంది'' అని అన్నారు.

స్టార్మర్‌తో చర్చలు

బకింగ్‌హైర్‌లో చెకర్స్‌లోని 16వ శతాబ్దినాటి పురాతన భవంతిలో బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో చర్చలు జరిపాక మీడియాతో ట్రంప్ మాట్లాడారు. ఇంగ్లిష్ ఛానల్, సరిహద్దు గుండా అక్రమ చొరబాట్లపై స్టార్మర్‌కు మీరేం సలహా ఇస్తారని ట్రంప్‌ను మీడియా ప్రశ్నించింది. ''అమెరికాలోకి అయితే చట్టవ్యతిరేకంగా లక్షలాది మంది చొరబడుతున్నారు. ఇలాంటి అక్రమవలసదారులు ఎన్నో దేశాలను నాశనంచేశారు. అలా చూస్తూ ఊరుకోలేను. వాళ్లను బహిష్కరించి పంపేయడం తప్ప మరో మార్గంలేదు. స్టార్మర్‌కూ అదే చెప్పా. సైన్యాన్ని సరిహద్దులకు రప్పించి అక్రమ వలసలను కట్టడిచేయండి. సైన్యాన్ని ఎలా సద్వినియోగం చేస్తున్నామనేదే ముఖ్యం''అని అన్నారు.

మోదీ, భారత్‌తో నాకెంతో సాన్నిహిత్యం

బుధవారం మోదీ బర్త్‌డే వేళ ఫోన్‌చేసి శుభాకాంక్షలు చెప్పిన ట్రంప్ మరుసటి రోజు సైతం పొగిడారు. ''భారత ప్రధాని మోదీ, ఇండియాతో నాకెంతో సాన్నిహిత్యం ఉంది. హ్యాపీబర్త్‌డే చెప్పేందుకు నిన్ననే ఫోన్‌చేసి మాట్లాడా. మా మధ్య సత్సంబంధాలున్నాయి. అయినాసరే భారత్‌పై అధిక టారిఫ్ మోపాల్సి వచ్చింది''అని అన్నారు.

అఫ్గానిస్తాన్ స్థావరాన్ని తిరిగి సాధిస్తాం

''అఫ్గానిస్తాన్‌లోని బాగ్రామ్ వైమానికస్థావరాన్ని తిరిగి చేజిక్కించుకుంటాం. అది జరిగితే నిజంగా ఇది సంచలన వార్తే అవుతుంది. దానిని కైవసం చేసుకోవాలన్న ఉద్దేశం వెనుక పెద్ద కారణం ఉంది. అక్కడి నుంచి కేవలం గంట సేపు విమానంలో ప్రయాణిస్తే చైనా అణ్వాయుధాల తయారీ కేంద్రాన్ని చేరుకోవచ్చు''అని ట్రంప్ అన్నారు. 1950దశకంలో సోవియట్ రష్యా ఈ స్థావరాన్ని తొలిసారిగా ఏర్పాటు చేసింది. 1980లలో అది ప్రధాన స్థావరంగా వెలుగొందింది. 2001లో తాలిబన్ ప్రభుత్వాన్ని అమెరికా కూలదోసి ఆ స్థావరాన్ని తమ వశంచేసుకుంది. చిన్న బేస్‌ను దశలవారీగా ఏకంగా 77 చదరపు కిలోమీటర్ల స్థాయికి పెంచింది. ఇటీవల అఫ్గాన్ నుంచి అమెరికా సేనలు పూర్తిగా నిష్క్రమించడం తెల్సిందే.

బ్రిటన్‌తో టెక్ డీల్

ట్రంప్ పర్యటన వేళ బ్రిటన్‌తో అమెరికా సాంకేతిక ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి సాంకేతికత శ్రేయస్సు ఒప్పందం అని పేరు పెట్టారు. కృత్రిమ మేథ, క్వాంటమ్ కంప్యూటింగ్, అణువిద్యుత్ రంగాల్లో సహకారంతోపాటు బ్రిటన్‌లో సాంకేతిక రంగాల్లో బడా అమెరికన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఈ ఒప్పందం బాటలు వేయనుంది. మైక్రోసాఫ్ట్ ఏకంగా 30 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతానని ప్రకటించింది. మరో రెండేళ్లలో ఏఐ పరిశోధన, మౌలిక సదుపాయాల రంగాల్లో 5 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తానని గూగుల్ తెలిపింది.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



ఇక ఫుడ్ డెలి'వర్రీ'..
ఆన్‌లైన్ ఫుడ్ లవర్స్‌కు ఊహించని షాక్ ఇది. జొమాటో, స్విగ్గీ యూజర్లపై అదనపు భారం పడనుంది. ఫుడ్ డెలివరీ చార్జీలు అమాంతం పెరగనున్నాయి. -10లో



మౌనమేలనోయి..
కొన్నిసందర్భాల్లో సైలెన్స్ ఎంత ప్రశాంతతనిస్తుందో.. మరికొన్ని సందర్భాల్లో సైలెన్స్..అంత వైలెంట్‌గా ఉంటుంది.. ఈ విషయం మనలో చాలా మంది గ్రహించే ఉంటాం. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.0/22.0
నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గరిష్టంగా 31, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

74 కి. మీ. దూరం కొట్టుకుపోయి..

నాలాలో గల్లంతైన అర్జున్ ఆచూకీ లభ్యం

- వలిగొండ వద్ద మూసీలో మృతదేహం
- రామా కోసం గాలిస్తున్న డీఆర్ఎఫ్ బృందాలు



నాంపల్లి: నగరంలోని అఫ్జల్‌సాగర్ నాలా వరద నీటిలో అయిదు రోజుల క్రితం గల్లంతైన మాన్గార్ బస్తీ యువకుడు అర్జున్ (26) నల్లగొండ జిల్లా వలిగొండ వద్ద మూసీలో మృతదేహమై తేలాడు. ఈ నెల 14న రాత్రి మామా అల్లుళ్లు రామా, అర్జున్ అఫ్జల్‌సాగర్ నాలాలో గల్లంతైన విషయం తెలిసిందే. వీరి కోసం జీహెచ్ఎంసీ, హైడ్రా బృందాలు గాలింపు చేపట్టాయి. అయిదు రోజుల తర్వాత నల్లగొండ జిల్లా వలిగొండ సమీపంలోని మూసీ నదిలో ఉన్నట్లు సహాయక సిబ్బంది కనుగొన్నారు. రామా (25) మృతదేహం లభించలేదు. డీఆర్ఎఫ్ బృందాలు రామా ఆచూకీ కోసం గాలిస్తున్నాయి. అర్జున్ మృతదేహం గ్రేటర్ హైదరాబాద్ నుంచి 74 కిలో మీటర్ల దూరం కొట్టుకుపోయింది. మృతుడు అర్జున్‌కు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

వరద నీటిలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి



వరద నీటిలో గాలిస్తున్న ట్రాఫిక్ ఎస్సై శ్రీరాములు



మొహ్మద్ షరీఫుద్దీన్ (ఫైల్)

అమీర్‌పేట: అమీర్‌పేట మైత్రివనం ప్రాంతంలో బుధవారం రాత్రి వరద నీటిలో ఓ వ్యక్తి కొట్టుకుపోయి మృతి చెందాడు. బల్కంపేట అండర్ పాస్ బ్రిడ్జి వద్ద రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడు ముషీరాబాద్‌కు చెందిన మొహ్మద్ షరీఫుద్దీన్ (26)గా గుర్తించారు. వరద నీటిలో కొట్టుకుపోతున్న షరీఫుద్దీన్‌ను స్థానికులు చూశారు. చిమ్మచీకటి ఉండటంతో సెల్‌ఫోన్ లైట్ల సాయంతో వెలికితీశారు. షరీఫుద్దీన్ తలకు ఉన్న హెల్మెట్‌ను తీసి సీపీఆర్ చేసి కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ట్రాఫిక్ ఎస్సై శ్రీరాములు సైతం నీటిలో కొట్టుకుపోతున్న బాధితుడిని కాపాడేందుకు యత్నించినా లాభం లేకపోయింది. షరీఫుద్దీన్ బాలానగర్‌లోని జైపూర్ ఫుట్ కృత్రిమ కాళ్లు, చేతుల తయారీ కంపెనీలో 5 నెలలుగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా మృత్యువాత పడ్డాడు. మృతుడి సోదరుడు మొహ్మద్ బిలాల్ ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాసబ్‌ట్యాంక్ మహవీర్ ఆస్పత్రి మార్గంలో..



వరద నీటిలో నెమ్మదిగా వెళ్తున్న వాహనాలు

సిటీ జామ్

రహదారులను ముంచెత్తిన వరద

- నలుదిక్కులా నిలిచిపోయిన ట్రాఫిక్
- వాహనదారుల నరకయాతన

కుండపోత వానతో అతలాకుతలం

సాక్షి, సిటీబ్యూరో: గత రెండురోజులుగా ఉదయం ఉక్కపోతతో.. సాయంత్రం కుండపోత వర్షం సిటీజనులను కకావికలం చేస్తోంది. గురువారం సాయంత్రం మరోసారి మేఘం గర్జించింది. నగరం అతలాకుతలమైంది. సుమారు గంటన్నర సేపు కురిసిన కుండపోత వర్షానికి ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. అత్యధికంగా పాతబస్తీ బహదూర్‌పురాలోని జూపార్క్ వద్ద సుమారు 8.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరద ఉధృతికి రోడ్ల పక్కన నిలిపిన ఆటోలు, ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. జీహెచ్ఎంసీ, జలమండలి, పోలీసు, హైడ్రా బృందాలు రంగంలో దిగి సహాయక చర్యలు చేపట్టాయి.

స్తంభించిన నగరం
భారీ వర్షానికి నగరం నలు దిక్కులా స్తంభించిపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోవడంతో చక్రబంధంగా మారింది. సాయంత్రం వేళ కావడం.. ట్రాఫిక్‌జామ్ ఏర్పడటంతో ఉద్యోగులు, విద్యార్థులు, కూలీలు గంటలకొద్దీ నరక యాతన పడ్డారు.

ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉండాలి
కుంభవృష్టి వర్షాల నేపథ్యంలో ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రోడ్లపై, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ, హైడ్రా, జల మండలి, పోలీస్, విద్యుత్ వివిధ విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు.

ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు

జీహెచ్ఎంసీ	040-2111 1111
జలమండలి కస్టమర్ కేర్	155313
హైదరాబాద్ కలెక్టరేట్	90634 23979



గోల్కొండ హోటల్ సమీపంలో..



పాదచారుల కష్టాలు



బంజారాహిల్స్‌లో..



నల్లగొండ ఎక్స్ రోడ్డు- చాదర్‌ఘాట్ మార్గంలో..

ట్రాఫిక్ నిర్వహణలో | కీలక ఎంఓయూలు

మ్యాప్స్ మై ఇండియా, ఐఐఐటీ హైదరాబాద్‌తో ఒప్పందాలు

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చడంతో పాటు రహదారి భద్రతను పెంపొందించడం, వాహన చోదకులకు రియల్ టైమ్ సమాచారం అందించడమే ప్రధాన లక్ష్యాలుగా హైదరాబాద్ పోలీసులు రెండు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. గురువారం జలవిహార్ ఆడిటోరియంలో ప్రారంభమైన ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్-2025లో భాగంగా, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో ఇరువర్గాలు ఎంఓయూలు చేసుకున్నాయి. మ్యాప్స్ సంస్థ మ్యాప్ ఆధారిత సేవలతో పాటు మొబైల్ అప్లికేషన్‌ను అందించనుంది. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం ఏర్పాటు చేసుకుని పని చేసే ఈ సంస్థ రహదారులపై ఉన్న ట్రాఫిక్ స్థితిగతుల్ని రియల్ టైమ్‌లో ఎప్పటికప్పుడు అందిస్తుంది. ట్రాఫిక్ జామ్స్‌తో పాటు నిరసనలు, ర్యాలీలు జరుగుతున్న ప్రాంతాలు, ప్రముఖుల కదలికలు, రహదారుల మూసివేత, దారి మళ్లింపు తదితర అంశాలను వాహన చోదకులకు అందిస్తుంది. తమ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నగరంలోని బ్లాక్‌స్పాట్స్, ప్రమాదకరమైన టర్నింగ్స్, స్పీడ్ లిమిట్స్ సమాచారం, యాక్సిడెంట్స్‌కు అవకాశం ఉన్న ప్రాంతాలను మ్యాప్స్ ద్వారా సూచిస్తుంది. మ్యాప్స్ మై ఇండియా ప్లాట్‌ఫామ్స్ వినియోగిస్తున్న వాహనచోదకులు ప్రమాణం ప్రారంభ-ముగింపు ప్రాంతాలను ఫీడ్ చేసుకుంటే... ఆయా మార్గాల్లో ఉన్న ట్రాఫిక్ స్థితిగతుల్ని అధ్యయనం చేస్తూ అవసరమైతే వాహనచోదకులకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తుంది. పార్కింగ్ జోన్లు, వాటర్ లాగింగ్ ఏరియాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఫెయిల్యూర్స్, ప్రమాదాలపై అప్రమత్తం చేస్తుంది. మరోపక్క ఐఐఐటీ హైదరాబాద్‌తోనూ హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్, హైదరాబాద్ పోలీసులు మరో కీలక ఒప్పందం చేసుకున్నారు. నగరంలో ఉన్న హాట్‌స్పాట్స్, రహదారులు స్థితిగతులు, ట్రాఫిక్ జామ్స్ జరుగుతున్న ప్రాంతాలతో పాటు ఆ సంబంధిత ఇబ్బందుల పైనా ఐఐఐటీ నిపుణులు అధ్యయనం చేస్తారు. వీటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తారు. రహదారి భద్రత అంశాలు, ట్రాఫిక్ నిబంధనల పైనా నగరవాసులకు అవగాహన కల్పించడంలో ఐఐఐటీ హైదరాబాద్ సహకరించనుంది.



గవర్నర్ సమక్షంలో ఎంఓయూలు..

ప్రత్యేక ప్రచారం.. ఫుడ్ వెండర్స్‌కు శిక్షణ

- రుణాల పంపిణీ కార్యక్రమాలు

సాక్షి, సిటీబ్యూరో

వీధి వ్యాపారుల సంక్షేమం, తదితర కార్యక్రమాల కోసం మున్సిపల్ పరిపాలన శాఖ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీలోని ఆరు జోన్లలో అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి వరకు 'లోక్ కల్యాణ్' మేళాల పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కొత్తగా వీధి వ్యాపారాలు చేస్తున్న వారిని ప్రధానమంత్రి వీధివ్యాపారుల ఆత్మ నిర్భర్ నిధి (పీఎం స్వనిధి) స్కీమ్‌లో చేర్చనున్నారు.

గురువారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమాల్లో భాగంగా ఈ దిగువ పనులు చేయనున్నారు.

- పునఃరూపకల్పన చేసిన పీఎం స్వనిధి పథకం కింద కొత్త దరఖాస్తులను ప్రోత్సహించడం
- ఇప్పటికే మంజూరైన దరఖాస్తులకు రుణ పంపిణీ సులభతరం చేయడం
- బ్యాంకుల్లోని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించడం
- ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సహకారంతో వీధి ఆహార విక్రేతలకు శిక్షణ ఇవ్వడం
- వీధి వ్యాపారుల కుటుంబాల సామాజిక-ఆర్థిక వివరాలు సేకరించడం
- వీధి విక్రేతల సామర్థ్యాలను అభివృద్ధి చేయడం.. తగిన సంక్షేమ పథకాలతో ఆదాయం పెరిగేలా చేయడం.

వీధి వ్యాపారుల కోసం 'లోక్ కల్యాణ్' మేళాలు

రుణ పంపిణీ లక్ష్యం

- 14,800 మందికి రుణాలివ్వనున్నారు. ఇందులో 13,470 మందికి తొలి విడతలో ఇప్పించనున్నారు. రెండో విడత 1330 మందికి ఇస్తారు. తొలి విడతలోని వారికి ఇచ్చే రుణం రూ.15వేలను 12 నెలల్లో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. రెండో విడత వారికి ఇచ్చే రూ. 25వేల రుణాన్ని 18నెలల్లో తిరిగి చెల్లించాలి.

వెయ్యి మందికి శిక్షణ
వీధి విక్రేతల్లో ఆహార పదార్థాలు విక్రయించే వారికి నాణ్యమైన ఆహార పదార్థాలు.. కల్తీ లేకుండా వినియోగించడం తదితర అంశాలపై రెండు విడతలుగా వెయ్యిమందికి శిక్షణ ఇస్తారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్సులిప్పించనున్నారు.ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో బ్యాంకులు, డిజిటల్ పేమెంట్ ఎగ్రిగేటర్లు (డీపీఏ), టౌన్ వెండింగ్ కమిటీలు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు, ఎన్జీఓలు, విక్రేతల సంఘాలు, తదితర ఆర్గనైజేషన్లు పాల్గొంటాయి.

జీహెచ్ఎంసీలో వీధి విక్రేతలకు 2020 నుంచి ఇప్పటి వరకు అందజేసిన రుణాలు

- మొదటి విడత 1,34,412 మందికి రుణాలిప్పించడం లక్ష్యంగా పెట్టుకోగా 58,600 మందికి మాత్రం రూ.58.60 కోట్ల రుణాలిప్పించారు.
- రెండో విడతలో 34,035 లక్ష్యం కాగా, 26,92 మందికి రూ. 52.18 కోట్ల రుణాలిప్పించారు.
- మూడో విడత లక్ష్యం 7,178 అంతకంటే ఎక్కువమందికి రుణాలిచ్చారు. 10,686 మందికి రూ. 53.43 కోట్ల రుణాలు అందజేశారు.



అది గురువారం ఉదయం.. జలవిహార్‌లోని ఆడిటోరియం.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అప్పుడే ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్-2025ని ప్రారంభించారు. ఆయనకు వీడ్కోలు పలికిన పోలీసు అధికారులు తదుపరి కార్యక్రమం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ నోటి వెంట 'హలో ఆఫీసర్' అనే మాట వచ్చింది. ప్రొటోకాల్ ప్రకారం అందరు అధికారులూ ముందుగానే అక్కడికి చేరుకున్నారు. అందరి పలకరింపులు పూర్తయ్యాయి. ఈ సమయంలో కొత్తగా ఎవరు వచ్చారా? అన్నట్లు ఉన్నతాధికారుల కళ్లు ఆ 'ఆఫీసర్' కోసం వెతికాయి. ఆ సమీపంలో యూనిఫాంలో నిల్చున్న చిన్నారి నడింపల్లి వశిష్ట రామ్‌ని చూసి మురిసిపోయారు. జలవిహార్ ఎండీ ఎన్వీ రామరాజు ట్రాఫిక్ సమ్మిట్ నేపథ్యంలో తన మనవడు వశిష్ట రామ్‌కు పోలీసు యూనిఫాం వేసి తీసుకువచ్చారు. కొత్వాల్ ఆనంద్‌తో పాటు ఉన్నతాధికారులూ ఆ చిన్నారిని దగ్గరకు తీసుకుని సరదాగా మాట్లాడారు. - సాక్షి, సిటీబ్యూరో

హలో ఆఫీసర్!



యూనిఫాంలో ఉన్న చిన్నారితో సీపీ ఆనంద్

నగరంలో రెండు భారీ స్కైవాక్‌లు!

- సికింద్రాబాద్ ఈస్ట్-వెస్ట్ మెట్రో స్టేషన్లను కలుపుతూ మధ్య ఒకటి
- జేఎన్టీయూ 'మెట్రో' నుంచి వర్సిటీ మీదుగా లులు మాల్‌కు మరొకటి
- అమీర్‌పేటలో పైలట్ ప్రాజెక్ట్‌గా మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్ విధానం
- ట్రాఫిక్ సమ్మిట్-2025లో ప్రకటించిన ఉమ్టా ఎండీ జీవన్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించడంతో పాటు రహదారి భద్రతను పెంచడం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ (ఉమ్టా) మేనేజింగ్ డైరెక్టర్ బి.జీవన్ బాబు అన్నారు. నగరంలోని జలవిహార్ ఆడిటోరియంలో జరుగుతున్న ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్- 2025కు ఆయన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్, జేఎన్టీయూ వద్ద నిర్మించనున్న భారీ స్కైవాక్‌లతో పాటు అమీర్‌పేట మెట్రో స్టేషన్ వద్ద పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్న మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్ విధానాన్ని వివరించారు.

అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో..
నగరంలోని అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జేఎన్టీయూ చౌరస్తా ఉన్నాయి. వీటి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న బస్టాండ్లు, జన సంచారం, ప్రయాణికుల రాకపోకల నేపథ్యంలో అనునిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు, అనేకసార్లు రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. సికింద్రాబాద్‌లో రైల్వేస్టేషన్, మూడు కీలక బస్టాండ్లు, రెండు మెట్రో స్టేషన్లు ఉంటాయి. వీటన్నింటినీ అనుసంధానిస్తూ ఉమ్టా భారీ స్కైవాక్ నిర్మిస్తోంది. సికింద్రాబాద్ ఈస్ట్-వెస్ట్ మెట్రోస్టేషన్ల మధ్య ఉండే వంతెన.. రెతిఫైల్‌తో పాటు ఆ చుట్టపక్కల ఉన్న మరో రెండు కీలక బస్టాండ్లను అనుసంధానించనుంది. వీటి మధ్య రాకపోకలు సాగించే వాళ్లు రహదారి పైకి రావాల్సిన అవసరం లేకుండా మరో ప్రాంతాన్ని చేరుకునేలా దీన్ని డిజైన్ చేశారు.



వర్సిటీని కలుపుతూ లులు వరకు...
ట్రాఫిక్ జామ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న జేఎన్టీయూ చౌరస్తా మీదుగా జాతీయ రహదారి వెళ్తుంది. ఫలితంగా వాహనాలు గంటల తరబడి ఆగిపోవడంతో పాటు అనేక మంది పాదచారులూ ప్రాణాలు కోల్పోతుంటారు. ఆ సమీపంలో ఉన్న వాణిజ్య ప్రాంతాలు, యూనివర్సిటీలకు రాకపోకలు సాగించే వాళ్లూ పెద్ద సంఖ్యలోనే ఉంటాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఉమ్టా జేఎన్టీయూ మెట్రో స్టేషన్ పై నుంచి కిందికి దిగాల్సిన అవసరం లేకుండా యూనివర్సిటీలోకి వెళ్లడానికి.. ఈ రెండు ప్రాంతాల నుంచి ఎవరైనా నేరుగా సమీపంలోని లులు మాల్‌కు చేరుకోవడానికి అనువుగా ఉమ్టా ఈ స్కైవాక్ నిర్మిస్తోంది. లులు మాల్‌కు సైతం నిత్యం పెద్ద ఎత్తున వినియోగదారులు వస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకుంది. స్కైవాక్‌కు అటు-ఇటు ఉన్న కీలక ప్రాంతాలను అనుసంధానించనుంది.

పైలట్ ప్రాజెక్టుగా అమీర్‌పేట మెట్రో వద్ద..
ఉమ్టా మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్ అండ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టేషన్ పేరుతో భారీ ప్రాజెక్టు చేపడుతోంది. రవాణా వ్యవస్థల అనుసంధానం, వాణిజ్య ప్రాంతాల తరలింపు, రహదారి భద్రత ఇందులోని ప్రధాన ఉద్దేశాలు. దీనికి సంబంధించి పైలట్ ప్రాజెక్టుగా ఇప్పటికే అమీర్‌పేట మెట్రో స్టేషన్‌ను ఎంచుకుంది. దాని చుట్టూ 500 మీటర్ల పరిధిలో వివిధ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పార్కింగ్ ప్రాంతాలు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి చేపడుతోంది. త్వరలో సత్యం థియేటర్ సమీపంలో, అమీర్‌పేట మెట్రో వద్ద వెండింగ్ జోన్లను ఏర్పాటు చేయనుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాల అభివృద్ధి, రోడ్ మార్కింగ్స్, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికాకుండా, వాహనాలు ప్రవేశించే అవకాశం లేకుండా ఏర్పాట్లు చేయనుంది.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్: రెండు వేర్వేరు కేసుల్లో శంషాబాద్ విమానాశ్రయంలో డీఆర్‌ఐ (డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్) అధికారులు అక్రమంగా విదేశాల నుంచి తరలిస్తున్న బంగారాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గత నెల (ఆగస్టు) 22న విదేశాల నుంచి వచ్చిన రెండు వేర్వేరు లగేజీ బ్యాగులను సంబంధిత ప్రయాణికులు ఎవరూ క్లెయిమ్ చేయలేదు. దీంతో లగేజీలను పరిశీలించిన అధికారులు వాటిని తెరిచి 3379.600 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.3.36 కోట్లుగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. కువైట్ నుంచి ఈ బంగారాన్ని కడపకు చెందిన ఇద్దరు వేర్వేరు వ్యక్తులు క్యారియర్‌లుగా తీసుకొస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి మహిళ మృతి


కృష్ణకుమారి(ఫైల్)

ఉప్పల్: అదృశ్యమైన మహిళ ఉప్పల్ నల్ల చెరువులో శవమై కనిపించిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ స్వరూప్‌నగర్ ప్రాంతానికి చెందిన బుడుమ కృష్ణ కుమారి(56) శ్రీ సాయి పబ్లిక్ స్కూల్ అడ్మినిస్ట్రేటర్‌గా పని చేసేది. కరోనా సమయంలో భర్త మృతి చెందడంతో సోమేశ్వర్ రావు అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె ఈ నెల 14 ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి పోయింది. అదే రోజు కుటుంబ సభ్యులు మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గురువారం ఉదయం నల్ల చెరువులో మహిళ మృత దేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. మేడిపల్లి పోలీసుల సమాచారంతో కృష్ణకుమారి కుటుంబ సభ్యులను పిలిపించగా వారు మృతురాలు తమ తల్లి అని గుర్తించారు. అనారోగ్యం కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని ఆమె కుమారుడు అనికేత్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ అసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

కనెక్టివిటీ లేకనే కష్టాలు

మెట్రో రైల్ ప్రయాణానికి 'ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్' జర్నీనే సమస్య

- ప్రయాణానికి 29 శాతం సమయం ..స్టేషన్‌కు చేరేందుకు 71 శాతం
- ఈ అంశంలో ఢిల్లీ, కేరళ, మహారాష్ట్ర చర్యలు భేష్
- ట్రాఫిక్ సదస్సులో అభిప్రాయపడిన నిపుణులు


మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌తో పాటు మెట్రో రైల్ అందుబాటులో ఉన్న అనేక నగరాల్లో ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ అధ్వానంగా ఉందని ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్-2025లో పాల్గొన్న వక్తలు, నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రయాణికులు మెట్రో రైల్‌లో ప్రయాణానికి 29 శాతం సమయం వెచ్చిస్తుండగా... ఆ స్టేషన్ నుంచి రాకపోకలు సాగించడానికి 71 శాతం వెచ్చించాల్సి వస్తోందన్నారు. కేవలం ఇదొక్కటే కాదని.. అనేక ప్రజా రవాణా వ్యవస్థల పరిస్థితి ఇలానే ఉందని స్పష్టం చేశారు. ఈ పరిస్థితులు మార్చగలిగితేనే పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్స్ వినియోగం పెరుగుతుందని సూచించారు.

లైసెన్స్ లేకుండానే వాహనం నడిపా..

ట్రాఫిక్ నిర్వహణ, రహదారి భద్రతలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కంటే పౌర స్పృహ చాలా కీలకం. ఎంత అత్యాధునిక సిగ్నల్స్ ఏర్పాటు చేసినా ఓ వ్యక్తి రెడ్ లైట్ ఉన్నప్పుడు సిగ్నల్ జంప్ చేస్తే ఉపయోగం ఉండదు. విద్యార్థి దశలో నాకు లైసెన్స్ అంటే ఏమిటో తెలీదు. మా అన్న డ్రైవింగ్ నేర్పాడు... నేను వాహనం నడుపుతూ తిరిగేశా. అప్పుడు ఏ రూల్స్ నాకు తెలీదు. పాఠశాల, కళాశాలల్లో రహదారి భద్రత నిబంధనలు చెప్పకపోవడం వల్లే అలా జరిగింది. గతంలో అప్పటి గవర్నర్ నరసింహన్‌ను కలిసినప్పుడు ఆయన హైదరాబాద్ ఫుట్‌పాత్స్ లేని అద్భుత నగరమని అన్నారు. కొందరు ఇక్కడ ఉన్న వాటినీ వినియోగించుకోరు. మౌలిక వసతుల లేమి వల్లే ఫస్ట్-లాస్ట్ మైల్ కనెక్టివిటీ సాధ్యం కాలేదు. ఈ కారణంగానే వ్యక్తిగత వాహనాల వినియోగం పెరుగుతోంది. భారీ భవనాలకు అనుమతి ఇచ్చే ముందు ట్రాఫిక్ పోలీసులను భాగస్వాములను చేయడం లేదు. వాటి నిర్మాణం వల్ల వచ్చే ట్రాఫిక్ ఇబ్బందుల్ని అధ్యయనం చేయట్లేదు. విభాగాల మధ్య మరింత సమన్వయం అవసరం.

- సీవీ ఆనంద్, హైదరాబాద్ సీపీ

ఇంటిగ్రేషన్‌కు ఖర్చు ఆధారం కాకూడదు



ఫస్ట్-లాస్ట్ మైల్ కనెక్టివిటీకి సంబంధించి మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్‌ను ప్రయాణ ఖర్చు ఆధారంగా నిర్దేశిస్తున్నాం. ఇది సరైన విధానం కాదు. విమానం దిగముందే క్యాబ్ బుక్ చేసుకునే టెక్నాలజీ ఉంది. అయితే దిగిన తర్వాత ఎక్కడికి వెళ్లి క్యాబ్ ఎక్కాలో సరైన సూచనలు ఉండవు. ఈ సమస్యలు పోవాలంటే ఫిజికల్ ఇంటిగ్రేషన్ చేయాలి. అత్యధికులు ప్రజారవాణా కోసం కనీసం 15 నిమిషాలు వేచి ఉండాల్సి వస్తోంది. నగరంలోని అన్ని ప్రాంతాలు, మార్గాల్లో ఒకే సైజు బస్సులు నడుపుతూ సమయాభావానికి కారణం కాకూడదు. రహదారి, ప్రయాణికుల సంఖ్య తదితరాల ఆధారంగా వివిధ సైజుల్లో ఉన్న బస్సులు నడపాలి. ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించే వారే ఫుట్‌పాత్‌లను వినియోగిస్తారు. రహదారులు క్రాస్ చేసి మరో బస్సు ఎక్కాల్సి ఉంటుంది. వీరికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి. ఫుట్‌పాత్స్‌పై పార్కింగ్‌కు అవకాశం లేకుండా రీడిజైన్ చేయాలి.

- దీప్తి జైన్, అసోసియేట్ ప్రొఫెసర్, ఐఐటీ ఢిల్లీ

ఇది సమన్వయం కాదు పోటీ



మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ సహా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ఫస్ట్ అండ్ లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సాధించాలి. అయితే ప్రస్తుతం ఈ విభాగాలు పోటీపడుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌కు ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్టు సిస్టం అవసరం. రూట్ ఫీడర్ సిస్టం ఏర్పాటు చేయడం ద్వారా ఏ మార్గంలో ఏ రకమైన రవాణా ఉపయుక్తమనేది నిర్ధారించుకుని సమన్వయం ఏర్పాటు చేసుకోవాలి. ఓ వ్యక్తి ప్రయాణం మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు తనకు ఖర్చయ్యే నగదు, సమయం బేరీజు వేసుకుని రవాణా విధానాన్ని ఎంచుకుంటారు.

- రామకృష్ణారావు, సీనియర్ సాంకేతిక సలహాదారు, యూఎన్‌టీసీ, ఢిల్లీ

ట్రావెల్ టైమ్ తగ్గేలా అర్బన్ ప్లానింగ్ ఉండాలి



ఇంటి నుంచి బయలుదేరే వ్యక్తి తన ఆఫీసు లేదా వ్యాపార కేంద్రానికి ప్రయాణించడానికి పట్టే ప్రయాణ సమయం తగ్గేలా అర్బన్ ప్లానింగ్ ఉండాలి. ప్రస్తుతం ఓ వ్యక్తి తన ప్రయాణంలో 20 శాతం దూరానికి 60 శాతం సమయం, 40 శాతం డబ్బు వెచ్చించాల్సి వస్తోంది. దీని నిరోధించడానికి ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్ (టీఓడీ) విధానం అమలు కావాలి. అంతా ఒకే రకంగా కాకుండా ఎక్కడిక్కడ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్, పార్కింగ్ పాలసీలు రూపొందించాలి. అన్ని రకాలైన ట్రాన్స్‌పోర్టులకు సింగిల్ టికెట్ విధానం అమలు చేస్తే ఫస్ట్-లాస్ట్ మైల్ కనెక్టివిటీ సులభం అవుతుంది.

- బి.జీవన్ బాబు, ఉమ్టా ఎండీ

హెల్మెట్టే నా ప్రాణాలను కాపాడింది

నటుడు సాయి ధరమ్ తేజ



మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై ప్రమాదానికి గురైనప్పుడు తన ప్రాణాలను హెల్మెట్టే కాపాడిందని సినీ నటుడు సాయి ధరమ్ తేజ అన్నారు. జలవిహార్ ఆడిటోరియంలో జరుగుతున్న ట్రాఫిక్ సమ్మిట్-2025కు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోలుకోవడానికి చాలా సమయం పట్టిందని అన్నారు. ఎలాంటి మినహాయింపులు లేకుండా ద్విచక్ర వాహనచోదకులందరూ హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. యువకులు ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, రహదారులపై స్టంట్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. బాధ్యతాయుతమైన డ్రైవింగ్ వాహనచోదకుడినే కాకుండా ఆ కుటుంబం మొత్తాన్ని రక్షిస్తుందని అభిప్రాయపడ్డారు. సర్వకాల సర్వావస్థల్లోనూ హైదరాబాద్ పౌరుల భద్రత, సౌకర్యం కోసం పని చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు, మార్షల్స్‌ను ఆయన కొనియాడారు. ప్రతి ఒక్కరూ దయ చేసి హెల్మెట్ ధరించండి, ట్రాఫిక్ నియమాలు పాటించండి, జీవితాన్ని విలువైందిగా పరిగణించండి.. మీతో పాటు ఇంట్లో మీ కోసం వేచి ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తుంచుకోండి అంటూ సాయి ధరమ్ తేజ హితవు పలికారు.

హాట్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి అవసరం

సాక్షి, సిటీబ్యూరో: భారీవర్షాల నేపథ్యంలో హాట్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఈఆర్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జూమ్ మీటింగ్‌లో అధికారులతో మట్లాడారు. వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రానున్న 2 రోజుల్లో ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటలవరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముంపు ప్రాంతాల్లో వరద నీరు తొలగింపు, సివర్ జెట్టింగ్ యంత్రాల ఆపరేషన్లను ఆయా డీజీఎంలు తనిఖీ చేయాలన్నారు. వర్షం కారణంగా రహదారులపై ఉన్న మ్యాన్ హోళ్ల వద్ద సీవరేజీ ఓవర్ ఫ్లో పై వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్ మూతలను తెరవకూడదని సూచించారు. ఇతర వివరాలకు జలమండలి కస్టమర్ కేర్ 155313 నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై కారు బోల్తా

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పీవీ నర్సింహా రావు ఎక్స్‌ప్రెస్ వేపై గురువారం రాత్రి కారు బోల్తా పడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వెళుతున్న ఓ కారు పిల్లర్ నంబర్ 162 వద్దకు రాగానే వర్షం కారణంగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటనతో ఎక్స్‌ప్రెస్ వేపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాన్ని అక్కడి నుంచి తరలించారు. వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పీజీ విద్యార్థి అదృశ్యం


ఎగ్గడి లోకేష్

కేపీహెచ్‌బీకాలనీ: బెట్టింగ్‌లో డబ్బులు చాలా పోగొట్టుకున్నా, జీవితాన్ని ముగించాలనుకుంటున్నానని సోదరుడికి మెసేజ్ పెట్టి ఓ పీజీ విద్యార్థి అదృశ్యమైన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట ప్రాంతానికి చెందిన ఎగ్గడి లోకేష్ (23) జేఎన్‌టీయూలో పీజీ చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. స్థానికంగా పార్ట్ టైం జాబ్ చేస్తున్న లోకేష్ గత వారం రోజులుగా సెల్‌ఫోన్‌లో అందుబాటులో లేకుండా పోయాడు. అయితే లోకేష్ వాట్సాప్ నుంచి అతని సోదరుడు పవన్‌కు తాను ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లో చాలా డబ్బులు పోగొట్టుకున్నానని చాలా మంది దగ్గర డబ్బులు తీసుకున్నానని, అవి తీర్చలేక జీవితాన్ని చాలించాలనుకుంటున్నట్లు మెసేజ్ పెట్టాడు. దీంతో పవన్ జేఎన్‌టీయూ హాస్టల్‌కు వచ్చి విచారించగా 12 నుంచి హాస్టల్‌కు రావటం లేదని తెలుసుకుని కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని బాలుడు..


నిఖిల్ నాయక్

దుండిగల్: సెల్‌ఫోన్ కొనివ్వలేదని 10వ తరగతి విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బౌరంపేట ఇందిరమ్మ కాలనీకి చెందిన రవింద్రనాథ్ కుమారుడు నిఖిల్ నాయక్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. గత కొన్ని రోజులుగా తనకు కొత్త సెల్‌ఫోన్స్ కొనివ్వాలని కోరుతున్నాడు. తల్లిదండ్రులు మందలించడంతో ఈ నెల 13న బయటికి వెళ్లిన నిఖిల్ తిరిగి రాలేదు. అతడి కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి బసంతి దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరదనీటిలో కొట్టుకుపోయిన కారు

కారులో చిక్కుకున్న నలుగురిని రక్షించిన స్థానికులు



గౌలిపురా: గౌలిపురా డివిజన్ పరిధిలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి హనుమాన్ నగర్ ఫేజ్-2లో ఇళ్ల మధ్యన పెద్ద ఎత్తున వరదనీరు చేరుకుంది. దీంతో అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొన్నారు. కాగా అదే సమయంలో మణికొండకు చెందిన ఓ కుటుంబం కారులో వచ్చి గౌలిపురా హనుమాన్ నగర్ ఫేజ్-2లో దిగేందుకు ప్రయత్నించగా కారు వరదనీటిలో కొట్టుకుపోయింది. కొద్ది దూరం వెళ్లిన తర్వాత కారు ఆగడంతో అందులో నుంచి దిగేందుకు ప్రయత్నించగా కారు డోర్ తెరుచుకోలేదు. దీంతో స్థానికుల సహాయంతో అందులో ఉన్న రెండేళ్ల చిన్నారి, ముగ్గురు మహిళలను అద్దంలో నుంచి బయటికి తీశారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

16.16 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్

సికింద్రాబాద్: ఒడిశా నుంచి ముంబైకి గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి నుంచి రూ.8.08 లక్షల విలువైన 16.16 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ డీఎస్పీ ఎస్‌ఎన్ జావెద్, జీఆర్‌పీ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు బీ.సాయిశ్వర్‌గౌడ్, బీఎస్ సారస్వత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముంబై వడాలా ఈస్ట్‌కు చెందిన అసీరుద్దీన్ తక్రిద్దీన్‌ఖాన్ కూలీగా పని చేసేవాడు. మాదకద్రవ్యాలకు బానిసైన అతను పలు నేరాలకు పాల్పడటంతో ముంబై పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై బయటికి వచ్చిన అసీరుద్దీన్‌కు ముంబైలో ఉంటున్న ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులతో పరిచయం ఏర్పడింది. వారి ద్వారా ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి వ్యాపారం చేసుకోవాలని భావించిన అసీరుద్దీన్ భువనేశ్వర్ వెళ్లాడు. రూ.1.13 లక్షలు చెల్లించి గంజాయి కొనుగోలు చేసి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ముంబైకి బయలుదేరాడు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రైలులో పోలీసులు ప్రయాణికుల లగేజీని తనిఖీ చేస్తుండగా గంజాయి రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

కుమార్తెతో సహా తండ్రి ఆత్మహత్య!


అశోక్, దివ్య (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఓ వ్యక్తి కుమార్తెతో సహా చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కాలేజీ వెనక ఉన్న చెరువులో గురువారం ఉదయం ఓ వ్యక్తి, బాలిక మృతదేహాలను గుర్తించిన స్థానికులు 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికి తీసి. విచారించగా బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన అశోక్(50), అతని కుమార్తె దివ్య(05)గా గుర్తించారు. నాలుగేళ్లుగా అశోక్, అతడి భార్య సోనీ ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నారు. అశోక్ వంట పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మూడేళ్ల క్రితం రోడ్డు అతడి భార్య సోనీ రోడ్డు దాటుతుండగా లారీ ఢీనడంతో ఎడమ కాలు కోల్పోయింది. అప్పటి నుంచి ఇంట్లోనే ఉంటోంది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మూడు క్రితం అశోక్ ఆత్మహత్య చేసుకునేందుకు ఇంట్లోని గ్యాస్ సిలిండర్ లీక్ చేశాడు. దీనిని గుర్తించిన అతడి భార్య సోనీ కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి మంటలను ఆర్పివేసినట్లు సమాచారం. ఆ మర్నాడు సాయంత్రం అశోక్ కుమార్తెను తీసుకుని ఇంటి నుండి వెళ్లిన అశోక్ కుమార్తెతో సహా చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జ్యూస్ తాగుతూ కుప్పకూలిన యువకుడు

ఆస్పత్రికి తరలించేలోపే మృత్యువాత

ఇబ్రహీంపట్నం రూరల్: జ్యూస్ తాగుతుండగా గుండెపోటు రావడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా పల్లిపాడుకు చెందిన మేడ ఏకలవ్య(30) ఇబ్రహీంపట్నంలోని తన స్నేహితు డు ఆకాశ్‌పటేల్ వద్ద ఉంటున్నాడు. యూకే లో ఉండే ఏకలవ్య ఉద్యోగం పోవడంతో హైదరాబాద్ వచ్చాడు. అప్పటినుంచి జాబ్ కోసం ట్రై చేస్తున్నాడు. జ్యూస్ సెంటర్ వద్ద కింద పడిపోయిన అతన్ని పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఫోకల్ టు ఫోకల్!

- వారికి ఏ నిబంధనలూ వర్తించవు..
- పదవీకాలమంతా ఫోకల్ పోస్టుల్లోనే
- ఆదాయానికి మించి ఆస్తులు జమ
- 17 మంది ఇంజినీర్లపై సీఎంఓ ఆరా

సాక్షి, సిటీబ్యూరో: ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి అక్రమాలకు పాల్పడినట్లు తేలితే...పనిష్మెంట్ కింద అతడిని పాతబస్తీ వంటి క్లిష్టమైన ప్రాంతాలకు పంపుతుంటారు. మెజార్టీ ఉద్యోగులు కూడా ఇక్కడ విధులను పనిష్మెంట్‌లో భాగమే అనుకుంటారు. ఇష్టం లేకపోయినా..విధులు నిర్వర్తిస్తుంటారు. కానీ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇంజినీర్లు మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తుంటారు. సంస్థలో ఫోకల్ (దండిగా ఆదాయం వచ్చే ప్రాంతాలు), నాన్ ఫోకల్ (నష్టాలతో పాటు ఆదాయం పెద్దగా లేని ప్రాంతాలు) అంటూ రెండు భిన్నమైన పోస్టులను సృష్టించారు. తరచూ అక్రమాలకు పాల్పడుతూ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంజినీర్లను శాఖపరంగా శిక్షించకపోగా వారికి మరింత ఆదాయాన్ని సమకూర్చి పెట్టే పోస్టులను కట్టబెడుతున్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో పని చేసే అధికారులను ఏళ్లుగా నాన్ ఫోకల్ పోస్టులకే పరిమితం చేస్తున్నారు. ఆర్థిక, రాజకీయ అండదండలు లేకపోవడంతో చేసేది లేక వారు కూడా రొటీన్ విధులకు అలవాటు పడిపోతున్నారు.

సీఎంఓకు చేరిన జాబితా

గ్రేటర్ జిల్లాల పరిధిలో మెట్రోజోన్, రంగారెడ్డి జోన్, మేడ్చల్ జోన్లు ఉన్నాయి. వీటి పరిధిలో తొమ్మిది సర్కిళ్లు, 26 డివిజన్లు, 65 ఆపరేషన్ సబ్ డివిజన్లు, 213 ఆపరేషన్ సెక్షన్లు ఉన్నాయి. ప్రతి మూడేళ్ల కోసారి ఆయా ఇంజినీర్లను ఒక చోట నుంచి మరో చోటికి బదిలీ చేస్తుంటారు. నిజానికి మూడేళ్లు ఫోకల్ పోస్టులో కొనసాగిన ఇంజినీర్లను, ఆ తర్వాతి బదిలీల్లో నాన్ ఫోకల్ పోస్టులకు బదిలీ చేయాల్సి ఉంది. కానీ డిస్కంలో నిబంధనలకు విరుద్ధంగా ఫోకల్ పోస్టుల్లో పని చేసిన ఇంజనీర్‌కు మళ్లీ మరో ఫోకల్ పోస్టును కట్టబెడుతున్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతూ కొందరు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడుతుండగా, మరి కొంత మంది తప్పించుకు తిరుగుతున్నారు. ఇలా ఇప్పటి వరకు గ్రేటర్ పరిధిలో ఫోకల్ టు ఫోకల్ పోస్టులు పొంది ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఇంజినీర్ల జాబితాపై సీఎంఓ ఆరా తీసినట్లు సమాచారం. ఇబ్రహీంబాగ్, గచ్చిబౌలి, మేడ్చల్, రాజేంద్రనగర్, కందుకూరు డివిజన్ల పరిధిలో పని చేసిన వారిలో ఎక్కువశాతం ఫోకల్ టు ఫోకల్ పోస్టుల్లోనే పని చేసినట్లు గుర్తించింది. విజిలెన్స్ విభాగం 17 మందితో రూపొందించిన ఓ జాబితా రెండు రోజుల క్రితమే సీఎంఓకు చేరినట్లు సమాచారం. వీరిలో ఏడీఈ స్థాయి మొదలు..ఓ సీఈ స్థాయి అధికారి కూడా ఉన్నట్లు తెలిసింది. దీనిపై సీఎం స్వయంగా ఆరా తీస్తుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గత మూడు రోజు లుగా ఆయా అధికారులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

ఆ మూడు డివిజన్లే కీలకం

హైదరాబాద్ సౌత్, హైదరాబాద్ సెంట్రల్, బంజారాహిల్స్ సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లు, సెక్షన్ల పరిధిలో ఖాళీ స్థలాలు పెద్దగా లేకపోవడంతో కొత్త కనెక్షన్లకు అంచనాలు కూడా పెద్దగా ఉండవు. విద్యుత్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ, అంతరాయాల పునరుద్ధరణ, నెలవారి బిల్లుల జారీ, వసూళ్లపై దృష్టి మినహా ఇతర పనులు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో అదనపు ఆదాయం కూడా ఉండదు. దీంతో ఆయా డివిజన్లు, సబ్‌డివిజన్లు, సెక్షన్లలో పోస్టులకు ఇంజినీర్లు పెద్దగా ఆసక్తి చూపరు. ఇక రంగారెడ్డిజోన్ పరిధిలోని సైబర్‌సిటీ, సరూర్‌నగర్, రాజేంద్రనగర్ సర్కిళ్లలో హైరేజ్ భవనాలు, మల్టీ స్టోరేజ్ బిల్డింగ్స్, ఐటీ అనుబంధ సంస్థలు, పారిశ్రామిక వాడలు ఎక్కువ. ఇక మేడ్చల్ జోన్‌లో సికింద్రాబాద్, హబ్సీగూడ, మేడ్చల్ సర్కిళ్లు ఉన్నాయి. కొండాపూర్, గచ్చిబౌలి, ఇబ్రహీంబాగ్ సహా రాజేంద్రనగర్, కందుకూరు, షాద్‌నగర్, సరూర్‌నగర్, చంపాపేట్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్ కీసర, జీడిమెట్ల డివిజన్లు పూర్తిగా ఫోకల్ పోస్టులుగా పేర్కొంటారు. కోర్‌సిటీతో పోలిస్తే శివారు ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ లైన్ల విస్తరణ, ఎస్టిమేషన్లు, భూగర్భ కేబుల్ పనులు, కనెక్షన్లు, మీటర్ల జారీ వంటివి ఇంజినీర్లకు కాసుల వర్షం కురిపిస్తుండటంతో ఇక్కడ పోస్టింగ్‌ల కోసం ఇంజనీర్లు అడ్డదారులు తొక్కుతుంటారు. ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖులకు భారీగా ముడుపులు ముట్టజెప్పి కోరుకున్న పోస్టును దక్కించుకుంటారు. ఇలా సర్వీసు అంతా ఫోకల్ పోస్టుల్లోనే కొనసాగిన వారిపై ఇప్పటికే అనేక ఫిర్యాదులు అందినా..చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికే ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టి 'పెద్ద'ల అండదండలతో తప్పించుకు తిరుగుతున్న అనకొండల జాబితా సీఎంఓకు చేరినట్లు తెలిసింది. ఏ క్షణమైనా ఆయా అక్రమార్కుల ఇళ్లపై దాడులు చేసే అవకాశం లేకపోలేదనే ప్రచారంతో వారంతా ఇప్పటికే బ్యాంకు లాకర్లలో దాచిన స్థిర, చరాస్తులకు సంబంధిం చిన పత్రాలు సహా భారీగా కూడబెట్టిన నగదును రహస్య ప్రాంతాలకు తరలించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.


బంజారాహిల్స్ రోడ్ నెం.2లో కేబీఆర్ పార్కులో కుంటలు నిండి రోడ్డుపైకి వస్తున్న నీరు


కృష్ణానగర్‌లో నీట మునిగిన పూర్ణ టిఫిన్స్ వీధి


కృష్ణానగర్‌లో..

దంచికొట్టిన వాన.. రహదారులు జలమయం

బంజారాహిల్స్: భారీ వర్షానికి బస్తీలు, కాలనీలు వణికిపోయాయి. బుధవారం రాత్రి కురిసిన వాన నుంచి కోలుకోకముందే గురువారం మధ్యాహ్నం తర్వాత గంటన్నర పాటు కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, అమీర్‌పేట్, శ్రీనగర్‌కాలనీ, కృష్ణానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లోని పలుచోట్ల మోకాళ్ల లోతు వరకు వరద నిలిచి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు లోపల ఉన్న కుంటలు నిండిపోవడంతో వరద ప్రధాన రోడ్ల పైన చేరుతోంది. దీంతో కేబీఆర్ పార్కు వైపు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపునకు వాహనాలు నెమ్మదిగా కదిలాయి. కృష్ణానగర్‌లోని వీధులన్నీ కుంటలను తలపించాయి. వరద సాఫీగా వెళ్లేలా హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది ప్రయత్నాలు చేశారు. మరో వైపు ఎక్కడికక్కడ వరద నిలిచిపోవడంతో రోడ్లపై వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి.


ఖైరతాబాద్ డివిజన్ ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో వరద


ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో రోడ్డుపై నిలిచిన వరద


మోకాళ్ల లోతు వరద


జలమయమైన శ్రీనగర్ కాలనీ ప్రధాన రోడ్డు







1) వరద సాఫీగా సాగేలా హైడ్రా సిబ్బంది చర్యలు
2) మోకాళ్ల లోతు వరదలో విద్యార్థులను దాటిస్తున్న హైడ్రా సిబ్బంది
3) రోడ్డుపై వరద చేరడంతో ఒకే పక్క నుంచి వెళ్తున్న వాహనాలు

అంబేడ్కర్‌నగర్‌లో విద్యుత్ అధికారుల పర్యటన

ఫిలింనగర్: బస్తీ సమస్యలు తెలుసుకునేందుకు విద్యుత్ అధికారులు, సిబ్బంది చేపట్టిన బస్తీబాట గురువారం జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–46లోని అంబేడ్కర్‌నగర్ బస్తీలో జరిగింది. టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ ఎస్ఈ కరుణాకర్‌బాబు, డీఈ హనుమంతరెడ్డి, ఏడీఈ మస్తాన్, ఏఈ సత్యనారాయణ తదితరులు పర్యటించి స్థానికులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బస్తీ నేతలు ఏ.అశోక్, మందా వెంకటయ్య, వి.నర్సయ్య, పి.అంజి తదితరులు తాము ఎదుర్కొంటున్న కరెంటు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బస్తీలో 10 చోట్ల కొత్తగా కరెంటు స్తంభాలను ఏర్పాటు చేయాలని, వాటికి స్ట్రీట్‌లైట్లు బిగించాలని కోరారు. అలాగే కరెంటు లైన్లు కూడా ఏర్పాటు చేయాలన్నారు. పది మందికి మీటర్లు లేవని, వాటిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో ఇక్కడి సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎస్ఈ కరుణాకర్‌బాబు స్థానికులకు హామీనిచ్చారు.


అంబేడ్కర్‌నగర్ బస్తీలో పర్యటిస్తున్న విద్యుత్ అధికారులు

22 నుంచి జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి నవరాత్రి ఉత్సవాలు

బంజారాహిల్స్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేవీశరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22వ తేదీన తెల్లవారుజామున 3 గంటలకు పెద్దమ్మ తల్లికి అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం విఘ్నేశ్వరపూజ, కలశ స్థాపన, మహా నివేదిన, ప్రదోషకాల పూజ, హారతి ఉంటాయి. ప్రతిరోజూ రాత్రి అమ్మవారి ఉత్సవ మూర్తి పల్లకీసేవ ఊరేగింపు, పవళింపు సేవ నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఈ నెల 22న శ్రీబాలాత్రిపురసుందరిదేవి అలంకారంలో, 23న శ్రీగాయత్రీదేవిగా, 24న శ్రీగజలక్ష్మీదేవిగా, 25న శ్రీఅన్నపూర్ణాదేవిగా, 26న శ్రీలలితాదేవిగా, 27న శ్రీరాజరాజేశ్వరీదేవిగా, 28న శ్రీస్కందమాతాదేవిగా, 29న శ్రీసరస్వతీదేవిగా, 30న శ్రీదుర్గాదేవిగా, అక్టోబర్ 1న మహిషాసురమర్దినిదేవిగా, 2న శ్రీపెద్దమ్మ తల్లి అలంకారంలో దర్శనమిస్తారు. ఈ నెల 30న చండీహోమం ఉంటుంది. ఆలయంలో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.


జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ తల్లి

ఇంజనీర్లను సన్మానించిన రోటరీ క్లబ్

బంజారాహిల్స్: ఇంజనీర్ల దినోత్సవం పురస్కరించుకుని బంజారాహిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం తాజ్ డెక్కన్ హోటల్‌లో పలువురు ఇంజనీర్లను సన్మానించారు. క్లబ్‌లో సభ్యులుగా ఉన్న ఇంజనీర్లు అనూప్ అగర్వాల్, రాహుల్‌జైన్, శ్రీనివాసరాజు, శ్రీనివాస్ చుండూరి, రామారావు గొడవర్తిలను వారి కృషి, ప్రతిభ, సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు నీరజా గొడవర్తి మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేసిన మహానుభావుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అన్నారు. ఇంజనీర్లు నిజమైన దేశ నిర్మాణకారులు అన్నారు. అలాంటి గొప్పవారు రోటరీ కుటుంబంలో ఉండటం గర్వకారణమన్నారు.


ఇంజనీర్లను సన్మానిస్తున్న బంజారాహిల్స్ రోటరీ క్లబ్ సభ్యులు

అంబేడ్కర్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన


అంబేడ్కర్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని అంబేడ్కర్‌నగర్ రోడ్డు నంబర్–9లో రోడ్డు, మెట్లదారి కూలిపోయింది. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ధ్వంసమైన రోడ్డుతో పాటు కూలిపోయిన మెట్ల మార్గాన్ని వెంటనే పునరుద్ధరించాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

నారాయణగూడ ఇన్‌స్పెక్టర్‌గా సైదేశ్వర్



హిమాయత్‌నగర్: నారాయణగూడ నూతన ఇన్‌స్పెక్టర్‌గా మేడిశెట్టి సైదేశ్వర్ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సైదేశ్వర్ ఇటీవల బదిలీల్లో భాగంగా నారాయణగూడ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు.

మోదీ పథకాలతోనే బీజేపీకి ప్రజా ఆదరణ



అబిడ్స్: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ పథకాలతోనే బీజేపీకి రాష్ట్రంలోనే కాక దేశ నలుమూలలా ప్రజా ఆదరణ లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు వాసుదేవ్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఆయనను గురువారం కట్టెలమండిలోని బీజేపీ కార్యాలయంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణాగుప్తా, సీనియర్ బీజేపీ నాయకుడు దాసరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవ్ మాట్లాడుతూ..ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో బీజేపీదే అధికారమన్నారు.

21 నుంచి జెక్‌కాలనీలో బతుకమ్మ సంబరాలు

సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ సహకారంతో జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 29 వరకు బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు చింతిరెడ్డి ప్రభ, ఎస్.అన్నపూర్ణ తెలిపారు. జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. .అధ్యక్షురాలిగా ప్రభా అనంతరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అన్నపూర్ణ, ఉపాధ్యక్షులుగా కేవీ రమణమ్మ, విజయలక్ష్మి, పర్వతవర్ధిని, భాగ్యలత, అమరావతి, మల్లు అలివేలు మంగ, సృజన, శ్రీదేవి, స్వప్న, జ్యోతి, సుధ, సత్యకళ, రాధిక, హైమావతి, కృష్ణకుమారి, స్వరూప, హరిత, సంధ్య, రాజ్యలక్ష్మి, విజయ, బేబి, శారద, శైలజ, మహాలక్ష్మి, జీవనజ్యోతి, జాయింట్ సెక్రటరీలుగా వాణి, మాధవి, మమత, అరుణ, షర్మిల, మల్లిక, పార్వతి, సుమలత, కీర్తి, శిరీష, శారద, పద్మలత, కవిత, కవిత, లక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా బాలమణి, లావణ్య, సత్యలక్ష్మి, రాజకుమారి, వసుంధర, సరళ, పద్మజ, సునీత, గీతాంజలి నియమితులయ్యారు.

రెస్టారెంట్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని పలు రెస్టారెంట్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఆహార పదార్థాల నాణ్యత, అందులో వాడే వస్తువుల నాణ్యతను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నం–1లోని ఒనెస్టా పిజ్జా రెస్టారెంట్‌లో తనిఖీల్లో ఫుడ్ లైసెన్స్‌ను డిస్ ప్లే చేయకపోవడంతో పాటు తనిఖీల సమయంలో ఫుడ్ టెస్టింగ్, వాటర్ టెస్టింగ్ రిపోర్ట్స్‌ను అందుబాటులో ఉంచలేదని, ఆహార పదార్థాల్లో, కిచెన్‌లో బొద్దింకలు ఎక్కువ సంఖ్యలో కనిపించినట్లు, తీరు మార్చుకోవాలని నోటీసులు ఇచ్చారు. అదేవిధంగా బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని బార్బిక్యూ నేషన్స్‌లో స్టోర్‌కు గాలి, వెలుతురు రాకుండా ఉన్నాయని, డ్రైనేజీలో ఆహార వ్యర్థాలతో పాటు బొద్దింకల బెడద తీవ్రంగా ఉండటాన్ని చూసి మందలించి నోటీసులు ఇచ్చారు. మాసబ్‌ట్యాంక్‌లోని డైన్‌హిల్ రెస్టారెంట్, లక్కీ రెస్టారెంట్లలో కూడా తనిఖీలు నిర్వహించిన అధికారులు పెద్ద ఎత్తున నిబంధనలు తుంగలో తొక్కిన వైనాన్ని గుర్తించి నోటీసులు అందజేశారు.


బంజారాహిల్స్‌లోని ఓ రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారిణి

బోరబండలో ఖబరస్థాన్‌కు స్థలం కేటాయించాలి

ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ వినతి


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్

రహమత్‌నగర్: బోరబండ ప్రాంతంలో ముస్లింలకు ఖబరస్థాన్ కోసం స్థలం కేటాయించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ముస్లిం పెద్దలతో కలిసి అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గ్రేవ్ యార్డు అనేది ప్రతి ఒక్కరి మతపరమైన హక్కు అన్నారు. దీని కోసం కొన్ని నెలలుగా ముస్లింలు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే, వారిపై కేసులు పెట్టడం అన్యాయం అన్నారు. బోరబండలో ఖబరస్థాన్‌కు స్థలం కేటాయించే వరకూ బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు సోహెల్, ముజీబుద్దీన్, అర్షద్, ఖదీర్, జకీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి ప్రభుత్వానిదే బాధ్యత

అమీర్‌పేట: ప్రభుత్వం మృతుడు మొహ్మద్ షరీఫుద్దీన్ కుటుంబాన్ని ఆదుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. బల్కంపేట అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి కింద నీట మునిగి వ్యక్తి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జి కింద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయక పోవడం ప్రమాదానికి ఒక కారణమని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే లైట్లు ఏర్పాటు చేయడమే కాకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రమాదానికి ప్రభుత్వమే బాధ్యత వహించి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌తో మాట్లాడి ఆర్థికసాయం మంజూరు కోసం కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ ఎస్.శేషుకుమారి, కొలను బాల్‌రెడ్డి, హనుమంత్‌రావు, జీహెచ్ఎంసీ అధికారులు జయంత్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంటకమరణ, మన్సూర్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

'అపెక్స్ బ్యాంక్'కు ఉత్తమ సహకార బ్యాంక్‌గా గుర్తింపు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ 2024–25 సంవత్సరానికి గాను ఉత్తమ సహకార బ్యాంక్‌గా గుర్తింపు పొందింది. ఈ మేరకు గురువారం జాతీయ రాష్ట్ర సహకార బ్యాంక్‌ల సమైఖ్య ఆధ్వర్యంలో సహకార బ్యాంక్‌ల పనితీరును అంచనా వేసి వార్షికంగా అందజేసే యానువల్ పర్ఫామెన్స్ అవార్డును తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు అందుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ..ఈ అవార్డు రాష్ట్ర సహకార రంగానికి ఒక ప్రోత్సాహక చిహ్నంగా నిలిచిందని తద్వారా భవిష్యత్తులో ప్రజల భాగస్వామ్యం మరింత పెంచేందుకు కృషి చేస్తుందని తెలిపారు. పాలకవర్గ సభ్యులు కొత్తకురుమ సత్తయ్య, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, యం.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.రమేష్‌రెడ్డి, ఎ.భోజరెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎండీ వై.కె.రావ్ తదితరులు పాల్గొన్నారు.


అవార్డును అందుకుంటున్న అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు

22 నుంచి శ్రీసాయి నామ శతకోటి మహాజప యజ్ఞం

పంజగుట్ట: శ్రీషిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్టు దిల్‌సుఖ్‌నగర్ వారి ఆధ్వర్యంలో 22వ తేదీ నుంచి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీ వరకు 'శ్రీసాయి నామ శత కోటి మహా జపయజ్ఞం' నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు బీవీ శ్యామ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాయిబాబా భక్తులను ఐక్యం చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు పద్మాకర్ ఆత్రేయ, శ్యామలరావు, ధర్మకర్త లక్ష్మీదుర్గ, ట్రస్ట్ మాజీ చైర్మన్ జి.మల్లయ్య, స్వామి ఓం స్వరూప్‌జీ, ప్రధాన కార్యదర్శి పి.రఘుకుమార్, ఉపాధ్యక్షుడు ఆర్ఎస్.శంకర్ రావు, పి.వీరప్ప పాల్గొన్నారు. వివరాలకు ఫోన్: 94926 46780.

మంత్రి మార్నింగ్ వాక్


ఎస్పీఆర్‌హిల్స్‌లో పర్యటిస్తున్న మంత్రి వివేక్

రహమత్‌నగర్: మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గురువారం రహమత్‌నగర్ డివిజన్‌లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. తెల్లవారు జామున ఆయన కార్మికనగర్, బ్రహ్మశంకర్‌నగర్, ఎస్పీఆర్‌హిల్స్ తదితర ప్రాంతాల్లో మార్నింగ్ వాక్ చేస్తూ చిరువ్యాపారులు, దినసరి కూలీలతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, మాజీ ఎంపీ అజహరుద్దీన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భవాని శంకర్, నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

డిగ్రీ, పీజీ అడ్మిషన్ వివరాల పోస్టర్ ఆవిష్కరణ

అడ్మిషన్ల గడువు 26కు పొడిగింపు

సనత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువును ఈ నెల 26 వరకు పొడిగించినట్లు బేగంపేట రీజనల్ సెంటర్ కో–ఆర్డినేటర్ డా. రామాచారి తెలిపారు. అడ్మిషన్ల వివరాలతో కూడిన పోస్టర్‌ను గురువారం బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని స్టడీ సెంటర్‌లో ప్రిన్సిపాల్ పద్మావతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామాచారి మాట్లాడుతూ.. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణత అయిన వారు డిగ్రీలో అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. అలాగే డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) ఉత్తీర్ణత సాధించిన వారు పీజీలో (ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఎకనామిక్స్, హిస్టరీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ లిటరేచర్) అడ్మిషన్ పొందవచ్చన్నారు. డిగ్రీ మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు సెప్టెంబర్ 26 తుది గడువుగా పేర్కొన్నారు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామని పరీక్షల నియంత్రణ అధికారి డా. శ్రీనివాస్ తెలిపారు.

మహిళ అదృశ్యం

వెంగళరావునగర్: ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకా రం దేవరకొండ ప్రాంతానికి చెందిన వెంకట మ్మ ఇటీవల జవహర్‌నగర్‌లో నివసిస్తున్న తన అల్లుడు యామారెడ్డి ఇంటికి వచ్చింది. ఈ నెల 15వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రా లేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


బంజారాహిల్స్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో రూ.2 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ గురువారం శంకుస్థాపన చేశారు. రూ.13 లక్షలతో ఎమ్మెల్యేకాలనీలో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులు, రూ.10 లక్షలతో ఎమ్మెల్యే కాలనీలో చేపట్టనున్న మురుగునీటి లైన్ పునర్నిర్మాణం, రూ.25 లక్షలతో ఎమ్మెల్యే కాలనీలో చేపట్టనున్న జీహెచ్ఎంసీ పార్కులో యోగా షెడ్డు నిర్మాణం, రూ.29 లక్షలతో ఎన్‌బీనగర్ రోడ్డు నంబర్–12 వద్ద చేపట్టనున్న వాటర్‌లైన్ అభివృద్ధి పనులు, రూ.42 లక్షలతో రోడ్డు నంబర్ 1, 12లోని మహేశ్వరిటవర్స్ వద్ద చేపట్టనున్న వాటర్ లైన్ అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు.

గౌతమ్‌నగర్ చౌరస్తాలో బీజేపీ నేతల స్వచ్ఛ భారత్



ఫిలింనగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవాపక్షం –2025లో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ కన్వీనర్ వల్లెపు శంకర్ ఆధ్వర్యంలో గురువారం ఫిలింనగర్ గౌతమ్‌నగర్ చౌరస్తాలో స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికుడు తిరుపతయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ముద్దంగుల శ్రీనివాస్, గణేష్‌యాదవ్, దండుగుల శేఖర్, దొంగరి రాజకళ, వలిశెట్టి రాంబాబు, గొల్లి రమ్య, మంజిలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
శుక్రవారం, 19, సెప్టెంబర్, 2025

విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: దసరా సెలవుల్లో హాస్టళ్లు, కాలేజీల నుంచి సొంత ఊళ్లకు వెళ్లే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ ఈడీ ఎం.రాజశేఖర్ తెలిపారు. పటాన్‌చెరు, బైరంగూడ, దుండిగల్, కూకట్‌పల్లి, మాదాపూర్, గచ్చిబౌలి, మియాపూర్, బాలానగర్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, ఏఎస్‌రావునగర్, రేతిఫైల్, ఉప్పల్, తార్నాక, దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్, ఎల్‌బీనగర్, బడంగ్‌పేట్, ఆదిభట్ల, కొల్లాపూర్, రాజేంద్రనగర్, అత్తాపూర్, చార్మినార్, కోఠి తదితర ప్రాంతాల నుంచి తెలంగాణలోని వివిధ జిల్లాలకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. బస్సులను ఆయా కళాశాలలు, హాస్టళ్ల నుంచి నేరుగా నడుపుతారు. బస్సుల వివరాల కోసం ఫోన్ నంబర్లు : 9959226148,/6142,/ 6136/ 6129 నెంబర్లను సంప్రదించవచ్చు.

'మనూ'లో బీఈడీ, ఎంబీఏ అడ్మిషన్ల గడువు పెంపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులైన బీఈడీ, ఎంబీఏలలో అడ్మిషన్ల దరఖాస్తు గడువు తేదీని పొడిగించినట్లు సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజౌల్లాఖాన్ గురువారం తెలిపారు. బీఈడీ, ఎంబీఏ(ఓడీఎల్) కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించడానికి చివరి తేదీని సెప్టెంబర్ 17 నుంచి సెప్టెంబర్ 24 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల కోసం ప్రవేశ పరీక్ష సెప్టెంబర్ 28వ తేదీన జరుగుతుందని, మొదటి మెరిట్ జాబితా అక్టోబర్ 3న ప్రకటించనున్నట్లు తెలిపారు, ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్ డాక్యుమెంట్ వెరిఫికేషన్ అక్టోబర్ 3 నుంచి 6వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ప్రాస్పెక్టస్, ఆన్‌లైన్ దరఖాస్తు ఫామ్‌లు వెబ్‌సైట్‌లో ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు స్టూడెంట్ సపోర్ట్ యూనిట్ హెల్ప్‌లైన్‌లు 040-23008463 లేదా 040-23120600 (ఎక్స్‌టెన్షన్ 2207, 2208)లో సంప్రదించాలని వివరించారు. దూర విద్యావిధానంలో ఇతర మెరిట్ ఆధారిత యూజీ/పీజీ/డిప్లొమో/ సర్టిఫికెట్ కోర్సులకు కూడా అక్టోబర్ 13 వరకు అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎన్వీఎస్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(పట్టణ రవాణా)గా ఎన్వీఎస్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నగర రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి సలహాలు ఇవ్వవలసిందిగా ఎన్వీఎస్‌కు సీఎం సూచించారు.

మారుతి సుజుకి సరికొత్త విక్టోరిస్ ఆవిష్కరణ

– హైబ్రిడ్ మోడల్ కార్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని శేరిలింగంపల్లి పావన్ మోటార్స్ షోరూమ్ వేదికగా మారుతి సుజుకి సరికొత్త విక్టోరిస్ కారును ఆవిష్కరించింది. ఈ అధునాతన హైబ్రిడ్ మోడల్‌ను గురువారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సౌత్ ఈస్ట్ జోన్ సీబీహెచ్ ఆర్.సురేష్ బాబు, ఆర్ఎం ప్రతిభస్, షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి చంద్ర పవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ మారుతి కారు అంటే నగరంతోపాటు దేశంలోనే ఒక ట్రెండ్ అని, అన్ని వర్గాల వారిని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ ఉత్పత్తి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఉద్యానవన శాఖ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హార్టికల్చర్ షో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ మైండ్ స్పేస్‌లోని ఇన్నార్‌బిట్ మాల్‌లో లైఫ్‌స్టైల్ పేరిట ఫెస్టివల్ కలెక్షన్ మధ్యాహ్నం 12.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కల్ప్చర్స్, స్టేకిడ్ స్టోరీస్, టీప్ ఇంటీరియల్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఇక ఫుడ్ డెలి'వర్రీ'..!

- ఆన్‌లైన్ ఫుడ్ లవర్స్‌కు అమాంతం పెరగనున్న చార్జీలు
- 22వ తేదీ నుంచి 18 శాతం జీఎస్టీ అమలులోకి..
- ఒక్కో డెలివరీపై రూ.15 వరకు పెరిగే చాన్స్



సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ ఫుడ్ లవర్స్‌కు ఊహించని షాక్ ఇది. జొమాటో, స్విగ్గీ యూజర్లపై అదనపు భారం పడనుంది. ఫుడ్ డెలివరీ చార్జీలు అమాంతం పెరగనున్నాయి. ఈ నెల 22వ తేదీ నుంచి అమలులోకి రానున్న జీఎస్టీ మార్పులతో ఫుడ్ డెలివరీలు మరింత భారం కానున్నాయి. జొమాటో, స్విగ్గీ వంటి యాప్‌లు డెలివరీ ఫీజులపై అదనంగా 18% జీఎస్టీ వర్తింపజేయాల్సి ఉంటుంది. ఫుడ్ ఆర్డర్‌లపై ప్రస్తుతం ఉన్న 5% జీఎస్టీ కంటే డెలివరీ చార్జీలే అధికం. స్థానిక డెలివరీ సేవలు సీజీఎస్టీ చట్టంలోని సెక్షన్ 9(5) కిందికి వస్తాయని జీఎస్టీ కౌన్సిల్ ధ్రువీకరించింది. పండగల వేళ ఇప్పటికే ఆయా కంపెనీలు ప్లాట్‌ఫామ్ ఫీజు పెంచి వినియోగదారులపై మోయలేని భారం మోపగా, ఇప్పుడు జీఎస్టీ బాదుడు మొదలుకానుంది. జీఎస్టీ భారాన్ని వినియోగదారుల నుంచే వసూలు చేస్తారు.

రెండు రకాల వసూళ్లు...

ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్ చేసినప్పుడు రెండు రకాల జీఎస్టీ వర్తిస్తుంది. ఒకటి ఆర్డర్ చేసే ఆహారంపై ఉండగా, రెండోది డెలివరీ చార్జీలపై అమలులోకి రానుంది. ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్‌పై ఉన్న 5 శాతం జీఎస్టీ జనవరి 2022 నుంచి అమలులోకి వచ్చింది. అయితే ఇప్పుడు ఫుడ్ ఆర్డర్‌పై ఎలాంటి మార్పులు చేయలేదు. కానీ, డెలివరీ ఫీజుపై 18 శాతం జీఎస్టీ వసూలు చేయనున్నారు. స్విగ్గీ, జొమాటో వంటి కంపెనీలు ఒకప్పుడు డెలివరీ చార్జీలే వసూలు చేసేవి. కొన్నాళ్లకు ప్లాట్ ఫామ్ ఫీజు విధానాన్ని తెచ్చాయి. మొదట రూ.2 చొప్పున ప్రారంభించి ఇప్పుడు రూ.15 వరకు పెంచాయి.

స్విగ్గీ రూ.15.. జొమాటో రూ.12.50..

స్విగ్గీలో ఇప్పుడు డెలివరీ చార్జీలు రూ.15 కాగా, జొమాటోలో రూ.12.50గా ఉంది. మ్యాజిక్ పిన్‌లో రూ.10గా ఉంది. డెలివరీ చార్జీలపై ఇక కొత్తగా విధించే 18 శాతం జీఎస్టీతో జొమాటో వినియోగదారులపై అదనంగా ఒక్కో ఆర్డర్‌కు రూ.2 చెల్లించాల్సి వస్తుంది. స్విగ్గీలో రూ.2.60 చొప్పున భారం పడనుంది. అదనంగా రూ.5 పైన చెల్లించాల్సి రావచ్చని తెలుస్తోంది.

కేంద్రం స్పష్టత...

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ విషయంపై మంగళవారం కీలక ప్రకటన చేసింది. డెలివరీ సర్వీసుల జీఎస్టీ విధింపు అంశంపై క్లారిటీ ఇచ్చింది. లోకల్ డెలివరీలపై జీఎస్టీ 18 శాతంగా ఉంటుందని తెలిపింది. రిజిస్టర్డ్ పర్సన్ నేరుగా లోకల్ డెలివరీ చేస్తే సదరు వ్యక్తి 18 శాతం జీఎస్టీ కట్టాల్సి ఉంటుందని పేర్కొంది. ఇక లోకల్ డెలివరీలను మరో వ్యక్తి (రిజిస్టర్ కాని వ్యక్తి) సరఫరా చేస్తే జీఎస్టీ 18 శాతం ఈసీఓ చెల్లించాల్సి ఉంటుంది. ఈసీఓ తరఫున రిజిస్టర్డ్ పర్సన్ సరఫరా చేస్తే జీఎస్టీని లోకల్ డెలివరీ సర్వీసెస్ చెల్లించాల్సి ఉంటుంది.

హైదరాబాద్ ఇమేజ్‌ని కాపాడుకోవాలి



దిశ సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

- వరద ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు
- దిశ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో హైదరాబాద్ ముందున్నదని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉన్నదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారులు కలిసి అభివృద్ధి రంగంలో, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటూ సమర్థవంతంగా సేవలందించాలని కోరారు. గురువారం ఎంసీఆర్‌హెచ్ ఆర్డీలో ఏర్పాటు చేసిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ)లో కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ దేశానికి రోడ్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. హైదరాబాద్ మురికివాడల్లో ఉన్న ప్రజలకు ఇబ్బందులు, సమస్యలను తొలగించి అలాంటి వారిని ఆదుకోవడం మన కర్తవ్యమని పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లాలో 36 అంగన్‌వాడీ కేంద్రాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయనున్నట్లు కిషన్ రెడ్డి ప్రకటించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కింద హైదరాబాద్ జిల్లాలో స్పెషల్ క్యాంపులు నిర్వహించి మహిళలు, బాలికలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మంత్రి సూచించారు. జిల్లాలో 71, 560 స్వయం సహాయక సంఘాల పనితీరు బాగుందని, దేశంలోని ఉత్తరప్రదేశ్ లక్నో తర్వాత తెలంగాణలో స్వయం సహాయక సంఘాలు మరింత విజయపథంలో నడుస్తున్నాయని పేర్కొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు

వరద ప్రభావిత ప్రాంతాల్లో సత్వరమే హెల్త్ క్యాంపులు నిర్వహించి మెరుగైన వైద్యసేవలు అందించాలని కిషన్‌రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల సందర్భంగా ఆసిఫ్‌నగర్, ముషీరాబాద్ ప్రాంతాల్లోని నాలాలలోపడి ముగ్గురు యువకులు కొట్టుకొని పోవటం బాధాకరమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్స్‌పై సమీక్షించారు. సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, కలెక్టర్ హరిచందన దాసరి, అదనపు కలెక్టర్ రెవిన్యూ జి.ముకుంద రెడ్డి, అడిషనల్ కమిషనర్ జీహెచ్‌ఎంసీ రఘుప్రసాద్, జోనల్ కమిషనర్, అపూర్వ్ చౌహాన్, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీఓ డాక్టర్ లావణ్య, సీపీఓ డాక్టర్ సురేందర్, సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముచ్చింతల్‌కు సిటీ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ముచ్చింతల్‌లోని సమతామూర్తి విగ్రహాన్ని సందర్శించే భక్తుల కోసం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రతి శుక్ర, శని,ఆదివారాల్లో ఈ బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జేబీఎస్, సికింద్రాబాద్, రిసాలాబజార్, ఉప్పల్, కేపీహెచ్‌బీ, అఫ్జల్‌గంజ్ తదితర ప్రాంతాల నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఏనుగు నర్సింహారెడ్డి బాధ్యతల స్వీకరణ



నర్సింహారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న భాషా సాంస్కృతిక శాఖ ఉద్యోగులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి గురువారం రవీంద్రభారతిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా, సాంస్కృతిక పరిరక్షణ, కళాకారులకు న్యాయం జరిగేలా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. అనంతరం ఆయనను భాషా సాంస్కృతిక శాఖ ఉద్యోగులు, వివిధ సాంస్కృతిక, కళా సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

వేగంగా విస్తరిస్తున్న భారత్ నిర్మాణ రంగం

'వరల్డ్ ఆఫ్ కాంక్రీట్ ఇండియా-2025' 11వ ఎడిషన్ ప్రారంభం

బంజారాహిల్స్: భారత్ నిర్మాణ రంగం వేగంగా విస్తరిస్తోందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ నిర్మాణ రంగం 12 శాతం వృద్ధితో దూసుకుపోతోందన్నారు. బంజారాహిల్స్‌లోని హయత్‌ప్లేస్ హోటల్‌లో గురువారం ప్రముఖ బీ2బీ ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఇన్ఫోర్మా మార్కెట్స్ ఇండియా ప్రత్యేక మీడియా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో భాగంగా 'వరల్డ్ ఆఫ్ కాంక్రీట్ ఇండియా-2025'11వ ఎడిషన్‌ను ప్రారంభించారు. ఈ ప్రధాన ఎక్స్‌పో అక్టోబర్ 8 నుంచి 10వ తేదీ వరకు ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరగనుంది. ఇందులో 250కిపైగా ఎగ్జిబిటర్లు, 350కి పైగా బ్రాండ్లు, 15 వేలకు మందికిపైగా ఇండస్ట్రీ నిపుణులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఇన్ఫోర్మా మార్కెట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాలు నగరంలో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. జియోపాలిమర్ కాంక్రీట్ వంటి సుస్థిర పరిష్కారాలను అన్వేషించనున్నారని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ గ్రూపు డైరెక్టర్ రజనీష్ ఖట్టర్, జిందాల్ పాంథర్ సిమెంట్ సీఈఓ రోహిత్ వోరా, కన్సల్టెంట్, ఆర్కిటెక్ట్ డాక్టర్ ఈఆర్ఏఆర్ ఎస్పీ అంచూరి, సీఈఏఐ ఉపాధ్యక్షుడు సోమనాథ్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

పండగల రద్దీ కోసం ప్రత్యేక భద్రత

- మోహరించిన సాయుధ పోలీసు బలగాలు
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పకడ్బందీ ఏర్పాట్లు



క్యూ పద్ధతిన బోగీల్లోకి ప్రయాణికులను పంపిస్తున్న పోలీసులు

సికింద్రాబాద్: దసరా, దీపావళి, ఛాత్ పండగల రద్దీ ప్రారంభమైన నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు గురువారం నుంచి ప్రత్యేక చర్యలు చేపట్టారు. దసరా, దీపావళి, ఛాత్ పంగడల రద్దీ తగ్గుముఖం పట్టే వరకు 60 రోజులపాటు ప్రత్యేక చర్యలు అమలులో ఉంటాయని రైల్వే పోలీసు అధికారులు ప్రకటించారు. ముఖ్యంగా జనరల్ బోగీల్లో తొక్కిసలాట, ప్రమాదాలు జరగకుండా చూసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ప్రయాణికులను 'క్యూ'పద్ధతిన బోగీల్లోకి ఎక్కిస్తున్నారు. 'ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు, బుకింగ్ కౌంటర్లు, వెయిటింగ్ హాళ్లు, ప్లాట్‌ఫామ్‌లపై ఆర్‌పీఎఫ్ సిబ్బందితో పికెట్‌లు ఏర్పాటు చేశారు. వాహనాల రద్దీని నియంత్రించేందుకు హోంగార్డులను నియమించారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమన్వయం చేసుకుని రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌లోకి ప్రయాణికులు ప్రవేశించగానే అవసరమైన సమాచారం అందించడం కోసం హెల్ప్‌డెస్క్ పేరుతో రెండు సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1వ, 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌లపై ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ల ద్వారా రైళ్ల రాకపోకల సమయాలు, ప్లాట్‌ఫామ్‌ల వివరాలను తెలియజెప్తున్నారు. టికెట్లు ఉన్న వ్యక్తులకు మాత్రమే రైల్వేస్టేషన్‌లోనికి అనుమతిస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో ఎక్కువ రద్దీ ఉండే ప్రాంతాలను గుర్తించి అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా 24 గంటలూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అన్ని ప్లాట్‌ఫామ్‌లపై అదనపు డిస్‌ప్లే బోర్డులు, కుర్చీలు ఏర్పాటు చేశారు. స్టేషన్‌లోని ఆరు ఫుట్ ఓవర్ వంతెనల మీద సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

రాహుల్‌కు కాళ్లొచ్చినయ్

నిమ్స్‌లో విద్యార్థికి ఉచితంగా కృత్రిమ అవయవాలు



లక్డీకాపూల్: రాజస్తాన్‌లో జరిగిన రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన వరంగల్ జిల్లా హనుమకొండ దామెర మండలం పులకుర్తికి చెందిన గుండేటి ఉమామహేష్ కుమారుడు రాహుల్‌కు హైదరాబాద్‌లోని నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అఫ్ సైన్సెస్(నిమ్స్)వైద్యులు కృత్రిమ అవయవాలు అమర్చారు. రాహుల్ ప్రస్తుతం రాజస్థాన్‌లోని కోటాలో ఇంటర్ చదువుతున్నాడు. గత నవంబర్ 2న దీపావళి సెలవులు ముగించుకుని వరంగల్ నుంచి రాజస్థాన్ వెళ్తున్న సమయంలో మధ్యప్రదేశ్‌లోని శ్యామ్‌గడ్ వద్ద రాత్రి 12 గంటల సమయంలో దుండగులు రన్నింగ్ ట్రైన్ నుంచి తోసివేయగా, అతని కాళ్లపై మరో రైలు దాటింది. ఈ ఘటనలో రాహుల్ రెండు కాళ్లు కోల్పోయాడు. దాంతో అతన్ని మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తీసుకువచ్చారు. ఈ క్రమంలో బుధవారం రాహుల్‌కు కృత్రిమ అవయవాలను అమర్చారు. వాటి సాయంతో ఎప్పటిలా నడవగలుగుతున్నాడు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప మాట్లాడుతూ "ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.10 లక్షల విలువ చేసే ఈ అత్యాధునిక కృత్రిమ అవయవాలను పూర్తిగా ఉచితంగా అందించామన్నారు. రాహుల్ తన చదువులు కొనసాగించేందుకు, సాధారణ జీవితాన్ని గడపేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. రాహుల్‌కు శస్త్రచికిత్స చేసిన ఆర్థోపెడిక్ వైద్యులు చంద్రశేఖర్, ఆసిఫ్, లలిత్, సందీప్‌లను ఆయన అభినందించారు.

నిమ్స్‌లో మీడియా సెంటర్ ఏర్పాటు

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా మీడియా సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని ఆస్పత్రి మీడియా ఇన్‌చార్జి సత్యాగౌడ్ తెలిపారు. సమాచారం కోసం వచ్చే మీడియా ప్రతినిధుల సౌకర్యార్థం ఈ సెల్ పని చేస్తుందన్నారు. ఆ సెంటర్ వద్దే మీడియా ప్రతినిధుల వాహనాలకు పార్కింగ్ సదుపాయాన్ని సైతం కల్పించినట్లు చెప్పారు. సమాచార సేకరణ కోసం ఆస్పత్రికి వచ్చే జర్నలిస్టులకు సెక్యూరిటీ గార్డులు, ఇతర సిబ్బంది ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్న అంశాలపై యాజమాన్యం దృష్టి సారించిందన్నారు. నిమ్స్ వైద్యుల ఇంటర్వ్యూలు, విజయవంతమైన అరుదైన ఆపరేషన్లు, వివిధ వైద్య విభాగాలకు సంబంధించిన అవగాహన సదస్సులు, ఇతర కార్యక్రమాలకు హాజరయ్యే జర్నలిస్టులు పార్కింగ్ విషయంలో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు సత్యాగౌడ్ పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల మెరుగుకు చర్యలు



నిలోఫర్ సమీక్ష సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

సాక్షి, సిటీబ్యూరో: నిలోఫర్ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఆసుపత్రిలోని విభాగాలను పటిష్టం చేయాలని సూచించారు. గురువారం ఆయన ఆసుపత్రి సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిలోఫర్‌లో మెరుగైన వైద్యసేవల కోసం చేపట్టవలసిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నూతన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పీజీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని సూచించారు. రోగుల సహాయకులకు సైతం సరైన వసతి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని భవనాల పరిస్థితిపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. సమీక్షలో ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా, టీజీఎంఎస్ఐడీ ఎండీ ఫణీందర్ రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల టీచర్ల వేతనాలు పెంచాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్



మైనార్టీ గురుకుల సొసైటీ కార్యాలయం ఎదుట బైఠాయించిన టీచర్లు, టీచర్లకు మద్దతుగా కింద కూర్చున్న ఆర్.కృష్ణయ్య

నాంపల్లి: మైనార్టీ గురుకుల పాఠశాలల్లో పనిచేసే కాంట్రాక్టు–ఔట్ సోర్సింగ్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. పది నెలల గురుకుల వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం నాంపల్లిలోని మైనార్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి కార్యాలయం ఎదుట టీచర్లు ధర్నా చేపట్టారు. బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనకు పెద్ద ఎత్తున టీచర్లు హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యతోపాటు పీజీఆర్‌టీ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్ కుమార్‌రెడ్డి, ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం హాజరై టీచర్లకు మద్దతు ప్రకటించారు. టీచర్లతోపాటు మైనార్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి కార్యాలయం ఎదుట బైఠాయించి వారు నిరసన వ్యక్తం చేశారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్‌కు రూ.32 వేల నుంచి రూ.21 వేలకు తగ్గించారని, ట్రెండ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ)లకు రూ.26 వేల నుంచి 18 వేలకు తగ్గించారని పేర్కొన్నారు. అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ పరీక్షల్లో 20 శాతం వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దిలీప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేశాయని, మన రాష్ట్రంలో కూడా క్రమబద్ధీకరించాలని కోరారు. అనంతరం 20 మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందం మైనార్టీ గురుకుల సెక్రటరీతో చర్చలు జరిపింది. తగ్గించిన వేతనాలను పెంచడానికి సెక్రెటరీ అంగీకరించారనీ, త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని దిలీప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పగడాల సుధాకర్, వంశీకృష్ణ, బాలకృష్ణ, రవి, ఆశిష్ పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయాలు ప్రగతికి నాంది



జాతీయ సెమినార్‌లో ప్రసంగిస్తున్న డాక్టర్ రియాజ్

తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్

చార్మినార్: పౌర గ్రంథాలయాలు ప్రగతికి నాంది అని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. 'తెలంగాణ గ్రంథాలయాలు.. నాడు- నేడు, అభివృద్ధి కార్యాచరణ'అనే అంశంపై ప్రభుత్వ సిటీ కళాశాల గ్రంథాలయ శాస్త్ర విభాగం గురువారం ఒకరోజు జాతీయ సెమినార్ నిర్వహించింది. ముఖ్యఅతిథి డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. 1969 తెలంగాణ ఉద్యమంలో దినపత్రికలు పోషించిన పాత్రను గుర్తు చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లుగా పుస్తకాలు చదవడం ద్వారా ఆలోచనలు విస్తృతమవుతాయని, పెద్ద కలలు కనడానికి, వాటిని సాకారం చేసుకోవడానికి జ్ఞానాన్ని పొందవచ్చని అన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా ప్రజలు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య సుదర్శన్ రావు మాట్లాడుతూ తెలంగాణలోని పౌర గ్రంథాలయాలను పాఠకులకు అనుగుణంగా ఆధునీకరించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సేవలను మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో పరిశోధకుడు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్, డాక్టర్ విప్లవ దత్ శుక్లా, డాక్టర్ రవికుమార్ చేగొని, అవధానం సుజాత, శంకర్, కృష్ణవేణి, రాజేందర్, లక్ష్మణ్ గౌడ్, నయన వినోదిని, శారద, తబుస్సుమ్ ఫాతిమా, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా 2 శాతం.. జీడీపీకి 8 శాతం

యూఎస్‌లో ఎన్ఆర్ఐల పాత్రపై డీజీపీ జితేందర్



వెంగళరావునగర్: అమెరికాలోని భారతీయులు 2 శాతం మంది మాత్రమే ఉన్నారని, అయితే అక్కడి జీడీపీకి 8 శాతం మేర మేధస్సును అందిస్తున్నట్టు తెలంగాణా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని నలందా విద్యాసంస్థలను గురువారం ఆయన సందర్శించి చిన్నారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పోలీసుల పనితీరు నివేదికను పరిశీలిస్తే తెలంగాణ పోలీసులే మొదటి స్థానంలో ఉన్నారని, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ తదితర ఎన్నో ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపుతున్నట్లు పేర్కొన్నారు. జీవితంలో సరైన లక్ష్యాన్ని ఎంపిక చేసుకుని క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణ, నైతిక నాయకత్వం, ప్రజాసేవ పట్ల నిబద్ధతతో పని చేసే ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఎక్కడో గ్రామీణ ప్రాంతంలో పుట్టిన తాను ఎన్నో ఆటంకాలను దాటి ఐపీఎస్ కాగలిగానని, కష్టాలు ఎదురొచ్చినప్పుడు వెనుకంజ వేయరాదని అన్నారు. కార్యక్రమంలో ప్రఖ్యాత మెంటర్, సివిల్ సర్వీసెస్ విద్యావేత్త రాంబాబు, నలందా విద్యాసంస్థల చైర్మన్ మంతెన శ్రీనివాసరాజు, డైరెక్టర్ మంతెన సూర్యనారాయణ కశ్యప్ వర్మ, టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మోప్మా ఆర్పీలకు వేతన బకాయిలు ఇవ్వాలి



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్. చిత్రంలో మోప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు ఎస్‌వీ రమ తదితరులు

– ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా

కవాడిగూడ: వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని , ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్పీలు భారీగా తరలివచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ మెప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు ఎస్వీ రమ, యూనియన్ అధ్యక్షురాలు చంద్రకళ, కోశాధికారి ఎ.పద్మ మాట్లాడారు. ఎన్నికలకు ముందు అధికార కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం ఆర్పీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అతి తక్కువ జీతంతో పనిచేస్తున్నవారికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు వివిధ సర్వేలు అన్ని ఆర్పీల ద్వారా చేయించుకుంటూ వారికి అన్యాయం చేయడం తగదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన డ్రెస్ కోడ్ ఇవ్వాలని, పది లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ధర్నాలో యూనియన్ నాయకులు బాలమణి, వసంత, సునీత, మంజుల, సుభద్ర అశోక్ పాల్గొన్నారు.



ముగిసిన కోహినూర్ థియేటర్ కార్నివాల్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో క్రియేటివ్ థియేటర్ సంస్థ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా రవీంద్రభారతిలో జరుగుతున్న కోహినూర్ థియేటర్ కార్నివాల్ (జాతీయ నాటకోత్సవాలు) గురువారంతో ముగిశాయి. రాష్ట్రంతో పాటు కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర నాటకరంగ కళాకారులు హాజరై వారి సంస్కృతి, సంప్రదాయాలను ప్రదర్శించారు. మూడు రోజుల నాటక మహోత్సవంలో తెలంగాణ రంగస్థల వేదికపై జాతీయ సంస్కృతిని ప్రదర్శించడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రానున్న కాలంలో అంతర్జాతీయ స్థాయిలో నాటకోత్సవాలను నిర్వహిస్తామని క్రియేటివ్ థియేటర్ వ్యవస్థాపకులు ఎం.అజయ్ ప్రకటించారు. అనంతరం పలువురు రంగస్థల కళాకారులను సత్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత మెర్సీ మార్గరేట్, సినీ నటుడు మైమ్ మధు, సినీ నిర్మాతలు బి.శివప్రసాద్, గణపతి రెడ్డి పాల్గొన్నారు.

నగర వేదికగా ప్రకృతి ప్రేమికుల హార్ట్ ఫేవరెట్ అయిన హార్టికల్చర్ షో మరో మారు అలరిస్తుంది. నక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా వేదికగా ఈ 18వ నర్సరీ మేళా–2025 గురువారం గ్రాండ్‌గా ప్రారంభించారు. ఇందులో వివిధ రకాల మొక్కలు రూ.30 నుంచి రూ.3 లక్షల ధరల్లో గార్డెనింగ్ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 22వ తేదీ వరకూ ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ నగరవాసులకు అందుబాటులో ఉండనున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.
– ఖైరతాబాద్/లక్డీకాపూల్



- సందడిగా నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజా
- రూ.30 నుంచి రూ.3 లక్షల ధరల్లో మొక్కలు
- గార్డెనింగ్ ప్రియులను ఆకట్టుకుంటున్న నర్సరీ ప్రదర్శన

హార్ట్ ఫేవరెట్.. హార్టికల్చర్ షో..






రాష్ట్ర ఉద్యానవన శాఖ టెర్రస్ గార్డెన్‌లను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా గ్రీనరీ ప్రియులను దృష్టిలో పెట్టుకుని నర్సరీ మేళా పేరుతో ఆల్ ఇండియా హార్టికల్చర్ షో అందుబాటులోకి తీసుకొచ్చింది. భిన్న రకాల మొక్కలు, విభిన్న రకాల పుష్పజాతులు, ఔషధ, అరుదైన మొక్కలు ఈ ప్రదర్శనలో కొలువుదీరాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి అరుదైన మొక్కలు, విత్తనాలు తీసుకొచ్చి 150 స్టాళ్లలో ఏర్పాటు చేశారు. కిచెన్, అవుట్‌డోర్, బల్బ్, సీడ్, సీడ్‌లింగ్స్, ఇండోర్, ఆడినియం, బోన్సాయ్, క్రీపర్స్, ఫ్లవర్స్, ఇంపోర్టెడ్ ప్లాంట్స్‌తో పాటు ఎగ్జాటిక్ ప్లాంట్స్, వాటర్ లిల్లీస్, కోకో పీట్, గార్డెన్ ఎక్విప్‌మెంట్, ఫామ్ ఎక్విప్‌మెంట్ వంటి ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు.

ఎగ్జాటిక్ ప్లాంట్స్ ప్రత్యేకం..

నర్సరీ మేళాలో వెస్ట్ బెంగాల్‌లోని కాలీపంగ్ నుంచి ప్రత్యేక ఎగ్జాటిక్ ప్లాంట్స్ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ప్రదర్శన ఇన్‌ఛార్జి ఖలీద్ అహ్మద్ పేర్కొంటున్నారు. ఈ మేళాలో ఏపీ, కడియం, కోల్‌కతా, ఢిల్లీ, హర్యాణ, ముంబై, బెంగళూరు, పుణె, చెన్నై, వెస్ట్ బెంగాల్ తదితర ప్రాంతాల నర్సరీలు భాగస్వామ్యం అయ్యాయి. నాటు కూరగాయలు, బొబ్బాయి, మునగ మొక్కలతో స్నేహ నర్సరీ ఆకట్టుకుంటోంది. తెలుగు రాష్ట్రాల వాతావరణానికి అనుకూలమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయి.



- ఫోన్ అడిక్షన్‌తో భావప్రకటనకు బ్రేక్
- నైపుణ్యాన్ని కోల్పోతున్న నగర యువత
- ప్రతిదానికీ బిడియపడుతున్న పరిస్థితులు
- వాట్సాప్ మెసేజ్‌లు, చాటింగ్‌తోనే భావప్రకటన
- కుటుంబ సభ్యులతోనూ స్వేచ్ఛగా మాట్లాడలేని పరిస్థితి
- మానసిక వైద్యులను సంప్రదిస్తున్న పలువురు

మౌనమేలనోయి..

యువతను వెంటాడుతోన్న 'షైనెస్'

కొన్ని సందర్భాల్లో సైలెన్స్ ఎంత ప్రశాంతతనిస్తుందో.. మరికొన్ని సందర్భాల్లో సైలెన్స్..అంత వైలెంట్‌గా ఉంటుంది.. ఈ విషయం మనలో చాలా మంది గ్రహించే ఉంటాయి. కానీ ప్రస్తుత తరంలోని కొందరు యువత ఇదే సూత్రంగా పాటిస్తున్నారు. కంఠానికి కళ్లెం వేస్తున్నారు. ఎప్పుడూ మౌనంగా కూర్చుంటూ.. ఫోన్ చూసుకుంటూ కాలం గడిపేస్తున్నారు. మనసులోని భావాలను స్వేచ్ఛగా చెప్పలేని పరిస్థితికి వెళ్లిపోతున్నారు. ఏది చెప్పాలన్నా సైగలతోనూ.. మెసేజ్‌లు, చాటింగ్ రూపంలోనో తప్ప ఎదురుపడి మాట్లాడలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గట్టిగా మాట్లాడితే షైనెస్ ఫీల్ అవుతున్నారు.. ఫోన్ అడిక్షన్ కారణంగా బయటి వారితోనే కాదు.. ఏకంగా ఇంట్లో వారితోనూ మాట్లాడలేని స్థితికి చేరుకుంటున్నారు పలువురు నగరవాసులు. దీంతో గత్యంతరం లేక మానసిక వైద్యులను సంప్రదించాల్సిన పరిస్థితి తప్పడంలేదని వాపోతున్నారు.
– సాక్షి, సిటీ బ్యూరో



వాక్చాతుర్యం ఒక అద్భుతమైన కళ.. మనసులోని భావాలను, ఆలోచనలను వ్యక్తీకరించేది 'మాట' ఒక్కటే. పిల్లలు గలగలా మాట్లాడేస్తుంటే భలే ముచ్చటగా ఉంటుంది. మరికొంత మంది తమ వాగ్ధాటితో కట్టిపడేస్తూంటారు. కానీ ఇటీవల కాలంలో మాటలు మౌనం దాల్చుతున్నాయి. మొబైల్‌ఫోన్ మాయాజాలంలో యువత కొట్టుకుపోతోంది. సూటిగా, స్పష్టంగా మాట్లాడే నైపుణ్యాన్ని కోల్పోతున్నారు. నగరంలో ఈ తరహా 'షైనెస్' తీవ్ర సమస్యగా మారుతోందని పలువురు మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్య అనేక మందిని విస్మయానికి గురి చేస్తుంది. డిగ్రీలు, పీజీలు వంటి ఉన్నత చదువులు పూర్తి చేసిన వాళ్లు కూడా తమ భావాలను స్పష్టంగా వెల్లడించలేకపోతున్నారు. తమ అభిప్రాయాలను, ఆలోచనలను తెలియజేసేందుకు వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను ఆశ్రయించడం ఆందోళన కలిగిస్తున్న పరిణామం.

ఏది కావాలన్నా వాట్సాప్‌లోనే..

'ఆ అమ్మాయికి పద్దెనిమిదేళ్లు. బీటెక్ చదువుతోంది. కానీ నోరు తెరిచి తండ్రితో నాలుగు మాటలు మాట్లాడలేదు. ఇంటికి చుట్టాలొచ్చినా పలుకరించదు. తన లోకం తనదే.. అలాగని చదువులో ఏ మాత్రం వెనుకబడకుండా బాగానే చదువుతోంది. తనకు ఏది కావాలన్నా.. తండ్రికి వాట్సాప్‌లో మెసేజ్ చేస్తుంది. ఈ ధోరణి చూస్తోంటే ఆందోళన కలిగిస్తోంది' అంటూ వారం రోజుల క్రితం హిమాయత్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ తన కూతురుతో కలిసి మానసిక వైద్య నిపుణుడిని సంప్రదించారు.

అడిక్షన్‌తో మానసిక సమస్యలు..

ఇంటికి వచ్చిన అతిథులను కనీసం బాగున్నారా.. అని కూడా పలకరించలేని పరిస్థితి. నిజానికి ఇది కేవలం ఆ అమ్మాయి ఎదుర్కొంటున్న సమస్య మాత్రమే కాదు.. చాలా మంది అబ్బాయిలు, అమ్మాయిల పరిస్థితి ఇదే.. ఈ తరహా షైనెస్‌తో బాధపడుతున్నవారు నగరవ్యాప్తంగా చాలా మందే ఉన్నారు. ఇరవై నాలుగు గంటలూ మొబైల్ ఫోన్‌లకు అతుక్కొనిపోవడం వల్ల..బయటి ప్రపంచంతో సంబంధాలను కోల్పోతున్నారు. రోజు రోజుకు ఇలాంటి మానసిక రుగ్మతలు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. మానసిక వైద్యుల పరిభాషలో చెప్పాలంటే ఈ 'షైనస్' (బిడియం) ఇటీవల కాలంలో ఒక సవాల్‌గా మారిందని సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సంహిత చెబుతున్నారు. ఇలాంటి పిల్లలు చదువుల్లో ఉన్నత ర్యాంకులు సాధించినప్పటికీ భావప్రకటనా నైపుణ్యంపై మాత్రం పట్టు కోల్పోతున్నారని చెబుతున్నారు. మర్యాదపూర్వకమైన సంభాషణలు, పలకరింపులు కూడా ఈ తరం పిల్లలకు తెలియకుండా పోతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

పరిష్కార మార్గాలు..

- అలాంటి వారితో నిత్యం ఏదో ఒక విషయంపై ఇంట్లో వారు నిరంతరం సంభాషించాలి.
- ఇరువై నాలుగు గంటలూ ఫోన్‌కు అతుక్కుపోయి మాట్లాడలేక పోతున్న పిల్లలను గుర్తించడంలో కుటుంబ సభ్యులు అప్రమత్తం కావాలి.
- అలాంటి పిల్లలను నెమ్మదిగా మాటల్లోకి దింపి సంభాషణలను పొడిగించాలి. ఇది ఒక ప్రణాళిక ప్రకారం కొనసాగించాలి.
- ఆ పిల్లల వాక్చాతుర్యాన్ని, భావప్రకటన నైపుణ్యాన్ని ప్రశంసించాలి. ప్రసంగాలను ప్రోత్సహించాలి.
- క్రమంగా మొబైల్ అడిక్షన్‌ను తగ్గించాలి అంటున్నారు మానసిక నిపుణులు.



భావప్రకటనను కోల్పోతూ..

'ఫేస్‌బుక్‌లో, వాట్సాప్‌లో, ఇతరత్రా సమాజిక మాధ్యమాల్లో బంధువులకు, స్నేహితులకు ఎంతో ఘనంగా పుట్టిన రోజు శుభాకాంక్షలు పోస్టు చేస్తారు. కానీ ఆయా వ్యక్తులు తారసపడినప్పుడు మనస్ఫూర్తిగా విషెస్ కూడా చెప్పలేకపోతున్నారు.' అని నిపుణులు పేర్కొంటున్నారు. ఇలాంటి పిల్లలు ఆఖరికి తల్లిదండ్రులతోనూ స్పష్టంగా మాట్లాడలేకపోతున్నారు. యువతలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. అన్నింటికీ ఇంటర్నెట్, మొబైల్ ఫోన్‌పై ఆధారపడడం, ఏదైనా సందేహం వచ్చిన పెద్దలను అడగకుండా గూగుల్ లేదా ఇతర యాప్స్‌లో సెర్చ్ కొట్టడం తద్వారా వారికి కావాల్సిన సమాచారం తెలుసుకోవడం కూడా ఓ కారణమే. తద్వారా తమలోని భావప్రకటనా నైపుణ్యాన్ని కోల్పోతున్నారని తెలుస్తోంది. నిత్యం ఒంటరిగా ఫోన్‌తో కాలం గడపడం ద్వారా ఎవరితోనూ పరిచయాలు లేక.. ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియక, ఏదైనా మాట్లాడితే ఏమంటారోననే భయంతో తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు.



పదేళ్ల నుంచి పాతికేళ్ల వరకూ..

సాధారణంగా పిల్లల మాటలతోనే ఇళ్లల్లో సందడి కనిపిస్తుంది. కానీ ఇప్పుడు పదేళ్ల పిల్లల నుంచి పాతికేళ్ల యువత వరకూ ప్రతి ఒక్కరికీ మొబైల్‌ఫోన్ ఒక్కటే ప్రపంచంగా మారింది. దీంతో ఇంట్లో, బయట ఆ మొబైల్‌లోనే మునిగిపోతున్నారు. చివరికి రోడ్డుపై నడిచినా, బస్సుల్లో, మెట్రోల్లో ప్రయాణం చేసినా సరే మొబైలే కాలక్షేపం.. దీని కారణంగా ఇతరులతో మాట్లాడే లక్షణాన్ని కోల్పోతున్నారు.. మరీ ముఖ్యంగా తమలోని భావాలను చెప్పేందుకు, పంచుకునేందుకు తీవ్రమైన షైనెస్‌కు గురవుతున్నారు.'ఇలాంటి పిల్లలు ఎదుటి వ్యక్తి ముఖంలోకి సూటిగా చూసి స్పష్టంగా మాట్లాడలేరు. ఈ షైనెస్ లక్షణం కారణంగా.. తమకు ఏం కావాలన్నా, తాము ఎదుటి వారిని ఏదైనా అడగాలనుకున్నా వాట్సాప్‌లో మెసేజ్ పోస్టు చేయడం అలవాటుగా మారుతోంది.' అని డాక్టర్ సంహిత చెబుతున్నారు.

రేపు 'పాలధార పాట' పుస్తకావిష్కరణ

- గద్దర్ ఫౌండేషన్ ఫౌండర్, సెక్రటరీ జీవీ.సూర్యకిరణ్

హిమాయత్‌నగర్ : గద్దర్ యాదిలో 'పాలధార పాట' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈనెల 20న శనివారం నిర్వహించనున్నట్లు గద్దర్ ఫౌండేషన్ ఫౌండర్, సెక్రటరీ జీవీ. సూర్య కిరణ్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ హిమాయత్‌నగర్ సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో ఈ పుస్తకంలో పాట రాసిన ప్రతి రచయిత తమ పాటలను వినిపించే విధంగా కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే రచయితలందరికీ 'పాలధార పాట' పుస్తకాన్ని ప్రముఖులు అందజేయనునట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ఓయూ ఆర్ట్స్ కాళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.కాశీం, పీఎస్ఎన్ మూర్తి, ఐడీఏఎస్–వీఆర్, సీనియర్ పాత్రికేయులు కే.శ్రీనివాస్, గద్దర్ ఫౌండర్ చైర్ పర్సన్ ప్రొఫెసర్.శాంతసిన్హా, పాలధార ఎడిటర్ సామ మల్లారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఏకచిత్ర ప్రింట్ మేకింగ్ ఎగ్జిబిషన్

- సిటీ ఆర్ట్ క్యాలెండర్‌లో 15వ శతాబ్దపు ఆర్ట్ టెక్నిక్
- నేడు ప్రారంభించనున్న ఫ్యాషన్ ఐకాన్ శిల్పారెడ్డి





హైదరాబాద్ ఆర్ట్ క్యాలెండర్ సరికొత్తగా 15వ శతాబ్దపు ఆర్ట్ టెక్నిక్, అరుదైన వేడుకకు సాక్ష్యంగా నిలువనుంది. వినూత్న కళా మాధ్యమం.. 'ప్రింట్‌మేకింగ్ ఎగ్జిబిషన్ ఎడిషన్ -2' ప్రదర్శనతో నగరానికి కొత్తకళను అద్దనుంది. జూబ్లీహిల్స్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ వేదికగా 14 రాష్ట్రాల నుంచి 30 మంది కళాకారులు ఇందులో భాగస్వామ్యం కానున్నారు. వీరి ఆధ్వర్యంలో ప్రదర్శించనున్న సరికొత్త ఆర్ట్ ఫెస్ట్ శుక్రవారం ప్రారంభం కానుంది. అన్నపూర్ణ.ఎం, అత్రి చేతస్ ఆధ్వర్యంలో చారిత్రాత్మక సింధు లోయ, భారత్‌లోని 16వ శతాబ్దపు సజీవ ముద్రలను, సంప్రదాయ ఆనవాళ్లను నగరానికి పరిచయం చస్తోంది. అంతేకాకుండా యువ కళాకారులు నేటి సమకాలీన కళా దృశ్యంలో సృజనాత్మక మాధ్యమాన్ని ఆవిష్కరించే విధానం హైలైట్‌గా నిలువనుంది. – సాక్షి, సిటీబ్యూరో



ప్రింట్‌మేకింగ్ అనేది సింధు లోయ నాగరికత నాటిది.. అయినప్పటికీ ఆధునిక కాలంలో లితో ప్రెస్ ఆగమనం, ప్రారంభ దినపత్రికల ముద్రణ.. అనేది ప్రింట్ మేకింగ్‌లో అత్యంత ఆధునిక అప్లికేషన్‌గా మారింది. ఇది కేవలం ఒక ఆర్ట్ షోకేస్ మాత్రమే కాకుండా.. స్టేట్ గ్యాలరీలో పబ్లిక్ ప్రింట్‌మేకింగ్ స్టూడియో ప్రారంభంతో ఈ ఎడిషన్ -2 నగరానికి సరికొత్త కళా ప్రమాణాన్ని అందించనుంది. ఔత్సాహికులు, విద్యార్థులు ఈ కళారూపాలను ఆస్వాదించడానికి అనువైన వేదికని నిర్వాహకుల అంటున్నారు. ఇదే వేదికగా వర్క్‌షాప్‌లు, మినీ ప్రింట్ పోర్ట్‌ఫోలియో, సాంకేతిక అభివృద్ధి వంటి విషయాలపై గొప్ప అనుభూతిని అందిస్తుంది. ఈ ఎడిషన్–2 సంప్రదాయం, ప్రయోగం, ప్రక్రియ, ఊహ వంటి ప్రత్యేక అనుభవాన్ని అందిస్తుందని క్యూరేటర్ అన్నపూర్ణ మడిపడిగ తెలిపారు. దశాబ్ద కాలంగా కళ మాత్రమే సమాజం మధ్య సంభాషణలను నిర్మిస్తోందని ది అన్‌నోన్స్ ఆర్ట్ కలెక్టివ్ వ్యవస్థాపకురాలు, ప్రింట్‌మేకర్ అత్రి చేతస్ పేర్కొన్నారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్, వెల్‌నెస్ ఇన్ఫ్లుయెన్సర్ శిల్పా రెడ్డి దీనిని ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గౌరవ అతిథిగా నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ డైరెక్టర్ జనరల్ డా.సంజీవ్ కిషోర్ గౌతమ్ పాల్గొనున్నారు.

'మియారా' పండుగ కలెక్షన్



లక్డీకాపూల్: మియారా పేరిట తనైరా క్రాఫ్టెడ్ బై హ్యాండ్, రూటెడ్ ఇన్ ప్యూరిటీ కలెక్షన్ అందుబాటులోకొచ్చింది. పండుగ సీజన్ పురస్కరించుకుని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కూకట్‌పల్లి, పంజాగుట్ట, కొంపల్లి, గచ్చిబౌలి, శేరిలింగంపల్లిలోని తనైరా షోరూమ్‌లో హ్యాండ్ క్రాఫ్టెడ్ కలెక్షన్ సొంతం చేసుకోవచ్చు. తనైరా సీఈఓ అంబుజ్ నారాయణ్ మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో వినియోగదారులకు తనైరా మరింత చేరువయ్యేందుకు ఆకర్షణీయమైన మోడళ్లను అందుబాటులో ఉంచామని, వినియోగదారుల సంతోషమే తమ లక్ష్యమని అన్నారు. ఈ పండుగ సీజన్‌లో కొనుగోలుదారుల మన్ననలతో అత్యధిక రెండంకెల వృద్ధిని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. మియారా ద్వారా బంగారు నాణేలతో ప్రత్యేక పండుగ ఆఫర్ పరిచయం చేస్తున్నామన్నారు. ప్రతి రూ.10వేలు కొనుగోలుపై వెయ్యి రూపాయిల గిఫ్ట్ ఓచర్, రూ.50వేల కొనుగోలుపై 0.2 గ్రాముల తనిష్క్ బంగారు నాణేన్ని కానుకగా ఇవ్వనున్నట్లు నారాయణ్ తెలిపారు.

గతి తప్పిన జలచక్రం!



ఇటు కుంభవృష్టి, అటు కటిక కరువు

అధిక ఉష్ణోగ్రత, అతివృష్టి, అనావృష్టి

2024లో ప్రపంచం అతలాకుతలం

ప్రపంచ వాతావరణ సంస్థ నివేదిక

ప్రపంచ జలచక్రం గతి తప్పింది. 2024లో ఇది మరింత అస్తవ్యస్తమైంది. గత 175 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు 1.55 డిగ్రీల సెల్సియస్ మేరకు పెరగటంతో వాతావరణంలో అసమతుల్యత పెరిగిపోయింది. ఇటు కుంభవృష్టి, అటు కరువులు విరుచుకుపడటంతో మూడింట రెండొంతుల నదులు చుక్క నీరు లేకుండా ఎండిపోయాయి లేదా విపరీతమైన వరదలతో సతమతమయ్యాయి. అతివృష్టి, అనావృష్టి వల్ల వల్ల ప్రజలు గతంలో ఎన్నడూ లేని విధంగా 2024లో తీవ్రస్థాయిలో కష్టాలపాలయ్యారని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) తాజా నివేదికలో వెల్లడించింది.

- సాక్షి, సాగుబడి

అసాధారణ నీటి కష్టాల వల్ల.. ఆహార కొరత, ధరల పెరుగుదల, సంఘర్షణలు, వలసలు పెరిగాయని 41 దేశాల సమాచారాన్ని క్రోడీకరించిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) తాజా నివేదిక వివరించింది. ఐక్యరాజ్యసమితికి అనుబంధ సంస్థ అయిన డబ్ల్యూఎంఓ ఏటా ప్రపంచ జల వనరులపై నివేదికను వెలువరిస్తుంటుంది. నీటి వనరులపై ప్రజలు, పాలకులు, శాస్త్రవేత్తలకు దిశానిర్దేశం చేస్తుంది.

కరువు కరాళ నృత్యం

అతి తీవ్రమైన నీటి సమస్యలతో ప్రపంచ జల చక్రం పూర్తిగా గతి తప్పింది. నదులు, రిజర్వాయర్లు, సరస్సులు, భూగర్భ జలాలు, హిమానీ నదాలన్నిటిలోనూ ఈ అసాధారణ స్థితిగతులు కనిపించాయి. ఆఫ్రికా, యూరప్, ఆసియా దేశాల్లో వరదలు పోటెత్తగా.. దక్షిణ అమెరికా, ఆఫ్రికా దక్షిణ ప్రాంతంలో తీవ్ర కరువు కరాళ నృత్యం చేసింది. హిమానీ నదాల్లో మంచు నిల్వలు 450 గిగా టన్నుల (ఒక గిగా టన్ను అంటే లక్ష కోట్ల కిలోలు) మేరకు అత్యధికంగా కరగటం వరుసగా ఇది మూడో సంవత్సరం. ఆకస్మిక వరదలతో పాటు దీర్ఘకాలిక నీటి అభద్రతకు ఇది దారితీస్తుంది. ఈ నీటితో 1.2 మిల్లీమీటర్ల మేరకు సముద్రాల నీటి మట్టాలు పెరిగాయి.

వరుసగా ఆరో ఏడాది

నీటి చక్రం అస్తవ్యస్తం కావటం ఇదే మొదటిసారి కాదు. ఇలా జరగడం వరుసగా ఆరో ఏడాది. ప్రకృతి వైపరీత్యాల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు, ప్రభుత్వాలకు వేల కోట్ల డాలర్ల మేరకు నష్టం జరిగింది. పంట దిగుబడులు నష్టపోయారు. ధరలు పెరిగిపోయాయి. ఆహార కొరత పెరిగింది. ఉద్రిక్తతలు పెరిగాయి. పొట్ట కూటికోసం వలస పోవాల్సిన దుస్థితి మరింతగా పెరిగింది. గత ఏడాది 40 శాతం నదుల్లో మాత్రమే.. నీటి లభ్యత ఉండాల్సినంత సాధారణంగా ఉంది. మిగతా 60 శాతం నదుల్లో అతి కరువు లేదా అతి వరద పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఈ రెండు తీవ్ర పరిస్థితులు నెలకొన్న విచిత్ర స్థితి ఏర్పడింది.

మనదేశంలోనూ..

ఉత్తర భారతంలో అతివృష్టి కారణంగా భూగర్భ జలాల్లో 2023తో పోల్చితే వృద్ధి కనిపించింది. అయితే, వాయవ్య ప్రాంతాల్లో కొన్ని చోట్ల మాత్రం కరువు నెలకొంది. భారత్, ఆగ్నేయాసియా ప్రాంతాల్లో రిజర్వాయర్లలోకి చాలా ఎక్కువ నీరు చేరింది. గంగ, గోదావరి, కృష్ణా తదితర నదులు సాధారణం కన్నా ఎక్కువగా ఉప్పొంగాయి. జూలై 30న కేరళలో ఆకస్మిక వరదలు విరుచుకుపడ్డాయి. ఇందులో 385 మంది భారతీయులు చనిపోయారు.

40 లక్షల మంది నిరాశ్రయులు

అమెజాన్ నదీ పరివాహక ప్రాంతంలో తీవ్ర కరువు వచ్చింది. దక్షిణ అమెరికాలో, ముఖ్యంగా అమెజాన్ బేసిన్లలో మట్టిలో తేమ బాగా తగ్గింది. సెంట్రల్ యూరప్‌లో అందుకు భిన్నంగా నేలలు అతి తేమగా మారాయి.

- సెంట్రల్ యూరప్, రష్యా, పాకిస్తాన్‌లలో పెను వరదలు ముంచెత్తాయి.
- ఆఫ్రికా ట్రాపికల్ జోన్‌లో వరదలకు 2,500 మంది చనిపోగా, 40 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.
- దుబాయ్‌లో 75 ఏళ్లలో ఎన్నడూ ఎరుగనంత వర్షపాతం నమోదైంది.

అస్తవ్యస్తం జలచక్రం

నీరే జీవకోటికి ప్రాణాధారం. ఆర్థిక వ్యవస్థలకు నీరే ఇంధనం. పర్యావరణానికీ నీరే ప్రాణం. అయితే, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఈ జలచక్రం అస్తవ్యస్తమైంది. జలవనరులు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఒత్తిడికి గురై విపత్తులకు కారణమవుతున్నాయి. ప్రాణాధారమైన ఆ నీరే ఉపద్రవాలకు కారణమై ప్రజల ప్రాణాలను, ఆస్తులను, జీవనోపాధులను కబళిస్తోంది. ఇది మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, ఇంధనం, ఆరోగ్యం, ఆర్థిక రంగాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. జలచక్రం ఎంత అస్తవ్యస్తంగా మారిపోయిందో 2024 నివేదిక మనకు తెలియజెప్తోంది. దీనిపై మరింత శ్రద్ధగా గణాంకాలు సేకరించాలి. జరుగుతున్నదేమిటో సరిగ్గా అంచనా వెయ్యలేకపోతే దాన్ని మార్చలేం కదా!

– సెలెస్టె సాలో, ప్రధాన కార్యదర్శి, ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ)

క్లుప్తంగా...

ఆడబిడ్డలను గౌరవించుకునే పండుగ బతుకమ్మ

మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ పండుగంటే కేవలం పూల పండుగ మాత్రమే కాదని, ఆడబిడ్డలను గౌరవించుకునే పండుగ అని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, ప్రత్యేక సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీక అన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను బతుకమ్మ పండుగ ద్వారా మరోసారి విశ్వవ్యాప్తంగా చాటాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 30 వరకు జరిగే వేడుకల్లో మహిళలంతా పెద్దఎత్తున పాల్గొని బతుకమ్మ స్ఫూర్తిని చాటాలన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పాటల ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై రూపొందించిన మూడు బతుకమ్మ పాటలను గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మహిళా నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, హేమలతా శేఖర్‌గౌడ్, వసంత, టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్ర, కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీ సాయిచంద్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, పలువురు జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. బతుకమ్మ పండుగకు స్వరాష్ట్రంలో తొలి సీఎంగా కేసీఆర్ ఇచ్చిన ప్రాధాన్యం, మహిళలే కేంద్ర బిందువుగా ఆయన తెచ్చిన పథకాలను వక్తలు గుర్తు చేశారు. పాటల విడుదల తర్వాత బీఆర్ఎస్ మహిళా నేతలు బతుకమ్మ ఆడారు.

సద్దుల బతుకమ్మ రోజు సెలవివ్వాలి

టీజీఈజేఏసీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఈనెల 30న జరగనున్న సద్దుల బతుకమ్మ పండుగ రోజు సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) కోరింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును.. టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు కలిసి వినతి పత్రం సమర్పించారు. సీఎస్‌ను కలిసిన వారిలో టీజీఈజేఏసీ కో చైర్మన్ కటకం రమేశ్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎ.సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి బి.శ్యామ్, నేతలు ముజీబ్, డాక్టర్ రామారావు, లక్ష్మణ్ గౌడ్, శ్రీకాంత్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

21న చింతమడకకు కవిత



సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ పండగ వేడుకలో పాల్గొనేందుకు ఈనెల 21న చింతమడకకు వెళ్లనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఇటీవల చింతమడక గ్రామ మహిళల ఆహ్వానం మేరకు.. సొంత ఊరిలో జరిగే ఎంగిలి పూల బతుకమ్మ కార్యక్రమంలో పాల్గొంటానని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 21న ఎంగిలిపూల బతుకమ్మ – చింతమడక (సిద్దిపేట జిల్లా), 22న హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయం, 23న శ్రీరాంపూర్ (మంచిర్యాల జిల్లా), 24న సిద్దిపేట జిల్లా వర్గల్ అమ్మవారి దర్శనం, 25న హరియాణాలో మాజీ ఉప ప్రధాని దేవిలాల్ 112వ జయంతి ఉత్సవాలు, 26న ఖతార్, 27న మాల్టా, 28న లండన్‌లో జరగనున్న బతుకమ్మ వేడుకలకు హాజరవుతానని కవిత వివరించారు.

ప్రజల గొంతు వినిపించకూడదా?

అందుకే వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా నిరాకరణ ● చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ మండిపాటు

- ప్రజల కష్టాలు వినడానికి ఈ ప్రభుత్వం ఇష్టపడటం లేదు
- విద్య, వైద్యం, వ్యవసాయం సహా అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం తిరోగమనం
- ప్రభుత్వం అనేది ఉందా? లేదా? అని ప్రజలకు సందేహం కలుగుతోంది
- మండలిలో మన పార్టీకి మంచి బలం ఉంది.. ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడాలి
- శాసనసభ, మండలి సమావేశాల సందర్భంగా సభ్యులకు దిశానిర్దేశం



సాక్షి, అమరావతి: అసెంబ్లీలో ప్రజల గొంతు వినిపించాలన్న తపన, ఆలోచన చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి ఏ కోశాన లేదని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మండిపడ్డారు. అందుకే మనకు మాట్లాడే అవకాశం ఇవ్వకూడదని ప్రతిపక్షంగా గుర్తించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నాడు మన ప్రభుత్వం ఉన్నప్పుడు టీడీపీ నుంచి వారంలోనే ఐదుగురు మనవైపు వచ్చి కూర్చున్నారు. అలా ఇంకొందరిని లాక్కుని, చంద్రబాబుకు ప్రతిపక్ష నాయకుడి హోదా లేకుండా చేద్దామని చాలా మంది సలహా ఇస్తే నేను వద్దన్నాను. విపక్షం గొంతు వినాల్సిన అవసరం ఉందని చెప్పాను. ఆ మేరకు వారికి అవకాశాలు ఇచ్చాం. సభలో వారు చెప్పింది విన్నాం. కానీ, ఈ రోజు ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ.. ప్రతిపక్షం ఉండకూడదని కోరుకుంటోంది' అని అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. శాసనసభ, మండలి సమావేశాల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో దారుణంగా విఫలమైందన్నారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా.. అన్న సందేహం ప్రజలకు కలుగుతోందని చెప్పారు. రాష్ట్రంలో తొలిసారి ప్రభుత్వంపై ఇంత తక్కువ వ్యవధిలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని ఎత్తిచూపారు. ఈ సమయంలో శాసనసభలో ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు మనకు తగిన సమయం కేటాయించడం ఇష్టం లేకనే వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదని స్పష్టం చేశారు. మొత్తం సభ్యులతో కలిపి కేవలం ఒక ఎమ్మెల్యేకు మాత్రమే ఇచ్చే అతి తక్కువ సమయంలో ప్రజా సమస్యలు ఎలా ప్రస్తావిస్తామని ప్రశ్నించారు. అన్ని రంగాల్లో దారుణంగా విఫలమైన ప్రభుత్వాన్ని నిలదీసేందుకు, ప్రశ్నించేందుకు అవసరమైన సమగ్ర సమాచారం సిద్ధంగా ఉన్నప్పటికీ, మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వడం లేదు కాబట్టే.. సభకు హాజరు కావడం లేదని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వారే డబుల్ యాక్షన్ చేయాలనుకుంటున్నారు

→ అసెంబ్లీలో అధికార పక్షం డబుల్ యాక్షన్ చేయాలనుకుంటోంది. 'నువ్వు కొట్టు.. నేను ఏడుస్తా' అన్న రీతిలో వారు వ్యవహరిస్తున్నారు. ప్రజల్ని ఏడిపించేది ఈ ప్రభుత్వమే. మళ్లీ వారు ఏడుస్తున్నారని, వారి తరఫున తామే ఏడుస్తామంటూ డబుల్ రోల్ ప్లే చేస్తామంటోంది ఈ ప్రభుత్వమే. ఇలా రెండు వైపులా యాక్షన్ చేస్తోంది. నిజం చెప్పాలంటే వారు ఏడ్చినట్లు నటించిన మాత్రాన ప్రజల్లో సానుభూతి రాదు. విపక్షంగా మనం ప్రజా సమస్యలు లేవనెత్తితేనే అందులో నిజాయితీ ఉంటుంది.

→ నాడు చంద్రబాబు కూడా అసెంబ్లీకి రాలేదు. ఆయన్ను ఎవరూ ఏమీ అనకున్నా.. బయటకు వెళ్లి ఏడ్చాడు. మన సభ్యులు ఎవరూ ఏమీ అనలేదు. అయినా అబద్ధాలు చెప్పి, సభకు రాలేదు. అదే మనం జాయింట్ సెషన్‌లో గవర్నర్ అడ్రస్ సమయంలో అటెండ్ అయ్యాం. ఏటా అలా వెళ్తున్నాం. గవర్నర్ ఎదుట మన సమస్య ప్రస్తావించి, మనకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పి వస్తున్నాం.

→ అసెంబ్లీలో ప్రజల గొంతు వినపడాలనే తపన ఈ ప్రభుత్వానికి లేదు. అందుకే మనకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని అనుకుంటోంది. ఇటీవల నేను ప్రెస్‌మీట్‌లో మూడు అంశాలపై గంటన్నర మాట్లాడాను. అలా మనకు అసెంబ్లీలో కూడా అవకాశం ఇస్తేనే, ప్రజా సమస్యలు ప్రస్తావించగలం. అలా కాకుండా మనల్ని ప్రతిపక్షంగా గుర్తించకుండా, ఒక ఎమ్మెల్యే మాదిరిగా కొన్ని నిమిషాల సమయం మాత్రమే ఇస్తే ఏం మాట్లాడగలం?

→ నిజానికి సభలో ఉన్నవి నాలుగే నాలుగు పార్టీలు. అందులో మూడు.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా అధికారంలో ఉన్నాయి. ఇక మిగిలిన ఒకే ఒక పార్టీ మనది విపక్షం. కానీ దాన్ని గుర్తించబోమని ఈ ప్రభుత్వం చెబుతోంది. ఎందుకంటే సభలో ప్రజల గొంతు వినడం ప్రభుత్వానికి ఇష్టం లేదు కాబట్టి. అందుకే సభకు వెళ్లకుండా ఇక్కడ ప్రెస్‌మీట్‌లో ప్రభుత్వాన్ని ఎండగట్టాలని నిర్ణయించాం.

→ మనకు కౌన్సిల్‌లో మంచి బలం ఉంది. రాజకీయంగా ఎదగడానికి పార్టీకి చెందిన ఎమ్మెల్సీలకు ఇది మంచి అవకాశం. చూస్తుండగానే ఏడాదిన్నర గడిచిపోయింది. మిగిలింది మరో రెండున్నర ఏళ్లు మాత్రమే. మరో అసెంబ్లీ సెషన్ తర్వాత.. చూస్తుండగానే మరో ఏడాది గడుస్తుంది. కాబట్టి, మీరు కౌన్సిల్‌లో గట్టిగా నిలబడండి. గట్టిగా మాట్లాడండి. ప్రజా సమస్యలు లేవనెత్తండి.

రాజీనామా ఆమోదించాలని కవిత కోరారు

- మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని చెప్పాను
- మీడియా చిట్‌చాట్‌లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ: ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామాను ఆమోదించాలని కవిత ఇటీవల తనకు ఫోన్ చేసి కోరారని, అయితే ఈ విషయంలో మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని తాను చెప్పానని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం నల్లగొండలో ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ డబ్బులు ప్రైవేటు శక్తులను బతికించడానికే ఉపయోగపడుతున్నాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. వాటికోసం ఖర్చు చేసే డబ్బులను ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి వెచ్చిస్తే ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రులు అంతగా అభివృద్ధి చెందని నేపథ్యంలో ఆరోగ్యశ్రీని ప్రారంభించారని, అయితే ప్రస్తుతం అన్ని జిల్లాల్లో మెడికల్ కళాశాలలు ఉన్నాయని, వాటి పరిధిలో ఆసుపత్రులు అభివృద్ధి చెందాయి కాబట్టి ఈ రెంటికి ప్రభుత్వం ఖర్చు చేసే డబ్బులను ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి ఖర్చు చేస్తే బాగుంటుందని గుత్తా అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తే ప్రైవేటు సంస్థల బెదిరింపులు తగ్గుతాయని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తయ్యేలోపు.. డిండి నుంచి వృధాగా సముద్రంలో కలిసే నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూరియా విషయంలో రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్లస్టర్ వారీగా ఆ మండల వ్యవసాయాధికారి ద్వారా యూరియా టోకెన్లు ఇస్తే ఇబ్బందులు కొంత వరకు తగ్గే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నాపై దుష్ప్రచారం: రాజగోపాల్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్/చిట్యాల: మంత్రి పదవి రానందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వంపై అనని మాటలను తానన్నట్లు చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరగలేదని తానన్నట్లు శీర్షికతో వచ్చిన వార్తను కూడా ఆయన ఖండించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేయడంతో పాటు గుంటూరులో జరిగే ఓ శుభకార్యానికి వెళ్తూ మార్గమధ్యలో నల్లగొండ జిల్లా పెద్దకాపర్తిలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనకు.. సోనియా, రాహుల్‌గాంధీ అంటే అభిమానమని తెలిపారు. తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు, కొత్త పార్టీ పెడుతున్నట్లు వస్తున్న ప్రచారాలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను కొందరు వ్యక్తులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారన్న అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి గుంటూరు వెళ్తుంటే, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి వెళ్తున్నట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. తన రాజకీయం, భవిష్యత్తు గురించి మీడియా సమావేశం పెట్టి చెబుతాను తప్ప.. అప్పటి వరకు ఈ దుష్ప్రచారాలను నమ్మవద్దని తెలంగాణ సమాజాన్ని కోరుతున్నట్లు రాజగోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

బిహార్ ఎన్నికల తర్వాతే స్థానిక సమరం!

- అక్టోబర్ చివర్లో లేదా నవంబర్ మొదట్లో బిహార్ ఎన్నికలు
- అక్కడ ప్రచారం చేసే యోచనలో సీఎం రేవంత్
- బీసీలకు 42 శాతం కోటాపై కేంద్రం వైఖరిని ఎండగట్టే యోచన

సాక్షి, హైదరాబాద్: బిహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నవంబర్ 22లోగా బిహార్‌లో ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నందున నవంబర్ ఆఖరులోగా స్థానిక ఎన్నికలు జరగొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఈ ఎన్నికల్లో ప్రచారంలో చురుగ్గా పాల్గొంటారని తెలిసింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్రం అడ్డుకట్ట వేస్తోందనే అంశంపై జోరుగా ప్రచారం చేయాలనే యోచనతో ఉన్నట్టు సమాచారం. అలాగే, తమ సర్కార్ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందనే సందేశాన్ని దేశవ్యాప్తంగా తీసుకెళ్లేందుకు ఇదొక మంచి అవకాశంగా కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. బీసీ కోటా అంశాన్ని బిహార్ ఎన్నికల సందర్భంగా జాతీయస్థాయిలో చర్చనీయాంశం చేయడం ద్వారా రాజకీయంగా, సామాజికంగా మంచి మైలేజీని పొందొచ్చనే అభిప్రాయంతో ఉన్నట్టుగా తెలుస్తోంది. అందువల్లే స్థానిక ఎన్నికల వాయిదాకే మొగ్గుచూపడంతో పాటు బిహార్ ఎన్నికల తర్వాతే వీటిని నిర్వహిస్తే ఇక్కడా రాజకీయంగా మంచి ఫలితాలు సాధించవచ్చుననే ధీమా కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. సెప్టెంబర్ 30లోగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు గడువు విధించిన సంగతి విదితమే. అయితే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై పీటముడి పడిన నేపథ్యంలో గడువులోగా స్థానిక ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో రెండు నెలల్లో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటామంటూ మరింత సమయం కోసం ఈ నెలాఖరులోగా హైకోర్టులో అప్పీలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

మేడారం జాతర మాస్టర్‌ప్లాన్ రెడీ

- సీఎం రేవంత్ ఆమోదం తర్వాత పనులు షురూ
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ఖమ్మంరూరల్: మేడారం జాతర పనులకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్ సిద్ధమైంది. ప్రస్తుతం దీనిని ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు. ఆయన ఆమోదం తర్వాత పనులను వేగంగా ప్రారంభించి, వందరోజుల్లో పూర్తిచేసేలా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఆదివాసీ, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా సమ్మక్క–సారలమ్మ గద్దెల ఆధునీకరణ, భక్తులకు సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించింది. దీనిపై గురువారం సచివాలయంలో వరంగల్ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మాస్టర్‌ప్లాన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తర్వాత పనులు ప్రారంభిస్తామన్నారు. గద్దెల అభివృద్ధి డిజైన్, సమ్మక్క, సారలమ్మ ప్రధాన ద్వారం డిజైన్, ప్రహరీగోడ నిర్మాణానికి అవసరమైన రాతి డిజైన్.. తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. భక్తుల సౌకర్యార్థం గద్దెల ప్రాంగణాన్ని విస్తరిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు.

ముందు నీ ఇల్లు, పార్టీని చక్కబెట్టుకో: పొంగులేటి

'మూడున్నరేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల నాటికి నువ్వు అమెరికాలో ఉంటావో, ఇండియాలో ఉంటావో ఎవరికీ తెలీదు. అప్పటి దాకా ఎందుకు.. కొద్దిరోజుల్లో వచ్చే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి నీ సత్తా ఏంటో నిరూపించుకో. ముందు నీ ఇల్లు, పార్టీని చక్కబెట్టుకో' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ జెండాను గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 'దమ్ముంటే జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకో.. ట్విట్టర్ టిల్లూ.. అసలు నీకు విజన్ ఉందా? మీ నాన్నకు ఉందా తెలుసుకో' అని ఎద్దేవా చేశారు.



ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్‌లో చేరిన వారితో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

జీఎస్టీ పోర్టల్ పనితీరుపై హైకోర్టుకు వివరణ

ప్రత్యక్షంగా హాజరై తెలియజేసిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: జీఎస్టీ పోర్టల్ పనితీరు.. నోటీసుల జారీ తదితర అంశాలపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అధికారులు హైకోర్టుకు స్వయంగా వివరించారు. ఈ మేరకు ఫస్ట్ కోర్టు హాల్‌లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ శామ్‌కోషి, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌కు పోర్టల్ పనితీరును ప్రాక్టికల్‌గా చూపించారు. జీఎస్టీ చెల్లింపులకు సంబంధించి జారీ చేస్తున్న నోటీసుల్లో సంతకాలు లేకపోవడంతో వాటి చట్టబద్ధతను సవాల్ చేస్తూ వందలాది పిటిషన్లు దాఖలయ్యాయి. కంప్యూటరైజ్డ్ నోటీసులను డౌన్‌లోడ్ చేసుకున్నప్పుడు సంతకం ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో సీజే ధర్మాసనం ముందు వందల పిటిషన్లు విచారణకు వచ్చాయి. సంతకాలు, ఇతర సందేహాల నేపథ్యంలో ప్రాక్టికల్‌గా వివరణ ఇవ్వాలని జీఎస్టీ అధికారులను సీజే ఆదేశించారు. ఇందులో భాగంగా రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కె.హరిత, కేంద్ర జీఎస్టీ కమిషనర్ శ్రీనివాస్ గురువారం కోర్టుకు హాజరయ్యారు. పోర్టల్ పనితీరు, డిజిటల్ కీతో సంతకం చేసిన నోటీసుల జారీపై గంటన్నరపాటు ప్రాక్టికల్‌గా వివరణ ఇచ్చారు. డౌన్‌లోడ్ సమయంలో డిజిటల్ సంతకాలు లేకపోయినా ఉన్నట్లుగా పరిగణించాలని చెప్పారు. అనంతరం 4 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని జీఎస్టీ అధికారులను సీజే ఆదేశించారు. రిజాయిండర్ వేసేందుకు పిటిషనర్లకు మరో రెండు వారాలు సమయమిస్తూ.. తదుపరి విచారణ అక్టోబర్ 30కి వాయిదా వేశారు. పోర్టల్ పనితీరుపై నేరుగా న్యాయస్థానంలో వివరణ ఇవ్వడం చరిత్రాత్మకమని, ఇలాంటి ప్రక్రియ చేపట్టడం ఇదే తొలిసారని ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇన్ని కేసులున్నప్పుడు ఇరుపక్షాలు నేరుగా తెలుసుకోవడం ప్రయోజనకరమని సీజే అభిప్రాయపడ్డారు. దీంతో చాలా పిటిషన్లలో సమస్యకు పరిష్కారం దొరుకుతుందని వ్యాఖ్యానించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ నేడు

సాక్షి, హైదరాబాద్: దాడులకు నిరసనగా న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించాలని ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ రాష్ట్ర అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.రాజవర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో 498 కేసుకు సంబంధించి మహిళ తరఫు బంధువులు.. న్యాయవాదులు హనుమాన్‌నాయక్, అనిల్‌కుమార్‌లపై దాడి చేయడం హేయమని వ్యాఖ్యానించారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకు సీఎం రేవంత్‌రెడ్డి పోలీస్‌శాఖకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాణహిత–చేవెళ్ల.. రూ.35 వేల కోట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

2 లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా సాగునీరు అందనుంది. ప్యాకేజీలు–23, 24, 25, 26 పూర్తైతే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, చేవెళ్ల నియోజకవర్గాల్లోని మొత్తం 2.47లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. రంగారెడ్డి జిల్లాలోని హుస్సేన్, మూసీ నదులకు, చేవెళ్ల చెరువుకు తుమ్మిడిహెట్టి నుంచి నీళ్లు సరఫరా కానున్నాయి.

త్వరలో మహారాష్ట్రకు రాష్ట్ర బృందం

మహారాష్ట్రతో సంప్రదింపులు జరిపి 150 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి అంగీకారం తీసుకోవాలని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. తుమ్మిడిహెట్టి వద్ద నుంచి 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా మొత్తం 80 టీఎంసీల నీళ్ల తరలింపును పీఎఫ్ఆర్‌లో ప్రతిపాదిస్తున్నారు. గోదావరి జలాల్లో రాష్ట్రానికి ఉన్న 968 టీఎంసీల కేటాయింపులకు లోబడే ఈ ప్రతిపాదనలు చేస్తున్నారు. త్వరలో నీటిపారుదల శాఖ అధికారుల బృందం తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మిస్తే మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మహారాష్ట్ర ప్రభుత్వంతో నేరుగా సంప్రదింపులు జరపనుంది. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల లభ్యత ఉందని గతంలో సీడబ్ల్యూసీ తేల్చింది.

రీ ఇంజనీరింగ్‌లో ఈ ప్యాకేజీలు తొలగింపు

ఉమ్మడి ఏపీలో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రూపొందించిన ఈ ప్రాజెక్టు డీపీఆర్ ప్రకారం.. గోదావరిపై ఆదిలాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించి 165 టీఎంసీల నీళ్లను తరలించడం ద్వారా మొత్తం 16.4 లక్షల ఎకరాల ఆయకట్టును అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే తెలంగాణ ఆవిర్భావం తర్వాత గత బీఆర్ఎస్ సర్కారు ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్‌ను చేపట్టింది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు మార్పులు చేర్పులతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. తొలి ప్రాజెక్టులో ప్యాకేజీలు–1, 2, 3,4, 5, 23, 24, 25, 26 కింద ప్రతిపాదించిన పనులను తొలగించి మిగతా పనులను కాళేశ్వరం ప్రాజెక్టు కింద చేపట్టింది. ఈ క్రమంలోనే తుమ్మిడిహెట్టికి బదులు మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రతిపాదించిన 2 లక్షల ఎకరాల ఆయకట్టుతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రతిపాదించిన 2.47 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సరఫరా కలగానే మిగిలిపోయింది. ప్యాకేజీ–3 కింద తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్, ప్యాకేజీ–1, 2, 4 కింద తుమ్మిడిహెట్టి నుంచి మైలారం వరకు 71.5 కి.మీ.ల ప్రధాన కాల్వ, ప్యాకేజీ–5 కింద మైలారం వద్ద పంప్‌హౌస్‌తో పాటు అక్కడి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు నీళ్లను తీసుకెళ్లే కాల్వను నిర్మించాల్సి ఉంది. ఈ ఐదు ప్యాకేజీల పనులకు తొలుత రూ.3,084.13 కోట్లతో అంచనాలు రూపొందించగా, తర్వాత రూ.4,204 కోట్లకు సవరించారు. కాగా రీ ఇంజనీరింగ్‌కు ముందే ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం రూ.11,150 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. తుమ్మిడిహెట్టి నుంచి మైలారం వరకు 71.5 కి.మీ.ల కాల్వ నిర్మాణానికి సంబంధించిన పనులు పూర్తయ్యాయి.





నవరాత్రులలో దాండియా ఆటలు గర్బా నృత్యాలు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని ఇచ్చేలా ఉంటాయి. ఈ ఆటపాటలలో పాల్గొనే వారు మరింత సౌకర్యంగా ఉండేలా చూపరులకు కనువిందు చేసేలా... ప్రత్యేక డ్రెస్సులూ ఉంటాయి. ముదురు రంగులు, అద్దాల మెరుపులు, ఎంబ్రాయిడరీ చేసిన లెహంగాలు, ధోతీ ప్యాంట్స్‌కి ఆధునికపు హంగుల అమరిక ఈ రోజుల్లో ముచ్చట గొలుపుతుంటాయి.



“ఏదైనా పుస్తకం నాన్‌స్టాప్‌గా చదువుతూ పోతుంటే కొద్దిసేపటికి చదువుతున్న విషయం మెదడుకు చేరదు. అలాంటి సమయంలో ఒక అయిదు నిమిషాలు బ్రేక్ ఇచ్చి మళ్లీ చదవాలి. ఇదే మైక్రో-బ్రేక్. పది నిమిషాల కంటే తక్కువ తీసుకునే మైక్రో-బ్రేక్‌లు అలసటను తగ్గించి, శక్తిని పునరుద్ధరిస్తాయి.”

ఫ్యాషన్

దాండియా ధడక్





నవరాత్రి గర్బా, దాండియా రాత్రుల కోసం ట్రెండీ దుస్తుల ఆలోచనలు నవతరాన్ని మిక్స్ అండ్ మ్యాచ్ వైపుగా నడిపిస్తున్నాయి. ఎంబ్రాయిడరీ, మిర్రర్ వర్క్‌తో అలంకరించిన రంగురంగుల చనియా చోళి దుస్తులను స్టైల్ చేయడానికి రకరకాల మార్గాలు ఉన్నాయి.

ధోతీ ప్యాంటుతో క్రాప్ టాప్

మిర్రర్, ఎంబ్రాయిడరీ చేసిన క్రాప్ టాప్, ధోతీ ప్యాంటు కలయిక కంఫర్ట్ స్టైల్‌తో ఆకట్టుకుంటుంది. దాండియా ఆడటానికి అనుకూలంగా ఉండే ఈ డ్రెస్ కాన్ఫిడెన్స్‌నూ ఇస్తుంది. ఫ్యాషన్ లుక్ కోసం ధోతీ ప్యాంటును కొత్త క్రాప్ టాప్‌తో తిరిగి వాడచ్చు.

ప్యాంటుతో సైడ్ స్లిట్ కుర్తీ

సంప్రదాయ దుస్తులకు ఆధునిక టచ్‌ను ఇష్టపడే వారికి సైడ్ స్లిట్ కుర్తీ సరైన ఎంపిక. ఇది ప్లెయిన్, ఎంబ్రాయిడరీ లేదా బ్రొకేడ్ బోర్డర్‌లతో డిజైన్ చేసిన ప్యాంటుతో, లెహంగా కాంబినేషన్‌గా ధరించవచ్చు.

లెహంగాతో మిర్రర్ డెనిమ్ షర్ట్

ఇండో-వెస్ట్రన్ లుక్ కోసం లెహంగాతో డెనిమ్ షర్ట్‌ను జత చేయచ్చు. ఈ ఇండో-వెస్ట్రన్ లుక్ వివిధ రకాల ప్రయోగాలు చేయడానికి ఇష్టపడే వారికి సరైనది. క్లాసిక్ లెహంగా, క్యాజువల్ డెనిమ్ షర్ట్ మరింత కంఫర్ట్‌గా ఉంటుంది, ఇది నవరాత్రుల్లో ప్రత్యేకంగా చూపుతుంది.


లెహంగా అసెమెట్రికల్ కుర్తీ

అసెమెట్రికల్ కుర్తీలు వేడుకలకు సరైన ఎంపికగా నిలుస్తున్నాయి. ఫ్లేర్డ్ లెహంగాతో జత చేస్తే చూపుతిప్పుకోలేరు. ఒక డైనమిక్ ఎలిమెంట్‌ను జోడిస్తుంది. పండుగ సీజన్‌లో స్పెషల్ లుక్ కోరుకునేవారికిది బెస్ట్ ఆప్షన్.

– ఎన్.ఆర్.



సొంతంగా క్రియేషన్



● పెద్ద పెద్ద జూకాలు, గాజులు, లేయర్డ్ నెక్లెస్‌లు.. జర్మన్ సిల్వర్ జ్యువెలరీని ఎంచుకోవచ్చు ● నృత్యం చేసే సమయం కాబట్టి వాటర్ ప్రూఫ్ మేకప్‌ను ఎంచుకుంటే లుక్ ఫ్రెష్‌గా ఉంటుంది. ● పెద్ద పెద్ద బిందీలు నవరాత్రి రోజులలో ప్రత్యేకంగా కనిపిస్తాయి ● పొడవాటి జడలు, వివిధ మోడల్స్‌లో ఉన్న ముడులు, వదులుగా ఉండే హెయిర్ స్టైల్స్ బాగుంటాయి. ● బోహో- ఫ్యూజన్ కాంబినేషన్‌లో డెనిమ్ డ్రెస్‌లు పగటి పూట కూడా ఈ రోజుల్లో క్యాజువల్‌గా ధరించవచ్చు. ● సంవత్సరాలుగా లెహంగాలు, ఘాగ్రాలు నవరాత్రి దుస్తులుగా ఉన్నాయి కాబట్టి స్కర్టులు, కుర్తీల నుండి లేయర్డ్ ఇండో-వెస్ట్రన్ గౌన్ల వరకు ఈ రోజుల్లో ప్రయత్నించవచ్చు. ● రంగురంగుల టాసెల్స్, రాజస్థానీ ఎంబ్రాయిడరీ ప్యాచ్‌లు, మిర్రర్ వర్క్ ఉపయోగించి పండగ థీమ్‌ను క్రియేట్ చేయవచ్చు. ● నవరాత్రి స్పెషల్ డ్రెస్సులు దాదాపు రూ.1500/- నుంచి మార్కెట్లో లభిస్తున్నాయి. లేదంటే ఇంట్లోనే డిజైనరీ క్రాప్ టాప్, బ్లౌజ్ లేదా చిన్న కుర్తీతో జత చేయబడిన డెనిమ్ బాటమ్స్ ధరిస్తే డ్యాన్స్ చేసేవారికి తాజా, ఉల్లాసభరితమైన వైబ్‌ను జోడిస్తాయి. ● పండుగ అలంకరణ కోసం దుప్పట్టా లేదా బాందిని స్టోల్ లేదా టై-డై ప్రింట్‌లతో స్టైల్ చేయచ్చు. ● నవరాత్రి ఫ్యాషన్ అనేది వ్యక్తిగత వ్యక్తీకరణతో సంప్రదాయాన్ని కళ్లకు కట్టవచ్చు. వాటిని మార్కెట్లో కొనుగోలు చేసినా, సొంతంగా తమదైన స్టైల్‌ను క్రియేట్ చేసినా, బోహో-ఫ్యూజన్ డ్రెస్సులు డ్యాన్స్ ఫ్లోర్‌పై హంగామా చేస్తాయి.

ఈ పండుగ సీజన్‌లో సాధారణంగా కాకుండా తమదైన సొంత సృజనాత్మకతను సరికొత్తగా పరిచయం చేయచ్చు.

● మంచి మనసు



యోగేష్

దేశం పరువు నిలబెట్టుకున్నారు

మన దేశంలో కాఫీ హోటల్ బయట పెట్టిన బైక్‌లు మాయమవడం మామూలే. కాని యు.కె.లో కూడా ఇలా జరిగితే వెర్రి ముఖం వేయక తప్పదు. అది కూడా ఆ బైకే ఆధారంగా ప్రపంచ యాత్ర చేస్తున్నవాడికి. అదే జరిగింది. ముంబైకి చెందిన 33 ఏళ్ల యోగేష్ అలెకరి తన కెటిఎం బైక్ మీద దేశాలు తిరుగుతూ వీడియోలు చేస్తుంటాడు. ఇతడు మొన్నటి మే నెలలో తన తాజా యాత్ర మొదలెట్టి 17 దేశాల మీదుగా సెప్టెంబర్ మొదటి వారానికి యు.కె. చేరుకున్నాడు. అక్కడి నుంచి ఆఫ్రికా చేరుకుంటే యాత్ర ముగుస్తుంది. అయితే యు.కె.లోని నాటింగ్‌హామ్‌లో ఒక కేఫ్‌లో కాఫీ తాగి బయటకి వచ్చేసరికి బైక్ కొట్టేశారు. దాంతో యాత్ర ఆగిపోవడమే కాదు అన్ని వస్తువులూ పోయాయి. దేశం కాని దేశంలో బైక్ కొనడం కూడా ఖరీదైన వ్యవహారమే. హతాశుడైన యోగేష్ తన ఇన్‌స్టాలో జరిగింది మొరపెట్టుకోవడంతో అతణ్ణి ఫాలో అవుతున్నవారంతా సాయానికి ముందుకొచ్చారు. తాము బైక్ కొనిస్తామన్నారు. అయితే నాటింగ్‌హామ్‌లోని ఒక సెకండ్‌హ్యాండ్ బైక్ స్టోర్ ఓనరు స్పందించాడు. ‘మా దేశం మర్యాద మేం పోగొట్టుకోము. అతనికి అలాంటి బైకే మరింత మంచి కండిషన్‌లో ఉన్నది ఇస్తాము’ అని ప్రకటించి మరీ మంచి బైక్ ఇచ్చాడు. దాంతో యోగేష్ ముఖాన నవ్వు వచ్చింది. అతని యాత్ర మళ్లీ మొదలైంది. దేశం పరువును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మన దేశంలో విదేశీ టూరిస్ట్‌లు కనిపిస్తే వారికి ఎటువంటి ఇబ్బంది కలిగించకపోవడం పౌరుల ధర్మం.

డిజిటల్ వరల్డ్

97 శాతం మంది రోజూ ‘రీల్స్’ చూస్తున్నారు!



డిజిటల్ మీడియాకు సంబంధించి భారతీయుల్లో 97 శాతం మంది రోజూ షార్ట్-ఫామ్ వీడియోలను చూస్తున్నారని మెటా స్టడీ రిపోర్ట్ తెలియజేసింది. ‘రీల్స్‌ను సృజనాత్మకంగా రూపొందించడంలో భారతదేశం అగ్రగామిగా ఉంది. అత్యధిక ప్రేక్షకులు వీక్షించడం వల్ల ఇండియా షార్ట్-ఫామ్ వీడియో ప్లాట్‌ఫామ్ అగ్రస్థానంలో ఉంది.
సరికొత్త సాంకేతికతతో క్రియేటర్‌లకు మరింత సహకారాన్ని అందిస్తాం. ఇంటర్నెట్ ఇండియాకు రీల్స్ అనేవి కల్చరల్ ఇంజిన్‌లాంటివి’ అంటున్నాడు మెటా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ శ్రీనివాస్.

ఆన్‌లైన్ ట్రాండ్స్, డ్యాన్స్ ఛాలెంజెస్, మీమ్స్... మొదలైన వాటిలో వైవిధ్యమైన, ఆకర్షణీయమైన రీల్స్ వస్తున్నాయి. ‘రీల్స్ అనేవి వినోదం కోసం మాత్రమే కాదు. ట్రెండ్స్ సెట్ చేసేవి కూడా. బ్రాండ్‌ల అడ్వర్‌టైజింగ్‌లోనూ తిరుగులేని పాత్ర పోషిస్తున్నాయి’ అని చెబుతోంది మెటా స్టడీ.



అరుణ సరీన్

మార్పు

ఈ బామ్మ రోజూ జైలుకు వెళుతుంది!

ఎనభై మూడు సంవత్సరాల అరుణ సరీన్ రోజూ జైలుకు వెళుతుంది.
అలాగని ఆమె బంధువులు ఎవరూ జైలులో లేరు.
గత పాతిక సంవత్సరాలుగా అరుణ జైలుకు వెళ్లడానికి కారణం ఖైదీలకు యోగా నేర్పించడం, సాధనం చేయించడం!

‘చాలా మంది ఉదయం ఆలయానికి వెళ్లినట్లే నేనూ జైలుకు వెళుతుంటాను’ నవ్వుతూ అంటుంది మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌కు చెందిన అరుణ. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న అరుణ విపశ్యన ధ్యానప్రక్రియను సాధన చేసేది. ఆ సమయంలో ‘ఆర్ట్ ఆఫ్ లివింగ్’ కోర్సులకు సంబంధించి కరపత్రం ఒకటి చదివింది. ఆ కోర్సులు నేర్చుకోవడానికి రెడీ అయింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ క్యాంపస్‌లో ఎన్నో కోర్సులు నేర్చుకుంది. ఆ తరువాత ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్‌గా కొత్త ప్రయాణం ప్రారంభించింది.

‘తొలిసారిగా జైలుకు వెళ్లినప్పుడు భయంగా ఏమీ అనిపించలేదు. జైలులో ఎలా ఉంటుందో ఆసక్తికరంగా పరిశీలించాను. ఖైదీలతో వివరంగా మాట్లాడాను. వారితో కలిసి భోజనం చేశాను. ప్రతి నిమిషం హాయిగా గడిచినట్లు అనిపించింది. యోగా, ధ్యానం ప్రాముఖ్యత గురించి వారికి తెలియజేశాను’ అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది అరుణ.

ఆనాటి నుంచి ప్రతిరోజూ ఉదయం జైలులో నాలుగు గంటల పాటు యోగా సెషన్‌లు నిర్వహిస్తోంది. జబల్పూర్ మాత్రమే కాదు ఇండోర్, సాత్న, భోపాల్‌లతో పాటు మధ్యప్రదేశ్‌లోని పది కారాగారాలలో యోగా సెషన్‌లు నిర్వహిస్తోంది.

‘హ్యాపీనెస్ ప్రోగ్రామ్’ పేరుతో తాను నిర్వహించే కార్యక్రమాల వల్ల ఖైదీల ఆలోచనా ధోరణిలో మార్పు రావడాన్ని ఆమె గ్రహించింది. చాలా మంది ఖైదీలు ఎప్పుడు చూసినా నిరాశ, నిస్పృహలతో కనిపించేవారు. అలాంటి వారికి జీవనోత్సాహాన్ని కలిగించడంలో ‘హ్యాపీనెస్ ప్రోగ్రామ్’ ప్రభావం ఎంతో ఉంది.

‘కోర్స్ పూర్తి చేసుకున్న ఖైదీలలో ఎంతో మార్పు వచ్చింది. తగాదాలు తగ్గాయి. కొద్దిమంది ఖైదీలలో విపరీతమైన కోపం ఉండేది. ఆ కోపంలో బ్లేడ్‌తో కోసుకొని తమకు తాము హాని చేసుకునేవారు. అలాంటి వారిలో పూర్తిగా మార్పు వచ్చింది’ అంటుంది అరుణ. గతంలో కొందరు ఖైదీలు జైలు నుంచి పారిపోవడానికి ప్రయత్నం చేసేవారు. అలాంటి వారిలో కూడా ‘హ్యాపీనెస్ ప్రోగ్రామ్’ మార్పు తీసుకువచ్చింది. మాదకద్రవ్యాల కేసులో జైలుకు వెళ్లాడు రాజు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా మళ్లీ అదే అక్రమ వ్యాపారం చేయాలనుకునేవాడు. అయితే అరుణ నిర్వహించే హ్యాపీనెస్’ కార్యక్రమంతో అతడిలో మార్పు వచ్చింది.

జైలు నుంచి విడులైన రాజు మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా కూలి పనులు చేసుకొని బతుకుతున్నాడు.

స్థూలంగా ‘హ్యాపీనెస్ ప్రోగ్రాం’ ద్వారా ఖైదీలకు యోగా, ధ్యానం మాత్రమే పరిచయం కాలేదు. ఉత్సాహంతో కూడిన కొత్త జీవన విధానం పరిచయం అయింది. జైలు బయట రెడ్ క్రాస్ స్వచ్ఛంద సేవకులతో కలిసి ఎన్నో సేవాకార్యక్రమాలలో పాల్గొంటుంది అరుణ. మద్యం బారిన పడిన ఎంతో మందిని ఆ దురలవాట్ల నుంచి బయటకు తీసుకువచ్చింది.

‘జైలులో నిర్వహించే హ్యాపీనెస్ ప్రోగ్రాం వల్ల ఖైదీలలో క్రమశిక్షణ పెరిగింది’ అంటున్నాడు జబల్పూర్ సెంట్రల్ జైలు సూపరిండెంట్ అఖిలేష్ తోమర్.

పలక్ గారి పౌష్టిక రుచులు



అవసరం అన్నీ నేర్పించడమే కాదు.. ప్రయోగాల దిశగా ప్రేరేపిస్తుంది కూడా!
అలాంటి ఒకానొక అవసరమే ఢిల్లీ వాసి పలక్ అరోరాను అంట్రప్రెన్యూర్‌గా మార్చింది!
‘సద్గురు సూపర్ ఫుడ్స్’ను స్థాపించేలా, ‘మిల్లియమ్’ బ్రాండ్‌ను లాంచ్ చేసేలా చేసింది!
కాలంతో పరుగులు పెడుతున్న కుటుంబాలకు దాన్నో వరంలా అందించింది!

అయితే.. ఫుడ్ టెక్నాలజీలో ఎఫ్ఎస్ఎస్‌సీ (FSS-C) 22000 లీడ్ ఆడిటర్ సర్టిఫికెట్ పొందిన ఆమె ప్రయాణం హైటెక్ ల్యాబ్‌లోనో.. స్టార్టప్ ఇంక్యుబేటర్‌లోనో మొదలవ్వలేదు.
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ అంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐఎఫ్‌టీఈఎమ్) థర్డ్ ఇయర్‌లో ఉన్నప్పుడు.. కోవిడ్ లాక్ డౌన్ టైమ్‌లో మొదలైంది.

ఆ అవసరం ఏంటంటే..



పలక అరోరా

కోవిడ్ టైమ్‌లో ఇమ్యూనిటీని పెంచేదేగాక తేలికగానూ వండుకోగలిగే ఫుడ్ కోసం ఆన్‌లైన్‌లో వెదకడం మొదలుపెట్టింది. ఆ జాబితాలో రా మిల్లెట్స్ ... లేదంటే ముతక పిండే కనబడసాగింది. తప్ప రెడీ టు కుక్ లేదా రెడీ టు ఈట్ ప్రాడక్ట్స్ ఏమీ కనిపించలేదు. మిల్లెట్స్ పౌష్టికాహారమని అందరికీ తెలుసు.. కానీ వాటిని రాత్రంతా నానబెట్టడం, తెల్లవారి ఉడకబెట్టడం లాంటి సుదీర్ఘ ప్రక్రియ లేకుండా అప్పటికప్పుడు అత్యంత తేలికగా వండటమెలాగో ఎవరికీ తెలియదు. పలక్ ఆలోచనల్లో ఉన్నప్పుడే ఆమె తండ్రికి కిడ్నీ ఫెయిల్యూర్ అని నిర్ధారణ అయింది. దీర్ఘకాలంగా మైక్రోన్యూట్రియెంట్స్ అందకపోవడం వల్లే వాళ్ల నాన్నకు కిడ్నీ జబ్బు వచ్చిందని డాక్టర్స్ తేల్చారు. దాంతో తన అన్వేషణను మరింత వేగవంతం చేసింది.

పోషక విలువల బంచ్

ఈజీ టు కుక్ ఫుడ్ మీద ప్రయోగాల కోసం పలక్.. తమ ఇంటి టెర్రస్‌నే కిచెన్‌గా మార్చుకుంది. ఆమె కనిపెట్టిన తొలి వంటకాల్లో స్ప్రౌటెడ్ మిల్లెట్ పోరిడ్జ్, మిక్స్‌డ్ వెజిటబుల్ ఇడ్లీలు, పంజాబీ స్టయిల్ చీలా (పాన్‌కేక్ లాంటిది) వంటివి ఉన్నాయి. ప్రతి వంటకాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో వంద సార్లు టేస్ట్, టెస్ట్ చేయించేది. ‘నా ఈ ప్రయత్నాన్ని ఎవరు నమ్మినా నమ్మకపోయినా మా నాన్న మాత్రం నమ్మారు. ప్రోత్సహించారు. ప్రతి చాలెంజ్‌లో నాకు అండగా నిలబడ్డారు. నా బిగ్గెస్ట్ స్ట్రెంత్ మా నాన్నే!’ అని చెబుతుంది పలక్ అరోరా. 2021లో ‘సద్గురు సూపర్‌ఫుడ్స్’ పేరుతో సంస్థను రిజిస్టర్ చేయించింది. 2022లో ‘మిల్లియమ్’ అనే బ్రాండ్‌ను లాంచ్ చేసింది. దానికి హెల్దీ అండ్ జల్దీ అనే ట్యాగ్‌లైన్‌నూ పెట్టింది. ప్రిజర్వేటివ్స్,అడిటివ్స్ లేని ఈ ఫ్యూజన్ ఫుడ్ పోషకవిలువల సముదాయం. . మిల్లియమ్ ఉత్పత్తులన్నీ ఎఫ్ఎస్ఎస్ఏఐ, ఏపిఈడీఏ, ఎమ్ఎస్ఎమ్మీ, స్టార్టప్ ఇండియా ధ్రువీకరించినవే. అలా టెర్రస్ కిచెన్ నుంచి ఫుల్‌ఫ్లెడ్జ్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా ఎదిగిన ఆ బ్రాండ్ నెలకు ఎనిమిది టన్నుల రెడీ టు కుక్ ఆహారపదార్థాలను, 21 టన్నుల రెడీ టు ఈట్ మిల్లెట్ ప్రాడక్ట్స్‌ను ఉత్పత్తి చేస్తోంది. రాగి సూప్, మిల్లెట్ నూడుల్స్, పాస్తా, మిల్లెట్ పోహా నుంచి పాన్‌కేక్స్ దాకా మొత్తం పదిహేను రకాల వెరైటీస్ ఉన్నాయి. అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి. ఆమె దగ్గర ప్రస్తుతం ఎనిమిది మంది ఉద్యోగులున్నారు. స్థానికంగా మరింతమంది మహిళలకు కొలువులిచ్చి తన సంస్థను విస్తరింపచేయాలనుకుంటోంది పలక్.

‘ఈ మిల్లెట్ రివైవల్ అనేది కేవలం ఒక బిజినెస్ ఆపర్చునిటీయే కాదు సస్టెయినబుల్ అగ్రికల్చర్, ఫుడ్ సెక్యూరిటీ కూడా. అందుకే పొలం నుంచి ఫోర్క్ దాకా ప్రతి దశలోనూ అవకాశాలను క్రియేట్ చేస్తూ పౌష్టికాహారాన్ని అందించడమే మా లక్ష్యం. అదే నిజమైన విజయంగా భావిస్తాను’ అంటుంది పలక్.

● బనాన ఏఐ శారీ ట్రెండ్

2025 టు 1990



గూగుల్ జెమిని నానో బనాన ట్రెండ్ హవా కొనసాగుతుండగానే మరోవైపు నానో బనాన ఏఐ శారీ ట్రెండ్ మొదలైంది. మహిళా యూజర్లు జెమిని నానో బనాన ఇమేజ్ ఎడిటింగ్ టూల్‌ను ఉపయోగించి తమ సెల్ఫీలను 90 దశకం డ్రామటిక్ బాలీవుడ్-స్టైల్ పోర్ట్రయిట్స్‌లోకి మార్చడమే... బనాన శారీ ట్రెండ్.

ఏఐ ప్రాంప్ట్‌లతో అలనాటి అద్భుత చీరలలో మెరిసిపోవడమే బనాన ఏఐ శారీ ట్రెండ్ ప్రత్యేకత.

ఈ ట్రెండ్ పుణ్యమా అని 90 దశకంలోని పాపులర్ స్టైల్స్.. పోల్కా-డాట్ డిజైన్, బ్లాక్ పార్టీవేర్ శారీ, సాఫ్ట్ ఫ్లోరల్ యాక్సెంట్‌లు మళ్లీ కనువిందు చేస్తున్నాయి.

మీరు కూడా ఈ ట్రెండ్‌లో భాగం కావాలనుకుంటున్నారా?
అయితే ఇలా చేయండి...
● జెమిని చాట్‌జీపీటీలో లాగిన్ కావాలి ● ట్రై ఇమేజ్ ఎడిటింగ్-క్లిక్ చేయాలి. ● క్లియర్ సోలో ఫోటోను అప్‌లోడ్ చేయాలి. ● బ్లాక్ శారీ, వైట్ పోల్కా డాట్....మొదలైన వైరల్ ప్రాంప్ట్స్‌లో ఒకదాన్ని పేస్ట్ చేయాలి. ● రెట్రో శారీ పోర్ట్రయిట్ క్షణాల్లో కళ్ల ముందుంటుంది.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 18న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,15,410	1,13,,340	1,11,170	1,13,,340	1,13,500	1,11,490
బంగారం (22 క్యారెట్లు)	1,07,950	1,01,900	1,01,900	1,04,960	1,04,420	1,02,200
వెండి	1,34,000	1,31,200	1,41,000	1,31,200	1,31,500	1,41,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



పరిణీతి ఇరవై ఏళ్ల అమ్మాయి. సొంతంగా ఒక జీపీటీ ఏజెన్సీ నడుపుతోంది. ఆర్థిక స్వావలంబన సాధించింది. కొత్త తరానికి రోల్‌మోడల్‌గా నిలిచిన పరిణీతి గురించి దేశమంతా తెలుసుకుంటోంది. తెలుసుకునే కొద్దీ ఇంకా ఆశ్చర్యకరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆమె పదమూడేళ్ల తర్వాత స్కూలుకే వెళ్లలేదనేది ఓ వాస్తవం. ఇంకా...

● కొత్త దారి

పరిణీత నిర్ణయం

బడి గంటలు వృథాయేనా!

'నా శక్తికి, సమర్థతకు స్కూల్లో అన్నేసి గంటలు గడపడం వృథా అనిపించింది' అని అణువిస్ఫోటనంలాంటి వ్యాఖ్యానం చేసింది పరిణీతి. 'పరీక్షలకు సిద్ధం కావడానికి ఏఐ సహాయం తీసుకోవడాన్ని స్కూల్లో మా టీచర్ అంగీకరించలేదు. భవిష్యత్తు మొత్తం ఏఐలో ఉంటుందని తెలిసి కూడా ఆమోదించకపోవడం ఏమిటి అనిపించేది' అని స్కూలు రోజులను గుర్తు చేసుకుంటూ చెప్పింది పరిణీతి.

అన్నట్లుగానే ఆమె పదమూడేళ్లకే స్కూలు మానేసి జీపీటీ ఆటోమేషన్ ఏజెన్సీ స్థాపించడానికి తనను తాను మలుచుకోవడం మొదలుపెట్టింది. అందుకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవడానికి మొదట్లో రోజుకు రెండు గంటల సమయం కేటాయించింది. ఆ తర్వాత అది నాలుగు గంటలైంది. ఆ తర్వాత ఆమె ఏఐ అవతార్‌లను సృష్టించింది.

ఒకటి తాను మరొకటి వాళ్ల నాన్న. ప్రయోగాల దశ నుంచి ఆమె ఐదుగురు క్లయింట్లకు జీపీటీ, ఏఐ సర్వీసులు అందించగలుగుతోంది. రెగ్యులర్ స్కూల్ చదువు కాదని ఏఐలో కెరీర్‌ను నిర్మించుకున్న పరిణీతికి తల్లిదండ్రుల ప్రోత్సాహం మెండుగా ఉన్నప్పటికీ ఆమె తల్లి మాత్రం 'రోజంతా కంప్యూటర్ ముందు కూర్చుని, టెక్ చాటింగ్‌లోనే గడుపుతుంటే మానవసంబంధాలు, వ్యక్తులతో మెలగడం అలవడుతుందా లేదా అని ఆందోళన పడేది.

టెక్ నైపుణ్యం సరే... లైఫ్ స్కిల్స్ ఎలా?

ఇదిలా ఉంటే పరిణీతి టెక్ జర్నీ గురించి తెలుసుకున్న నెటిజన్‌లలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. 'నేటి విద్యావ్యవస్థను సంస్కరించాల్సిన అవసరం ఉందని, చదువంటే మార్కుల వెంట పరుగులు పెట్టడం కాదని చెప్పడానికి పరిణీతి పెద్ద ఉదాహరణ' అని కొందరంటున్నారు. 'పద్నాలుగేళ్ల వయసులో ఆమె తీసుకున్న నిర్ణయం చాలా గొప్పది' అని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే... 'పుస్తక పరిజ్ఞానమే అసలైన పరిజ్ఞానం అని చెప్పలేం, ఆచరణాత్మక నైపుణ్యం చాలా ముఖ్యమే. కానీ నియత విద్యావిధానంలో విద్యార్థులు సమష్టిగా పనిచేయడం, క్రమశిక్షణ, స్థితప్రజ్ఞత వంటి అనేక విషయాలు నేర్చుకుంటారు. పరిణీతి తనకు తాను నేర్చుకున్న నైపుణ్యాలతో మంచి సంపాదన మార్గం వేసుకున్న మాట నిజమే, కానీ స్కూలు మానేయడం వల్ల జీవన నైపుణ్యాలను నేర్చుకునే దారిని తనకు తానుగా మూసేసుకుంది' అని మరి కొందరు ఆమె మార్గాన్ని విమర్శిస్తున్నారు.

సమీక్ష అవసరమే!

పరిణీతి నిర్ణయం అనుసరణీయమేనా కాదా అనేది ప్రధాన చర్చ కాదు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేవిధంగా, చదువు వారి భవిష్యత్తు ఉపయుక్తంగా ఉండేటట్లు విద్యావ్యవస్థలో తగు మార్పుల అవసరాన్ని ప్రధానంగా చర్చించాలి. అందుకు పరిణీతి కేస్ స్టడీ ప్రత్యక్ష నిదర్శనం.

● టెక్.. టాక్

ఇన్‌స్టాగ్రామ్ పిక్చర్-ఇన్-పిక్చర్



చిన్న ఫ్లోటింగ్ విండోలో రీల్స్‌ను చూసుకోవడానికి వీలు కల్పించే ఫీచర్‌ని పరీక్షిస్తోంది ఇన్‌స్టాగ్రామ్. యూట్యూబ్ లాగే 'పిక్చర్-ఇన్-పిక్చర్ మోడ్' యాప్ క్లోజ్ అయినప్పుడు ఎనేబుల్ అవుతుంది. చిన్న ఫార్మట్‌లో వీడియోలు చూస్తూనే వేరు వేరు పనులు చేసుకోవచ్చు. ఈ మోడ్ వద్దనుకుంటే త్రీ-డాట్ మెనూ టాప్ చేయాలి. ప్రస్తుతం ఈ ఫీచర్ పరిమిత సంఖ్యలో యూజర్‌లకు అందుబాటులో ఉంది.

కొన్ని నెలల క్రితం 'పిక్చర్ ఇన్ పిక్చర్' మోడ్ గురించి ప్రకటించింది ఇన్‌స్టాగ్రామ్. ఈ కొత్త ఫీచర్ అందరికీ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో తెలియదు.

మోటో ప్యాడ్ 60 నియో



సైజ్: 11.0 అంగుళాలు
వోఎస్: ఆండ్రాయిడ్ 15
రిజల్యూషన్: 1600×2560 పిక్సెల్స్
బ్యాటరీ: 7040 ఎంఏహెచ్
రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్
కలర్స్: ప్యాంటోన్, బ్రాంజ్ గ్రీన్
ఇంటర్నల్: 128జీబి 8జీబి ర్యామ్

ఏసర్ నైట్రో వి 15



సైజ్: 15.6 అంగుళాలు
రిఫ్రెష్ రేట్: 165 హెచ్‌జడ్
రిజల్యూషన్: 1920×1080 పిక్సెల్స్
బరువు: 2.1 కేజీ
ర్యామ్: 32జీబి
వోఎస్: విండోస్ 11

మొబైల్ హోల్డర్



బ్రాండ్: పోర్ట్రోనిక్స్ కలర్: బ్లాక్ క్లిప్: ఆఫీస్ డెస్క్, టేబుల్, లగేజ్... మొదలైనవి డివైజెస్: స్మార్ట్‌ఫోన్స్ విత్ స్క్రీన్ సైజెస్ మౌంటింగ్ టైప్: టాబ్‌లెట్ మౌంట్

మ్యూజిక్ ట్రాన్స్‌ఫర్



వివిధ మ్యూజిక్ స్ట్రీమింగ్ యాప్స్ నుంచి మ్యూజిక్‌ను యాపిల్ మ్యూజిక్‌కు ట్రాన్స్‌ఫర్ చేయడానికి...
- యాపిల్ మ్యూజిక్ సెట్టింగ్స్ మెనూలోకి వెళ్లాలి
- ఐఫోన్, ఐపాడ్, సెట్టింగ్స్-యాప్స్-మ్యూజిక్
- త్రీ డాట్స్ మెనూను ట్యాప్ చేసి సెట్టింగ్స్‌ను సెలెక్ట్ చేసుకోవాలి
- సెట్టింగ్స్‌లో 'ట్రాన్స్‌ఫర్ మ్యూజిక్ ఫ్రమ్ అదర్ మ్యూజిక్ సర్వీసెస్' ఆప్షన్‌ను సెట్టింగ్స్ నుంచి సెలెక్ట్ చేసుకోవాలి
- జాబితాలో నుంచి మీకు నచ్చిన మ్యూజిక్ స్ట్రీమింగ్ సర్వీస్‌ను ఎంపిక చేసుకోవాలి
- మ్యూజిక్ లైబ్రరీ, ప్లేలిస్ట్ యాక్సెస్‌కు సంబంధించి 'సాంగ్‌షిఫ్ట్' కోసం అనుమతి తీసుకోవాలి
- 'ప్లేలిస్ట్'ను పిక్ చేసుకొని 'యాడ్ టు లైబరీ' క్లిక్ చేయాలి
- కొన్ని నిమిషాల వ్యవధిలో ట్రాన్స్‌ఫర్ పూర్తవుతుంది.

● ఏఐ ఏరియా

నిమిషాల్లో బొమ్మల పుస్తకం రెడీ!



జెమిని కోసం గూగుల్ సరికొత్త ఏఐ టూల్స్‌ను తీసుకువచ్చింది. ఇందులో ఆసక్తికరమైన టూల్... న్యూ స్టోరీ బుక్. దీని ద్వారా సింపుల్ ప్రాంప్ట్స్‌తో పదిపేజీల బొమ్మల పుస్తకాన్ని సృష్టించవచ్చు. తల్లిదండ్రులు, విద్యావేత్తలు, కథకులకు ఈ ఫీచర్ ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఈ స్టోరీబుక్ ఫీచర్ డెస్క్‌టాప్, మొబైల్ వెర్షన్‌లకు అందుబాటులో ఉంటుంది. ఈ టూల్ 45కు పైగా భాషలకు సపోర్ట్ చేస్తుంది.

జెమినిలో స్టోరీబుక్ క్రియేట్ చేయడానికి....
- జెమిని యాప్‌ను ఓపెన్ చేసిన తరువాత ఎడమ వైపు 'జెమ్స్' కింద కనిపిస్తున్న 'స్టోరీబుక్' క్లిక్ చేయాలి.
- ఒకవేళ 'స్టోరీబుక్' కనిపించకపోతే ఫుల్ లిస్ట్ కోసం 'ఎక్స్‌ప్లోర్ జెమ్స్' క్లిక్ చేయాలి.
- స్టోరీకి సంబంధించిన డిస్క్రిప్షన్‌ను ఎంటర్ చేయాలి.

ఉదా: 'కింగ్ గోస్ ఆన్ ఏ ట్రెజర్ హంట్. అండ్ జెమిని విల్ జనరేట్ ఏ 10-పేజీ డిజిటల్ స్టోరీబుక్ కంప్లీట్లీ విత్ టెక్స్ట్, ఆర్ట్‌వర్క్ అండ్ ఆడియో.
- కొద్ది సమయం తరువాత 2-కాలమ్ లేఔట్‌లో స్టోరీబుక్ కనిపిస్తుంది. ఒకవైపు స్టోరీ మరోవైపు ఎడిట్, ఫీడ్‌బ్యాక్ కోసం చాట్ విండో కనిపిస్తుంది.
- స్టోరీబుక్ క్రియేట్ అయిన తరువాత ఆన్‌లైన్‌లో షేర్ చేయవచ్చు. ప్రింటింగ్ కోసం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ఈ ఫీచర్ అప్‌లోడెడ్ కంటెంట్‌ను కూడా సపోర్ట్ చేస్తుంది. ఉదాహరణకు ఫ్యామిలీ ట్రిప్, పిల్లల డ్రాయింగ్స్, స్కాన్‌డ్ లెటర్‌ను సబ్‌మిట్ చేస్తే జెమిని వాటి చుట్టూ స్టోరీ అల్లుతుంది.

యువర్స్

● ఇన్నోవేషన్

హిమనీష్ హెల్త్ యాప్



బెంగళూరులోని 'స్టోన్‌హిల్ ఇంటర్నేషనల్ స్కూల్' విద్యార్థి హిమనీష్ సోంపల్లె బీజింగ్‌లో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఒలింపియాడ్-2025లో కాంస్య పతకం గెలుచుకున్నాడు. 14 సంవత్సరాల హిమనీష్ అరవైకి పైగా దేశాల విద్యార్థులతో పోటీ పడ్డాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, దాని అప్లికేషన్‌లపై నిర్వహించే ఈ ఒలింపియాడ్‌ను కఠినమైన పోటీగా చెబుతుంటారు.

నాలుగు దశల నేషనల్ సెలెక్షన్ విధానం ద్వారా హిమనీష్ టీమ్ ఇండియాలో స్థానాన్ని సంపాదించాడు.

'మేము హిమనీష్‌ను చూసి గర్వపడుతున్నాం. అతని విజయం సాంకేతిక అంశాలకు మేము ఇచ్చే ప్రాధాన్యతకు అద్దం పడుతుంది' అంటూ స్కూలు యాజమాన్యం స్పందించింది.

రక్తదాతలు, అవసరార్థులకు మధ్య అనుసంధానంగా ఉండే హెల్త్ యాప్‌ను తయారు చేశాడు హిమనీష్. వరల్డ్ రోబోటిక్ ఒలింపియాడ్‌లో కర్నాటక నుంచి ప్రాతినిధ్యం వహించాడు.

పరిశోధన పత్రాలు చదవడం, చిన్న ప్రాజెక్ట్‌లను డెవలప్ చేయడం అంటే హిమనీష్‌కు ఇష్టం. అర్బన్ ప్లానింగ్, హెల్త్‌కేర్, ఎడ్యుకేషన్‌కు సంబంధించి సాంకేతికత సహాయంతో కొత్త ఆవిష్కరణలు చేయాలనేది పద్నాలుగు సంవత్సరాల హిమనీష్ లక్ష్యం.

● ఇంగ్లిష్ ఇడియమ్స్

ఫ్లై ఆఫ్ ది హ్యాండిల్

తట్టుకోలేనంత కోపంతో, బిగ్గరగా అరుస్తున్నప్పుడు వాడే మాట... ఫ్లై ఆఫ్ ది హ్యాండిల్.

ఉదా: యూ హ్యావ్ టు బీ వెరీ కేర్‌ఫుల్ బికాజ్ హి ఫ్లైస్ ఆఫ్ ది హ్యాండిల్ వెరీ ఈజీ

ఫర్ మై మనీ



'నా అభిప్రాయం ప్రకారం' అని చెప్పే సందర్భంలో వాడే మాట... ఫర్ మై మనీ.

ఉదా: ఫర్ మై మనీ, ద బెస్ట్ రెస్టారెంట్ ఇన్ టౌన్ ఈజ్... అమృత రెస్టారెంట్.

ఫుల్ యువర్‌సెల్ఫ్

తాము ఉన్న స్థితి, ప్రతిభ కంటే ఎక్కువ చేసుకొని మాట్లాడే వ్యక్తుల విషయంలో ఉపయోగించే మాట... ఫుల్ యువర్ సెల్ఫ్.

ఉదా: దట్ గయ్ వాజ్ సో ఫుల్ ఆఫ్ హిమ్ సెల్ఫ్!

సాక్షి సినిమా



● ఉపేంద్ర

హ్యాపీ బర్త్ డే ఆంధ్ర కింగ్

సూపర్‌స్టార్ సూర్యకుమార్ తన ఫ్యాన్స్‌కు అభివాదం చేస్తున్నారు. రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే హీరో హీరోయిన్లుగా, ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మహేశ్‌బాబు .పి దర్శకత్వంలో గుల్షన్ కుమార్, భూషణ్‌కుమార్ అండ్ టీ-సిరీస్ ఫిలిమ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సినీ సూపర్‌స్టార్ సూర్య కుమార్ పాత్రలో ఉపేంద్ర, ఈ హీరో ఫ్యాన్ పాత్రలో రామ్ నటిస్తున్నారని తెలిసింది. గురువారం ఉపేంద్ర బర్త్ డే సందర్భంగా, 'హ్యాపీ బర్త్ డే ఆంధ్ర కింగ్' అంటూ, ఆయన కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమా నవంబరు 28న విడుదల కానుంది.



● మోహన్‌లాల్

ఓ మంచి భావోద్వేగం

మోహన్ లాల్ లీడ్ రోల్‌లో నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'వృషభ'. రాగిణి ద్వివేది, సమర్జిత్ లంకేష్ ముఖ్య పాత్రలు పోషించారు. నందకిశోర్ దర్శకత్వంలో ఈ సినిమాని శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సీకే పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మించారు. మలయాళం, తెలుగు భాషల్లో రూపొందిన ఈ చిత్రం హిందీ, కన్నడలోనూ దీపావళి సందర్భంగా విడుదల కానుంది. ఈ మూవీ టీజర్‌ని గురువారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏక్తా కపూర్ మాట్లాడుతూ– ''వృషభ' కేవలం సినిమా కాదు. ఎమోషన్స్, రిలేషన్స్, రివెంజ్, స్వేచ్ఛ కోసం చేసే పోరాటం వంటి అంశాలతో తెరకెక్కించాం'' అని చెప్పారు. నందకిశోర్ మాట్లాడుతూ– ''వృషభ'... ఓ మర్చిపోలేని భావోద్వేగం. మోహన్ లాల్‌గారితో పని చేయడం ఓ గౌరవంగా భావిస్తున్నాను. ఆయన కొడుకు పాత్రలో సమర్జిత్ బాగా నటించారు. తండ్రీకొడుకుల చుట్టూ తిరిగే శక్తిమంతమైన కథే ఈ చిత్రం'' అని పేర్కొన్నారు.

దసరాకి ఆరంభం?



హీరో నాగార్జున కెరీర్‌లో రూపొందనున్న వందో చిత్రానికి జోరుగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సినిమాని తమిళ దర్శకుడు కార్తీక్ తెరకెక్కించనున్నట్లు నాగార్జున ఆ మధ్య ఓ సందర్భంలో స్వయంగా తెలిపారు. కాగా దసరా సందర్భంగా నాగార్జున కొత్త సినిమా ప్రారంభోత్సవం ఉంటుందని టాక్. అన్నపూర్ణ స్టూడియోస్‌పై నాగార్జున భారీ బడ్జెట్‌తో ఈ చిత్రం నిర్మించనున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ మూవీకి '100 నాటౌట్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారనే వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. తన వందో చిత్రం కావడంతో ఘనంగా ప్రారంభించేందుకు నాగార్జున సన్నాహాలు చేస్తున్నారట. కాగా... ఈ సినిమాలో నాగార్జున తనయులు నాగచైతన్య, అఖిల్ అతిథి పాత్రల్లో కనిపించనున్నారని భోగట్టా. మరి... 'మనం' తర్వాత మరోసారి ఈ ముగ్గురూ స్క్రీన్ షేర్ చేసుకుంటారా? వేచి చూడాల్సిందే.

● నాగార్జున



● దీపికా పదుకోన్

కల్కి 2 నుంచి ఔట్

ప్రభాస్ హీరోగా నటించిన పాన్ ఇండియన్ మూవీ 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా 2024 జూన్ 27న విడుదలై, సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ చిత్రంలో సుమతి అనే గర్భిణి పాత్ర చేశారు దీపికా పదుకోన్. ఇక 'కల్కి 2898 ఏడీ'కి సీక్వెల్ ఉంటుందని చిత్ర బృందం ప్రకటించిన విషయం తెలిసిందే. రెండో భాగంలోనూ దీపిక పదుకోన్ ఉంటారని చాలా మంది ఊహించారు. అయితే ఈ ప్రాజెక్టులో ఆమె నటించడం లేదంటూ వైజయంతీ మూవీస్ సంస్థ ప్రకటించడం చర్చనీయాంశం అయింది. ''చాలా ఆలోచించిన తర్వాత మేం ఒక నిర్ణయానికి వచ్చాం. 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్‌లో దీపికా పదుకోన్ భాగం కాదని తెలియజేస్తున్నాం. తొలి భాగం కోసం ఆమెతో సుదీర్ఘమైన ప్రయాణం చేసినప్పటికీ, రెండో భాగంలో మేము కలిసి సినిమా చేయలేకపోతున్నాం. ఇంతటి భారీ ప్రాజెక్టుకు సంపూర్ణ నిబద్ధత చాలా అవసరం... అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. భవిష్యత్తులో దీపిక మంచి సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాం. గొప్ప టీమ్‌తో 'కల్కి 2898 ఏడీ' రెండో భాగం ప్రేక్షకుల ముందుకు వస్తుంది'' అని వైజయంతీ మూవీస్ అధికారికంగా పేర్కొంది.

లిటిల్ హార్ట్స్ విజయం కొత్త వాళ్లకు స్ఫూర్తి

– విజయ్ దేవరకొండ



● వంశీ, బన్నీ వాస్, విజయ్ దేవరకొండ, మౌళి, అల్లు అరవింద్, శివాని, సాయి మార్తాండ్

''మౌళి అండ్ టీమ్ మా ఇంటికి వచ్చి.. 'లిటిల్ హార్ట్స్' సక్సెస్ మీట్‌కు రావాలని అడిగినప్పుడు కాదనలేకపోయాను. వీళ్లంతా ఇండస్ట్రీ బయటివాళ్లే. ఏ సపోర్ట్ లేకుండా సక్సెస్ అందుకున్న వీళ్లు మరెంతో మంది కొత్తవాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తారు. అందుకే వీళ్లకు సపోర్ట్ చేయాలనిపించింది'' అని హీరో విజయ్ దేవరకొండ తెలిపారు. మౌళి తనుజ్, శివానీ నాగారం జంటగా సాయి మార్తాండ్ దర్శకత్వం వహించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్‌పై ఆదిత్య హాసన్ నిర్మించారు. ఈ సినిమాని బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ నెల 5న విడుదల చేశారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'లిటిల్ హార్ట్స్' సినిమా సెలబ్రేషన్ ఆఫ్ గ్లోరీ ఈవెంట్‌కి విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా, నిర్మాతలు అల్లు అరవింద్, బండ్ల గణేష్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''నేను ఏ మూవీ టీమ్‌ను కలిసినా కాసేపే మాట్లాడతాను. కానీ 'లిటిల్ హార్ట్స్' టీమ్‌తో మూడు గంటలు మాట్లాడాను'' అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ–''ఒక యంగ్ టీమ్‌తో సినిమా చేస్తే ఎంత సందడిగా ఉంటుందో ఈ వేదికపై ఉన్న మీ అందర్నీ చూస్తుంటే తెలుస్తోంది. ఇలాంటి టీమ్‌తో ఒక సినిమా నిర్మించాలనిపిస్తోంది'' అని చెప్పారు. ''మా సినిమాని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని సాయి మార్తాండ్, బన్నీ వాస్, వంశీ నందిపాటి, శివానీ నాగారం, మౌళి తనుజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, నటీనటులు అనితా చౌదరి, సత్యకృష్ణన్, రాజీవ్ కనకాల, జయకృష్ణ, సంగీత దర్శకుడు సింజిత్ యెర్రమల్లి తదితరులు మాట్లాడారు.

థియేటర్స్ కళకళలాడుతున్నాయి

– అనిల్ రావిపూడి



● సాహు గారపాటి, బాబీ, అనిల్, వశిష్ఠ, సాయి శ్రీనివాస్, సాయి దుర్గాతేజ్, అనుదీప్, కౌశిక్

''ఈ సెప్టెంబరు ఒక విజయవంతమైన నెల అయింది. 'కొత్తలోక, మిరాయ్, కిష్కింధపురి, లిటిల్ హార్ట్స్' సినిమాలతో థియేటర్స్ ప్రేక్షకులతో కళకళలాడుతున్నాయి. థియేటర్స్‌లో ఒక చిన్న పండగ వాతావరణం ఉంది. ఈ మూమెంట్ ఇలాగే కొనసాగాలి. 'కిష్కింధపురి' టీమ్‌కి అభినందనలు'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జోడీగా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలైంది. ఈ చిత్రం సక్సెస్ మీట్‌కి హీరో సాయి దుర్గాతేజ్, దర్శకులు అనిల్ రావిపూడి, బాబీ, వశిష్ఠ, అనుదీప్ అతిథులుగా హాజరయ్యారు. సాయి దుర్గాతేజ్ మాట్లాడుతూ– ''లిటిల్ హార్ట్స్, మిరాయ్, కిష్కింధపురి.., ఇలా అన్ని చిత్రాలు అద్భుతంగా ఆడుతున్నాయి. మంచి కథలను ప్రేక్షకులు సపోర్ట్ చేస్తున్నారు'' అని చెప్పారు. ''మా సినిమాని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అన్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ''బలమైన కథ ఉంటేనే జనం థియేటర్స్‌కి వస్తారు. 'కిష్కింధపురి'లో హారర్‌తో పాటు మంచి సందేశం ఉండటం బాగా అనిపించింది'' అని పేర్కొన్నారు బాబీ. ''సాయిగారు కొత్త జోనర్‌లో బ్లాక్ బస్టర్ కొట్టారు'' అన్నారు వశిష్ఠ. ''అందరూ థియేటర్స్‌లో చూడాల్సిన సినిమా ఇది'' అని అనుదీప్ పేర్కొన్నారు. ''మా మూవీని ఆడియన్స్ సూపర్ హిట్ చేయడం హ్యాపీ'' అని సాహు గారపాటి చెప్పారు. ''కిష్కింధపురి' పార్ట్ 2 ఎప్పుడు అని అడుగుతున్నారు. ఓ ఐడియా ఉంది.. కచ్చితంగా వస్తుంది'' అన్నారు కౌశిక్ పెగల్లపాటి. మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్ మాట్లాడారు.

ఒక్క రాత్రిలో జరిగే కథ



● రాజు నాయక్

అథర్వ మురళీ, లావణ్య త్రిపాఠి జంటగా రవీంద్ర మాధవ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'టన్నెల్'. ఈ సినిమాను తెలుగులో నిర్మాత ఎ. రాజు నాయక్ రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రం నేడు విడుదల అవుతోన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''తమిళ 'టన్నెల్' సినిమా నచ్చడంతో తెలుగులో విడుదల చేస్తున్నా. కథ అంతా ఒక్క రాత్రిలోనే జరుగుతుంది. పోలీసులను హీరో ఎలా కాపాడతాడు? సైకోని ఎలా పట్టుకుంటాడు? హీరోకి, టన్నెల్‌కి ఉన్న సంబంధం ఏమిటి? అనే అంశాలు ఉంటాయి. తమిళంలో హిట్టయినట్లే తెలుగు వారందర్నీ 'టన్నెల్' సినిమా మెప్పిస్తుంది'' అని అన్నారు.

అందరికీ తెలిసిన కథే



● అంకిత్ కొయ్య

''ప్రతి ఇంట్లో, ప్రతి వీధిలో జరిగే కథ 'బ్యూటీ' సినిమా. అందరికీ తెలిసిన కథే. అయినా సరే అందరూ తెలుసుకోవాల్సిన కథ. ప్రస్తుతం ఎంత జాగ్రత్తగా ఉండాలో తెలియజెప్పే కథ ఇది. మధ్య తరగతి తండ్రి భావోద్వేగాలను చూపించాం'' అని అంకిత్ కొయ్య చెప్పారు. జె.ఎస్.ఎస్. వర్ధన్ దర్శకత్వంలో అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించిన చిత్రం 'బ్యూటీ'. వానర సెల్యులాయిడ్, జీ స్టూడియోస్, మారుతి టీమ్ ప్రొడక్ట్‌పై అడిదల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కుమార్ బన్సల్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. అంకిత్ మాట్లాడుతూ–''నేను నటించిన అర్జున్ పాత్రని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అని భయపడ్డాను. అయితే.. ఓ నటుడిగా ఆ పాత్రకు న్యాయం చేయాలని నటించాను'' అని చెప్పారు.

స్టాక్ మార్కెట్లు

(తెల్లి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
320	93
83,014	25,424

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,497	▲	237
డోజోన్స్	46,228	▲	209
ఎఫ్‌టీఎస్ఈ 100	9,234	▲	26
డాక్స్	23,667	▲	308
షాంఘై	3,832	▼	45
నికాయ్	45,303	▲	513

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	87.55	88.57
£	బ్రిటన్ పౌండ్	118.49	121.48
€	యూరో	102.67	105.46
¥	జపాన్ యెన్ (100)	59.28	60.80
AUS	ఆస్ట్రేలియా డాలర్	57.25	59.51
S$	సింగపూర్ డాలర్	66.38	69.39
SAR	సౌదీ రియాల్	22.61	24.11
UAE D	యూఏఈ దిర్హామ్	23.12	24.36
¥	చైనా యువాన్	11.51	13.34

ఇక షాంపూ, సబ్బులు చౌక!

తగ్గిన భారం..

ఉత్పత్తి	తగ్గింపు (రూ.లలో)
ఓరల్ బీ టూత్‌బ్రష్	5
హెడ్ అండ్ షోల్డర్స్ (300ఎంఎల్)	40
డవ్ షాంపూ (340ఎంఎల్)	55
క్లినిక్ ప్లస్ (355ఎంఎల్)	53
సన్‌సిల్క్ బ్లాక్ (350ఎంఎల్)	60
ప్యాంటీన్ షాంపూ (340ఎంఎల్)	55
జండూబామ్ (25ఎంఎల్)	7
లైఫ్ బాయ్ (75గ్రా..4ప్యాక్)	8
లక్స్‌గ్లో (75గ్రా.. 4ప్యాక్)	11
క్లోజప్ టూత్ పేస్ట్ (150గ్రా)	16
హార్లిక్స్ (200గ్రా)	20
బూస్ట్ (200గ్రా)	14
బ్రూకాఫీ (75గ్రా)	30
కిసాన్ కెచప్ (850గ్రా)	7
కిసాన్ జామ్ (200గ్రా)	10
జండూ చవన్ ప్లస్ (900గ్రా)	24
జిల్లెట్ షేవింగ్‌క్రీమ్ (30గ్రా)	5
ఓల్డ్ స్పైస్ ఆఫ్టర్ షేవింగ్ లోషన్	36

- బేబీ డైపర్లు, టూత్‌పేస్ట్‌లు సైతం
- రేట్ల కోతను ప్రకటించిన ఎఫ్‌ఎంసీజీలు

న్యూఢిల్లీ: జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనాన్ని వినియోగదారులకు బదలాయిస్తూ ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు తమ ఉత్పత్తులపై కొత్త రేట్లను తగ్గించాయి. షాంపూలు, సబ్బులు, టూత్‌పేస్ట్‌లు, టూత్‌బ్రష్‌లు, రేజర్లు, బేబీ డైపర్లు తదితర ఉత్పత్తులకు సంబంధించి కొత్త రేట్లను ప్రకటించాయి.



సెప్టెంబర్ 22 నుంచి కొత్త రేట్లు అమల్లోకి రానుండడం తెలిసిందే. దీంతో ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్, ఇమామీ, హెచ్‌యూఎల్ కొత్త ధరలను తమ పోర్టల్‌పై ప్రకటించాయి. పీఅండ్‌జీ విక్స్ యాక్షన్ 500 అడ్వాన్స్‌డ్ స్ట్రిప్ ధర రూ.5 తగ్గింది. ఇన్‌హేలర్ ధర సైతం ఇదే స్థాయిలో దిగొచ్చింది. వీటిపై 12 శాతం జీఎస్‌టీ 5 శాతానికి తగ్గింది. షాంపూలపై జీఎస్‌టీ 18% నుంచి 5 శాతానికి దిగొచ్చింది. డైపర్లపై జీఎస్‌టీ 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గగా, బేబీ వైప్స్‌పై 18% నుంచి 5 శాతానికి తగ్గింది. దీంతో పీఅండ్‌జీ తన ఉత్పత్తులపై ఇంతే మేర రేట్లు తగ్గించింది.

ఈపీఎఫ్‌వో ‘పాస్‌బుక్ లైట్’

- ప్రధాన పోర్టల్‌పై లభ్యం
- ఒకే లాగిన్‌తో ఎన్నో సేవలు
- కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ కొత్తగా ‘పాస్‌బుక్ లైట్’ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. సభ్యులు ప్రధాన పోర్టల్‌పై https://unifiedportal&mem.epfindia.gov.in/memberinterface/ లాగిన్ అయ్యి ఈపీఎఫ్ పాస్‌బుక్ సులభ వెర్షన్‌ను నేరుగా చూసుకోవచ్చు. ఇప్పటి వరకు సభ్యులు తమ ప్రావిడెంట్ ఫండ్ బ్యాలన్స్, చందాలు, రుణాలు, ఉపసంహరణల లావాదేవీలను చూసుకునేందుకు ప్రత్యేకంగా ఈపీఎఫ్‌వో పాస్‌బుక్ పోర్టల్‌లో లాగిన్ అవ్వాల్సి వచ్చేది. ఇకపై పాస్‌బుక్ లైట్ నుంచి కూడా ఈ వివరాలు పొందొచ్చు. పాస్‌బుక్‌లైట్‌తో యూజర్ అనుభవం మెరుగుపడుతుందని.. ఒకే లాగిన్‌తో పాస్‌బుక్ సహా అన్ని రకాల సేలను పొందొచ్చని, దీన్ని ప్రారంభించిన సందర్భంగా కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రకటించారు. పాస్‌బుక్‌కు సంబంధించి సమగ్ర వివరాల కోసం సభ్యులు ఇకమీదటా పాస్‌బుక్ ప్రత్యేక పోర్టల్‌పై లాగిన్ అవ్వొచ్చని చెప్పారు. పీఎఫ్ బదిలీకి సంబంధించిన ‘అనెక్స్యూర్ కే’ను ఆన్‌లైన్‌లో పొందే సదుపాయాన్ని సైతం మంత్రి ప్రారంభించారు. ఒక సంస్థ నుంచి మరో సంస్థకు ఉద్యోగి బదిలీ అయితే, కొత్త సంస్థకు సభ్యుడి పీఎఫ్ ఖాతా బదిలీ అవుతుంది. అప్పుడు అనెక్స్యూర్ కేని సంబంధిత పీఎఫ్ కార్యాలయం, కొత్త కార్యాలయానికి బదిలీ చేస్తుంది. సభ్యుల అభ్యర్థన మేరకే ప్రస్తుతం అనెక్స్యూర్ కేని జారీ చేస్తుండగా, ఇకపై ఆన్‌లైన్‌లో సులభంగా పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఈపీఎఫ్‌వో వీలు కల్పించింది. దీంతో తమ బదిలీ పూర్తయిందా? ఏ స్థాయిలో ఉంది? అన్నది సభ్యులు ఆన్‌లైన్‌లో తెలుసుకోవడం సాధ్యపడుతుంది. పీఎఫ్ బ్యాలన్స్, సర్వీస్ కాలం సరిగ్గానే నమోదయ్యాయా? అన్నది సరిచూసుకోవచ్చు.

మారుతీ కార్ల ధరలు తగ్గాయ్!

- రూ. 1.29 లక్షల వరకు ధరల తగ్గుదల
- జీఎస్‌టీ ప్రయోజనాలు బదలాయించేందుకే

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్నుల్లో (జీఎస్‌టీ) మార్పుల నేపథ్యంలో ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా తమ వాహనాల రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. మోడల్‌ను బట్టి ధర తగ్గింపు రూ. 1,29,600 వరకు ఉంటుంది. సెప్టెంబర్ 22 నుంచి ఈ ధరలు అమల్లోకి వస్తాయి. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలను కస్టమర్లకు బదలాయించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. ద్విచక్ర



వాహనాల యూజర్లు .. కార్లకు అప్‌గ్రేడ్ కావడంలో సహాయకరంగా ఉండేలా, జీఎస్‌టీపరంగా 8.5% తగ్గింపునకు అదనంగా, చిన్న కార్ల ధరలను మరింతగా తగ్గించినట్లు సంస్థ వివరించింది. దేశీయంగా కార్ల వినియోగం చాలా తక్కువగా ఉన్నందున మార్కెట్ దిగ్గజం హోదాలో కార్లను మరింత అందుబాటులో స్థాయిలోకి తెచ్చేందుకు తాము చొరవ తీసుకుంటున్నట్లు వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సందర్భంగా కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. గత కొన్నాళ్లుగా నెమ్మదిస్తున్న ఎంట్రీ లెవెల్ కార్ల సెగ్మెంట్ పుంజుకోవడానికి ధరల తగ్గింపు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఎంత తగ్గుతుందంటే..

మోడల్	తగ్గింపు (గరిష్టంగా రూ.లలో)
ఎస్ ప్రెసో	1,29,600
ఆల్టో కే10	1,07,600
సెలెరియో	94,100
వ్యాగన్‌ఆర్	79,600
ఇగ్నిస్	71,300
స్విఫ్ట్	84,600
బాలెనో	86,100
టూర్ ఎస్	67,200
డిజైర్	87,700
ఫ్రాంక్స్	1,12,600
బ్రెజా	1,12,700
గ్రాండ్ విటారా	1,07,000
జిమ్నీ	51,900
ఎర్టిగా	46,400
ఎక్స్‌ఎల్6	52,000
ఇన్విక్టో	61,700
ఈకో	68,000
సూపర్ క్యారీ ఎల్‌సీవీ	52,100

అక్టోబర్ 1 నుంచి గేమింగ్ చట్టం అమల్లోకి

ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ మనీ గేమ్స్‌ను నిషేధిస్తూ రూపొందించిన ఆన్‌లైన్ గేమింగ్ చట్టం అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దీనిపై గత మూడేళ్లుగా పరిశ్రమ వర్గాలతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపిందని, చట్టాన్ని ఆమోదించిన తర్వాత కూడా బ్యాంకులు, ఇతరత్రా భాగస్వాములతోను చర్చించామని ఏఐ ఇంపాక్ట్ సదస్సు 2026



ఇండియాకి సంబంధించి ప్రీ–ఈవెంట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన తెలిపారు. పార్లమెంటు గత నెలలో ఈ చట్టానికి ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. దీనితో డ్రీమ్11, మై11 సర్కిల్, విన్‌జో, జూపీ, పోకర్‌బాజీలాంటి సంస్థలు రియల్ మనీ గేమింగ్ కార్యకలాపాలను నిలిపివేశాయి. కాగా, కృత్రిమ మేధ (ఏఐ) సంబంధిత ముప్పుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు, ఏఐ వినియోగ విధి విధానాలను నిర్దేశించేందుకు ఉద్దేశించిన గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్‌ను సెప్టెంబర్ 28 నాటికి విడుదల చేయనున్నట్లు వైష్ణవ్ చెప్పారు.

అదానీకి సెబీ క్లీన్ చిట్

హిండెన్‌బర్గ్ ఆరోపణలపై క్లియరెన్స్

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా అదానీ గ్రూప్‌నకు క్లీన్ చిట్ ఇచ్చింది. తద్వారా అదానీ గ్రూప్‌పై యూఎస్ షార్ట్‌సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ ఆరోపణలను తోసిపుచ్చింది. గ్రూప్ కంపెనీల మధ్య నిధుల బదిలీలో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి సెబీ విడిగా రెండు సవివర నివేదికలు విడుదల చేసింది. మార్కెట్ మ్యానిప్యులేషన్, ఇన్‌సైడర్ ట్రేడింగ్, పబ్లిక్ వాటాదారుల నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై చేసిన విచారణ మీదట వీటిని రూపొందించింది. ఈ అంశాలపై విస్తృత పరిశోధన తదుపరి హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారమైనవని తేల్చింది. తద్వారా



దేశీ కార్పొరేట్ దిగ్గజం గౌతమ్ అదానీకి భారీ ఉపశమనాన్ని కల్పించింది. అదానీ గ్రూప్‌నకు వ్యతిరేకంగా 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ ఒక నివేదికను విడుదల చేసిన సంగతి తెలిసిందే. గ్రూప్ కంపెనీల నుంచి అదానీ పవర్, అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు నిధులను బదిలీ చేసేందుకు అడికార్ప్ ఎంటర్‌ప్రైజెస్, మైల్‌స్టోన్ ట్రేడ్‌లింక్స్, రెహవార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థలను వాడుకున్నట్లు నివేదికలో ఆరోపించింది. అయితే అప్పటినుంచి హిండెన్‌బర్గ్ కార్యకలాపాలు మూతపడగా.. తమ దర్యాప్తుకంటే ముందుగానే ప్రస్తావిత సంస్థల నుంచి తీసుకున్న రుణాలను ఆయా కంపెనీలు వడ్డీతోసహా దశలవారీగా తిరిగి చెల్లించినట్లు సెబీ తెలియజేసింది. ఇదేవిధంగా సెక్యూరిటీల కొనుగోలు లేదా నియంత్రణ అంశాలలోనూ నిబంధనల ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేసింది.

దేశానికి క్షమాపణ చెప్పాలి

హిండెన్‌బర్గ్ ఆరోపణలపై అదానీ గ్రూప్‌నకు క్లీన్ చిట్ ఇవ్వడం ద్వారా సెబీ ఈ అంశాలపై తమ ప్రతిస్పందనను పునరుద్ఘాటించిందని బిలియనీర్ గౌతమ్ అదానీ పేర్కొన్నారు. ఇవన్నీ నిరాధార ఆరోపణలని వ్యాఖ్యానించారు. హిండెన్‌బర్గ్ నివేదిక ద్వారా గ్రూప్‌పై తప్పుడు ప్రచారాన్ని చేపట్టినవారు దేశానికి క్షమాపణ చెప్పాలని ‘ఎక్స్’ వేదికగా డిమాండ్ చేశారు.

మార్కెట్‌కు ‘ఫెడ్’ బూస్ట్!

- 83,000 స్థాయిపైకి సెన్సెక్స్
- 93 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- మూడోరోజూ ముందడుగే



ముంబై: ఐటీ, ఫార్మా, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు గురువారం లాభపడ్డాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ పావుశాతం వడ్డీరేట్ల తగ్గింపుతో పాటు ఈ ఏడాదిలో మరో రెండుసార్లు కోత ఉంటుందనే సంకేతాలు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 320 పాయింట్లు పెరిగి 83,014 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93 పాయింట్లు లాభపడి 25,424 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది వరుసగా మూడో రోజూ లాభాల ముగింపు. ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 448 పాయింట్లు బలపడి 83,141 వద్ద, నిఫ్టీ 119 పాయింట్లు ఎగసి 25,449 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అధిక విలువలు, డాలర్ ఇండెక్స్ బలోపేతంతో మిడ్‌సెషన్ తర్వాత లాభాల స్వీకరణ చోటుచేసుకున్నప్పటికీ.., ప్రైవేటు బ్యాంకులు, మిడ్‌క్యాప్ షేర్ల దన్నుతో లాభాలు నిలుపుకోగలిగాయి.

ఆసియాలో కొరియా, జపాన్ ఇండెక్సులు 1% పెరిగాయి. చైనా, హాంగ్‌కాంగ్ సూచీలు 1% నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు 1% లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు అరశాతం లాభంతో ట్రేడవుతున్నాయి.

– బ్రోకరేజ్ సంస్థలు పాజిటివ్ రేటింగ్‌తో ఎటర్నల్ లిమిటెడ్ షేరు 3% లాభపడి రూ.338 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 3.18% పెరిగి రూ.339 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3.26 లక్షల కోట్లుగా నమోదైంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా హిందుస్తాన్ ఏరోనాటిక్స్(రూ.3.24 లక్షల కోట్లు), టైటాన్(రూ.3.11 లక్ష కోట్లు), అవెన్యూ సూపర్‌మార్ట్స్(రూ.3.09 లక్షల కోట్లు), అదానీ పోర్ట్స్(రూ.3.05 లక్షల కోట్లు)ను అధిగమించింది. తద్వారా దేశంలో టాప్–100 మార్కెట్ విలువ కలిగిన కంపెనీల జాబితాలో 22వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ షేరు ఈ ఏడాదిలో ఇప్పటివరకు 21.54% ర్యాలీ చేసింది.

■ వరుసగా 4 రోజులు ర్యాలీ చేసిన రూపాయి గురువారం డీలా పడింది. డాలర్‌తో 35 పైసలు తగ్గి 88.20 వద్ద క్లోజైంది.

‘సాక్షి ప్లస్’ ఈ-పేపర్‌లో ..

సంస్కరణలను అందిపుచ్చుకోండి: నిర్మల	ఆస్తుల మానిటైజేషన్ స్పీడ్ పెంచాలి: సెబీ చీఫ్



కాంస్యం నెగ్గిన అంతిమ్

ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో తొలి పతకం చేరింది. క్రొయేషియాలో గురువారం జరిగిన మహిళల 53 కేజీల విభాగంలో అంతిమ్ పంఘాల్ కాంస్య పతకం సాధించింది. గురువారం జరిగిన కాంస్య పతక బౌట్‌లో హరియాణాకు చెందిన 21 ఏళ్ల అంతిమ్ 9–1తో ఎమ్మా జోనా డెనిస్ మాల్మ్‌గ్రెన్ (స్వీడన్)పై గెలుపొందింది. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో అంతిమ్‌కిది రెండో పతకం. 2023లోనూ ఆమె కాంస్యం సాధించింది. వినేశ్ ఫొగాట్ (2019, 2022లలో కాంస్యం) తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండు పతకాలు గెలిచిన రెండో భారతీయ మహిళా రెజ్లర్‌గా అంతిమ్ గుర్తింపు పొందింది. ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ పోటీల్లో భారత్ నుంచి అల్కా (2006లో కాంస్యం), బబిత (2012లో కాంస్యం), గీతా ఫొగాట్ (2012లో కాంస్యం), పూజ (2018లో కాంస్యం), అన్షు (2021లో రజతం), సరిత (2021లో కాంస్యం), మాన్సి (2024లో కాంస్యం) కూడా పతకాలు నెగ్గారు.

నీరజ్‌కు నిరాశ

- **ప్రపంచ టైటిల్ నిలబెట్టుకోలేకపోయిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్**
- **ఫైనల్లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్న డిఫెండింగ్ చాంపియన్**
- **2018 తర్వాత తొలిసారి టాప్–3లో చోటు దక్కించుకోని వైనం**
- నాలుగో స్థానంతో ఆకట్టుకున్న సచిన్ యాదవ్



టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో కచ్చితంగా పతకం సాధిస్తాడనుకున్న భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఊహించని ప్రదర్శనతో నిరాశ పరిచాడు. గురువారం జరిగిన జావెలిన్ త్రో ఫైనల్ ఈవెంట్‌లో నీరజ్ ఎనిమిదో స్థానంలో నిలిచాడు. 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం... 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన నీరజ్ ‘టోక్యో’లో పతకాల ‘హ్యాట్రిక్’ నమోదు చేయలేకపోయాడు. డిఫెండింగ్ వరల్డ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన నీరజ్ జావెలిన్‌ను 84.03 మీటర్ల దూరం విసిరి పతకం రేసులో వెనుకబడిపోయాడు. 2018 తర్వాత నీరజ్ తాను పాల్గొన్న టోర్నీలో టాప్–3లో నిలువకపోవడం ఇదే ప్రథమం. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ సచిన్ యాదవ్ అంచనాలకు మించి రాణించి త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకున్నాడు. సచిన్ జావెలిన్‌ను 86.27 మీటర్ల దూరం విసిరి నాలుగో స్థానాన్ని సంపాదించాడు. కెషార్న్ వాల్కట్ (ట్రినిడాడ్ అండ్ టొబాగో; 88.16 మీటర్లు) స్వర్ణ పతకాన్ని దక్కించుకోగా... రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా; 87.38 మీటర్లు) రజతం... కుర్టిస్ థాంప్సన్ (అమెరికా; 86.67 మీటర్లు) కాంస్యం సాధించారు. బుధవారం జరిగిన క్వాలిఫయింగ్‌లో తొలి ప్రయత్నంలోనే ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్న నీరజ్... మెడల్ రౌండ్‌లో మాత్రం తడబడ్డాడు. తొలి ప్రయత్నంలో



సచిన్


ఈటెను 83.65 మీటర్ల దూరం విసిరిన నీరజ్, రెండో ప్రయత్నంలో 84.03 మీటర్లకు పంపించాడు. మూడో ప్రయత్నంలో ‘ఫౌల్’ చేసిన నీరజ్... నాలుగో ప్రయత్నంలో 82.86 మీటర్లకు పరిమితమయ్యాడు. ఐదో ప్రయత్నంలో ‘ఫౌల్’ చేసిన ఈ భారత స్టార్ పతకంపై ఆశలు వదులుకున్నాడు. 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన అర్షద్ నదీమ్ (పాకిస్తాన్) కూడా ‘టోక్యో’లో ఆకట్టుకోలేకపోయాడు. అర్షద్ జావెలిన్‌ను 82.75 మీటర్ల దూరం విసిరి పదో స్థానంలో నిలిచాడు. ‘ఫైనల్లో ఏం జరిగిందో నాకు అర్థం కావడంలేదు. చాలా రోజుల తర్వాత ఇలా జరిగింది. రెండు వారాలక్రితం నుంచే వెన్నునొప్పితో బాధపడ్డాను. టోక్యో చేరుకున్నాక కూడా నొప్పి తీవ్రంగా లేకపోవడంతో ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. అయితే జావెలిన్ త్రోలో పూర్తి ఫిట్‌గా ఉంటేనే ఫలితాలు వస్తాయి. ఏమాత్రం తేడా వచ్చినా నిరాశ తప్పదు. ఈ ప్రదర్శనతో గుణపాఠం నేర్చుకుంటాను’ అని నీరజ్ చోప్రా వ్యాఖ్యానించాడు.



జావెలిన్ త్రోలో తాము నెగ్గిన పతకాలతో అండర్సన్ పీటర్స్, వాల్కట్, కుర్టిస్ థామ్సన్ (ఎడమ నుంచి)

సింధు సంచలనం

- ప్రపంచ ఆరో ర్యాంకర్‌పై గెలుపుతో క్వార్టర్ ఫైనల్లోకి
- నేడు వరల్డ్ నంబర్‌వన్ ఆన్ సె యంగ్‌తో పోరు



షెన్‌జెన్: ఈ ఏడాది తొలి టైటిల్ కోసం వేచి చూస్తున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు... చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 14వ ర్యాంకర్ సింధు సంచలన విజయం నమోదు చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్)తో జరిగిన మ్యాచ్‌లో సింధు 21–15, 21–15తో గెలుపొందింది. 41 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధుకు రెండో గేమ్‌లో కాస్త పోటీ ఎదురైంది. తొలి గేమ్ ఆరంభంలో తొలి పాయింట్ చేజార్చుకున్న సింధు ఆ తర్వాత వరుసగా ఆరు పాయింట్లు సాధించి 6–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. స్కోరు 6–4 వద్ద సింధు మళ్లీ చెలరేగి వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి 11–4తో ముందంజ వేసింది. అనంతరం ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని తొలి గేమ్ దక్కించుకుంది. రెండో గేమ్ హోరాహోరీగా సాగింది. పలుమార్లు ఇద్దరి స్కోరు సమమయ్యాయి. స్కోరు 13–13 వద్ద సింధు విజృంభించి వరుసగా ఐదు పాయింట్లు గెలిచి 18–13తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరులో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఈ గెలుపుతో చోచువోంగ్‌తో ముఖాముఖి రికార్డులో సింధు 7–5తో ఆధిక్యంలోకి వెళ్లింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో సింధు తలపడుతుంది. ఆన్ సె యంగ్‌తో ఇప్పటి వరకు ఏడుసార్లు ఆడిన సింధు ఒక్కసారి కూడా నెగ్గలేదు. ఆన్ సె యంగ్‌తో జరిగిన ఏడు మ్యాచ్‌ల్లో సింధు ఒక్క గేమ్ మాత్రమే గెలవగలిగింది.

క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ

పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–13, 21–12తో సియాంగ్ చియె చియు–వాంగ్ చి లిన్ (చైనీస్ తైపీ) జంటపై గెలిచింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో రెన్ జియాంగ్ యు–జియె హావోనన్ (చైనా)లతో సాత్విక్–చిరాగ్ తలపడతారు.

మరో ‘ప్రాక్టీస్’ మ్యాచ్!

- నేడు ఒమన్‌తో భారత్ ఢీ
- రాత్రి 8 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రసారం

అబుదాబి: ఆసియా కప్ టి20 టోర్నీలో వరుసగా రెండు విజయాలతో తమ స్థాయిని ప్రదర్శిస్తూ అలవోకగా ‘సూపర్–4’ దశకు అర్హత సాధించిన భారత జట్టు తమ సాధనకు పదును పెడుతోంది. ఈ క్రమంలో గ్రూప్ ‘ఎ’లో నేడు జరిగే నామమాత్రపు చివరి లీగ్ మ్యాచ్‌లో ఒమన్‌తో ఆడనుంది. తొలి మ్యాచ్‌లో యూఏఈని 57కు ఆలౌట్ చేసిన టీమిండియా... రెండో మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను 130 పరుగులకే పరిమితం చేసింది. ఏకపక్షంగా సాధించిన ఈ విజయాల కారణంగా మన బ్యాటర్లందరికీ బరిలోకి దిగే అవకాశమే పెద్దగా రాలేదు. ఈ రెండు మ్యాచ్‌లు కలిపి అభిషేక్ శర్మ, గిల్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే మాత్రమే బ్యాటింగ్ చేయగలిగారు. సామ్సన్, హార్దిక్ పాండ్యాలకు ఏమాత్రం బ్యాటింగ్ ప్రాక్టీస్ లేకుండా పోయింది. దాంతో ఒమన్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిస్తే జట్టు బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. అదే జరిగితే మన దుర్భేద్యమైన టీమ్‌ను నిలువరించడం ఒమన్‌కు సాధ్యం కాదు. భారత బౌలింగ్ కూడా చాలా పటిష్టంగా ఉంది. అయితే అందరూ ‘సూపర్–4’కు ముందు తగిన ప్రాక్టీస్‌ను ఆశిస్తున్నారు. ఈ టోర్నీలో ఏకైక మ్యాచ్‌లో అబుదాబిలో ఆడుతున్న సూర్యకుమార్ బృందం... ఆదివారం పాకిస్తాన్‌తో మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో సాధన చేసే అవకాశం లేదు. అందుకే ఈ మ్యాచ్ జట్టుకు కావాల్సిన ప్రాక్టీస్‌ను అందించవచ్చు. ఈ నేపథ్యంలో టీమ్ మేనేజ్‌మెంట్ తుది జట్టులో ఏమైనా మార్పులు చేస్తుందేమో చూడాలి. చిన్న జట్టు కాబట్టి బుమ్రాకు విశ్రాంతినిచ్చి అర్ష్‌దీప్ సింగ్ లేదా హర్షిత్ రాణాలలో ఒకరిని ఆడించే అవకాశం కూడా ఉంది. మరోవైపు తొలిసారి ఆసియా కప్‌లో ఆడుతున్న ఒమన్ నుంచి ఆశించేదేమీ లేదు. పాకిస్తాన్, యూఏఈలతో ఆడిన రెండు మ్యాచ్‌లలో కూడా జట్టు బ్యాటింగ్ కుప్పకూలింది. చెప్పుకోదగ్గ ఆటగాళ్లు కూడా ఒక్కరూ లేరు.



సూర్యకుమార్

అఫ్గానిస్తాన్‌పై గెలుపుతో ‘సూపర్–4’కు శ్రీలంక

అబుదాబి: ఆసియా కప్ టి20 టోర్నీలో గ్రూప్ ‘బి’ నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్ ‘సూపర్–4’ దశకు అర్హత సాధించాయి. గురువారం జరిగిన కీలక మ్యాచ్‌లో శ్రీలంక 6 వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్‌పై విజయం సాధించింది. ఈ గ్రూప్‌లో మూడు విజయాలతో లంక, రెండు విజయాలతో బంగ్లాదేశ్ ముందంజ వేయగా... అఫ్గానిస్తాన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ‘సూపర్–4’ దశకు చేరాలంటే కచ్చితంగా గెలవాల్సిన పోరులో... టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. మొహమ్మద్ నబీ (22 బంతుల్లో 60; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో జట్టుకు మెరుగైన స్కోరును అందించాడు. వెల్లలాగే వేసిన చివరి ఓవర్లో నబీ ఏకంగా 5 సిక్స్‌లు కొట్టడం బాదడం విశేషం. ఈ ఓవర్లో అతను వరుసగా 6, 6, 6, (నోబాల్), 6, 6 బాదాడు. ఇతర బ్యాటర్లలో రషీద్ ఖాన్ (24), ఇబ్రహీమ్ జద్రాన్ (24) కొన్ని పరుగులు జోడించారు. శ్రీలంక బౌలర్లలో నువాన్ తుషార 18 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టడం విశేషం. అనంతరం లంక 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 171 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ కుశాల్ మెండిస్ (52 బంతుల్లో 74 నాటౌట్; 10 ఫోర్లు) అర్ధ సెంచరీతో జట్టును గెలిపించగా... కుశాల్ పెరీరా (28), కమిందు మెండిస్ (26 నాటౌట్) రాణించాడు. శనివారం జరిగే తొలి సూపర్–4 మ్యాచ్‌లో శ్రీలంక, బంగ్లాదేశ్ తలపడతాయి.

ఆర్చరీ ప్రీమియర్ లీగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా రామ్‌చరణ్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌ను సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సీఎంతో బ్రిటన్ హైకమిషనర్ భేటీ

మూసీ పునరుజ్జీవంలో బ్రిటన్ కంపెనీలు భాగస్వాములు కావాలి... హైకమిషనర్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మూసీ పునరుజ్జీవంలో బ్రిటన్‌కు చెందిన కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌ను కోరారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో గురువారం బ్రిటిష్ హైకమిషనర్ కామెరాన్, డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ తదితరులు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైకమిషనర్ లిండీ మాట్లాడుతూ విద్య, సాంకేతిక రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్‌షిప్‌ను కో ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణకు చెందిన మెరిట్ విద్యార్థులకు కూడా అందించడానికి లిండీ కామెరాన్ అంగీకరించారు. కాగా రాష్ట్రంలో కొత్త విద్యావిధానాన్ని తీసుకురానున్నట్లు సీఎం రేవంత్ బ్రిటిష్ హైకమిషనర్‌కు వివరించారు. తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం యూకే యూనివర్సిటీలు హైదరాబాద్ నుంచి నిర్వహించేలా చూడాలని సీఎం కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ ఇవ్వడానికి బ్రిటిష్ హైకమిషనర్ సుముఖత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రిటిష్ హైకమిషన్ పొలిటికల్ ఎకానమీ అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెమీకండక్టర్.. 'డబుల్' జోరు!

ప్రస్తుత మార్కెట్ 54.3 బిలియన్ డాలర్లు
2030 నాటికి 103.5 బిలియన్ డాలర్లకు...

భారత సెమీకండక్టర్ మార్కెట్ విలువ ప్రస్తుత సంవత్సరంలో 54.3 బిలియన్ డాలర్లకు చేరవచ్చని.. 2030 నాటికి 13.8 శాతం వార్షిక వృద్ధి రేటుతో 103.5 బిలియన్ డాలర్లకు చేరుతుందని స్టాఫింగ్ కంపెనీ 'క్వెస్ కార్ప్' నివేదిక తెలిపింది. 'ది చిప్ క్యాటలిస్ట్: ఇండియాస్ ఎమర్జింగ్ సెమీకండక్టర్ ఎకోసిస్టమ్' పేరుతో రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. భారీ స్థాయిలో వినియోగ మార్కెట్‌గా ఉన్న భారత్, ప్రపంచ సామర్థ్య కేంద్రంగా అవతరిస్తోంది. అయితే ఈ రంగం నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సెమీకండక్టర్ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 80 శాతం మందికి.. 10 సంవత్సరాల కంటే తక్కువ అనుభవం ఉంది. మధ్య స్థాయి, సీనియర్ రోల్స్‌లో నిపుణుల కొరత ఉంది. 55కుపైగా ఉన్న సెమీకండక్టర్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్‌లో (జీసీసీ) 60 వేల పైచిలుకు ఇంజనీర్లు పనిచేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఈ పరిశ్రమలో 2030 నాటికి నిపుణుల సంఖ్య 4,00,000లకు చేరనుంది. తద్వారా నిపుణుల సంఖ్య విషయంలో ప్రపంచంలో యూఎస్ తర్వాత భారత్ రెండో స్థానాన్ని ఆక్రమించనుంది. **-సాక్షి, స్పెషల్ డెస్క్**



వృద్ధి జోరు
భారత సెమీకండక్టర్ మార్కెట్ ఏటా వృద్ధి ఇలా..

సంవత్సరం	బిలియన్ డాలర్లు	సంవత్సరం	బిలియన్ డాలర్లు
2020	15.0	2026	61.3
2021	23.2	2027	69.3
2022	26.3	2028	78.3
2023	34.5	2029	88.5
2024	46.5	2030	103.5
2025	54.3	(2026 నుంచి అంచనాలు)	

ప్రస్తుత ఉద్యోగుల్లో నగరాల వారీగా శాతం

శ్రేణి	సంఖ్య	శాతం
ప్రథమ	1,80,000	72
ద్వితీయ	45,000	18
తృతీయ	25,000	10

నిపుణుల అనుభవం

అనుభవం (సంవత్సరాల్లో)	ఉద్యోగులు (శాతాల్లో)
0–5	50
6–10	30
11–15	12
15+	8

విభాగాలవారీగా నిపుణులు

విభాగం	శాతం
తయారీ, అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్	39
ఇంజనీరింగ్, ఐటీ	36
పరిశోధన –అభివృద్ధి, ఇతరులు	25



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్

ఐదుగురు విద్యార్థులు.. 9 మంది టీచర్లు

మహబూబాబాద్ జిల్లా రాజులకొత్తపల్లి జెడ్పీ స్కూల్ పరిస్థితి ఇది

నెల్లికుదురు: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని రాజులకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదుగురు విద్యార్థులకు 9 మంది ఉపాధ్యాయులు బోధన చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఆరో తరగతిలో ఒకరు, ఏడో తరగతిలో ఇద్దరు, ఎనిమిదో తరగతిలో ఇద్దరు మొత్తం ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. 9, 10 తరగతుల్లో అసలు విద్యార్థులే లేరు. గురువారం పాఠశాలకు ఐదుగురు విద్యార్థులు, ఏడుగురు ఉపాధ్యాయులు హాజరయ్యారు. హెచ్‌ఎంతో పాటు మరో ఉపాధ్యాయుడు పాఠశాలకు రాలేదు. పాఠశాలలు తెరిచి మూడు నెలలు దాటుతున్నా.. విద్యాశాఖ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న చోట ఇక్కడి వారిని సర్దుబాటు చేయడంలో అధికారులు ఎందుకింత నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఎంఈఓ రాందాస్‌ను వివరణ కోరగా పాఠశాలకు విద్యార్థులు రావడం లేదని, ఉన్న ఐదుగురు విద్యార్థులకు న్యాయం చేయాలి కాబట్టి అక్కడి టీచర్లను సర్దుబాటు చేయలేదన్నారు. పీఈటీని వేరే పాఠశాలలో సర్దుబాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

అన్ని ప్రాంతాలను సమదృష్టితో చూడాలి

- కొత్త ప్రాంతాలతోపాటు పాతబస్తీ కూడా అభివృద్ధి చెందాలి
- ట్రాఫిక్ సమ్మిట్ ప్రారంభంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ట్రాఫిక్ నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అవసరం
- రహదారిపై క్రమశిక్షణ ఉన్నచోటే ప్రాణానికి రక్షణ

సాక్షి, హైదరాబాద్: కొత్త నగరం, ఫ్యూచర్ సిటీతో పాటు పాతబస్తీ కూడా అభివృద్ధి చెందాలని, ప్రభుత్వం అన్ని ప్రాంతాలను సమదృష్టితో చూడాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పిన 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' ప్రధాన ఉద్దేశం అదేనని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీసులు జలవిహార్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్–2025ను గురువారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.

ప్రజల ప్రవర్తనే కీలకం

'సమగ్ర అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో కూడిన ట్రాఫిక్ నిర్వహణ అవసరం. గడిచిన దశాబ్ద కాలంలో దేశంలో జాతీయ రహదారులు 60 శాతం విస్తరించాయి. రహదారిపై క్రమశిక్షణ ఉన్నచోటే ప్రాణానికి రక్షణ ఉంటుంది. హైదరాబాద్‌లోనే రోజుకు 1,500 వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. అన్ని మెట్రోల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. నేను ఈశాన్య భారతదేశంలో ఉన్న చిన్న రాష్ట్రమైన త్రిపురకు చెందినవాడిని. విద్యార్థిగా ఉన్నప్పుడు రాజధాని అగర్తలా మొత్తం కాలినడకన తిరిగా. కొందరు సైకిల్‌పై సంచరించే వాళ్లు. కానీ ఇప్పుడు అక్కడ కూడా ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతున్నాయి. పక్కనే ఉన్న మేఘాలయా రాజధాని షిల్లాంగ్‌లోనూ అదే పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రజల ప్రవర్తన పైనే వాటి ఫలితాలు ఆధారపడి ఉంటాయి..' అని గవర్నర్ చెప్పారు.

భద్రతలో ప్రతిఒక్కరూ భాగస్వాములు

'ప్రతి ఒక్కరూ ఆ భద్రతలో భాగస్వాములే. ట్రాఫిక్, రోడ్డు భద్రత కోణంలో బయటకు వెళ్లిన బిడ్డలు సురక్షితంగా తిగిరి వస్తారో? లేదో? అని భయపడే తల్లులు ఇప్పటికీ ఉన్నారు. అలాంటి తల్లులు ఆందోళన లేకుండా, రోగి సమయానికి ఆసుపత్రికి, ఉద్యోగి కార్యాలయానికి ఇబ్బంది పడకుండా చేరేలా చేయడమే లక్ష్యం కావాలి. ప్రజలకు అవగాహన కల్పించడమంటే సమాచారం ఇవ్వడం కాదు. ప్రతి ఒక్కరూ అమలు చేసేలా కృషి చేయడం. ప్రజ లు కూడా ఓటు వేశాం కదా అంతా ప్రభుత్వం చూసుకుంటుందనే ధోరణి వీడాలి. టీ–హబ్, టీ–వర్క్స్ లాగా తెలంగాణ పోలీసు శాఖకు కూడా దేశమంతటికీ ఆదర్శం కావాలి. నేను నా రాష్ట్రానికి వెళ్లినప్పుడు తెలంగాణను ఆదర్శంగా తీసుకోమని అక్కడి ముఖ్యమంత్రికి చెప్తా..' అని గవర్నర్ అన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో కమిషనర్ సీవీ ఆనంద్

ట్రాఫిక్ ఓ పెనుసవాల్: సీవీ ఆనంద్

హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. 'ట్రాఫిక్ నిర్వహణ పోలీసులకు ఓ పెనుసవాల్. పట్టణాలు, నగరాలకు వలసలు పెరగడమే దీనికి కారణం. ట్రాఫిక్ అంశంలో బెంగళూరు అధ్వానమని అందరూ అంటారు. కానీ హైదరాబాద్ కూడా ఆ దిశలో వెళ్తోంది. ఇప్పటికే 92 లక్షల వాహనాలు ఉండటం, ప్రతిరోజూ కొత్తగా 1,500 వాహనాలు వచ్చి చేరుతుండటమే దీనికి కారణం..' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, పి.విశ్వప్రసాద్, సంయుక్త సీపీ డి.జోయల్ డేవిస్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌కు చెందిన శేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యూఎక్స్ ఇండియా–25 సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

యాప్ డిజైన్‌లో లీడర్‌గా హైదరాబాద్

- ఏఐ టెక్నాలజీకి నగరమే గ్లోబల్ సెంటర్
- యూఎక్స్ ఇండియా–25 సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి

మాదాపూర్ (హైదరాబాద్): యాప్ డిజైన్ లీడర్‌గా హైదరాబాద్‌ను నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో గురువారం యూఎంఓ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూఎక్స్ ఇండియా–25 పేరిట ఏర్పాటు చేసిన 21వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ యూజర్ ఎక్స్‌పీరియన్స్ ప్రొడక్ట్ డిజైన్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి భట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరం ఎటువంటి టెక్నాలజీనైనా అందిపుచ్చుకుని లీడర్‌గా ఎదుగుతుందని తెలిపారు. ఏఐ టెక్నాలజీకి హైదరాబాద్ మహానగరాన్ని గ్లోబల్ సెంటర్‌గా నిలబెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు యావత్ కేబినెట్ పట్టుదలతో ఉందన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన ప్రతినిధులు హైదరాబాద్ వాతావరణం, సంస్కృతి, కళలు, ఆహారం, అన్నింటినీ ఆస్వాదించాలని భట్టి కోరారు.

ఇన్నోవేషన్ హబ్‌గా తెలంగాణ: శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌ను గ్లోబల్ డిజైన్ హబ్‌గా మార్చాలనే సంకల్పంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డిజైన్‌ను ప్రారంభించనున్నట్టు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. టీహబ్, టీవర్క్స్, వీహబ్‌లాంటి సంస్థల ద్వారా తెలంగాణను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూఎంఓ డిజైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కళాధర్‌బాపు పాల్గొన్నారు.

టెర్రస్ గార్డెన్‌లను ప్రోత్సహించేందుకు శిక్షణ

సాక్షి, హైదరాబాద్: కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరాల్లో టెర్రస్ గార్డెన్‌లను ప్రోత్సహించేందుకు ప్రతీ రెండో శనివారం శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నామని హార్టికల్చర్ కమిషనర్ యాస్మిన్ బాషా తెలిపారు. నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హార్టికల్చర్ షోను గురువారం ఆమె ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి అరుదైన మొక్కలు, విత్తనాలు తీసుకువచ్చి నర్సరీ మేళాలో ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. 150 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ మేళా సందర్శకులకు అందుబాటులో ఉంటుందని మేళా ఇన్‌చార్జి ఖాలీద్ అహ్మద్ చెప్పారు. ప్రదర్శనలో రూ.30 నుంచి రూ.3 లక్షల వరకు ఖరీదు చేసే మొక్కలు లభ్యమవుతాయన్నారు.

బ్యాంకు ఖాతాలు సరఫరా చేసే ముఠా అరెస్టు

సైబర్ నేరగాళ్లకు వివరాలిస్తున్నట్లు గుర్తించిన టీజీ సీఎస్‌బీ

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును మార్పిడి చేసేందుకు బ్యాంక్ ఖాతాల వివరాలు సరఫరా చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీ సీఎస్‌బీ) అరెస్ట్ చేసింది. ఈ ముఠా అందించిన బ్యాంక్ అకౌంట్లతో చైనాకు చెందిన సైబర్ నేరగాళ్లు కాంబోడియా నుంచి ఇన్వెస్ట్‌మెంట్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ గురువారం ప్రకటనలో వెల్లడించారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ జిల్లాకు చెందిన శివారెడ్డి (33) హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌లో నివాసం ఉంటున్నాడు. బ్యాంక్ అ కౌంట్లను సేకరించి సైబర్ నేరగాళ్లకు అందిస్తున్నా డు. ఇందుకు ఒక్కో అకౌంట్ రూ.లక్ష కమీషన్ ఇస్తున్నాడు. ఈ క్రమంలోనే కూకట్‌పల్లిలో ఉంటున్న ఓలా డ్రైవర్ చిన్నం ఉగ్ర నర్సింహులు (29) పరిచయం అయ్యాడు. శివారెడ్డి సూచనల మేరకు రిటా నా ప్రాపర్టీస్ పేరుతో నర్సింహులు ఆర్బీఎల్ బ్యాంకులో కరెంట్ అకౌంట్ ఓపెన్ చేశాడు. ఇలా ఓపెన్ చేసిన బ్యాంకు ఖాతాలను శివారెడ్డి, నర్సింహులు, మోహినుద్దీన్ షేక్, పసుపులేటి రాజేశ్ (27) సైబర్ నేరగాళ్లకు ఇస్తూ కమీషన్లు పొందే వారు.

ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌తో వెలుగులోకి..: రంగారెడ్డి జిల్లా హయత్ నగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఆయన వాట్సాప్ నంబర్‌కు జూలై 13న 8968651687 నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. సైబర్ నేరగాళ్లు https://m. ironfxsvip.vip లింక్ పంపించి ట్రేడింగ్ అకౌంట్లో ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.4.87 కోట్లు వసూలు చేశారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా సీఎస్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ అయిన ఖాతాలపై దర్యాప్తు చేయగా రిటానా ప్రాపర్టీస్ సహా మరికొన్ని అకౌంట్లకు డబ్బు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించారు. నర్సింహులును అదుపులోకి తీసుకుని విచారించగా వీరి దందా బయటపడింది. నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

లద్దాఖ్ మారథాన్ పూర్తి

సెక్రటేరియట్ ఏడీఎఫ్‌వోకు ఫైర్ డీజీ అభినందన



ఫైర్ మారథాన్ ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: ఈనెల 14న నిర్వహించిన లద్దాఖ్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సెక్రటేరియట్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ జీవీ ప్రసాద్‌ను అగ్నిమాపకశాఖ డీజీ వై.నాగిరెడ్డి గురువారం అభినందించారు. సముద్ర మట్టానికి 11,500 అడుగుల ఎత్తులో (3,505 మీటర్లలో) ఉండే లద్దాఖ్‌లో.. మొత్తం 42.20 కిలోమీటర్ల దూరం నడవడమే ఈ మారథాన్ ప్రత్యేకత. అత్యంత క్లిష్టమైన ఈ మారథాన్‌ను రన్నర్లు ప్రతిష్టాత్మకంగా భావిస్తారు. ఈ మారథాన్ విజయంతో.. జీవీ ప్రసాద్ ప్రస్తుతం ఖర్దూంగ్‌లా మారథాన్ (72 కిలోమీటర్లు, లద్దాఖ్)లో పాల్గొనేందుకు అర్హత పొందారు. గతంలోనూ ఆయన బెంగళూరులో 10 కిలోమీటర్లు, ఢిల్లీలో 25 కిలోమీటర్లు, కోల్‌కతాలో 25 కిలోమీటర్లు, ముంబై మారథాన్‌లో 42.20 కిలోమీటర్లు పూర్తి చేశారు. ఈ విభాగంలో ఇప్పటివరకు 50 పతకాలు గెలుచుకున్నారు.

యూనిఫామే స్కానర్

- రైల్వే సిబ్బంది యూనిఫామ్‌లపై క్యూఆర్ కోడ్‌లు
- యూటీఎస్ టిక్కెట్ల కొనుగోలు ఆ స్కానర్ల నుంచే
- సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రారంభించిన ద.మ.రైల్వే



సాక్షి, హైదరాబాద్: సాధారణ రైలు టిక్కెట్ల కొనుగోలు కోసం దక్షిణమధ్య రైల్వే సరికొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకొని యూటీఎస్ టిక్కెట్లకు మొబైల్ స్కానర్ల సదుపాయాన్ని రైల్వేస్టేషన్‌లలో ప్రవేశపెట్టింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం ఈ సదుపాయం అందుబాటులో ఉంది. ప్రయాణికులు సాధారణ టిక్కెట్ల కోసం రైల్వే కౌంటర్ల వద్ద పడిగాపులు పడాల్సిన అవసరం లేకుండా స్టేషన్ ఆవరణలో ఎంపిక చేసిన కొంతమంది సిబ్బంది మొబైల్ సేవలందజేస్తారు. ఇందుకోసం వారు ధరించిన జాకెట్ల వెనుక భాగంలో క్యూఆర్ కోడ్‌లు ముద్రితమై ఉంటాయి. ప్రయాణికులు యూటీఎస్ యాప్‌తో స్కాన్ చేసి తమకు అవసరమైన టిక్కెట్లను కొనుగోలు చేయవచ్చు. అన్‌రిజర్వ్‌డ్ టిక్కెట్ల కోసం దక్షిణమధ్య రైల్వే యూటీఎస్ యాప్‌ను తెచ్చింది. దీన్ని ప్రారంభించినప్పటి నుంచి ప్రయాణికుల నుంచి విశేషమైన స్పందన లభిస్తోంది. ప్రతిరోజు లక్షలాది మంది ఈ యాప్ సేవలను వినియోగించుకుంటున్నారు. మొబైల్ స్కానర్ల సేవలను ప్రధాన స్టేషన్లు అయిన సికింద్రాబాద్, కాచిగూడ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, తిరుపతి, నాందేడ్ తదితర చోట్ల ప్రవేశపెట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు తాము బయలుదేరనున్న స్టేషన్ ప్రాంగణం లేదా రైల్వే ట్రాక్ నుంచి 5 మీటర్ల పరిధిలో సాధారణ టిక్కెట్లను కొనుగోలు చేయవచ్చు. ఈ యూటీఎస్ యాప్‌లో బహుళ భాషల్లో వివరాలు లభిస్తాయి. అలాగే ఆర్–వాలెట్ ద్వారా టిక్కెట్లు కొనుగోలు చేసేవారికి 3 శాతం బోనస్ కూడా లభిస్తుంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

వెదురు కంజి.. ఎంతో ప్రీతి

మన్యం వంటకాల్లో ఒకటి.. చిగుళ్లతో కర్రీ





సేకరించిన వెదురు కొమ్ములు, అమ్మకానికి సిద్ధంగా ఉన్న వాటాలు

కొమ్ముల సేకరణలో గిరిజనుల బిజీ

ముంచంగిపుట్టు: మన్యం వంటకాల్లో వెదురు కంజి కూర ఒకటి. వెదరు చిగుళ్లతో కూర తయారు చేసుకుని మన్యం వాసులు ఎంతో ప్రీతిగా తింటారు. అల్లూరి జిల్లాలో గిరిజనులు వీటిని వెదురు కంజి, వెదురు కొమ్ములు అని కూడా పిలుస్తారు.

ఆహారం.. ఆదాయం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వెదురు చిగుళ్లు ఏపుగా వస్తున్నాయి. వీటిని సేకరించిన గిరిజనులు విక్రయించి ఆదా యం పొందుతున్నారు. ప్రస్తుతం వీటి అమ్మకాలు హాట్ కేక్‌ల్లా జరుగుతున్నాయి. అటవీ ప్రాంతాల్లోని వెదురు బొంగు నుంచి లేత వెదురును తీసి వాటి నుంచి చిగురును సేకరిస్తున్నారు. శుభ్రం చేసి ముక్కలు చేసి వాటా రూ. 20 నుంచి రూ.40కు అమ్ముతున్నారు.

రెండు రకాలుగా కర్రీ..

వెదురు కంజిని రెండు రకాలుగా కూర తయారీకి వినియోగిస్తారు. పచ్చి వెదురు కంజిని ఒక రకంగా, ఎండబెట్టి మరో విధంగా కూర తయారు చేస్తారు. పచ్చిగా ఉన్నప్పుడు వెంటనే కూర తయారు చేసుకోవాలి. ఎండ బెట్టుకొని ఉంటే ఏడాది కాలంలో ఎప్పుడైనా కూర తయారీకి వినియోగించవచ్చని గిరిజనులు తెలిపారు. వెదురు కంజిని వేపుడు, పచ్చడి, పులుసు ఇలా రకరకాలుగా తయారు చేసుకుని తింటామని వారు పేర్కొన్నారు. కూర తయారీకి ముందు రెండు మూడు సార్లు బాగా కడుగుకోవాలి..అప్పుడే వెదురు కంజిలో ఉండే చేదు పోతుందని గిరిజనులు తెలిపారు.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో.. వెదురుకంజిని బాగా ఉడకబెట్టి దాని కషాయాన్ని తాగితే వేడి చేస్తుంది. మధుమేహం, కఫం, మూల వ్యాధి నివారణకు దోహదపడుతుంది. రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా గర్భకోశ వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుందని గిరిజనులు చెబుతున్నారు. వెదురు కంజిని పేస్ట్‌గా తయారు చేసి గాయంపై రాయడం వల్ల త్వరగా మాను పడుతుందని వారు వివరించారు. అంతేకాకుండా పాము, తేలు కాటులకు ఔషధంగా ఉపయోగిస్తామని వారు వివరించారు.

బిగ్ రిలీఫ్



దసరా, దీపావళి పండగ ఆనందాలు రెట్టింపు కానున్నాయి. ఇటీవల కేంద్రం సవరించిన వస్తు సేవల పన్ను(జీఎస్టీ) శ్లాబులు ఈ నెల 22వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. గృహోపకరణాలు, ఆటో మొబైల్స్, ఎలక్ట్రానిక్ వంటి చాలా వరకు ఉత్పత్తుల ధరలు 10 శాతం మేర తగ్గనున్నాయి. గృహ నిర్మాణ భారం నుంచి ఉపశమనం కలగనుంది. దీంతో వాహనాలు, కార్లు, టీవీలు, సెల్‌ఫోన్లు వంటి ఉత్పత్తుల కొనుగోలుదారులు ఈనెల 22 వరకు వాయిదా వేసుకుంటున్నారు. ఈ కామర్స్ సంస్థలు సైతం ఈనెల 22 తర్వాతే ఆఫర్లు అందించేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లు, ఆన్‌లైన్ సంస్థల్లో అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. – విశాఖ సిటీ

తగ్గనున్న నిత్యావసర ధరలు



ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. ఉప్పు నుంచి పప్పు వరకు రేట్లు విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో జీఎస్టీ సవరణలతో మరో వారం రోజుల్లో ఈ ధరలు దిగిరానున్నాయి. సాధారణ ప్రజలు నిత్యం వినియోగించే వస్తువులపై కేవలం 5 శాతం మాత్రమే జీఎస్టీ విధించారు. దీంతో పేస్ట్ నుంచి డ్రై ఫ్రూట్స్ వరకు ధరలు తగ్గనున్నాయి. వీటితో పాటు పన్నీర్, బ్రెడ్, వెన్న, నెయ్యి, పాస్తా, నూడుల్స్, కార్న్‌ఫ్లేక్స్, బిస్కెట్లు, కేకులు, స్వీట్లు వంటి ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల ధరలు అందుబాటులోకి రానున్నాయి. ఖరీదైన బాదం, జీడిపప్పు, పిస్తా, ఖర్జూరం వంటి వాటిపై కూడా జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గనుంది. ఇది సాధారణ ప్రజలకు భారీ ఉపశమనాన్ని అందించనుంది.

గృహ నిర్మాణ భారం నుంచి ఉపశమనం



జీఎస్టీ సంస్కరణలతో రియల్ ఎస్టేట్ రంగానికి మంచి రోజులు కనిపిస్తున్నాయి. బిల్డర్లతో పాటు సొంతింటి నిర్మాణాలు చేపట్టే ప్రజలకు నిర్మాణ వ్యయం భారీగా తగ్గనుంది. దీంతో ఫ్లాట్లు, ఇళ్ల ధరలు తగ్గనున్నాయి. నిర్మాణ రంగంలో కీలకమైన సిమెంట్, ఇసుక, ఇటుకలు, గ్రానైట్, మార్బుల్స్, టైల్స్, రంగుల ధరలపై కేంద్రం జీఎస్టీని తగ్గించింది. సాధారణంగా ఇంటి నిర్మాణంలో అయ్యే ఖర్చులో 40–45 శాతం వ్యయం నిర్మాణ సామగ్రిదే ఉంటుంది. తాజా జీఎస్టీ సవరణతో నిర్మాణ సామగ్రిపై అయ్యే ఖర్చులో డెవలపర్‌కు 10–15 శాతం వరకు ఆదా అవుతుంది. ఫలితంగా మొత్తం ఇంటి నిర్మాణ వ్యయం 4–6 శాతం వరకు ఖర్చు తగ్గుతుంది.

ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు సైతం..



జీఎస్టీ సవరణతో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ధరలు కూడా భారీగా తగ్గనున్నాయి. ఇప్పటి కంటే 10 నుంచి 13 శాతం మేర ధరలు దిగివచ్చే అవకాశాలు ఉన్నాయి. టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు ఇలా అన్ని రకాల ఎలక్ట్రానిక్ వస్తువుల ధరల్లో వ్యత్యాసం భారీగా ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు కూడా అందుబాటు ధరల్లోకి రానున్నాయి. టీవీలపై రూ.5 వేలు నుంచి రూ.15 వేలు వరకు, మొబైల్ ఫోన్లపై రూ.2 వేలు నుంచి రూ.5 వేలు, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్లపై రూ.7 వేలు నుంచి రూ.10 వేలు వరకు తగ్గింపు ఉండే అవకాశం ఉంది. సాధారణంగా దసరా, దీపావళి సమయాల్లో ఎలక్ట్రానిక్, వస్తువులపై వ్యాపారులు ప్రత్యేక డిస్కౌంట్లు, బహుమతులు ఇస్తుంటారు. ఈ ఏడాది మాత్రం వ్యాపారుల ఆఫర్లతో పాటు కేంద్రం జీఎస్టీ రూపంలో కొనుగోలుదారులకు శుభవార్త చెప్పింది. దీంతో ప్రజలు ఈ నెల 22వ తేదీ తర్వాతే గృహోపకరణాలు, మొబైల్స్‌ను కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యారు.

వాహనాలపై 28 నుంచి 18 శాతానికి..



వాహనాల ధరలపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి కేంద్రం కుదించింది. దీంతో వీటి ధరలు తగ్గనున్నాయి. సాధారణంగా దసరా, దీపావళి పండగ సీజన్లలో వాహనాలను కొనుగోలు చేయడం సెంటిమెంట్‌గా భావిస్తుంటారు. ఈ నెల 22వ తేదీ నుంచి బైక్‌లు, కార్లపై 10 శాతం వరకు ధరలు తగ్గే అవకాశాలు ఉండడంతో భారీగా వాహనకొనుగోళ్లు జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బైక్, కార్ల కంపెనీలు తగ్గించిన ధరలను ప్రకటించాయి. బైక్‌లపై రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు, మధ్యస్థాయి కారుపై రూ.1.5 లక్షల వరకు తగ్గింపు ఉండనుంది. దీంతో కొనుగోలుదారులు ఈనెల 22 తర్వాతే వాహనాలను కొనుగోలు చేసేందుకు వాయిదా వేస్తున్నారు. అయితే కొన్ని షోరూమ్‌లు ప్రీ బుకింగ్‌లకు కూడా డిస్కౌంట్ ధరలు ప్రకటించాయి. లగ్జరీ కార్లపై 40శాతం జీఎస్టీ విధించారు. 350 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ ఉన్న బైక్‌లు, ఇతర లగ్జరీ వస్తువులపై ప్రత్యేక, అధిక స్లాబ్ వడ్డించారు.

ఈ-కామర్స్‌లో ఆఫర్ల వెల్లువ



ఈ-కామర్స్ సంస్థల్లో కూడా డిస్కౌంట్ల సందడి మొదలైంది. ఈ నెల 22వ తేదీ నుంచి అమెజాన్ 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్', ఫ్లిప్‌కార్ట్ 'బిగ్ బిలియన్ డేస్' పేర్లతో భారీ సేల్‌కు సిద్ధమవుతున్నాయి. ఇక మింత్రా, మీషో, షాపి వంటివి ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. జీఎస్టీ సవరణలతో ఈ నెల 22వ తేదీ నుంచి అన్ని రకాల వస్తువులపై డిస్కౌంట్ల వర్షం కురిపించనున్నాయి.

గ్రూప్‌-1 మెయిన్స్ మూల్యాంకనం కేసులో

వాడివేడిగా వాదనలు

ఏపీపీఎస్సీ వాస్తవాలు దాస్తోందన్న హైకోర్టు

రోజంతా వాదనలు.. తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: గ్రూప్‌-1 ప్రధాన పరీక్ష సమాధాన పత్రాల మాన్యువల్ మూల్యాంకనం మంగళగిరి హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో జరిగినట్లు అభ్యర్థులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పూర్తి వివరాలను తమ ఎదుట ఉంచకుండా దాపరికం పాటిస్తోందని హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఏపీపీఎస్సీలో పారదర్శకత లోపించిందని ఆక్షేపించింది. మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయంటూ హైకోర్టులో దాఖలైన పలు వ్యాజ్యాలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. పరీక్షను, అర్హత సాధించిన వారి జాబితాను కూడా రద్దు చేశారు. మెయిన్స్ మళ్లీ నిర్వహించాలని, మొత్తం ప్రక్రియను 6 నెలల్లో పూర్తి చేయాలని ఏపీపీఎస్సీ అధికారులను ఆదేశించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ.. హైకోర్టులో అప్పీల్ చేసింది. అయితే, ఉద్యోగాలు పొంది ప్రస్తుతం వివిధ హోదాల్లో కొనసాగుతున్న వారు కూడా అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ ధర్మాసనం గురువారం విచారణ మొదలుపెట్టింది. వాదనలు వాడివేడిగా, దాదాపు రోజంతా కొనసాగాయి. హాయ్‌ల్యాండ్‌లో జరిగింది సన్నాహకాలు మాత్రమేనని ఏపీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేస్తున్న విచారణ పూర్తయ్యేదాక వేచి చూడడం ఉత్తమమని వివరించారు. ఉద్యోగాలు పొంది ప్రస్తుత వివిధ హోదాల్లో పనిచేస్తున్న వారి తరఫున సీనియర్ న్యాయవాదులు చింతల విష్ణు మోహన్‌రెడ్డి, ఓబిరెడ్డి మనోహర్‌రెడ్డి, పమిడిఘంటం శ్రీరఘురాం, న్యాయవాదులు శ్రీకాంత్, జీవీరెడ్డి తదితరులు వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది శివ వాదనలు వినిపించారు. తదుపరి వాదనల నిమిత్తం విచారణను ధర్మాసనం శుక్రవారానికి వాయిదా వేసింది.

ఎస్‌ఎస్‌సీ మూల్యాంకన నిధులు విడుదల చేయాలి: ఎస్టీయూ

సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్షల మూల్యాంకన నిధులు వెంటనే విడుదల చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూల్యాంకనం ఏప్రిల్ నెలలోనే పూర్తయిందని, ఇప్పటికే ఐదు నెలలు పూర్తవుతున్నా ఉపాధ్యాయులకు మూల్యాంకన పారితోషికం ఇవ్వకపోవడం సరి కాదని పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా చలనం లేదని ఆక్షేపించారు. గతేడాది ఎస్‌ఎస్‌సీ వంద రోజుల యాక్షన్ ప్లాన్ సందర్భంగా సెలవు రోజుల్లో పనిచేసిన టీచర్లకు ఇంతవరకు సీసీఎల్ మంజూరు చేయలేదని వివరించారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థికపర, ఆర్థికేతర అంశాలపై పాలక పక్షం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందని, ఈ విధానం మంచిది కాదని పేర్కొన్నారు. పీఆర్సీ గడువు పూర్తయ్యి 26 నెలలు దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

అసెంబ్లీలో ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలి

ఈ అసెంబ్లీ సమావేశాలలో ఉద్యోగుల ఆర్థిక బకాయిలపై చర్చించి, పరిష్కారం చూపాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్ భాస్కర్ ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ గడువు 2023 జూలైతో ముగిసినా ఇప్పటివరకు కొత్త పీఆర్సీ చైర్మన్‌ను నియమించలేదని, ఐఆర్ ప్రకటించలేదని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు నాలుగు డీఏలు, ఇతర బకాయిలు ఇప్పటివరకు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కారం చూపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అంతర్ జిల్లా బదిలీలు పూర్తయ్యాకే డీఎస్సీ భర్తీ చేపట్టాలి

ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీల్లో స్థానాలు కేటాయించిన తర్వాతే డీఎస్సీలో ఎంపికైన వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తూ అంతర్ జిల్లా బదిలీకి దరఖాస్తు చేసుకున్న స్పౌజ్ కేటగిరీ ఉపాధ్యాయులకు డీఎస్సీ నియామకాల తరువాత ఇస్తే న్యాయం జరగదని పేర్కొన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఖాళీలను క్లస్టర్ వేకెన్సీలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

22 నుంచి డిగ్రీ కళాశాలలను

మూసేస్తాం

- దసరా తర్వాత నిరవధిక సమ్మె
- డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం హెచ్చరిక

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో జాప్యం కారణంగా కళాశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నాన జయరామ్, ప్రధాన కార్యదర్శి పాదిలి పెద్దిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏడు క్వార్టర్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో కళాశాలలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక, నాణ్యమైన విద్యను అందించేందుకు అవరోధాలు ఏర్పడుతున్నట్టు వాపోయారు. ఫీజులు విడుదల కాని పక్షంలో ఈ నెల 22 నుంచి ప్రైవేటు డిగ్రీ కళాశాలలను మూసివేయాలని నిర్ణయించినట్టు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే దసరా సెలవుల అనంతరం, రెండో విడత డిగ్రీ ప్రవేశాలు పూర్తి చేసిన తర్వాత ప్రైవేటు డిగ్రీ కళాశాలలు నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు రమణజీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిధిలోకి వచ్చే ఇంజినీరింగ్, డిగ్రీ, నర్సింగ్, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్ విద్యను అందించే కళాశాలలు కలిసి నిరవధిక సమ్మెకు వెళ్తాయని స్పష్టం చేశారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా గ్రీవెన్స్‌ను పంపడం, కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులు, సీఎంను కలిసి వినతిపత్రాలు అందించే కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు.

టెంపుల్ జాగా.. ప్రైవేట్ పరం దిశగా



ద్వారకాతిరుమల కొండపైన హరితా హోటల్

ప్రైవేటీకరణకు సిద్ధంగా ఏపీటీడీసీ యూనిట్లు



హోటల్ వెనుక కోటి రూపాయలతో నిర్మించిన కల్యాణ మండపం

- అందులో ద్వారకాతిరుమల కొండపైన హరితా హోటల్ ఒకటి
- పర్యాటకుల సౌకర్యార్థం 23 ఏళ్ల క్రితం హోటల్ నిర్మాణానికి.. స్వల్ప ధరకు భూమిని విక్రయించిన శ్రీవారి దేవస్థానం
- ఇప్పుడు భవనంతో పాటు ప్రైవేట్ పరం కానున్న గోవిందుడి భూమి
- ప్రైవేట్‌కి ఇస్తే క్షేత్రానికి ముప్పు.. ఆపై సామాన్యులకు ఇబ్బందులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం పర్యాటకులకు మెరుగైన సేవలు అందించాలనే మంచి ఉద్దేశ్యం, లక్ష్యంతో రెండు దశాబ్దాల క్రితం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థకు అతి తక్కువ ధరకు విక్రయించిన కోట్లాది రూపాయల విలువైన భూమి ఇప్పుడు ప్రైవేట్ పరం కానుందా.. అంటే అవుననే చెప్పాలి. ఎందుకంటే రాష్ట్రంలోని పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) యూనిట్లను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోంది. దాంతో ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవారి కొండపై ఉన్న హరితా హోటల్, అది ఉన్న భూమి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనుంది. అదే జరిగితే గోవిందుడి భూమిలో ప్రైవేట్ వ్యాపారం జరగడం ఖాయం. వివరాల్లోకి వెళితే. టెంపుల్ టూరిజంలో భాగంగా శ్రీవారి దేవస్థానం సుమారు 2 ఎకరాల భూమిని 23 ఏళ్ల క్రితం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థకు విక్రయించింది. ప్రభుత్వ సంస్థ కావడం, భక్తులకు సౌకర్యాలు కలుగుతాయన్న ఉద్దేశ్యంతో అప్పట్లో నామమాత్రపు ధరకు భూమిని దేవస్థానం అమ్మింది.

కోటిన్నరతో హోటల్ నిర్మాణం..

సుమారు రూ.1.50 కోట్లతో నిర్మించిన ఈ హోటల్‌ను 2002 డిసెంబర్ 19న ప్రారంభించారు. పర్యాటకులు, సామాన్య భక్తులు ఈ హోటల్‌లోని గదులు, రెస్టారెంట్, ఫంక్షన్ హాల్స్‌ను వినియోగిస్తున్నారు. అయితే 7 ఏళ్ల క్రితం టీడీపీ హయాంలోనే ఈ హోటల్‌తో పాటు, మరికొన్ని హోటళ్లను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నించగా, అప్పటి శ్రీవారి దేవస్థానం అధికారులు తమ భూమిలో ఉన్న హోటల్‌ను తమకే అప్పగించాలని టూరిజం శాఖ అధికారులను కోరారు. దాంతో ప్రైవేటీకరణ అంశానికి తాత్కాలికంగా తెరపడింది. మళ్లీ చంద్రబాబు సీఎం కావడంతో తాజాగా ప్రైవేటీకరణ అంశం తెరమీదకొచ్చింది. ఈ సారి ఏకంగా 33 ఏళ్ల లీజుకు ఈ హరితా హోటళ్లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం శరవేగంగా జరుగుతోంది.

రూ.3 కోట్లతో అభివృద్ధి

స్థానిక హరిత హోటల్లో 8 డీలక్స్, 8 ఏసీ స్టాండర్డ్, 2 నాన్ ఏసీ రూములు, ఒక రెస్టారెంట్, మినీ ఫంక్షన్ హాల్ ఉండేది. వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులను మంజూరు చేయగా, ఆ నిధులతో ఏడాదిన్నర క్రితం హోటల్లో అన్ని సౌకర్యాలను సమకూర్చారు. క్షేత్రంలో కల్యాణ మండపాలకు మంచి డిమాండ్ ఉండటంతో సుమారు కోటి రూపాయలు వెచ్చించి, ఒక పెద్ద ఏసీ ఫంక్షన్ హాల్‌ను నిర్మించారు. ఇప్పుడు ప్రైవేటీకరణ చేస్తే రూ. 3 కోట్లు ఖర్చు వృథా అయినట్టే.

ప్రైవేట్‌కి ఇస్తే.. క్షేత్రాల పవిత్రతకు ముప్పే

ద్వారకాతిరుమల, శ్రీశైలం క్షేత్రాల్లో కొండపై ఉన్న ఈ హరిత హోటళ్లను ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెడితే సామాన్య భక్తులకు వాటి ధరలు అంబాటులో ఉండవు. అలాగే మద్యం, మాంసాల వినియోగంతో పాటు, అసాంఘిక కార్యకలాపాలు జరిగి, క్షేత్ర పవిత్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. కాబట్టి ఆలయాల పరిసరాల్లో ఉన్న హరితా హోటళ్లను మాత్రం ఆ దేవస్థానాలకే లీజుకు ఇచ్చి, వాటి నుంచి ప్రభుత్వం ఆదాయాన్ని పొందితే బాగుంటుందని పలువురు అంటున్నారు.

ఉద్యోగుల్లో ఆందోళన..

రాష్ట్ర వ్యాప్తంగా హరితా హోటళ్లలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, రోజువారీ పద్ధతిన 1,300 మంది పని చేస్తున్నారు. హోటళ్లను ప్రైవేటీకరణ చేస్తే దాదాపు 20 నుంచి 25 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుంది. అందుకే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఇప్పటికే రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీకి, ఎండీ ఆమ్రపాల్‌కు తమ మొర వినిపించి, అర్జీలను అందించారు. అలాగే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మద్దతు కోరారు. గురువారం టూరిజం ఉద్యోగులు విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వం దిగిరాకుంటే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈవో వివరణ

కొండపైన దేవస్థానం స్థలంలో టూరిజం హోటల్ నిర్మించి, అభివృద్ధి చేశారని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి వివరణ ఇచ్చారు. అయితే అప్పట్లో ఆ స్థలాన్ని టూరిజం శాఖకు ఎంతకు విక్రయించారు, ఏమి జరిగిందనే విషయాలను తాను కూడా తెలుసుకోవాల్సి ఉందన్నారు.

ప్రభుత్వంలోనే ఉండాలని..

మేము ప్రభుత్వంలోనే ఉండాలని కోరుకుంటున్నాం. హరిత హోటళ్లు, రిసార్ట్స్‌ను ప్రైవేటీకరణ చేస్తున్నారని తెలిసి ఇప్పటికే మా ఉన్నతాధికారులను కలిశాం. మాకు ఏ ఇబ్బంది ఉండదని చెప్పారు. ద్వారకాతిరుమల హరిత హోటల్‌లో 9 మంది పనిచేస్తున్నాం. నేను 20 ఏళ్ల క్రితం నుంచి పనిచేస్తున్నాను.

– పి.అచ్యుతకుమార్, హరిత హోటల్ కాంట్రాక్ట్ ఉద్యోగి, ద్వారకాతిరుమల

చంద్రబాబే ప్రైవేట్ మనిషి

సీఎం చంద్రబాబే ప్రైవేట్ మనిషి. ఆయనకు కావాల్సిన వారికి టూరిజం హోటళ్లు, రిసార్ట్స్‌లను తక్కువ లీజుకు కట్టబెట్టేందుకు చూస్తున్నారు. టెంపుల్ టూరిజంను ఎప్పుడూ ఆదాయ వనరుగా చూడకూడదు. పర్యాటకుల సౌకర్యాల కల్పనపైనే దృష్టి పెట్టాలి. హోటళ్లు, రిసార్ట్స్‌ను ప్రైవేట్ పరం చేస్తే ఇంక టూరిజం శాఖ దేనికి, దానికి మంత్రి, అధికారులు దేనికి. కొండపైన ప్రైవేట్ వ్యక్తులకు హోటళ్ల నిర్వహణ అవకాశాలు కల్పిస్తే క్షేత్ర పవిత్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

– పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గం మేధావుల ఫోరం అధ్యక్షుడు

సీక్వెల్స్‌కి సై

● టాలీవుడ్‌లో ఊపందుకుంటున్న సీక్వెల్ సినిమాలు

ఓ సినిమా విజయం సాధించి, ఆ సినిమాకు సీక్వెల్ వస్తోందంటే ఆడియన్స్‌లో తప్పక అంచనాలు ఉంటాయి. తెలుగు చిత్రపరిశ్రమలో ఇటీవల సీక్వెల్‌కు స్కోప్ ఉన్న సినిమాల సంఖ్య కాస్త ఎక్కువగానే ఉంటోంది. ఇటు బాక్సాఫీస్ లెక్కల ప్రకారం కూడా సీక్వెల్స్ సినిమాలను తక్కువగా అంచనా వేయడానికి లేదు. ఎందుకంటే... ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన తొలి పది భారతీయ చిత్రాల్లో 'బాహుబలి 2, పుష్ప 2, కేజీఎఫ్ 2' వంటి సినిమాలు ఉన్నాయి. దీన్ని బట్టి సీక్వెల్ సినిమాలు ఆడియన్స్‌కు కనెక్ట్ అయితే, బాక్సాఫీస్ కలెక్షన్స్ నెక్ట్స్ లెవల్లో ఉంటాయని ఊహించవచ్చు. అందుకే ఓ సినిమా హిట్టైతే, ఆ సినిమా సీక్వెల్స్‌ను సెట్స్‌కు తీసుకువెళ్లడానికి ఆయా దర్శక-నిర్మాతలు సన్నాహాలు చేస్తుంటారు. ఇక ఇప్పటివరకూ ఫలానా సినిమాకు సీక్వెల్ అంటూ అనౌన్స్‌మెంట్‌లు చాలానే వచ్చాయి. కానీ అతి కొద్ది సినిమాల సీక్వెల్స్ మాత్రమే సెట్స్‌కు వెళతాయి. ఇలా ఈ ఏడాది ఆల్రెడీ సెట్స్‌కు వెళ్లిన, వెళ్లనున్న లేదా వచ్చే ఏడాది సెట్స్‌కు వెళ్లనున్న కొన్ని సీక్వెల్స్‌పై ఓ లుక్ వేయండి.


● బాలకృష్ణ


● వెంకటేశ్


● ప్రభాస్


● ఎన్టీఆర్


● శ్రీవిష్ణు


● అడివి శేష్


● రిషబ్ శెట్టి


● శర్వానంద్


● తేజ సజ్జా

మూడోసారి దృశ్యం

వెంకటేశ్ హీరోగా 'దృశ్యం' ఫ్రాంచైజీ నుంచి 'దృశ్యం, దృశ్యం 2' చిత్రాలొచ్చాయి. ఈ రెండూ చిత్రాలూ ప్రేక్షకులను మెప్పించి, సూపర్ హిట్స్‌గా నిలిచాయి. కాగా 'దృశ్యం 3' సినిమా పనులు కూడా మొదలయ్యాయని, ఈ చిత్రంలో మీనాతో కలిసి తాను మళ్లీ నటించబోతున్నట్లుగా ఇటీవల అమెరికాలో జరిగిన ఓ ఈవెంట్‌లో వెంకటేశ్ పేర్కొన్నారు. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది చివర్లో ప్రారంభం కానుందని, ఈ చిత్రానికి జీతూ జోసెఫ్ దర్శకత్వం వహిస్తారనే టాక్ వినిపిస్తోంది. అంతేకాదు... 'దృశ్యం 3'ని తెలుగుతో పాటు హిందీ (అజయ్ దేవగణ్ హీరో), మలయాళం (మోహన్‌లాల్ హీరో) వెర్షన్స్‌నూ రెడీ చేసి, ఒకేసారి రిలీజ్ చేసే ప్లాన్‌లో ఉన్నారు జీతూ జోసెఫ్. ఈ దిశగా సన్నాహాలు మొదలయ్యాయి. ముందుగా మోహన్‌లాల్ హీరోగా మలయాళ వెర్షన్ 'దృశ్యం 3' రెడీ అవుతుందట. ఆ తర్వాత తెలుగు 'దృశ్యం 3'ని డైరెక్ట్ చేస్తారట జీతూ జోసెఫ్. "'దృశ్యం, దృశ్యం 2' చిత్రాలకు పూర్తి విభిన్నంగా 'దృశ్యం 3' ఉంటుంది. జార్జి కుట్టి ('దృశ్యం' సినిమాల్లో హీరో పాత్ర పేరు) జీవితం, ఆయన భావోద్వేగాలు, అంతరంగం వంటి అంశాలకు 'దృశ్యం 3'లో పెద్ద పీట వేశాం. ట్విస్టులు, టర్నులు ముందు భాగాలతో పోలిస్తే కాస్త తక్కువగా ఉంటాయి" అని ఇటీవల ఓ సందర్భంలో జీతూ జోసెఫ్ పేర్కొన్నారు. ఇక దర్శకుడు త్రివిక్రమ్‌తో చేయాల్సిన 'ఆనంద నిలయం' (వర్కింగ్ టైటిల్), 'దృశ్యం 3' సినిమాల చిత్రీకరణల్లో వెంకటేశ్ సమాంతరంగా పాల్గొంటారని ఊహించవచ్చు. 'దృశ్యం' ఫ్రాంచైజీ సంగతి అటు ఉంచితే... వెంకటేశ్ చేతిలో 'సంక్రాంతికి వస్తున్నాం'కు సీక్వెల్‌గా 'మళ్లీ సంక్రాంతికి వస్తున్నాం' అనే సినిమా రానుంది. 'ఎఫ్ 2' ఫ్రాంచైజీ కూడా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రాల పనులు ప్రారంభం కావడానికి చాలా సమయం పడుతుంది.

టైమ్ ట్రావెల్...

హీరో బాలకృష్ణ డ్రీమ్ ప్రాజెక్ట్స్‌లో 'ఆదిత్య 999' ఒకటి. బాలకృష్ణ హీరోగా సింగీతం శ్రీనివాసరావు డైరెక్షన్‌లో రూపొందిన టైమ్ ట్రావెల్ అండ్ సైన్స్ ఫిక్షన్ మూవీ 'ఆదిత్య 369' (1991). ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఆదిత్య 999' రూపొందనుంది. కాగా ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలైపోయాయని, బాలకృష్ణ వందో చిత్రం 'గౌతమిపుత్ర శాతకర్ణి'ని డైరెక్ట్ చేసిన క్రిష్ జాగర్లమూడి ఈ 'ఆదిత్య 999' సినిమాకు దర్శకత్వం వహిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో బాలకృష్ణతో పాటు ఆయన తనయుడు మోక్షజ్ఞ కూడా నటించనున్నారని భోగట్టా. ఈ సినిమాలో మోక్షజ్ఞ నటించడం కన్ఫార్మ్ అయితే అతని తొలి చిత్రం ఇదే అవుతుంది. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా చిత్రీకరణ మొదలయ్యే అవకాశం ఉంది. అలాగే బాలకృష్ణ నటించిన మరో సీక్వెల్ మూవీ 'అఖండ 2'. హీరో బాలకృష్ణ-దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన 'అఖండ' సినిమాకు సీక్వెల్‌గా 'అఖండ 2: తాండవం' చిత్రం తెరకెక్కింది. బాలకృష్ణ, బోయపాటి కాంబినేషన్‌లోనే 'అఖండ 2' రూపొందింది. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపి ఆచంట ఈ సినిమాను నిర్మించారు. సంయుక్త, ఆది పినిశెట్టి ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాను తొలుత సెప్టెంబరు 25న విడుదల చేయాలనుకున్నారు. కానీ 'అఖండ 2' చిత్రం డిసెంబరులో విడుదల కానున్నట్లు ఇటీవల ఓ సందర్భంలో బాలకృష్ణ తెలిపారు. 'అఖండ 2' డిసెంబరు 4 లేదా డిసెంబరు 5న రిలీజ్ అవుతుందని భోగట్టా.

పనులు ప్రారంభం

ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజాసాబ్, ఫౌజి' సినిమాల చిత్రీకరణలతో బిజీగా ఉన్నారు. ఈ రెండు చిత్రాల షూటింగ్స్ పూర్తయిన తర్వాత సందీప్‌రెడ్డి వంగాతో 'స్పిరిట్' సినిమాను ఆరంభిస్తారు ప్రభాస్. కాగా ప్రభాస్ హీరోగా నటించిన మరో బ్లాక్‌బస్టర్ సినిమా 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్ కీలక పాత్రల్లో నటించారు. సి. అశ్వనీదత్ నిర్మించారు. కాగా ఈ సినిమా సీక్వెల్ 'కల్కి 2' చిత్రీకరణను ఈ ఏడాది చివర్లో ఆరంభించే ఆలోచనలో ఉన్నట్లుగా ఇటీవల ఓ సందర్భంలో ఈ చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ పేర్కొన్నారు. దీంతో 'స్పిరిట్, కల్కి 2' చిత్రీకరణల్లో ప్రభాస్ ఏకకాలంలో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. కానీ 'కల్కి 2' చిత్రం నుంచి దీపికా పదుకోన్ తప్పుకున్నట్లుగా మేకర్స్ గురువారం వెల్లడించారు. ఆమె ప్లేస్‌లో కొత్త హీరోయిన్‌ను ఎంపిక చేయాల్సి ఉంది. కొంత ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ కూడా చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ముందుగా 'స్పిరిట్' సినిమా మొదలై, కొంత చిత్రీకరణ జరుపుకున్న తర్వాత 'కల్కి 2' మూవీ చిత్రీకరణ ప్రారంభం కావొచ్చనే టాక్ వినిపిస్తోంది. అలాగే 'స్పిరిట్, కల్కి 2' చిత్రాల తర్వాత ప్రభాస్ 'సలార్ 2' సినిమా ప్రారంభం అవుతుంది. కానీ 'సలార్ 2' సినిమా చిత్రీకరణ ప్రారంభం కావడానికి ఇంకా సమయం ఉంది.

వచ్చే ఏడాది సెట్స్‌లోకి దేవర

తండ్రీకొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేసిన తాజా చిత్రం 'దేవర'. ఇందులో తండ్రి దేవ, కొడుకు వర పాత్రల్లో ఎన్టీఆర్ నటించారు. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన 'దేవర' 2024 సెప్టెంబరులో విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. అయితే 'దేవర'కు మేకర్స్ ఊహించినంత రెస్పాన్స్ రాలేదని, దీంతో 'దేవర 2' ఉండకపోవచ్చనే టాక్ వినిపించింది. కానీ 'మ్యాడ్ 2' సినిమా సక్సెస్ మీట్‌లో 'దేవర 2' కచ్చితంగా ఉంటుందని ఎన్టీఆర్ కన్ఫార్మ్ చేశారు. అయితే ప్రస్తుతం ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో 'డ్రాగన్' సినిమా చేస్తున్నారు ఎన్టీఆర్. ఈ సినిమా వచ్చే ఏడాది జూన్ 25న విడుదల కానుంది. 'డ్రాగన్' సినిమా చిత్రీకరణ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత 'దేవర 2' సినిమా షూటింగ్‌ను ఆరంభిస్తారట ఎన్టీఆర్. ప్రస్తుతం 'దేవర 2' సినిమా స్క్రిప్ట్ వర్క్ పనుల్లో బిజీగా ఉన్నారు దర్శకుడు కొరటాల శివ. వచ్చే ఏడాది 'దేవర 2' సినిమా షూటింగ్ పనులు ప్రారంభం అయ్యే చాన్సెస్ ఉన్నాయి.

సంక్రాంతికే రిలీజ్?

ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రూపొందిన సినిమా 'హను-మాన్'. ఈ చిత్రంలో తేజ సజ్జా హీరోగా నటించారు. 2024 సంక్రాంతికి విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ విజయం సాధించింది. అయితే 'హను-మాన్' చివర్లో ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రానున్నట్లుగా ప్రశాంత్ వర్మ అండ్ టీమ్ ప్రకటించారు. ఆ తర్వాత ఈ చిత్రంలో కన్నడ నటుడు 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి నటించనున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. ఈ సినిమా చిత్రీకరణ వచ్చే ఏడాదిలో ప్రారంభం కానుందని తెలిసింది. ఇక హను-మాన్ సినిమా సీక్వెల్‌ను 2025 సంక్రాంతికి రిలీజ్ చేయాలనుకున్నారు మేకర్స్. కానీ ఈ సినిమా ఇంకా సెట్స్ పైకి వెళ్లలేదు. అయితే కాస్త ఆలస్యంగానే ఈ సినిమా చిత్రీకరణ మొదలైనప్పటికీ ఏ ఏడాది వచ్చినా ఈ సినిమాను సంక్రాంతికే రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని తెలిసింది.

ఉమెన్ సెంట్రిక్ సినిమాలకు సీక్వెల్స్ కాస్త అరుదుగా వస్తుంటాయి. అయితే 'మంగళవారం' సినిమాకు సీక్వెల్ తీసేందుకు ఈ సినిమా స్క్రిప్ట్‌ను రెడీ చేస్తున్నారట ఈ చిత్రదర్శకుడు అజయ్ భూపతి. పాయల్ రాజ్‌పుత్ మెయిన్ లీడ్ రోల్‌లో నటించిన 'మంగళవారం' చిత్రం 2023లో విడుదలై, ప్రేక్షకుల మెప్పు పొందింది. కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో 'మంగళవారం' సినిమాకు సీక్వెల్‌గా 'మంగళవారం 2' తెరకెక్కనుందని, తొలి భాగంలో నటించిన పాయల్ రాజ్‌పుత్ మలి భాగంలోనూ మెయిన్ లీడ్ రోల్ చేస్తారనే ప్రచారం సాగింది. కానీ 'మంగళవారం' సీక్వెల్‌లో తాను నటించడం లేదని గతంలో వెల్లడించారు పాయల్ రాజ్‌పుత్. దీంతో ఈ సినిమా సీక్వెల్ 'మంగళవారం 2'లో ఎవరు నటిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. ఆ సమయంలో శ్రీలీల, కృతీ శెట్టి వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. మరి... ప్రచారంలో ఉన్నట్లుగా 'మంగళవారం' సీక్వెల్‌లో శ్రీలీల నటిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.


● శ్రీలీల

మళ్లీ సామజ వరగమన

శ్రీ విష్ణు, రెబ్బా మౌనికా జాన్ హీరో హీరోయిన్లుగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'సామజ వరగమన'. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా 2023లో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దీంతో అప్పట్నుంచే ఈ సినిమా సీక్వెల్‌పై అంచనాలు ఏర్పడ్డాయి. కాగా ఇటీవల 'సామజ వరగమన' చిత్రం సీక్వెల్ పనులు ఆరంభం అయ్యాయని, ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, ఓసారి కథ స్క్రిప్ట్ లాక్ అయితే, త్వరలోనే ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన రానుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. 'సామజ వరగమన' చిత్రంలో హీరోగా నటించిన శ్రీవిష్ణు సీక్వెల్‌లోనూ నటించనున్నారని టాక్.

మరోసారి గూఢచారి

అడివి శేష్ కెరీర్‌లోని బ్లాక్‌బస్టర్ మూవీస్‌లో 'గూఢచారి' ఒకటి. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జీ 2' (గూఢచారి 2) తెరకెక్కుతోంది. 'గూఢచారి' సినిమాకు శశి కిరణ్ తిక్క దర్శకత్వం వహించగా, 'జీ 2'ని మాత్రం ఎస్. వినయ్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. దర్శకుడిగా వినయ్ కుమార్‌కు ఇది తొలి చిత్రం. అడివి శేష్ హీరోగా నటిస్తున్న 'జీ 2' చిత్రంలో ఇమ్రాన్ హష్మి, వామికా గబ్బి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర నిర్మిస్తున్న 'జీ 2' చిత్రం వచ్చే ఏడాది మే 1న విడుదల కానుంది.

నెక్ట్స్ పేజీ

శర్వానంద్ కెరీర్‌లో వన్నాఫ్ ది సూపర్ హిట్స్ మూవీ 'శతమానం భవతి'. సతీష్ వేగేశ్న దర్శకత్వంలో 'దిల్' రాజు నిర్మించిన ఈ చిత్రం 2017లో విడుదలై, సూపర్‌హిట్‌గా నిలిచింది. కాగా 'శతమానం భవతి నెక్ట్స్ పేజీ' అంటూ ఈ సినిమా సీక్వెల్‌ను గత ఏడాది సంక్రాంతికి ప్రకటించి, ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేస్తామన్నట్లుగా 'దిల్' రాజు అండ్ టీమ్ పేర్కొంది. కానీ ఈ సినిమా ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. అయితే 'శతమానం భవతి' సినిమా సీక్వెల్ కోసం కథ సిద్ధం అవుతోందని, ఫుల్ స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన రానుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. మరి... ఈ చిత్రం సీక్వెల్‌లో హీరో శర్వానంద్ నటిస్తారా? లేక 'దిల్' రాజు సోదరుడు, నిర్మాత శిరీష్ తనయుడు హీరో ఆశిష్ నటిస్తారా? అనే విషయంపై మాత్రం ఓ స్పష్టత రావాలి.

రాయలసీమ టు ఎండ్ ఆఫ్ ది వరల్డ్

'హను-మాన్, మిరాయ్' వంటి సూపర్ డూపర్ హిట్స్ తర్వాత హీరో తేజ సజ్జా చేయనున్న సినిమా 'జాంబిరెడ్డి 2'. తేజ సజ్జాతో 'మిరాయ్' సినిమాను నిర్మించిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థయే ఈ 'జాంబిరెడ్డి 2' సినిమానూ నిర్మించనుంది. తేజ సజ్జా హీరోగా నటించి, ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన 'జాంబిరెడ్డి' సినిమాకు సీక్వెల్‌గా 'జాంబిరెడ్డి 2' తెరకెక్కనుంది. అయితే చిన్న మార్పు ఉంది. 'జాంబిరెడ్డి' చిత్రానికి ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించగా, 'జాంబిరెడ్డి' సీక్వెల్‌కు ప్రశాంత్ వర్మ కథ మాత్రమే అందిస్తున్నారు. ఈ సీక్వెల్‌కు ఇంకా దర్శకుడు ఖరారు కాలేదని, త్వరలోనే ఈ విషయంపై అధికారికంగా ఓ ప్రకటన చేస్తామని 'మిరాయ్' ప్రమోషన్స్‌లో భాగంగా తేజ వెల్లడించారు. 'జాంబిరెడ్డి' సినిమా రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. అయితే 'జాంబిరెడ్డి 2' కథ మాత్రం రాయలసీమ నుంచి ఇంటర్‌నేషనల్ రేంజ్‌ను టచ్ చేస్తుందని తెలుస్తుంది. 'ఫ్రమ్ రాయలసీమ టు ది ఎండ్ ఆఫ్ ది వరల్డ్' అని ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌పై ఉంది. దీన్ని బట్టి 'జాంబిరెడ్డి 2' సినిమా కథను ప్రశాంత్ వర్మ అంతర్జాతీయ స్థాయిలో సిద్ధం చేశారని తెలుస్తోంది. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా సెట్స్‌కు వెళ్తుందట. ఈ 'జాంబిరెడ్డి 2' చిత్రాన్ని 2027 సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లుగా గతంలో మేకర్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

- ముసిమి శివాంజనేయులు

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' చిత్రాల ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా' చిత్రీకరణ పూర్తయింది. ఈ మూవీలో రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటించగా, వైవా హర్ష కీలక పాత్ర పోషించారు. స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రం ద్వారా దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా లొకేషన్‌లో కేక్ కట్ చేసుకుని సెలబ్రేట్



● సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధీ శెట్టి, రాశీ ఖన్నా

చేసుకుంది యూనిట్. "మోస్ట్ ఎవైటెడ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'తెలుసు కదా'. నీరజ కోన చాలా యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఇటీవల విడుదల చేసిన మా మూవీ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. తమన్ మ్యూజిక్ అందించిన ఈ చిత్రం నుంచి త్వరలో సెకండ్ సాంగ్ రిలీజ్ కానుంది. అక్టోబర్ 17న మా సినిమా విడుదల కానుంది" అని చిత్రబృందం పేర్కొంది.

భావోద్వేగాల ప్రేమకథ


● శ్రీదేవి, హర్ష్ రోషన్

'కోర్ట్' సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న హర్ష్ రోషన్, శ్రీదేవి అపల్ల జంటగా నటిస్తున్న ద్వితీయ చిత్రం 'బ్యాండ్ మేళం'. 'ఎవ్రీ బీట్ హ్యాజ్ యాన్ ఎమోషన్' అనేది ఉప శీర్షిక. సాయికుమార్ ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. సతీష్ జవ్వాజీ రచన, దర్శకత్వంలో మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్‌పై కావ్య, శ్రావ్య నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ బీట్ (టైటిల్ గ్లింప్స్)ని రిలీజ్ చేశారు మేకర్స్. "అందమైన గ్రామీణ ప్రేమకథగా రూపొందుతోన్న చిత్రం 'బ్యాండ్ మేళం'. సంగీతం, ప్రేమ, భావోద్వేగాలు, మనోహరమైన కథతో ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు సతీష్ జవ్వాజి. యాదగిరి (హర్ష్ రోషన్), రాజమ్మ (శ్రీదేవి అపల్ల) ప్రేమకథని అందంగా తెరపై చూపించనున్నారాయన" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి సహ నిర్మాత: శివరాజు ప్రణవ్, సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: సతీష్ ముత్యాల.

బిజినెస్ రీల్

ఆనంద్ రాఠీ షేర్ @ రూ. 393-414

ఈ నెల 23-25 మధ్య ఐపీవో



న్యూఢిల్లీ: బ్రోకింగ్ సంస్థ ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 393-414 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 23న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 745 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వెరసి 25న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 745 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 550 కోట్లు దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వెచ్చించనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 36 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఆనంద్ రాఠీ గ్రూప్ కంపెనీ విస్తృత స్థాయిలో ఫైనాన్షియల్ సర్వీసులను అందిస్తోంది.

సీమెన్స్ ఎనర్జీ కోసం ఆజాద్ ఇంజినీరింగ్ ప్రత్యేక ప్లాంటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సీమెన్స్ ఎనర్జీకి అవసరమైన ఉత్పత్తుల కోసం ఆజాద్ ఇంజినీరింగ్ సంస్థ హైదరాబాద్‌లోని తునికిబొల్లారంలోని తమ ఫ్యాక్టరీలో ప్రత్యేక తయారీ ప్లాంటును ప్రారంభించింది. ఇది 7,200 చ.మీ. విస్తీర్ణంలో ఏర్పాటైంది. సీమెన్స్ ఎనర్జీతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించుకునేందుకు ఇది మరింతగా దోహదపడగలదని ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ రాకేశ్ చోప్దార్ తెలిపారు. ఈ ప్లాంటులో ప్రత్యక్షంగా 150 మంది పైగా నిపుణులు ఉన్నారని, ఈ ఏడాది ఆఖరు నాటికి ఈ సంఖ్యను 230కి పెంచుకోనున్నామని వివరించారు. ఇరు సంస్థల మధ్య భాగస్వామ్యానికి ఈ ప్లాంటు ఏర్పాటు కీలక మైలురాయిగా నిలుస్తుందని ఎస్ఈ జీఎస్ సెంట్రల్ వీపీ ఆండ్రియాస్ ష్మిట్ తెలిపారు.



ఫ్లిప్‌కార్ట్ 'డార్క్ ప్యాటర్న్స్' ఆడిట్ పూర్తి

ముంబై: మరింతగా కొనుగోళ్లు జరిపేలా కస్టమర్లను మభ్యపెట్టే విధానాలను (డార్క్ ప్యాటర్న్స్) కట్టడి చేసేందుకు స్వతంత్రంగా నిర్వహించిన స్వీయ-ఆడిట్ పూర్తయినట్లు ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ తెలిపింది. కేంద్రీయ వినియోగదారుల పరిరక్షణ సంస్థ (సీసీపీఏ) మార్గదర్శకాలకు అనుగుణంగా దీన్ని నిర్వహించినట్లు వివరించింది. సమగ్ర డిక్లరేషన్ పత్రాన్ని వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరేకి సమర్పించినట్లు పేర్కొంది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్‌లో ఫ్లిప్‌కార్ట్, మింత్రా, ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్, క్లియర్‌ట్రిప్ సంస్థలు ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-9-2025

విశాఖ	555-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	560-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
KOTAKBANK	2,023.50	2.67
LT	3,670.00	2.34
M&M	3,612.00	2.31
EICHERMOT	6,951.00	2.21
MARUTI	15,592.00	2.14

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	618.5	-0.83
ASIANPAINT	2,482.00	-0.82
NESTLEIND	1,204.00	-0.7
TATACONSUM	1,095.80	-0.62
HDFCLIFE	773.05	-0.53

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,461
ఎన్ఎస్ఈ	97,995
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,37,816
ఎఫ్ఐఐ	+ 367
డీఐఐ	+ 3,326

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	63.57	$	64.05
బ్రెంట్	67.43	$	67.95

సంస్కరణలను అందిపుచ్చుకోండి..

- మరింతగా పెట్టుబడులు పెట్టండి
- ప్రభుత్వంతో కలిసి పని చేయండి
- కార్పొరేట్లకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పిలుపు



న్యూఢిల్లీ: ప్రభుత్వ విధానాలు, సంస్కరణల ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలని కార్పొరేట్లకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. మరింతగా పెట్టుబడులు పెట్టేందుకు, సామర్థ్యాలను పెంచుకునేందుకు సందేహించకుండా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువతకు నైపుణ్యాల్లో శిక్షణనివ్వడంలో ప్రభుత్వంతో కలిసి పని చేయాలన్నారు. బడ్జెట్ ముందు మాత్రమే కాకుండా ఏడాది పొడవునా, ఎప్పుడైనా సరే ప్రభుత్వంతో మాట్లాడాలని ఇండియన్ ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (ఐఎఫ్‌క్యూఎం) కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి చెప్పారు. పరిశ్రమ నుంచి ప్రభుత్వం ఏం ఆశిస్తోందనే టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ప్రశ్నకు సమాధానంగా ఆమె ఈ విషయాలు తెలిపారు. పరిశ్రమ అంచనాలకు అనుగుణంగా ప్రభుత్వం స్థిరంగా ముందుకెళ్తోందని వివరించారు. వ్యాపారాల నిర్వహణను సులభతరం చేసేలా తగు పాలసీలను రూపొందించడం, పన్నులపరమైన ప్రయోజనాలివ్వడం, మరింతగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) రాకకు అవకాశాలు కల్పించడం తదితర చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సంస్కరణల అమలుకు ఎన్నడూ వెనుకాడలేదని, పరిశ్రమ విజ్ఞప్తులను వింటూనే ఉన్నారని ఆమె తెలిపారు.

'మరింతగా ఇన్వెస్ట్ చేయడం, సామర్థ్యాలను పెంచుకోవడం, భారత్‌లో మరింతగా ఉత్పత్తి చేయడంపై ఇక మీదట సందేహాలు ఉండబోవని ఆశిస్తున్నాను' అని చెప్పారు. స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) చిన్న పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) కీలకంగా ఉంటున్నాయని మంత్రి తెలిపారు. వాటి అవసరాలను గుర్తించే, ఎంఎస్ఎంఈ క్లస్టర్లలో స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (సిడ్బి) ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు.

ప్రైవేట్ పెట్టుబడుల ఆవశ్యకత..


అధిక వృద్ధి సాధన దిశగా, ఎకానమీకి దన్నుగా చర్యలు తీసుకునే క్రమంలో కేంద్రం 2025-26లో రూ. 11.21 లక్షల కోట్ల మూలధన వ్యయాలను బడ్జెట్‌లో ప్రతిపాదించింది. అయితే, సామర్థ్యాల పెంచుకోవాలంటూ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నప్పటికీ, ప్రైవేట్ పెట్టుబడులు అంతగా రావడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. కేంద్ర గణాంకాలు, పథకాల అమలు శాఖ (ఎంవోఎస్‌పీఐ) శాఖ విడుదల చేసిన సర్వే నివేదిక ప్రకారం 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ పెట్టుబడులు 26 శాతం తగ్గొచ్చనే అంచనాలు ఉన్నాయి. 2022, 2023, 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ కంపెనీలు వరుసగా రూ. 3.95 లక్షల కోట్లు, రూ. 5.72 లక్షల కోట్లు, రూ 4.22 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి..

దేశీయ మార్కెట్లోనూ, ఎగుమతులపరంగానూ ప్రభుత్వం చక్కని అవకాశాలు కల్పిస్తోందని చంద్రశేఖరన్ చెప్పారు. మరింత మంది ఔత్సాహిక వ్యాపారవేత్తలు, చిన్న..మధ్యతరహా సంస్థలు, పెద్ద కార్పొరేట్లు గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తాయని తాను గట్టిగా విశ్వసిస్తున్నట్లు వివరించారు. సరఫరా వ్యవస్థను పటిష్టం చేసుకునేలా ప్రపంచం ప్రత్యామ్నాయ సరఫరాదారులను అన్వేషిస్తున్న నేపథ్యంలో పెట్టుబడులు పెట్టకపోతే అవకాశాలను అందిపుచ్చుకోలేమని ఆయన పేర్కొన్నారు.

భారత్‌లో ఇన్వెస్ట్ చేయండి

అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు కేంద్ర మంత్రి గడ్కరీ ఆహ్వానం



న్యూఢిల్లీ: భారత్ పెట్టుబడులకు అనుకూలమైన అనేక విధానాలను అమలు చేస్తోందని, దేశీయంగా సుశిక్షితులైన నిపుణుల లభ్యత పుష్కలంగా ఉందని కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ నేపథ్యంలో భారత్‌లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు, ఇన్వెస్ట్ చేసేందుకు ముందుకు రావాలని ఐసీసీ గ్లోబల్ సమిట్ 2025లో వర్చువల్‌గా పాల్గొన్న సందర్భంగా గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆయన ఆహ్వానించారు. ప్రత్యామ్నాయ ఇంధనాలు, బయోఫ్యూయల్స్ అభివృద్ధిలో భారత్ విశేషంగా రాణిస్తోందని చెప్పారు. ఇంజినీరింగ్ నిపుణుల లభ్యత, మెరుగైన మౌలిక సదుపాయాల, రాజకీయంగా పటిష్టమైన మద్దతు వంటి సానుకూలాంశాల కారణంగా ఇన్వెస్టర్లకు భారత్ అత్యుత్తమ గమ్యస్థానం కాగలదన్నారు. మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లో ముడి వస్తువుల ధరలు తక్కువగా ఉండటంతో పాటు ఉత్పత్తులు అత్యంత నాణ్యమైనవిగా ఉంటాయని గడ్కరీ వివరించారు. 'మేము నాణ్యతకు కట్టుబడి ఉన్నాం. ఆ విషయంలో రాజీపడకుండా ఉత్పత్తి వ్యయాలను తగ్గించుకోవాలనుకుంటున్నాం. ఇది ప్రపంచ ప్రజలందరికీ మేలు చేస్తుంది' అని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో 5 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీగా ఆవిర్భవించాలని, ఆత్మనిర్భర్ భారత కలను సాకారం చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు.

హైడ్రోజన్‌పై మరింత దృష్టి..

లాజిస్టిక్స్ వ్యయాలను తగ్గించేందుకు, పర్యావరణహిత ఇంధనాలను అభివృద్ధి చేసేందుకు, పునరుత్పాదక విద్యుత్తును ప్రోత్సహించేందుకు, రహదారి..రైలు..జలమార్గాల కనెక్టివిటీని పటిష్టం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. ప్రత్యామ్నాయ ఇంధనాలను అభివృద్ధి చేయడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు గడ్కరీ చెప్పారు. 'మేము ఇథనాల్, మిథనాల్, బయోడీజిల్, ఎల్ఎన్‌జీ, ఎలక్ట్రిక్స్‌పై ఏకకాలంలో పని చేస్తున్నాం. అదే సమయంలో హైడ్రోజన్‌పై కూడా టాటా మోటర్స్, అశోక్ లేల్యాండ్, రిలయన్స్, హెచ్‌పీసీఎస్, ఐవోసీఎల్, ఎన్‌టీపీసీలాంటి కంపెనీలు పని చేస్తున్నాయి. హైడ్రోజన్ తయారీకి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. అయితే, 1 కేజీ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడానికి 50 యూనిట్ల విద్యుత్ అవసరమవుతుంది. భారత్‌లో (హైడ్రోజన్ ఉత్పత్తి చేసేందుకు) ఖర్చు సుమారు రూ. 250-200గా (కేజీకి) ఉంటుంది. దీన్ని 1 డాలర్ స్థాయికి (సుమారు రూ. 88) తీసుకురావాలనేది నా లక్ష్యం' అని వివరించారు. ఇది చాలా కష్టమే అయినప్పటికీ, భారత్ ప్రయత్నిస్తోందని గడ్కరీ చెప్పారు.

రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టి

ప్రైవేట్ రంగం ద్వారా దేశీయంగా రక్షణ ఉత్పత్తుల పరిశ్రమను పటిష్టం చేయడంపై ప్రభుత్వం మరింతగా దృష్టి పెడుతోందని డిఫెన్స్ ప్రొడక్షన్ కార్యదర్శి సంజీవ్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి పాలసీలు, ప్రక్రియల గురించి అర్థవంతమైన సలహాలను సంబంధిత నిబంధనల్లో పొందుపర్చేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. స్వావలంబన సాధనే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దీన్ని సాధించాలంటే తయారీలోనే కాకుండా డిజైన్‌తో పాటు మనం ఉపయోగించే అన్ని ప్లాట్‌ఫాంలపై మనకు పూర్తి నియంత్రణ ఉండాలని, బైటి ఏజెన్సీలపై ఆధారపడే పరిస్థితి ఉండకూడదని కుమార్ వివరించారు.

టారిఫ్‌లకు పది వారాల్లో పరిష్కారం

- నవంబర్ చివరికి 25 శాతం ఎత్తేయొచ్చు
- 10-15 శాతానికి ప్రతీకార సుంకం
- రూపాయి బలంగా నిలబడుతుంది
- సీఈఏ అనంత నాగేశ్వరన్



కోల్‌కతా: అమెరికా టారిఫ్‌లకు వచ్చే ఎనిమిది, పది వారాల్లో పరిష్కారం లభిస్తుందని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) అనంత నాగేశ్వరన్ చెప్పారు. 25 శాతం ప్రతీకారం సుంకం, రష్యా నుంచి చమురు కొంటున్నందుకు విధించిన 25 శాతంతో కలిపి భారత ఉత్పత్తులపై అమెరికా 50 శాతం టారిఫ్‌లు అమలు చేస్తుండడం తెలిసిందే. భారత్ చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి నాగేశ్వరన్ మాట్లాడారు. భారత ఉత్పత్తులపై టారిఫ్‌లను అమెరికా వెనక్కి తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య అంతర్గతంగా చర్చలు కొనసాగుతున్నాయంటూ, వచ్చే 8-10 వారాల్లో పరిష్కారం లభించొచ్చన్నారు. ''భారత్‌పై విధించిన 25 శాతం పీనల్ టారిఫ్‌ను నవంబర్ చివరి నాటికి అమెరికా ఉపసంహరించుకోవచ్చు. నవంబర్ 30 తర్వాత ఉండకపోవచ్చు. ఇటీవలి పరిణామాల ఆధారంగా ఇది కేవలం నా అంచనాయే. ప్రస్తుతమున్న 25 శాతం ప్రతీకార సుంకం సైతం 10-15 శాతానికి తగ్గొచ్చు''అని సీఈవో తన అభిప్రాయాలను వెల్లడించారు. ఒకవేళ టారిఫ్‌లు కొనసాగితే అమెరికాకు ఎగుమతులు తగ్గుతాయన్నారు. భారత్ మధ్యస్థ ఆదాయ దేశమని, మొదటి త్రైమాసికంలో జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసినట్టు చెప్పారు. కరోనా విపత్తు తర్వాత ఎన్నో దేశాలతో పోల్చితే భారత ఆర్థిక వ్యవస్థ ఎంతో వేగవంతమైన వృద్ధిని సాధించినట్టు తెలిపారు.

తయారీ, వ్యవసాయం, సేవల పాత్ర



వచ్చే రెండేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో తయారీ, సేవలు, వ్యవసాయ రంగంలో గొప్ప పాత్ర పోషిస్తాయని నాగేశ్వరన్ చెప్పారు. అలాగే, వినియోగం, పెట్టుబడులు వృద్ధికి ఊతంగా నిలుస్తాయన్నారు. జీడీపీలో భారత రుణ నిష్పత్తి సహేతక స్థాయిలోనే ఉన్నట్టు చెప్పారు. ఇతర దేశాల కంటే మెరుగైన వృద్ధిని సాధిస్తున్నామని, నిధులను సమర్థవంతంగా వినియోగించుకుంటున్న దానికి ఇది సంకేతంగా పేర్కొన్నారు. గ్రామీణ వినియోగం బలంగా ఉందంటూ, అదే సమయంలో పట్టణ డిమాండ్ పుంజుకుంటున్నట్టు చెప్పారు. ఇటీవలి జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో వినియోగదారుల చేతుల్లో ఖర్చు చేసే ఆదాయం మిగులు పెరుగుతుందని, దీంతో పట్టణ వినియోగం సైతం ఇతోధికం అవుతుందని అంచనా వేశారు. ఎంఎస్ఎంఈ రంగానికి రుణ సాయం పెరుగుతోందని, పెద్ద పరిశ్రమలకు రుణాల్లో నిర్మాణాత్మక మార్పు కనిపిస్తోందన్నారు. నేటి రోజుల్లో నిధుల సమీకరణకు ఎన్నో మార్గాలు అందుబాటులోకి వచ్చినట్టు చెప్పారు. ఎగుమతులు బలంగా కొనసాగుతున్నట్టు నాగేశ్వరన్ తెలిపారు. మొదటి త్రైమాసికంలో కరెంట్ ఖాతా లోటు జీడీపీలో 0.2 శాతానికి పరిమితమైనట్టు చెప్పారు. ''డాలర్‌తో రూపాయి విలువ క్షీణిస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో అంతర్గతంగా ఉన్న బలం దృష్ట్యా దీర్ఘకాలంలో రూపాయి తన విలువను కాపాడుకుని, బలంగా నిలబడుతుంది''అని నాగేశ్వరన్ దేశ ఆర్థిక వ్యవస్థను విశ్లేషించారు. దేశ ప్రైవేటు రంగం పరిశోధన, అభివృద్ధిపై పెట్టుబడులను మరింతగా పెంచాలని, మరిన్ని ఆవిష్కరణలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కృత్రిమ మేథ (ఏఐ) ఉపాధి పరంగా పెద్ద అవరోధం కాదన్నారు. ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు.

గ్లోబల్‌గా చైనా ఈవీలతో టాటా పోటీ



న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లలో ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి చైనా కంపెనీలతో ధరలపరంగా పోటీపడటంపై దృష్టి పెడుతున్నట్లు టాటా మోటర్స్ ఎండీ (ప్యాసింజర్ వెహికల్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ) శైలేష్ చంద్ర తెలిపారు. ఇప్పటికే కొన్ని అంశాల్లో దీటుగా పోటీనిస్తుండగా, వచ్చే ఏడాది, ఏడాదిన్నర వ్యవధిలో చైనా తయారీ సంస్థలకు సరిసమానమైన రేట్లకే వాహనాలను అందించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. స్థానికంగా తయారీ, స్వావలంబన సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారీ ఉత్పత్తి స్థాయితో పాటు ప్రభుత్వం నుంచి లభించే ప్రోత్సాహకాలు చైనా కంపెనీలకు ప్రయోజనకరంగా ఉంటున్నాయని, అందుకే అవి తక్కువ రేట్లకు ఉత్పత్తులను అందించగలుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశీయంగా స్థిరమైన పాలసీలపరంగా ప్రభుత్వ తోడ్పాటు, కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణతో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం 5 శాతానికి పెరిగిందని చెప్పారు. టాటా మోటర్స్ ఆగస్టులో 7,111 ఎలక్ట్రిక్ కార్లను విక్రయించింది. గతేడాది ఆగస్టులో నమోదైన 4,392 యూనిట్లతో పోలిస్తే ఇది 62 శాతం అధికం.

ప్రధాని మోదీతో పెప్సికో గ్లోబల్ సీఈవో భేటీ

న్యూఢిల్లీ: పెప్సికో గ్లోబల్ సీఈవో, చైర్మన్ రామన్ లగుర్తా మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. భారత మార్కెట్లో దీర్ఘకాల వ్యాపార లక్ష్యాలు, పెట్టుబడులు, తయారీ, ఆవిష్కరణలు, పరస్పర అభివృద్ధి అవకాశాలపై మోదీతో చర్చించారు. లగుర్తాతో పాటు కంపెనీ భారత సీఈవో జాగృత్ కొటేచా, గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. చిరుతిళ్లు(స్నాక్స్) ఆహారోత్పత్తులపై జీఎస్‌టీ 12% నుంచి 5 శాతానికి తగ్గిన నేపథ్యంలో సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. జీఎస్‌టీ తగ్గింపుతో పెప్సికో కీలక బ్రాండులు లేస్, కుర్‌కురే, చీటోస్, క్వాకర్ ఓట్స్‌కు లబ్ధి చేకూరనుంది. అయితే శీతలపానియాలపై 40% పన్ను విధించారు. పెప్సికో భారత్‌ను 'అత్యంత కీలక మార్కెట్'గా పరిగణిస్తూ అసోంలో ఫుడ్స్ ప్లాంట్, మధ్యప్రదేశ్‌లో ఫ్లేవర్ తయారీ కేంద్రం, ఉత్తరప్రదేశ్‌లో గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్‌లో భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతోంది.



ఆస్తుల మానిటైజేషన్ స్పీడ్ పెంచాలి

- ప్రభుత్వ ఆస్తుల విక్రయంపై సెబీ చైర్మన్ పాండే
- జాబితాలో రైల్వేలు, రహదారులు, విమానాశ్రయాలు
- మౌలిక ప్రాజెక్టుల నిధుల సమీకరణకు పలు మార్గాలు



ముంబై: ప్రభుత్వ రంగంలోని ఆస్తుల మానిటైజేషన్‌ను వేగవంతం చేయవలసి ఉన్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే పేర్కొన్నారు. రైల్వేలు, విమానాశ్రయాలు, రహదారులు, ఇంధనం, పెట్రోలియం అండ్ గ్యాస్, లాజిస్టిక్స్ రంగాలలోని ప్రభుత్వ ఆస్తుల మానిటైజేషన్‌లో స్పీడ్ పెంచవలసి ఉన్నట్లు అభిప్రాయపడ్డారు. దీంతో ఆయా ప్రాజెక్టులలోకి ఇన్వెస్టర్ల పెట్టుబడులు ప్రవహించేందుకు వీలు చిక్కుతుందని తెలియజేశారు. సెబీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పాండే గతంలో దీపమ్ కార్యదర్శిగా పనిచేసిన సంగతి తెలిసిందే. చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకూ ఆస్తుల మానిటైజేషన్ ప్రణాళికలకు రచించలేదంటూనే వీటికి తెరతీయడం ద్వారా వనరుల లభ్యతకు దారి ఏర్పడుతుందని వివరించారు. తద్వారా మౌలిక సదుపాయాల(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) అభివృద్ధి జోరందుకుంటుందని అభిప్రాయపడ్డారు. మౌలిక సదుపాయాల కల్పనకు భారీస్థాయిలో పెట్టుబడుల అవసరముంటుందని, కేవలం ప్రభుత్వం, బ్యాంకులు వీటిని భుజాలకు ఎత్తుకోలేవని వ్యాఖ్యానించారు. వెరసి వనరుల సమీకరణకు క్యాపిటల్ మార్కెట్లను ప్రత్యామ్నాయంగా భావించవచ్చని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో తెరతీసిన ఆస్తుల మానిటైజేషన్ ప్రణాళిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్(ఇన్విట్స్) మార్కెట్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు నాబ్‌ఫిడ్ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో పాండే ప్రస్తావించారు.

నాబ్‌ఫిడ్ అంటే?

మౌలిక సదుపాయాల ఏర్పాటు, అభివృద్ధిలో ఫైనాన్సింగ్ మద్దతిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ ఎన్ఏబీఎఫ్ఐడీ(నాబ్‌ఫిడ్). ఆర్‌బీఐ నియంత్రణలోని నాబ్‌ఫిడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు దీర్ఘకాలిక ఫైనాన్సింగ్ సౌకర్యాలను కల్పిస్తుంది. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణకు వీలుగా బాండ్లు, డెరివేటివ్స్ తదితర ఇన్నోవేటివ్ ఫైనాన్షియల్ ప్రొడక్టులను అభివృద్ధి చేయడంతోపాటు.. ఫైనాన్సింగ్, రిస్క్ మేనేజ్‌మెంట్‌లో డేటా ఆధారితంగా ఉత్తమ కార్యాచరణకు దారి చూపుతుంది.

ఇవీ మార్గాలు

ఆస్తుల మానిటైజేషన్ చేపట్టేందుకు పలు మార్గాలు న్నట్లు పాండే తెలియజేశారు. వీటిలో ఇన్విట్స్, రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్(రీట్స్), పబ్లిక్, ప్రయివేట్ భాగస్వామ్యం లేదా సెక్యూరిటైజేషన్ తదితరాలను పేర్కొన్నారు. 2017 నుంచి 21సార్లు మునిసిపల్ బాండ్ల జారీ ద్వారా రూ. 3,134 కోట్లు సమీకరించడం ప్రోత్సాహన్నిస్తున్నట్లు తెలియజేశారు. అయితే మ్యూచువల్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్ తదితర సంస్థాగత ఇన్వెస్టర్లతోపాటు.. రిటైల్ ఇన్వెస్టర్లను సైతం ఆకట్టుకోవడం ద్వారా ఇన్వెస్టర్ల పరిధిని విస్తరించవలసి ఉన్నట్లు అభిప్రాయపడ్డారు. ఇందుకు క్రమపద్ధతిలో ఇన్‌ఫ్రా సెక్యూరిటీల జారీ చేయవలసి ఉన్నట్లు ప్రస్తావించారు. పూర్తిగా బ్యాంకులు లేదా ప్రభుత్వ బడ్జెట్‌లపై ఆధారపడితే అధిక రిస్కులకు చాన్స్ ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు నిధుల సమీకరణలో మార్కెట్లలో కార్పొరేట్ బాండ్లు, ఇండెక్స్ రేట్లు, మునిసిపల్ బాండ్లు తదితర ఇన్‌స్ట్రుమెంట్స్‌కు వీలుంటుందని వివరించారు. డిస్‌క్లోజర్ నిబంధనల ద్వారా క్రమశిక్షణ, పారదర్శకత, సుపరిపాలన, స్వతంత్ర ఆడిట్స్, ఇన్వెస్టర్ పరిశీలన తదితరాల ఆచరణను క్యాపిటల్ మార్కెట్లు ఆదేశిస్తాయని తెలియజేశారు. వెరసి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులలో నాణ్యత, నమ్మకానికి రక్షకులుగా క్యాపిటల్ మార్కెట్లు వ్యవహరిస్తాయని తెలియజేశారు.

ఆందోళనకరం

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రుణాలందించడంలో వాణిజ్య బ్యాంకులు వెనకడుగు వేస్తుండటం ఆందోళన కలిగిస్తున్నట్లు నాబ్‌ఫిడ్ ఎండీ, సీఈవో రాజ్‌కిరణ్ రాయ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థ(ఎన్‌బీఎఫ్‌సీ)లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెట్ ఫండ్స్ తదితరాలతో పోలిస్తే వాణిజ్య బ్యాంకులలో మౌలిక ప్రాజెక్టులపట్ల ఆసక్తి తగ్గుతున్నట్లు తెలియజేశారు. దీంతో మౌలిక ప్రాజెక్టులకు వాణిజ్య బ్యాంకుల రుణాలు క్షీణిస్తుంటే.. బ్యాంకింగేతర సంస్థల రుణ వితరణ 10 శాతం పుంజుకున్నట్లు తెలియజేశారు. వెరసి రుణాల విడుదలకు మద్దతివ్వవలసి ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌కు వేళాయె!

వచ్చే నెలలో న్యూఢిల్లీ వేదికగా నిర్వహణ • 6 జట్లు... 48 మంది ఆర్చర్లు.. 12 మంది విదేశీయులు

బరిలో జ్యోతి సురేఖ, చికిత, హంసిని, ధీరజ్, జిజ్ఞాస్ • మొత్తం ప్రైజ్‌మనీ రూ. 2 కోట్లు • బ్రాండ్ అంబాసిడర్‌గా రామ్‌చరణ్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)... ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)... ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)... హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)... అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ)... రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్)... టెన్నిస్ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్)... ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)... ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)... ఇలా అన్ని ఆటల్లో లీగ్‌ల హవా సాగుతున్న వేళ...కొత్తగా ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)కు కూడా వచ్చే నెలలో తెరలేవనుంది.


జ్యోతి సురేఖ


ధీరజ్


చికిత


హంసిని

న్యూఢిల్లీ: ప్రతిభకు పట్టం కడుతూ... ఆటకు మరింత విస్తృత ప్రచారం కల్పిస్తూ... ప్రపంచ ఆర్చరీలో భారత్‌ను నంబర్‌వన్‌గా నిలపడమే లక్ష్యంగా ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌కు అంకురార్పణ జరిగింది. అక్టోబర్ 2 నుంచి 12 వరకు దేశ రాజధాని న్యూఢిల్లీలో జరగనున్న ఆర్చరీ ప్రీమియర్ లీగ్ వివరాలను గురువారం నిర్వాహకులు వెల్లడించారు. మొత్తం ఆరు జట్లు పాల్గొననున్న ఈ లీగ్‌లో 48 మంది ఆర్చర్లు బరిలోకి దిగనున్నారు. వారిలో 12 మంది విదేశీయులు కాగా... మిగిలిన 36 మంది స్వదేశీ ఆర్చర్లు. ప్రపంచ నంబర్‌వన్ ఆర్చర్లు ఆండ్రియా బెకెర్రా (కాంపౌండ్), బ్రాడీ ఎలీసన్ (రికర్వ్) ఈ లీగ్‌లో భాగం కానున్నారు. భారత్ నుంచి స్టార్ ఆర్చర్లు వెన్నం జ్యోతి సురేఖ, దీపిక కుమారి, అతాను దాస్, బొమ్మదేవర ధీరజ్ ఇలా పలువురు ఆర్చర్లు వేర్వేరు జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన చిట్టిబొమ్మ జిజ్ఞాస్, మాదాల సూర్య హంసిని, తెలంగాణ అమ్మాయి తనిపర్తి చికిత కూడా ఈ లీగ్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. ఈ లీగ్‌తో భారత ఆర్చరీ ముఖచిత్రం మారిపోతుందని భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ) భావిస్తోంది. 'ఆర్చరీలో మనకు ఘన చరిత్ర ఉంది. పురాతన కాలం నుంచి మన దేశంలో విలువిద్యకు ఎంతో ప్రాధాన్యత ఉంది. వరల్డ్‌కప్, వరల్డ్ చాంపియన్‌షిప్స్, ఆసియా చాంపియన్‌షిప్స్, కామన్వెల్త్ చాంపియన్‌షిప్స్ ఇలా ప్రతి పోటీలోనూ భారత ఆర్చర్లు పతకాలు సాధించారు. ఒలింపిక్స్‌లో మాత్రం పతకం ఇంకా బాకీ ఉంది. ఈ లీగ్ ద్వారా ఆ ముచ్చట కూడా తీరడం ఖాయమే' అని ఏఏఐ కార్యదర్శి వీరేంద్ర సచ్‌దేవ్ అన్నారు.

- ఒక్కో జట్టులో నలుగురు మహిళలు, నలుగురు పురుష ఆర్చర్ల చొప్పున 8 మంది ఉంటారు. ఇందులో ఇద్దరు విదేశీయులు, ఆరుగురు భారత ఆర్చర్లు ఉంటారు. విదేశీయుల్లో ఒకరు పురుష ఆర్చర్, మరొకరు మహిళా ఆర్చర్ ఉంటారు.
- భారత ఆర్చరీ అసోసియేషన్ ఇటీవల నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌తో పాటు ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా ఆర్చర్లను ఎంపిక చేశారు.
- కాంపౌండ్, రికర్వ్ విభాగాల్లో ఒలింపిక్ ప్రమాణాలకు తగ్గట్లు 70 మీటర్లు, 50 మీటర్లలో పోటీలు జరుగుతాయి. ఈ లీగ్ మొత్తం ప్రైజ్‌మనీ 2 కోట్ల రూపాయలు.
- రౌండ్ రాబిన్ పద్ధతిలో రోజుకు మూడు మ్యాచ్‌లు (20 నిమిషాలు) నిర్వహిస్తారు. అంతర్జాతీయ స్థాయిలో బాణం సంధించేందుకు 20 సెకన్ల సమయం ఇస్తుండగా... ఈ లీగ్‌లో 15 సెకన్లకు తగ్గించారు.
- రికర్వ్ విభాగంలో మూడో ర్యాంకర్ దీపిక కుమారి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ధీరజ్‌తో పాటు వెటరన్స్ అతాను దాస్, తరుణ్‌దీప్ ఉన్నారు.
- కాంపౌండ్ విభాగంలో ప్రపంచ రికార్డు హోల్డర్ వెన్నం జ్యోతి సురేఖ, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ రిషభ్ యాదవ్, అభిషేక్ వర్మ, ప్రథమేశ్, ప్రియాంశ్, పర్ణీత్ కౌర్ బరిలో ఉన్నారు.

ఏ జట్టులో ఎవరున్నారంటే...

పృథ్వీరాజ్ యోధాస్ (ఢిల్లీ): మాటియస్ గ్రాండె, ఆంద్రియా బెకెర్రా, అభిషేక్ వర్మ, గాథ, ప్రియాంశ్, శర్వరి, క్రిష్ కుమార్, ప్రాంజల్.

చెరో ఆర్చర్స్ (జార్ఖండ్): మాథియస్ ఫుల్లెర్టన్, క్యాథరినా బ్యూర్, రాహుల్, ప్రీతిక ప్రదీప్, అతాను దాస్, మాదాల సూర్య హంసిని, సాహిల్ రాజేశ్, కుంకుమ్ మొహొద్.

కాకతీయ నైట్స్ (తెలంగాణ): నికో వైనెర్, ఎలియా క్యానల్స్, నీరజ్, వెన్నం జ్యోతి సురేఖ, రోహిత్, అవ్‌నీత్, చిట్టిబొమ్మ జిజ్ఞాస్, తిషా పునియా.

చోళా చీఫ్స్ (తమిళనాడు): బ్రాడీ ఎలీసన్, మీరి మారిటా, రిషభ్ యాదవ్, దీపిక కుమారి, తరుణ్‌దీప్ రాయ్, తనిపర్తి చికిత, పులకిత్, అన్షిక కుమారి.

మైటీ మరాఠాస్ (మహారాష్ట్ర): మైక్ స్కాలెస్సర్, అలెగ్జాండ్రా వాలెన్సియా, బొమ్మదేవర ధీరజ్, పర్ణీత్ కౌర్, అమన్ సైనీ, భజన్ కౌర్, మృణాల్ చౌహాన్, మధుర.

రాజ్‌పుతానా రాయల్స్ (రాజస్తాన్): మెటా గాజోజ్, ఎల్లా గిబ్సన్, ప్రథమేశ్, అంకిత, ఓజస్ ప్రవీణ్, బసంతి, సచిన్ గుప్తా, స్వాతి.

ఏపీఎల్ డైరెక్టర్‌గా అనిల్ కామినేని



ఈ లీగ్‌కు రూపకల్పన చేసిన ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ కామినేని... ఏపీఎల్ డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు. ప్రపంచ అగ్రశ్రేణి ఆర్చర్లు పాల్గొంటున్న ఈ లీగ్‌తో భారత ఆర్చర్లకు ఎంతో లాభం జరుగుతుందని అనిల్ వెల్లడించారు. 'ప్రపంచ ఆర్చరీ సంఘంతో ఈ లీగ్ గురించి చర్చించాం. ఇకపై ప్రతీఏటా దీన్ని నిర్వహిస్తామని అందుకు తగ్గట్లు అంతర్జాతీయ షెడ్యూల్ రూపొందించాలని చెప్పాం. ప్రస్తుతం ఆర్చరీలో దక్షిణ కొరియా ఆధిపత్యం కొనసాగుతోంది. ఆరంభ లీగ్‌లో పలువురు కొరియా స్టార్లు పాల్గొనేందుకు ఆసక్తి చూపారు. అయితే ఈ లీగ్ సమయంలో వారి దేశంలో సెలెక్షన్ ట్రయల్స్ ఉన్నాయి. ఫలితంగా ఈసారి నుంచి కాకుండా వచ్చే ఏడాది కొరియా ప్లేయర్లను కూడా చూడవచ్చు' అని అనిల్ తెలిపారు. సినీనటుడు రామ్‌చరణ్ ఈ లీగ్‌కు అంబాసిడర్‌గా వ్యవహరించనున్నాడు. ప్రతిభను గుర్తించి మరింత సానబెట్టేందుకు ఈ లీగ్ ఎంతగానో ఉపకరించనుంది. ప్రపంచ ఆర్చరీలో భారత దేశాన్ని అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయంగా ఈ లీగ్ రూపకల్పన చేసినట్లు డైరెక్టర్ అనిల్ కామినేని వెల్లడించారు. ఆర్చరీలో కొత్త విప్లవం తీసుకొచ్చి తద్వారా ప్రపంచంలో తిరుగులేని శక్తిగా నిలపడమే తమ ధ్యేయమని తెలిపారు. ఈ క్రమంలోనే ఆర్చరీని మరింత మందికి చేరువ చేసేందుకు రామ్‌చరణ్‌ను అంబాసిడర్‌గా ఎంపికచేసినట్లు వివరించారు.


మొహమ్మద్ వసీమ్

'మా వద్ద భారత్, పాక్ వినిపించదు'

• యూఏఈ జట్టులో వర్గాలు లేవన్న కెప్టెన్ వసీమ్

దుబాయ్: ఆసియా కప్‌లో పాల్గొన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టులో ఆ దేశంలో పుట్టినవారు కాకుండా వలస వచ్చిన ఆటగాళ్లే ఎక్కువ మంది ఉన్నారు. ఐదుగురు భారత్‌కు చెందినవారు కాగా, మరో ఐదుగురు పాకిస్తానీలు. టోర్నీలో భారత్, పాక్ మధ్య తాజా 'షేక్ హ్యాండ్' వివాదం నేపథ్యంలో యూఏఈ టీమ్‌లో ఉన్న ఇరు దేశాల క్రికెటర్ల మధ్య సంబంధాలపై కూడా చర్చ జరిగింది. అయితే కెప్టెన్ మొహమ్మద్ వసీమ్ ఈ మొత్తం అంశాన్ని తేలిగ్గా కొట్టిపారేశాడు. భారత్, పాక్ మధ్య ఏం జరిగినా తమకు సంబంధం లేదని, తామంతా యూఏఈ జట్టు ఆటగాళ్లం మాత్రమేనని అతను స్పష్టం చేశాడు. వసీమ్ స్వయంగా పాకిస్తాన్‌లోని ముల్తాన్‌కు చెందిన వాడు కాగా...హైదర్ అలీ, జునైద్, రోహిద్, ఆసిఫ్ ఇతర పాకిస్తాన్ క్రికెటర్లు. భారత్‌కు చెందిన సిమ్రన్‌జీత్ సింగ్, రాహుల్ చోప్రా, హర్షిత్ కౌశిక్, ధ్రువ్ పరాశర్, అలీషాన్ షరఫు టీమ్‌లో కీలక సభ్యులు. 'యూఏఈ టీమ్ సభ్యులంతా ఒక కుటుంబ సభ్యుల్లాంటివాళ్లం. ఎవరూ భారతీయుడు కాదు, ఎవరూ పాకిస్తానీ కాదు. భారత్, పాక్ వివాదానికి సంబంధించి మా జట్టులో అసలు ఎలాంటి చర్చా జరగలేదు, జరగదు కూడా. మా టీమ్ సభ్యులంతా కలిసి ఎంతో క్రికెట్ ఆడాం. ఒకే కుటుంబంలాగే ఉంటూ ఒకే దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాం' అని వసీమ్ వ్యాఖ్యానించాడు. రిఫరీతో విభేదాల నేపథ్యంలో బుధవారం యూఏఈతో జరిగిన మ్యాచ్‌కు పాక్ టీమ్ చాలా ఆలస్యంగా వచ్చింది. నిబంధనల ప్రకారం యూఏఈ అప్పీల్ చేస్తే పాక్ వాకోవర్ ఇచ్చినట్లుగా ప్రకటించి యూఏఈని విజేతగా ఖరారు చేయవచ్చు. అయితే తమకు అలాంటి ఆలోచన ఏమాత్రం రాలేదని అతను వెల్లడించాడు.

పుణేరి పల్టన్ 'టాప్' షో

యు ముంబాపై 18 పాయింట్ల తేడాతో ఘన విజయం



జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో పుణేరి పల్టన్ 'హ్యాట్రిక్' విజయం నమోదు చేసుకొని పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. గత రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన పుణేరి పల్టన్ గురువారం జరిగిన పోరులో యు ముంబాపై ఏకపక్ష విజయం సాధించింది. సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన పుణేరి పల్టన్ 40–22 పాయింట్ల తేడాతో యు ముంబాను చిత్తుచేసింది. పుణేరి పల్టన్ జట్టు తరఫున స్టువర్ట్ సింగ్ 8 పాయింట్లు, గుర్‌దీప్ 5 పాయింట్లు సాధించగా... అభినేష్, గౌరవ్ ఖత్రి చెరో 4 పాయింట్లు సాధించారు. యు ముంబా జట్టు తరఫున అమీర్ మొహమ్మద్ 6 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో యు ముంబా జట్టు 12 రెయిడ్ పాయింట్లు సాధించగా... పుణేరి పల్టన్ జట్టు 14 రెయిడ్ పాయింట్లు ఖాతాలో వేసుకుంది. అయితే ట్యాక్లింగ్‌లో యు ముంబా 6 పాయింట్లకు పరిమితం కాగా... పల్టన్ 20 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. తాజా సీజన్‌లో 8 మ్యాచ్‌లాడిన పుణేరి పల్టన్ 6 విజయాలు, 2 పరాజయాలతో 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక 'టాప్' ప్లేస్‌కు చేరింది. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 45–41తో బెంగాల్ వారియర్స్‌పై గెలుపొందింది. జైపూర్ రైడర్లు నితిన్ 13, అలీ 12 పాయింట్లతో విజృంభించగా... వారియర్స్ తరఫున దేవాంక్ 16, మన్‌ప్రీత్ 10 పాయింట్లు సాధించారు. దేవాంక్‌కు ఇది వరుసగా ఏడో 'సూపర్–10' కావడం విశేషం. ఈ లీగ్ చరిత్రలో అత్యంత వేగంగా (38 మ్యాచ్‌ల్లో) 400 రెయిడ్ పాయింట్లు సాధించిన ప్లేయర్‌గా దేవాంక్ నిలిచాడు. నేడు పుణేరి పల్టన్‌తో హరియాణా స్టీలర్స్, తమిళ్ తలైవాస్‌తో తెలుగు టైటాన్స్ ఆడతాయి.

ధ్రువ్ జురేల్ అజేయ సెంచరీ

భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్ 403/4
- మెరిసిన పడిక్కల్, సాయి సుదర్శన్
- ఆస్ట్రేలియా 'ఎ'తో అనధికారిక తొలి టెస్టు


దేవదత్ పడిక్కల్


ధ్రువ్ జురేల్

లక్నో: వికెట్ కీపర్ ధ్రువ్ జురేల్ (132 బంతుల్లో 113 బ్యాటింగ్; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ శతకంతో కదంతొక్కాడు. ఫలితంగా ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో భారత 'ఎ' జట్టు పటిష్ట స్థితికి చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 116/1తో గురువారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత 'ఎ' జట్టు ఆట ముగిసే సమయానికి 103 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 403 పరుగులు చేసింది. టీమిండియా ప్లేయర్ ధ్రువ్ దుమ్మురేపగా... దేవదత్ పడిక్కల్ (178 బంతుల్లో 86 బ్యాటింగ్; 8 ఫోర్లు), సాయి సుదర్శన్ (124 బంతుల్లో 73; 10 ఫోర్లు), నారాయణ్ జగదీశన్ (113 బంతుల్లో 64; 7 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్‌సెంచరీలతో రాణించారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (8) నిరాశ పరిచాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో జేవియర్, కారీ రాచిసిల్లీ, లియామ్ స్కాట్, కనొల్లీ తలా ఒక వికెట్ పడగొట్టారు. మూడో రోజు సైతం వర్షం కారణంగా పూర్తి ఆట సాధ్యపడలేదు. అంతకుముందు ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 532/6 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ప్రస్తుతం చేతిలో 6 వికెట్లు ఉన్న భారత్ 'ఎ' జట్టు... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 129 పరుగులు వెనుకబడి ఉంది. సెంచరీ హీరో ధ్రువ్‌తో పాటు... దేవదత్ పడిక్కల్ క్రీజులో ఉన్నారు. వీరి తర్వాత క్రీజులోకి రానున్న తనుశ్ కొటియాన్, హర్ష్ దూబే కూడా బ్యాటింగ్ చేయగల సమర్థులే కావడంతో... ఈ మ్యాచ్ 'డ్రా'గా ముగియడం ఖాయమే.

ధ్రువ్ ధనాధన్...

ఇటీవల ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు భారత జట్టుకు ఎంపికైన జగదీశన్ క్రితం రోజు స్కోరుకు ఎక్కువ పరుగులు జోడించకుండానే వెనుదిరగగా... సాయి సుదర్శన్‌తో కలిసి పడిక్కల్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ జోడీ మూడో వికెట్‌కు 76 పరుగులు జోడించింది. సాధికారికంగా ఆడుతున్న సాయి సుదర్శన్ కూపర్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోగా... కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇలా వచ్చి అలా వెళ్లాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌తో పాటు... ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌లో పాల్గొంటున్న భారత జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన శ్రేయస్... ఈ మ్యాచ్‌లో రాణించి వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపికవుతాడని భావిస్తే అతడు ఎక్కువసేపు నిలవలేకపోయాడు. ఈ దశలో పడిక్కల్‌కు జత కలిసిన ధ్రువ్ ఇన్నింగ్స్‌ను సజావుగా ముందుకు నడిపాడు. ఈ జంట అబేధ్యమైన ఐదో వికెట్‌కు 181 పరుగులు జోడించింది. ఫలితంగా భారత 'ఎ' జట్టు ప్రత్యర్థికి దీటైన బదులిచ్చింది.


శాన్‌ఫ్రాన్సిస్కోలోని విఖ్యాత గోల్డెన్ గేట్ బ్రిడ్జి వద్ద లేవర్ కప్‌తో టీమ్ యూరప్, టీమ్ వరల్డ్ ఆటగాళ్లు

వరల్డ్ x యూరప్

• నేటి నుంచి లేవర్ కప్ టోర్నీ
• బరిలో అల్‌కరాజ్, జ్వెరెవ్ తదితరులు

శాన్‌ఫ్రాన్సిస్కో (అమెరికా): ప్రపంచ పురుషుల టెన్నిస్‌లోని మేటి ఆటగాళ్లతో ప్రతి యేటా నిర్వహించే 'లేవర్ కప్' టోర్నమెంట్‌కు రంగం సిద్ధమైంది. నేటి నుంచి అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో మూడు రోజులపాటు ఈ టోర్నీ జరుగుతుంది. టీమ్ యూరప్, టీమ్ వరల్డ్ జట్ల మధ్య ఈ టోర్నీని నిర్వహిస్తారు. 2017లో మొదలైన ఈ టోర్నీ 2020లో కరోనా మహమ్మారి కారణంగా జరగలేదు. ఇప్పటి వరకు ఏడుసార్లు ఈ టోర్నీ జరగ్గా... ఐదుసార్లు టీమ్ యూరప్ (2017, 2018, 2019, 2021, 2024), రెండుసార్లు టీమ్ వరల్డ్ (2022, 2023) 'లేవర్ కప్' చాంపియన్‌గా నిలిచాయి. ఈసారి టీమ్ యూరప్ తరఫున ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్), మూడో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), 11వ ర్యాంకర్ హోల్గర్ రూనె (డెన్మార్క్), 12వ ర్యాంకర్ కాస్పర్ రూడ్ (నార్వే), 17వ ర్యాంకర్ జాకుబ్ మెన్‌సిక్ (చెక్ రిపబ్లిక్), 22వ ర్యాంకర్ టామస్ మఖచ్ (చెక్ రిపబ్లిక్), 25వ ర్యాంకర్ ఫ్లావియో కొబొల్లి (ఇటలీ) ఆడనున్నారు. టీమ్ వరల్డ్ తరఫున ప్రపంచ 5వ ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా), 8వ ర్యాంకర్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా), 21వ ర్యాంకర్ ఫ్రాన్సిస్కో సెరున్‌డోలో (అర్జెంటీనా), 32వ ర్యాంకర్ అలెక్స్ మిచెల్సన్ (అమెరికా), 42వ ర్యాంకర్ జోవా ఫోన్సెకా (బ్రెజిల్), 62వ ర్యాంకర్ రిలీ ఒపెల్కా (అమెరికా), 86వ ర్యాంకర్ జెన్సన్ బ్రూక్స్‌బై (అమెరికా) బరిలోకి దిగుతారు. టీమ్ యూరప్ జట్టుకు ఫ్రెంచ్ ఓపెన్ మాజీ చాంపియన్ యానిక్ నోవా (ఫ్రాన్స్)... టీమ్ వరల్డ్ జట్టుకు అమెరికా మేటి ప్లేయర్, ఎనిమిది గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ నెగ్గిన ఆంద్రీ అగస్సీ కెప్టెన్‌లుగా వ్యవహరిస్తారు.



స్పెయిన్‌లోని ఎంపురియాబ్రావాలో బుధవారం స్కైడైవర్ శీతల్ మహాజన్ ఇలా వినూత్నంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి 75వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



బిహార్‌లోని గయలో ఉన్న విష్ణుపాద్ ఆలయంలో పితృపక్షం సందర్భంగా పిండ ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్న విదేశీయులు



సంప్రదాయ హిందూ క్యాలెండర్‌ను అనుసరించి గురువారం సూరత్‌లో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా చర్కాలపై నూలు వడుకుతున్న గుజరాత్ విద్యాపీఠ్ విద్యార్థులు

పాక్, సౌదీ అరేబియా రక్షణ ఒప్పందం...
భారత్‌పై ప్రభావం ఎంత?

దుబాయ్/ఇస్లామాబాద్: పాకిస్తాన్, సౌదీ అరేబియాల రక్షణ ఒప్పందం వల్ల భారత్‌పై ప్రభావం ఏమేరకు ఉంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ భారత్‌పై తమపై దాడికి దిగితే ఒప్పందం ప్రకారం సౌదీ అరేబియా సైన్యం తమకు మద్దతుగా నిలుస్తుందని పాకిస్తాన్ విశ్వసిస్తోంది. కానీ, క్షేత్రస్థాయి పరిస్థితులను గమనిస్తే పాక్ ఆశలు నెరవేరే అవకాశం లేదని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే భారత్, సౌదీ అరేబియాల మధ్య బలమైన స్నేహ సంబంధాలున్నాయి. ఇరుదేశాల మధ్య దశాబ్దాలుగా వాణిజ్య బంధం కొనసాగుతోంది. ఏ దేశమైనా తమపై దాడికి దిగితే ఉమ్మడిగా ఎదుర్కొంటామని ఒప్పందంలో పేర్కొన్నారు. కానీ, ఫలానా దేశం అంటూ పేర్లు ప్రస్తావించలేదు. ఇండియాకు నాలుగో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి సౌదీ అరేబియా. సౌదీ అరేబియాకు రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి ఇండియా. 2024–25లో ఇరుదేశాల మధ్య 41.88 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. పాక్–సౌదీ అరేబియాల మధ్య వాణిజ్యం దాదాపు 4 బిలియన్ డాలర్లే. పాకిస్తాన్ కోసం భారత్‌పై సౌదీ అరేబియా యుద్ధం చేసే అవకాశం లేదన్నది నిపుణుల అంచనా. పాక్, సౌదీ అరేబియా తాజా ఒప్పందాన్ని ఇజ్రాయెల్ కోణంలో చూడాలని చెబుతున్నారు. ఇజ్రాయెల్ గనుక పాక్‌పై దాడికి పాల్పడితే ఒప్పందం ప్రకారం పాక్‌కు మద్దతుగా సౌదీ అరేబియా సైన్యం రంగంలోకి దిగుతుందని పేర్కొంటున్నారు. ఇటీవలి కాలంలో అరబ్ దేశాలు–ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న సంగతి తెలిసిందే. భారత్, పాక్ మధ్య ఇప్పటిదాకా నాలుగు యుద్ధాలు జరిగాయి. మూడుసార్లు భీకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పాక్‌కు అండగా సౌదీ అరేబియా ఏనాడూ జోక్యం చేసుకోలేదన్న సంగతి తెలిసిందే.



సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌తో పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్

ఇదీ ఒప్పందం

అణ్వాయుధ దేశం పాకిస్తాన్, సౌదీ అరేబియాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. 'వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందం'పై రెండు దేశాలు బుధవారం సంతకాలు చేశాయి. దీనివల్ల ఇరుదేశాల మధ్య రక్షణ బంధం మరింత బలపడనుంది. ఒక దేశంపై దాడి జరిగితే మరో దేశం అండగా నిలుస్తుంది. పాక్, సౌదీ అరేబియాల్లో ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా రెండు దేశాలపై జరిగినట్లేనని పరిగణిస్తాయి. రక్షణ రంగంలో పాక్, సౌదీ అరేబియా దశాబ్దాలుగా సహకరించుకుంటున్నాయి. ఈ సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్, పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ పరస్పర రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశారు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్షణ సహకారాన్ని బలోపేతం చేసుకోవడం, ఎవరైనా దురాక్రమణకు పాల్పడినప్పుడు ఉమ్మడి పోరాటం సాగించడం ఒప్పందం అసలు ఉద్దేశమని పాకిస్తాన్ ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది.

భద్రత విషయంలో అమెరికాపై ఆధారపడడం తగ్గించుకోవాలని గల్ఫ్ అరబ్ దేశాలు భావిస్తున్నాయి. అమెరికా మిత్రదేశమైన ఇజ్రాయెల్ గతవారం ఖతార్‌లోని దోహా నగరంలో వైమానిక దాడులకు పాల్పడింది. కాల్పుల విరమణ ప్రతిపాదనపై చర్చల్లో పాల్గొన్న హమాస్ నేతలను అంతం చేసేందుకు ప్రయత్నించింది. ఈ దాడులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుమతి ఉన్నట్లు అరబ్ దేశాలు భావిస్తున్నాయి. హమాస్–ఇజ్రాయెల్ యుద్ధంతోపాటు తాజా పరిణామాల నేపథ్యంలో అమెరికా నుంచి సెక్యూరిటీ గ్యారంటీ ఇకపై ఆశించినంతగా ఉండకపోవచ్చని అంచనాకొచ్చాయి. అందుకే పొరుగు దేశాలతో రక్షణ ఒప్పందాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ క్రమంలోనే పాక్, సౌదీ అరేబియాల మధ్య ఒప్పందం కుదరడం గమనార్హం.

భారత్‌తో సంబంధాలకు అధిక ప్రాధాన్యం: సౌదీ అధికారి

ఎన్నో ఏళ్ల చర్చల తర్వాతే పాకిస్తాన్‌తో రక్షణ ఒప్పందం కుదిరినట్లు సౌదీ అరేబియా సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఏవో కొన్ని దేశాలు లేదా కొన్ని ఘటనలను దృష్టిలో పెట్టుకొని జరిగిన ఒప్పందం కాదని స్పష్టంచేశారు. తమ రెండు దేశాల మధ్యనున్న దీర్ఘకాల, లోతైన సహకారాన్ని వ్యవస్థీకృతంగా మార్చుకోవాలన్నదే అసలు లక్ష్యమని వివరించారు. భారత్‌తో సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. భారత్–సౌదీ అరేబియాల మధ్య గతంలో ఎన్నడూ లేనంతగా బలమైన సంబంధాలు ఇప్పుడున్నాయని వెల్లడించారు. ప్రాంతీయంగా శాంతి, స్థిరత్వం కోసం భారత్‌తో కలిసి పని చేస్తామన్నారు. భారత్, పాకిస్తాన్‌లతో సంబంధాల విషయంలో సమతూకం పాటించాలన్నదే తమ విధానమని తెలిపారు. పాక్ ప్రభుత్వం అణు శక్తిని సౌదీ అరేబియాకు అందజేయడానికి అంగీకరించిందా? అని ప్రశ్నించగా.. ఇది సమగ్ర రక్షణ ఒప్పందమని, సైనికపరంగా అన్ని అంశాలూ దీని పరిధిలోకి వస్తాయని స్పష్టంచేశారు.

అధ్యయనం చేస్తాం: రణధీర్ జైస్వాల్


పాక్, సౌదీ అరేబియాల రక్షణ ఒప్పందంపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. ఈ పరిణామంపై తమకు అవగాహన ఉందని వెల్లడించారు. భారతదేశ భద్రత, ప్రాంతీయ స్థిరత్వంపై ఈ ఒప్పందం చూపే ప్రభావాన్ని అధ్యయనం చేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఎక్స్'లో పోస్టు చేశారు.

ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం(తెలంగాణ): ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మహిళా మావోయిస్టు మృతి చెందిందని సుకుమా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. గురువారం ఉదయం గదిరాస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుఫ్రి, పెర్మాపారా మధ్య ఉన్న కొండల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో భద్రతా దళాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో డీఆర్జీ బలగాలకు, మావోయిస్టులకు మధ్య భారీగా ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పుల అనంతరం గాలింపు చేపట్టగా ఓ మహిళా మావోయిస్టు మృతదేహం లభ్యమైంది. మృతురాలిని మలంగిర్ ఏరియా కమిటీకి చెందిన బుస్కీ నుప్పోన్సోగా గుర్తించగా ఆమెపై రూ. 5లక్షల రివార్డు ఉందని ఎస్పీ తెలిపారు. ఘటనా స్థలం నుంచి భద్రత బలగాలు మృతదేహాన్ని, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయని వెల్లడించారు.

రాజకీయాల్లో జోక్యం చేసుకోను

- కేథలిక్ చర్చి, వలసలపై మాత్రం మాట్లాడుతా
- మొట్టమొదటి ఇంటర్వ్యూలో పోప్ లియో వెల్లడి



పోప్ లియో

రోమ్: అగ్రరాజ్యం అమెరికా రాజకీయాల్లో జోక్యం చేసుకునే ఉద్దేశం తనకు లేదని పోప్ లియో స్పష్టం చేశారు. అయితే, ఆ దేశంలో కేథలిక్ చర్చి, వలసలకు సంబంధించిన అంశాలపై మాత్రం మాట్లాడుతానన్నారు. అమెరికాకు చెందిన మొట్టమొదటి పోప్‌గా చరిత్ర సృష్టించిన లియో మొదటిసారిగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మతబోధకులపై లైంగిక వేధింపుల ఆరోపణలు, ఎల్జీబీటీక్యూ ప్లస్ కేథలిక్కులు, వాటికన్–చైనా సంబంధాలు సహా పలు అంశాలపై మాట్లాడారు. వాటికన్ కరస్పాండెంట్ ఎలిస్ అన్ అల్లెన్‌కు ఇచ్చిన ఈ ఇంటర్వ్యూ గురువారం ప్రచురితమైంది. 'కేథలిక్ చర్చిలోకి అందరూ ఆహ్వానితులే'అంటూ ఎల్జీబీటీక్యూ ప్లస్ కేథలిక్కులను ఉద్దేశించి దివంగత పోప్ ఫ్రాన్సిస్ ఇచ్చిన సందేశాన్ని తానూ స్వీకరిస్తున్నానన్నారు. లైంగిక సంబంధ అంశాల్లో చర్చి వైఖరి మారడానికి దాదాపుగా అవకాశమేలేదని స్పష్టం చేశారు. హోమోసెక్సువల్ వ్యక్తులను కూడా గౌరవించాలని కేథలిక్ చర్చి చెబుతోందన్నారు. అయితే, స్వలింగ వివాహాన్ని చర్చి వ్యతిరేకిస్తుందన్నారు. వివాహం ఆడ, మగ జరగాల్సిందని స్పష్టంగా చెబుతోందని పోప్ లియో అన్నారు. చైనాతో సంబంధాలపై ఆయన..బిషప్పుల నియామకంపై 2018లో చైనాతో చేసుకున్న వివాదాస్పద ఒప్పందంలో సమీప భవిష్యత్తులో మార్పులు జరిగే అవకాశం లేదని భావిస్తున్నానన్నారు. చైనాలో వివిధ చర్చిల పరిధిలో ఉన్న కోటికి పైగా కేథలిక్కులను ఏకం చేసే లక్ష్యంతో పోప్ ఫ్రాన్సిస్ హయాంలో వాటికన్ ఈ ఒప్పందం కుదుర్చుకుంది. చర్చిల్లో లైంగిక వేధింపుల కుంభకోణాలను ప్రస్తావించిన పోప్ లియో..నిజంగా ఇదో సంక్షోభమన్నారు. బాధితుల్లో 90 శాంత వరకు ముందుకొచ్చి తన ఆరోపణలు చేస్తున్నారని, వీరి సాంత్వన కలిగించే విషయంలో చర్చి వ్యవస్థ ఒక పరిష్కారాన్ని కనుగొనలేకపోయిందని చెప్పారు. అదే సమయంలో మతబోధకుల హక్కులను కూడా గౌరవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రపంచ వ్యవహారాలపై అమెరికా పలుకుబడి గణనీయంగా ఉందన్న లియో..కేథలిక్ చర్చి వలసలను కూడా ఒక ముఖ్యమైన అంశంగానే భావిస్తోందని స్పష్టం చేశారు. ట్రంప్ ప్రభుత్వ వలసదారుల వ్యతిరేక చర్యలను పోప్ ఫ్రాన్సిస్ ఇచ్చిన పిలుపు మేరకు అమెరికా బిషప్పులు బహిరంగంగానే వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తోటి మనిషిని తగు రీతిలో గౌరవించాలన్నదే తమ అభిమతమని చెప్పారు.

రబీలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 36.25 కోట్ల టన్నులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా వచ్చే రబీ సీజన్‌లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 36.25 కోట్ల మెట్రిక్ టన్నుల వరకు ఉండొచ్చని కేంద్ర వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇది గత ఏడాది అంచనా 34.15 కోట్ల మెట్రిక్ టన్నులతో పోలిస్తే 2.10 కోట్ల టన్నుల మేర అధికమని తెలిపింది. 2024–25లో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 35.39 కోట్ల టన్నులు కాగా, అది అంతకుముందు ఏడాది కన్నా 2.16 కోట్ల టన్నులు అధికమని తెలిపింది. ఈ ఏడాది 1.19 కోట్ల టన్నుల గోధుమ ఉత్పత్తి లక్ష్యం గత ఏడాది కన్నా 3.47 శాతం ఎక్కువగా ఉండనుంది. ఇక 1.65 కోట్ల టన్నుల పప్పు ధాన్యాలు, 1.50 కోట్ల టన్నుల నూనె గింజలను ఉత్పత్తిని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రబీ సీజన్‌కు 2.29 కోట్ల టన్నుల విత్తనాలు అవసరం కాగా, 2.5 కోట్ల టన్నులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని తెలిపింది.

కుటుంబ పింఛనుకు సవతి తల్లి అనర్హురాలు

ఐఏఎఫ్ నిబంధనలను సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: భారత వైమానిక దళం(ఐఏఎఫ్) నిబంధనల ప్రకారం పింఛను 'బహుమతి కాదు', సవతి తల్లిని కుటుంబ పింఛనుకు అర్హురాలిగా పరిగణించలేమని కేంద్రం గురువారం సుప్రీంకోర్టుకు తెలిపింది. చట్టపరంగా, బాంధవ్యం కోణంలో చూసినప్పుడు సవతి తల్లి కన్న తల్లికి భిన్నంగా ఉండటమే ఇందుకు కారణమని వివరించింది. తల్లి అంటే కన్నతల్లి అనే అర్థంలోనే భావించాల్సి ఉంటుందని, సవతి తల్లిని కాదని తెలిపింది. నిర్వహణ, ఇతర సంక్షేమ ప్రయోజనాలపై ఉన్నత న్యాయస్థానం గతంలో వివిధ సందర్భాల్లో ఇచ్చిన తీర్పులను కేంద్రం ప్రస్తావించింది. పింఛను ప్రయోజనాలను కోరుకునే వ్యక్తి, సంబంధిత చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం స్పష్టమైన అర్హతను నిరూపించుకోవాల్సి ఉంటుందని గురువారం జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనానికి కేంద్రం తెలిపింది. జోగి అనే ఉద్యోగి చిన్న తనంలోనే ఆరేళ్ల వయస్సు ఉండగా కన్నతల్లి చనిపోయింది. దీంతో, తండ్రి మరొకరిని వివాహం చేసుకున్నారు. సవతి తల్లి జయశ్రీ ఆయన్ను పెంచి పెద్ద చేశారు. జోగి 2008లో చనిపోయారు. ఆయనది ఆత్మహత్య అని ఐఏఎఫ్ తెలిపింది. కుటుంబ పింఛనుకు వచ్చేసరికి సవతి తల్లి అర్హురాలు కాదని ఐఏఎఫ్ స్పష్టం చేసింది. దీంతో, ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తల్లి స్థానంలో తనకు కుటుంబ పింఛను ఇవ్వాలని కోరారు. ఐఏఎఫ్ పింఛను నిబంధనలు–1961 ప్రకారం ఉద్యోగి చనిపోయిన పక్షంలో కుటుంబ పింఛనుకు..వితంతువు, చట్టబద్ధంగా వివాహం చేసుకున్న తండ్రి లేదా తల్లి, చట్టబద్ధ వారసుడైన కుమారుడు లేదా కుమార్తె అర్హులని స్పష్టం చేస్తోందని కేంద్రం వివరించింది. ధర్మాసనం ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 20వ తేదీకి వాయిదా వేసింది.

మాన్యువల్ స్కావెంజింగ్‌పై రూ. 5 లక్షల జరిమానా

న్యూఢిల్లీ: మనుషులతో డ్రెయిన్లను శుభ్రం చేయించినందుకు గాను ఢిల్లీ ప్రభుత్వ ప్రజా పనుల విభాగా(పీడబ్ల్యూడీ)నికి సుప్రీంకోర్టు రూ.5 లక్షల జరిమానా విధించింది. ఎటువంటి రక్షణ పరికరాలు లేకుండా ఏకంగా సుప్రీంకోర్టు గేట్–ఎఫ్ వద్దనున్న మురుగు కాల్వను శుభ్రం చేయించిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కార్మికుల్లో ఒక మైనర్ కూడా ఉండటాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. నేషనల్ కమిషన్ ఫర్ సఫాయి కర్మచారీస్ అక్కౌంట్‌లో నాలుగు వారాల్లోగా రూ5 లక్షలు జమ చేయాలని పీడబ్ల్యూడీ విభాగాన్ని ఆదేశించింది. 2023 అక్టోబర్‌లో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారని పేర్కొంది. తమకు అందిన ఫొటోల్లో మురుగు కాల్వను శుభ్రం చేయించిన అధికారులు, పాల్గొన్న కార్మికులు స్పష్టంగా కనిపిస్తున్నారంది. ముందుముందు ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడే అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనం ఉత్తర్వు జారీ చేసింది. పీడబ్ల్యూడీ మాత్రమే కాదు, ఇతర విభాగాల అధికారులు కూడా తమ ఆదేశాలను తుచ తప్పకుండా పాటించేలా చూసుకోవడానికి ఇదో హెచ్చరికని పేర్కొంది.

గృహ నిర్బంధంలో మెహబూబా ముఫ్తీ

తీవ్రంగా ఖండించిన సీఎం ఒమర్

శ్రీనగర్: పోలీసులు తనను గృహ నిర్బంధంలో ఉంచారని పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ ఆరోపించారు. హురియత్ కాన్ఫరెన్స్ మాజీ చైర్మన్ అబ్దుల్ గనీ భట్‌కు నివాళులర్పించేందుకు సోపోర్ వెళ్లకుండా అడ్డుకున్నారని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని కఠినమైన అప్రజాస్వామిక వాస్తవమని గురువారం ఆమె ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. ఈ నెల 5న హజ్రత్‌బల్ మసీదుపై జాతీయ జెండాను ఎగురవేసిన నేపథ్యంలో కశ్మీర్ ప్రజలు లోలోపల అశాంతితో రగిలిపోతున్నారన్నారు. కశ్మీర్‌లో శాంతి నెలకొల్పడంపై కేంద్రంలోని బీజేపీకి ఆసక్తి లేనదటానికి ఈ ఘటన మరింత తేటతెల్లమైందని చెప్పారు. అదేవిధంగా, హంద్వారా ఎమ్మెల్యే సజాద్ లోనె, హురియత్ కాన్ఫరెన్స్ ప్రస్తుత చైర్మన్ మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ కూడా పోలీసులు తమను గృహ నిర్బంధంలో ఉంచారని ప్రకటించారు. అబ్దుల్ ఘనీ భట్‌కు నివాళులర్పించేందుకు సోపోర్ వెళ్లకుండా అడ్డుకున్నారని చెప్పారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భట్ బుధవారం సాయంత్రం సోపోర్‌లో కన్నుమూయడం తెల్సిందే. నేతలను గృహ నిర్బంధంలో ఉంచడాన్ని సీఎం ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా ఖండించారు. వాళ్లు అక్కడికి వెళ్లి భట్ కుటుంబ సభ్యులను ఓదార్చి, రెండు మాటలు మాట్లాడి తిరిగి వచ్చినందువల్ల తుపానేమీ సంభవించదని వ్యాఖ్యానించారు. ఓ వైపు అంతా బాగుందని చెబుతూనే, మరోవైపు మన ప్రజలను మనమే నమ్మలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఇలాంటి విచిత్ర పరిణామాలు ఏమాత్రం మంచిది కావని పేర్కొన్నారు.

కించపరిచేలా మాట్లాడకపోవడమే మంచిది

సీజేఐ బీఆర్ గవాయ్ వ్యాఖ్యలపై వీహెచ్‌పీ

న్యూఢిల్లీ: ఖజురహోలో విష్ణుమూర్తి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలను విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) తప్పుబట్టింది. హిందూ మత విశ్వాసాలను చులకన చేసే అటువంటి వ్యాఖ్యలను నివారించడం మంచిదని పేర్కొంది. మరీ ముఖ్యంగా న్యాయస్థానాల్లో చేయరాదని తెలిపింది. వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత సమాజం కోర్టులను న్యాయ ఆలయాలుగా భావిస్తుందని ఆయన తెలిపారు. 'అటువంటి న్యాయస్థానాలపై సమాజం విశ్వాసం చెక్కుచెదరకుండా చూడటమే కాదు మరింత బలపడేలా వ్యవహరించడం అందరి కర్తవ్యం'అని కుమార్ అన్నారు. కక్షిదారులు, లాయర్లతోపాటు జడ్జీలకు కూడా ఈ విషయంలో సమాన బాధ్యత ఉందన్నారు. తన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శల నేపథ్యంలో సీజేఐ గవాయ్ స్పందిస్తూ..అన్ని మతాలను సమానంగా గౌరవిస్తానని తెలిపారు. విగ్రహం పునఃప్రతిష్ఠాపనపై ఆ దేవుడినే అడగాలంటూ మంగళవారం జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ వ్యాఖ్యానించడం తెల్సిందే.

ఢిల్లీ జూలో ఆఫ్రికా ఏనుగు 'శంకర్' మృత్యువాత

న్యూఢిల్లీ: ఢిల్లీ జూలో ఉన్న ఏకైక ఆఫ్రికా ఏనుగు 29 ఏళ్ల 'శంకర్'ఈ నెల 17వ తేదీ బుధవారం రాత్రి చనిపోయింది. 16వ తేదీ వరకు ఈ మగ ఏనుగు ఎటువంటి అనారోగ్యానికి గురికాలేదని, అసాధారణంగా ప్రవర్తించ లేదని జూ తెలిపింది. 17వ తేదీ ఉదయం సాధారణం కంటే తక్కువగా ఆకులు, గడ్డి తిందని, కొద్దిపాటి నీళ్ల విరేచనం చేసుకుందని పేర్కొంది. దీంతో, పశువైద్య బృందం పరిశీలనలో శంకర్‌ను ఉంచామని, హఠాత్తుగా రాత్రి 7.25 గంటల వేళ శంకర్ అపస్మారక స్థితికి చేరుకుందని, అత్యవసర వైద్య చికిత్సలు అందిస్తుండగానే ప్రాణాలు విడిచిందని వివరించింది. ఘటనపై దర్యాప్తు చేపట్టామని గురువారం ఢిల్లీ జూ ఒక ప్రకటనలో పేర్కొంది. బరేలీలోని ఇండియన్ వెటరినరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నిపుణుల బృందం పోస్టుమార్టం నిర్వహించిందని వెల్లడించింది. శంకర్‌ను జింబాబ్వే ప్రభుత్వం భారత్‌కు కానుకగా ఇచ్చింది. 1998 నవంబర్‌లో ఢిల్లీ జూకు చేరుకున్న శంకర్..తోడుగా ఉండే బంబాయి అనే ఆడ ఏనుగు చనిపోవడంతో 2005 నుంచి ఒంటరిగా ఉంటోంది.

అండమాన్ మాజీ ఎంపీని అరెస్ట్ చేసిన ఈడీ

పోర్ట్ బ్లెయిర్: అండమాన్ నికోబార్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్(ఏఎన్ఎస్‌సీబీఎల్) రుణం కుంభకోణం కేసులో అండమాన్ మాజీ ఎంపీ కుల్దీప్ రాయ్ శర్మను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్(ఈడీ) అరెస్ట్ చేసింది. ఇదే కేసులో ఏఎన్ఎస్‌సీబీఎల్ మాజీ చైర్మన్ కూడా అయిన కుల్దీప్ రాయ్ శర్మ, ఏఎన్ఎస్‌సీబీఎల్ మాజీ ఎండీ కె.మురుగన్‌తోపాటు మాజీ అధికారి కె.కలైవనన్‌లను మనీ లాండరింగ్ నివారణ చట్టం కింద అరెస్ట్ చేసి గురువారం కోల్‌కతాలోని సాల్ట్‌లేక్‌లో ఉన్న జోనల్ కార్యాలయానికి తరలించింది. వీరికి ఈడీ ప్రత్యేక న్యాయస్థానం 8 రోజుల రిమాండ్‌కు పంపించింది. ఈ నెల 15వ తేదీన రుణ కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా సంబంధిత బ్యాంకు అధికారులు, వ్యాపారవేత్తలకు చెందిన పలు ప్రాంతాల్లో సోదాలు చేపట్టినట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. రూ.500 కోట్ల రుణాన్ని షెల్ కంపెనీల పేరుతో ఉన్న 100కు పైగా అనుమానాస్పద ఖాతాలకు తరలించడంపై మే 15వ తేదీన అండమాన్ నికోబార్ పోలీసులు నమోదు చేసిన కేసుపై దర్యాప్తు చేపట్టామంది.

మెడికల్ పీజీలో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లపై సుప్రీం విచారణ వాయిదా

న్యూఢిల్లీ: పీజీ వైద్య కోర్సుల్లో ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులకు రిజర్వేషన్ కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వచ్చే వారానికి వాయిదా వేసింది. 2014 నాటి తీర్పులో సుప్రీంకోర్టు ట్రాన్స్‌జెండర్ల హక్కులకు గుర్తింపునిచ్చిందని సీనియర్ లాయర్ ఇందిరా జైసింగ్ గురువారం విచారణ సందర్భంగా తెలిపారు. పిటిషనర్లు ఇద్దరూ పీజీ మెడికల్ ప్రవేశ పరీక్ష రాశారని, ట్రాన్స్‌జెండర్ రిజర్వేషన్లు వర్తింపజేసిన పక్షంలో కటాఫ్ మార్కులపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. అందుకే ఆలిండియా కోటాలో రెండు, రాష్ట్ర కోటాలో రెండు సీట్లను ఇద్దరు ట్రాన్స్‌జెండర్ల కోసం ఖాళీగా ఉంచాలని జైసింగ్ కోరారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సిలింగ్ మొదలు కాలేదని నేషనల్ మెడికల్ కమిషన్ తెలిపినందున ఈ విషయంలో తక్షణమే ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం పేర్కొంది. ఈ నెల 23వ తేదీన తదుపరి విచారణ చేపడతామని స్పష్టం చేసింది.

రూ.102 కోట్ల మెథ్ టాబ్లెట్లు స్వాధీనం

ఐజ్వాల్: మిజోరంలోని భారత– మయన్మార్ సరిహద్దుల్లో నిషేధిత డ్రగ్ మెథాంఫెటమైన్ పెద్ద మొత్తంలో పట్టుబడింది. విశ్వసనీయ సమాచారం మేరకు అస్సాం రైఫిల్స్ బలగాలు చంఫాయ్ జిల్లా జోట్ వద్ద బుధవారం కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ సమయంలో ఓ వ్యక్తి బ్యాగుతో అనుమానాస్పదంగా కనిపించగా అడ్డుకున్నారు. ఆ వ్యక్తి బ్యాగును వదిలేసి పక్కనే ఉన్న పొలాల్లోకి పరారయ్యాడు. ఆ బ్యాగులో సుమారు 34.218 కిలోల మెథాంఫెటమైన్ టాబ్లెట్లు కనిపించాయి. వీటి విలువ రూ.102.65 కోట్లు ఉంటుందని అస్సాం రైఫిల్స్ ఒక ప్రకటనలో వివరించింది. మరో ఘటన.. అస్సాంలోని చఛార్ జిల్లా కథల్‌బస్తీ ప్రాంతంలో చేపట్టిన సోదాల్లో పోలీసులు రూ.12 కోట్ల విలువైన 40 వేల మెథాంఫెటమైన్ టాబ్లెట్లను స్వాధీనం చేసుకుని, ఒక పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నారని సీఎం హిమంత బిశ్వ శర్మ గురువారం తెలిపారు.

పడవ మునిగి 50 మంది మృతి

కైరో: లిబియా తీరంలో మరో పడవ ప్రమాదం జరిగింది. ఆదివారం జరిగిన ఈ విషాద ఘటనలో 50 మంది చనిపోయారు. కనీసం 75 మందితో ఈ పడవ గ్రీస్ దిశగా వెళుతోందని ఐరాసకు చెందిన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్(ఐవోఎం) పేర్కొంది. లిబియాలోని టొబ్రుక్‌కు 60 కిలోమీటర్ల దూరంలో ఘటన చోటుచేసుకున్న ఘటనలో 24 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారని ఐవోఎం వివరించింది. ఆఫ్రికా, మధ్య ఆసియాల నుంచి యూరప్ దిశగా వచ్చే వలసదారులకు లిబియా కూడలిగా మారింది. గత 8 నెలలుగా లిబియా తీరంలో చోటుచేసుకున్న పడవ ప్రమాదాల్లో కనీసం 434 మంది చనిపోగా మరో 611 మంది గల్లంతయ్యారని ఐవోఎం పేర్కొంది.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురు పోలీసులు మృతి

పెన్సిల్వేనియా: అమెరికాలోని పెన్సిల్వేనియాలో చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో ముగ్గురు పోలీసులు ప్రాణాలు కోల్పోగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఫిలడెల్ఫియాకు 115 మైళ్ల దూరంలో ఉన్న నార్త్ కొడొరస్ టౌన్‌షిప్‌లో బుధవారం ఓ కేసు విచారణకు వెళ్లిన సమయంలో పోలీసులపై గుర్తు తెలియని వ్యకి కాల్పులకు దిగాడు. ప్రతిగా పోలీసులు జరిపిన కాల్పుల్లో దుండగుడు హతమయ్యాడు. కాల్పులకు దారి తీసిన పరిస్థితిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడతామని అధికారులు తెలిపారు. దుండగుడిని గుర్తించాల్సి ఉంది. క్షతగాత్రులైన ఇద్దరు పోలీసుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఉత్తర్వుల ఉల్లంఘన.. ఆగని వివక్ష

సుప్రీంలో మహిళా ఆర్మీ అధికారుల ఆరోపణ

న్యూఢిల్లీ: శాశ్వత కమిషన్ మంజూరులో తమపై వివక్ష కొనసాగుతోందని మహిళా సైనికాధికారులు సుప్రీంకోర్టులో ఆరోపించారు. గతంలో కీలకమైన గల్వాన్, బాలాకోట్‌తోపాటు ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌లో సైతం పురుష అధికారులతో సమానంగా విశేష సేవలందించిన తమను పట్టించుకోవడం లేదన్నారు. 2020, 2021 సంవత్సరాల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పదేపదే కేంద్రం ఉల్లంఘిస్తోందని, రిటైరైన ప్రస్తుత మహిళా అధికారులు గురువారం జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనానికి నివేదించారు. వీరి తరఫున సీనియర్ లాయర్ వి.మోహన వాదనలు వినిపించారు. మహిళా అధికారుల సంఖ్య తక్కువగా ఉందంటూ శాశ్వత కమిషన్ మంజూరును కేంద్రం జాప్యం చేస్తోందని, అయితే అది నిజం కాదని ఆమె వివరించారు. తదుపరి విచారణను ధర్మాసనం ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. ఆరోజున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కేంద్రం తరఫున వాదనలు వినిపించనున్నారు.

మొదటిసారిగా ప్రాథమిక హక్కులను సూచించింది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

భారత రాజ్యాంగం చారిత్రక నేపథ్యం

నెహ్రూ నివేదిక (1928)

భారత వ్యవహారాల కార్యదర్శి లార్డ్ బిర్కెన్ హెడ్ 1927 నవంబర్‌లో బ్రిటన్ ఎగువసభలో మాట్లాడుతూ 'అందరికీ సమ్మతమైన రాజ్యాంగాన్ని భారతీయులు రూపొందించగలరా?' అని సవాలు విసిరారు. ఈ సవాలును స్వీకరించిన భారత జాతీయ కాంగ్రెస్ 1928 మే 19న బొంబాయిలో అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించింది. 1928 ఆగస్టు 10న రాజ్యాంగ రచనకు మోతీలాల్ నెహ్రూ అధ్యక్షుడిగా 8 మంది సభ్యులతో కూడిన ఉపసంఘాన్ని నియమించింది. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దీనికి కార్యదర్శిగా పనిచేశారు.

ముఖ్యాంశాలు

- భారతదేశానికి డొమినియన్ (స్వయంప్రతిపత్తి) ఇవ్వడం.
- భాషాప్రయుక్త రాష్ట్రాలు, స్వయం ప్రతిపత్తి రాష్ట్రాలు అనే అంశాల ఆధారంగా దేశంలో సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేయడం.
- కార్యనిర్వాహక శాఖ.. శాసన శాఖకు బాధ్యత వహించడం.
- అల్పసంఖ్యాక వర్గాల వారికి శాసనమండళ్లలో కనీసం 10 సంవత్సరాల పాటు కొన్ని స్థానాలను కేటాయించడం.
- 19 ప్రాథమిక హక్కులను కల్పించడం.

గమనిక: మొదటిసారిగా ప్రాథమిక హక్కులను సూచించింది – నెహ్రూ రిపోర్టు.

1929లో బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సైమన్ కమిషన్ నివేదిక, భారత్‌లో రాజ్యాంగపరమైన సంస్కరణలపై చర్చించడానికి రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేశారు. నాటి బ్రిటన్ ప్రధానమంత్రి రామ్ సే మెక్‌డొనాల్డ్ చొరవతో రాజప్రతినిధి (వైస్రాయ్) ఇర్విన్‌ను ఇంగ్లండ్‌కు రప్పించారు. భారతీయుల సమస్యల గురించి చర్చించడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తుందని, ఇందులో పాల్గొనడానికి అన్ని పార్టీలు, వర్గాలకు ఆహ్వానం వస్తుందని మెక్‌డొనాల్డ్ ఒక ప్రకటన చేశారు.

మొదటి రౌండ్ టేబుల్ సమావేశం

1930 నవంబర్ 12 నుంచి 1931 జనవరి 19 వరకు మొదటి రౌండ్ టేబుల్ సమావేశం లండన్‌లో జరిగింది. ఇందులో 89 మంది ప్రముఖ రాజనీతిజ్ఞులు పాల్గొన్నారు. కానీ భారత జాతీయ కాంగ్రెస్ పాల్గొనలేదు. ఈ సమావేశంలో 'భావి భారత రాజ్యాంగం సమాఖ్యగా ఉండాలా? లేదా ఏక కేంద్రంగా ఉండాలా?' అనే అంశంపై చర్చించారు. కాంగ్రెస్ పాల్గొనకపోవడం వల్ల చర్చల్లో వాస్తవమైన ప్రగతి సాధ్యం కాలేదు. సమావేశంలో పాల్గొనని ప్రజా వర్గాల సహకారం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పి ప్రధానమంత్రి మెక్‌డొనాల్డ్ సమావేశాన్ని ముగించారు.

మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో ముస్లిం లీగ్ తరఫున జిన్నా, ఆగాఖాన్, మహ్మద్ అలీ, మహ్మద్ షా, ఫజల్ హక్; హిందూ మహాసభ తరఫున మూంజే, జయకర్; ఉదారవాదుల తరఫున తేజ్ బహదూర్ సప్రూ, చింతామణి, శ్రీనివాస శాస్త్రి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్; హైదరాబాద్ దివాన్ అక్బర్ హైదర్ పాల్గొన్నారు.

రెండో రౌండ్ టేబుల్ సమావేశం

1931 సెప్టెంబర్ 7 నుంచి డిసెంబర్ 7 వరకు లండన్‌లో రెండో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇర్విన్‌తో చేసుకున్న ఒడంబడిక ప్రకారం కాంగ్రెస్ తరఫున గాంధీజీ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇందులో అన్ని స్వదేశీ సంస్థానాధిపతులతో పాటు 107 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి మహిళా ప్రతినిధిగా సరోజినీ నాయుడు, బలహీన వర్గాల తరఫున డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ముస్లిం వర్గాలకు రెండు కొత్త ప్రావిన్సులను (నార్త్ వెస్టన్ ప్రావిన్స్, సింధ్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గాంధీజీ దీన్ని 'విభజించు, పాలించు' విధానంగా భావించి తీవ్రంగా వ్యతిరేకించారు. అల్పసంఖ్యాక వర్గాల సమస్యపై ఈ సమావేశం ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. బ్రిటిష్ ప్రధానమంత్రి, తాను దారులు వేరయ్యే చోటుకే వచ్చానని గాంధీజీ ప్రకటించారు.

కమ్యూనల్ అవార్డు (1932)

మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యానికి సంబంధించి నాటి బ్రిటన్ ప్రధాని రామ్‌సే మెక్‌డొనాల్డ్ 1932 ఆగస్టు 4న ఒక ప్రతిపాదన చేశారు. దీన్ని 'కమ్యూనల్ అవార్డు' అంటారు. దీని ప్రకారం ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లకే కాకుండా షెడ్యూల్డ్ కులాలకు కూడా ప్రత్యేక నియోజక గణాలను ప్రతిపాదించారు. దీన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమర్థించారు. మహాత్మాగాంధీ దీన్ని వ్యతిరేకిస్తూ పుణేలోని ఎరవాడ కారాగారంలో 1932 సెప్టెంబర్ 20న ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. రాజాజీ, మదన్‌మోహన్ మాలవ్య లాంటి నాయకులు చొరవ తీసుకొని అంబేద్కర్, గాంధీజీతో చర్చించి దీక్షను విరమింపజేశారు. 1932 సెప్టెంబర్‌లో 'పుణే ఒప్పందం' కుదిరింది. తద్వారా కమ్యూనల్ అవార్డు కంటే ఎక్కువగా షెడ్యూల్డ్ కులాలకు అవకాశాలు లభించాయి.

మూడో రౌండ్ టేబుల్ సమావేశం


1932 నవంబర్ 17 నుంచి డిసెంబర్ 24 వరకు లండన్‌లో మూడో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బ్రిటిష్ ప్రభుత్వం సమస్యలు సృష్టిస్తారని భావించిన వారెవరికీ ఆహ్వానం పంపలేదు. అందువల్ల కాంగ్రెస్ ప్రతినిధులు సమావేశానికి హాజరు కాలేదు. ఇంగ్లండ్‌లోని లేబర్ పార్టీ కూడా దీనికి సహకరించలేదు. ఇందులో అంతకు ముందు నియమించిన ఉపసంఘాల నివేదికలపై చర్చించారు. ఈ సమావేశంలో చేసిన సిఫార్సులకు సంబంధించిన అనేక అంశాలను 1935 భారత ప్రభుత్వ చట్టంలో పొందుపరిచారు. ఈ సమావేశానికి కేవలం 46 మంది ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు.

భారత ప్రభుత్వ చట్టం-1935

బ్రిటిషర్లు రూపొందించిన రాజ్యాంగ సంస్కరణ చట్టాలన్నింటిలో ఇది వివరణాత్మకమైంది, సుదీర్ఘమైంది. 1937 ఏప్రిల్ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ఈ చట్టంలో 321 ప్రకరణలు, 10 షెడ్యూళ్లు, 14 భాగాలు ఉన్నాయి.

ముఖ్యాంశాలు

- అఖిల భారత సమాఖ్య ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందులో 11 రాష్ట్రాలు, 6 చీఫ్ కమిషనర్ల ప్రాంతాలు, సమాఖ్యలో చేరడానికి అంగీకరించిన స్వదేశీ సంస్థానాలు ఉంటాయి.
- కేంద్రం, రాష్ట్రాల మధ్య 3 జాబితాల ప్రకారం అధికార విభజన ఉంటుంది. కేంద్ర జాబితాలో 59, రాష్ట్ర జాబితాలో 54, ఉమ్మడి జాబితాలో 36 అంశాలు ఉంటాయి.
- అవశిష్ట అధికారాలను వైస్రాయ్‌కి ఇచ్చారు. స్వదేశీ సంస్థానాలు ఈ సమాఖ్యలో చేరకపోవడం వల్ల ఇది అమల్లోకి రాలేదు.
- రాష్ట్రాల్లోని ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దుచేసి కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రతిపాదించారు. కేంద్రంలో పాలనాంశాలను రిజర్వుడు, ట్రాన్స్‌ఫర్డ్ అంశాలుగా విభజించారు.
- గవర్నర్ జనరల్.. రిజర్వుడు అంశాలను తాను నియమించిన ముగ్గురు కౌన్సిలర్ల సహాయంతో పాలిస్తాడు. ట్రాన్స్‌ఫర్డ్ అంశాల కోసం ఒక మంత్రిమండలిని నియమించి, దీని సహాయంతో పాలనను పర్యవేక్షిస్తారు. ఈ మంత్రిమండలిలో సభ్యులు 10 మందికి మించకూడదు.
- రాష్ట్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు. దేశంలోని మొత్తం 11 రాష్ట్రాలకు గాను ఆరు (బెంగాల్, బొంబాయి, మద్రాసు, బిహార్, అస్సాం, యునైటెడ్ ప్రావిన్స్) రాష్ట్రాల్లో దీన్ని ప్రవేశపెట్టారు.
- భారత రాజ్య కార్యదర్శికి ఉన్న కౌన్సిల్‌ను రద్దుచేశారు. ఇతడికి సహాయకంగా ముగ్గురి కంటే తక్కువ కాకుండా, ఆరుగురికి మించకుండా సలహాదార్లను నియమించారు.
- కేంద్ర శాసనసభల పరిమాణాన్ని పెంచారు. సభ్యుల సంఖ్యను ఎగువసభ (కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్)లో 260కి, దిగువ సభ (లెజిస్లేటివ్ అసెంబ్లీ)లో 375కు పెంచారు.
- కమ్యూనల్ ప్రాతినిధ్యాన్ని కొనసాగించారు. ఈ సదుపాయాన్ని షెడ్యూల్డ్ కులాలవారికి, మహిళలకు వర్తింపజేశారు.
- ఓటు హక్కును విస్తృతపరిచారు. జనాభాలో 10 శాతం మందికి ఓటు హక్కు వర్తింపజేశారు.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య సమాఖ్య వివాదాలను పరిష్కరించడానికి ఫెడరల్ కోర్టు (సుప్రీం కోర్టు)ను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు ఇతర న్యాయమూర్తులు ఉంటారు. అయితే దీని తీర్పులే సర్వోన్నతం కాదు. వీటిపై ఇంగ్లండులో ఉండే ప్రివికౌన్సిల్‌కు అప్పీల్ చేసుకోవచ్చు.
- ఈ చట్టం ద్వారా బర్మాను భారతదేశం నుంచి వేరు చేశారు. అదేవిధంగా ఒరిస్సా, సింధ్ అనే రెండు కొత్త ప్రావిన్సులను ఏర్పాటు చేశారు. బ్రిటిష్ ఇండియాపై బ్రిటిష్ పార్లమెంట్ సర్వాధిపత్యాన్ని పునరుద్ఘాటించారు.
- కేంద్రంలో ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్రాల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటు చేశారు. భారతదేశంలో విత్త విధానం, రుణ నియంత్రణ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను స్థాపించారు.



చట్టం ప్రాముఖ్యత: ఈ చట్టం ద్వారా పొందుపరచిన అత్యంత ముఖ్యమైన అంశం 'ప్రాంతాల స్వయంప్రతిపత్తి'. దీని ద్వారా మొదటిసారిగా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ప్రాంతీయ పాలనాంశాలన్నింటినీ మంత్రుల ఆధీనంలోకి బదిలీ చేశారు. కేంద్రం నియంత్రణ చాలా వరకు తగ్గింది. గవర్నర్లను రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధమైన అధిపతులుగా పరిగణించారు.

ముఖ్యాంశాలు

- బానిసత్వానికి ఒక నూతన చట్టం, భారతదేశంపై బలవంతంగా రుద్దారు. ఇంజన్ లేకుండా కేవలం గట్టి బ్రేకులున్న యంత్రం. – జవహర్‌లాల్ నెహ్రూ
- భారతదేశంలో గోచరించే భూస్వామ్య వ్యవస్థను దృఢం చేయడానికి బ్రిటిష్ పాలకులు ఆడిన నాటకం. **– సుభాష్ చంద్రబోస్**
- కచ్చితంగా పిచ్చిది, సమూలంగా చెడ్డది, మొత్తానికి అనంగీకారమైంది. **– జిన్నా**
- ఈ చట్టాన్ని మా మీద బలవంతంగా రుద్దారు. బాహ్యంగా దీనికి కొంత ప్రజాస్వామ్య రూపం ఉన్నట్లు కనిపించినా లోపల మాత్రం అంతా శూన్యం. **– పండిట్ మదన్‌మోహన్ మాలవ్య**
- ఈ చట్టం ద్వారా వైస్రాయ్‌కి ముస్సోలిని, హిట్లర్‌ను తలపించే నియంతృత్వ అధికారాలు ఇచ్చారు. ఇది పొట్టి మనుషులు కట్టిన అవమానకరమైన గొప్ప కట్టడం. **– విన్‌స్టన్ చర్చిల్**

లిన్‌లిత్‌గో ఆగస్టు ప్రతిపాదనలు

భారత వైస్రాయ్ లార్డ్ లిన్‌లిత్‌గో 1940 ఆగస్టు 8న కొన్ని ప్రతిపాదనలను చేశాడు.

ముఖ్యాంశాలు

- రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత భారతదేశానికి డొమినియన్ ప్రతిపత్తి కల్పించే విషయాన్ని పరిశీలించడం. రాజకీయ పార్టీల ప్రాతినిధ్యంతో రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటు చేయడం.
- వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులకు గవర్నర్ జనరల్ కార్య నిర్వాహక మండలిలో సభ్యత్వం కల్పించి మండలిని విస్తృతం చేయడం.
- రాజ్యాంగ పరిషత్తులో అల్పసంఖ్యాక వర్గాల వారికి సముచిత ప్రాతినిధ్యం ఇవ్వడం.
- అన్ని రాజకీయ పార్టీలు, సంస్థానాల ప్రతినిధులతో కూడిన యుద్ధ సలహా మండలి ఏర్పాటు చేయడం.

ఈ ప్రతిపాదనలను రాజకీయ పార్టీలు తిరస్కరించాయి.

క్రిప్స్ ప్రతిపాదనలు (1942)


బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ 1942 మార్చి 11న ఒక ప్రకటన ద్వారా భారత రాజ్యాంగ సమస్య విషయంలో అక్కడి నాయకులతో సంప్రదింపుల నిమిత్తం కేబినెట్ మంత్రి సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌ను భారతదేశానికి పంపిస్తున్నట్లుగా పేర్కొన్నాడు. క్రిప్స్ 1942 మార్చి 22న భారతదేశానికి వచ్చాడు. ఇతడి ప్రతిపాదనల ప్రకారం బ్రిటిష్ ప్రభుత్వం రాజ్యాంగ పరిషత్తుకు సంబంధించి మొదటిసారిగా అధికారిక ప్రకటన చేసింది.

ముఖ్యాంశాలు

- భారత్‌కు అవసరమైన కొత్త రాజ్యాంగాన్ని నిర్మించడానికి ఎన్నుకున్న రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటవుతుంది. భారతదేశానికి వీలైనంత త్వరలో స్వయంప్రతిపత్తి లభిస్తుంది.
- రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం అమల్లో ఉన్న రాజ్యాంగాన్ని కలిగి ఉండవచ్చు లేదా నూతన రాజ్యాంగాన్ని రూపొందించుకోవచ్చు.
- గవర్నర్ జనరల్ కార్య నిర్వాహక మండలిలో ఒక భారతీయుడికి సభ్యత్వం ఇస్తారు.

క్రిప్స్ ప్రతిపాదనలను మహాత్మాగాంధీ తీవ్రంగా విమర్శించారు. ఇవి 'దివాళా తీస్తున్న బ్యాంకు మీద ముందస్తు తేదీ వేసిన ఒక చెక్కు లాంటివి' అని వ్యాఖ్యానించారు.

ప్రధాన క్వాంటం సంఖ్య తెలిపే ధర్మం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
కెమిస్ట్రీ

పరమాణు నిర్మాణం

ప్లాంక్ క్వాంటం సిద్ధాంతం ప్రకారం విద్యుదయస్కాంత వికిరణం ప్యాకెట్ రూపంలో ఉంటుంది. దీన్నే క్వాంటా అంటారు.

- ప్లాంక్ తన క్వాంటం సిద్ధాంతాన్ని ఉపయోగించి కృష్ణ వస్తువు వికిరణాన్ని విశదీకరించాడు.
- ప్లాంక్ స్థిరాంకం (h) విలువ = 6.625×10^{-27} ఎర్గ్ సెకన్ లేదా 6.625×10^{-34} జౌల్ సెకన్.
- బోర్ స్థిర కక్ష్యలను K, L, M, N అక్షరాలతో లేదా 1, 2, 3, 4 అంకెలతో సూచించాడు.
- బోర్ నమూనా హైడ్రోజన్ వర్ణ పటాన్ని, హైడ్రోజన్ వంటి He^{+} Li^{2+}...అయాన్ల వర్ణపటాలను విశదీకరించింది.
- అయస్కాంత క్షేత్రంలో వర్ణపటరేఖలు, చిన్న చిన్న ఉపరేఖలుగా విడిపోయాయి. దీన్నే జీమన్ ఫలితం అంటారు.
- ఒక స్థిర కక్ష్యలో తిరుగుతున్న ఎలక్ట్రాన్ కోణీయ ద్రవ్యవేగం (mvr), = nh/2π

  పూర్ణాంకంగా ఉంటుంది. (mvr), = nh/2π
- దీర్ఘ వృత్తాకార కక్ష్యలను ప్రవేశపెట్టిన శాస్త్ర వేత్త ఆర్నాల్డ్ సోమర్‌ఫెల్డ్. ఎలక్ట్రాన్‌కు కణ స్వభావం, తరంగ స్వభావం ఉంటుందని పేర్కొన్న శాస్త్ర వేత్త డీబ్రోగ్లీ.

- **కేంద్రకంలోని ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌లను న్యూక్లియాన్‌లు అంటారు.**
- **మొట్టమొదటి పరమాణు నమూనాను ప్రతి పాదించిన శాస్త్రవేత్త జె.జె. థామ్సన్.**
- **రూథర్ ఫర్డ్ పరమాణు నమూనానే గ్రహమండల లేదా న్యూక్లియర్ నమూనా అంటారు.**

- జర్మనీ శాస్త్రవేత్త ఇర్విన్ శ్రోడింజర్ హైడ్రోజన్ పరమాణువులోని ఎలక్ట్రాన్‌కు తరంగ సమీకరణాన్ని ప్రతిపాదించాడు.
- ప్రధాన క్వాంటం సంఖ్య (n)ను ప్రతిపాదించిన శాస్త్రవేత్త నీల్స్‌బోర్. ప్రధాన క్వాంటం సంఖ్య (n) కక్ష్య పరిమాణం, శక్తిని సూచిస్తుంది.
- అజిముతల్ క్వాంటం సంఖ్య (*l*)ను ప్రతిపాదించిన శాస్త్రవేత్త సోమర్‌ఫెల్డ్. అజిముతల్ క్వాంటం సంఖ్యను కోణీయ ద్రవ్యవేగ క్వాంటం సంఖ్య అని కూడా అంటారు. *l* గరిష్ఠ విలువ n –1
- అజిముతల్ క్వాంటం సంఖ్య ఉప స్థిరకక్ష్య ఆకృతిని తెలియజేస్తుంది.
- *l* విలువ 0 అయితే s ఆర్బిటాల్, *l* విలువ 1 అయితే p ఆర్బిటాల్, *l* విలువ 2 అయితే d ఆర్బిటాల్, *l* విలువ 3 అయితే f ఆర్బిటాల్.
- అయస్కాంత క్వాంటం సంఖ్య (m)ను ప్రతిపాదించిన శాస్త్రవేత్త లాండే.
- ఒక '*l*' విలువకు ఉన్న మొత్తం m విలువల సంఖ్య = 2*l* +1
- సమాన శక్తి ఉన్న స్థాయిలను సమశక్తి స్థాయిలు అంటారు.
- అయస్కాంత క్వాంటం సంఖ్య (m) ఆర్బిటాల్ దృగ్విన్యాసాన్ని తెలియజేస్తుంది.
- స్పిన్ క్వాంటం సంఖ్యను ఉలెన్‌బెక్, గౌడ్ స్మిత్‌లు ప్రతిపాదించారు.
- స్పిన్ క్వాంటంసంఖ్య (s) విలువలు +1/2, –1/2 మాత్రమే.
- ఎలక్ట్రాన్‌ను కనుగొనే సంభావ్యత ఉన్న ప్రాంతాన్ని పరమాణు / ఆర్బిటాల్ అంటారు.
- s – ఆర్బిటాల్ గోళాకారంగా ఉంటుంది. p – ఆర్బిటాల్ డంబెల్ ఆకారాన్ని, d – ఆర్బిటాల్ డబుల్ డంబెల్ ఆకారాన్ని కలిగి ఉంటాయి.
- p – ఆర్బిటాళ్లు L కర్పరం నుంచి, d – ఆర్బిటాళ్లు M కర్పరం నుంచి, f–ఆర్బిటాళ్లు N కర్పరం నుంచి ఉంటాయి.
- ఆఫ్ భౌ నియమం ప్రకారం ఎలక్ట్రాన్ తక్కువ శక్తి ఉన్న ఆర్బిటాల్‌ను ఆక్రమించుకొంటుంది.
- పౌలీ వర్జన నియమం ప్రకారం రెండు ఎలక్ట్రాన్‌లకు నాలుగు క్వాంటం సంఖ్యలు సమానం కావు.
- హుండ్ నియమం ప్రకారం సమశక్తి ఆర్బిటాళ్లలో ఒక్కొక్క ఎలక్ట్రాన్ నిండిన తర్వాతనే జతకూడుతాయి.
- పరమాణు కేంద్రకానికి, బాహ్య ఆర్బిటాల్‌కు మధ్య ఉండే దూరాన్ని పరమాణు వ్యాసార్ధం అని అంటారు. దీన్ని ఆంగ్‌స్ట్రాం యూనిట్స్‌లో కొలుస్తారు. ($1A^{\circ} = 10^{-8}$ సె.మీ.)
- వాయుస్థితిలో ఉన్న పరమాణు బాహ్య కర్పరం నుంచి ఎలక్ట్రాన్‌ను తీసి వేసేందుకు కావాల్సిన శక్తి పరిమాణాన్ని అయనీకరణ శక్మం అంటారు.

అయనీకరణ శక్మం ప్రమాణాలు

- ఎలక్ట్రాన్ వోల్ట్ (ev) లేదా కి.కా. మోల్ లేదా కి.జౌ మోల్1
- అయనీకరణ శక్మం.. కేంద్రక ఆవేశం, పరమాణు సైజు, అయాన్ ఆవేశాలపై ఆధారపడి ఉంటుంది.
- వాయుస్థితిలో తటస్థ పరమాణువు భూస్థాయిలో ఉన్నప్పుడు ఒక ఎలక్ట్రాన్‌ను చేర్చితే విడుదలయ్యే శక్తిని ఎలక్ట్రాన్ అఫినిటీ అంటారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. **క్రోమియం (Z=24) ఎలక్ట్రాన్ విన్యాసం?** (డీఎస్సీ-2006)
   1) $[Ar]4s^{1}3d^{5}$ 2) $[Ar]4s^{2}3d^{1}$
   3) $[Ar]4s^{2}3d^{5}$ 4) $[Ar]4s^{2}3d^{4}$
2. పరమాణువులో వృత్తాకార కక్ష్య '*l*' గరిష్ఠ విలువ? (డీఎస్సీ-2012)
   1) 0 2) 1 3) –1 4) 1/2
3. అతిచిన్న పరమాణు వ్యాసార్ధం ఉన్న మూలకం? (డీఎస్సీ-2003)
   1) లిథియం 2) సోడియం
   3) హీలియం 4) హైడ్రోజన్
4. ఒక పరమాణు ద్రవ్యరాశి ప్రమాణం విలువ గ్రాముల్లో? (డీఎస్సీ-2012)
   1) 1.64×10^{-24}
   2) 1.602×10^{-19}
   3) 1.602×10^{-23} 4) 6.023×10^{-23}
5. $1s^{2}$ $2s^{2}$ $2p^{6}$ $3s^{2}$ $3p^{6}$ $4s^{2}$ ఎలక్ట్రాన్ విన్యాసంగా గల మూలకం సంకేతం? (డీఎస్సీ-2003)
   1) Mn 2) Si 3) Mg 4) Ca
6. ఆర్బిటాళ్ల శక్తుల ఆధారంగా సరైన క్రమం? (డీఎస్సీ-2012)
   1) 3d, 4s, 4p, 4d
   2) 4s, 3d, 4p, 5s
   3) 3d, 4s, 4d, 4p
   4) 3d, 4s, 4p, 5s
7. కింది వాక్యాల్లో సరైనవి? (డీఎస్సీ-2008)
   ఎ) కేథోడ్ కిరణాలు పల్చని రేకుల ద్వారా చొచ్చుకుపోతాయి
   బి) X – కిరణాలు ప్రయాణ మార్గం లోని వాయువులను అయనీ కరిస్తాయి
   సి) కేథోడ్, X – కిరణాలు zns వంటి పదార్థాలపై పడినప్పుడు ప్రతి దీప్తిని కలిగిస్తాయి
   1) ఎ, బి, సి 2) బి, సి
   3) ఎ, బి 4) ఎ, సి

సమాధానాలు

1) 1; 2) 1; 3) 4; 4) 1; 5) 4; 6) 2; 7) 1.

మాదిరి ప్రశ్నలు

1. దీర్ఘ వృత్తాకార కక్ష్యలను ప్రవేశపెట్టిన శాస్త్రవేత్త?
   1) బోర్ 2) ష్రోడింజర్
   3) జీమన్ 4) సోమర్‌ఫెల్డ్
2. **3p, 4s, 3d, 4pలలో దేనికి అత్యల్ప శక్తి ఉంటుంది?**
   1) 4s 2) 3p 3) 3d 4) 4p
3. **p – ఆర్బిటాల్ ఆకృతి?**
   1) గోళాకృతి
   2) సంక్లిష్టం
   3) డబుల్ డంబెల్
   4) డంబెల్
4. L కర్పరంలో ఉండే ఉపకర్పరాలు?
   1) s, d 2) s, p, d
   3) s, p 4) s, p, d, f
5. మాక్స్ ప్లాంక్ ప్రతిపాదించిన సిద్ధాంతం?
   1) తరంగ 2) విద్యుదయస్కాంత
   3) క్వాంటం 4) కణ సిద్ధాంతం
6. **3d ఆర్బిటాల్ n + *l* విలువ?**
   1) 4 2) 5 3) 6 4) 8
7. పరమాణు వ్యాసార్ధానికి ప్రమాణాలు?
   1) ఆంగ్‌స్ట్రాం యూనిట్స్
   2) కిలో కాలరీ
   3) ev
   4) ఫారడ్స్
8. పరమాణు సంఖ్య (Z) పరమాణువులోని ___కు సమానం?
   1) న్యూట్రాన్ 2) న్యూట్రినో
   3) ఎలక్ట్రాన్ లేదా ప్రోటాన్
   4) పాజిట్రాన్
9. రూథర్ ఫర్డ్ పరమాణు నమూనాను ___ నమూనాగా వ్యవహరిస్తారు?
   1) పుచ్చకాయ 2) గ్రహమండల
   3) స్థిర కక్ష్య 4) దీర్ఘవృత్తాకార
10. ప్రోటాన్‌ల ద్రవ్యరాశి, ఎలక్ట్రాన్‌ల ద్రవ్యరాశి కంటే ఎన్ని రెట్లు ఎక్కువ?
    1) 2350 2) 1837
    3) 1950 4) 2000
11. పరమాణు కేంద్రక వ్యాసార్ధం సుమారుగా?
    1) 10^{-8}cm 2) 10^{-15}mt
    3) ఒక ఫెర్మీ 4) 2, 3
12. న్యూక్లియాన్‌లు అంటే?
    1) ఎలక్ట్రాన్, ప్రోటాన్‌లు
    2) ఎలక్ట్రాన్, న్యూట్రాన్లు
    3) ప్రోటాన్లు, న్యూట్రాన్లు
    4) ఏవీ కావు
13. పరమాణువులోని తటస్థ కణాన్ని కనుగొన్న శాస్త్రవేత్త?
    1) రూథర్ ఫర్డ్ 2) జేమ్స్ చాడ్విక్
    3) గోల్డ్ స్టెయిన్ 4) జె.జె. థామ్సన్
14. $_{11}Na^{23}$లోని న్యూట్రాన్‌ల సంఖ్య?
    1) 11 2) 23
    3) 12 4) 34
15. n విలువ పెరిగే కొద్దీ పెరిగేవి?
    1) కక్ష్య సైజు, శక్తి
    2) కేంద్రకం సైజు
    3) కేంద్రకం ఆవేశం
    4) పరమాణు ద్రవ్యరాశి
16. కిందివాటిలో సరైన క్వాంటం సంఖ్యల విలువలను చూపనిది?
    1) n = 1 *l* = o m = o s = +1/2
    2) n = 2 *l* = 1 m = –2 s = +1/2
    3) n = 1 *l* = 1 m = –1 s = –1
    4) n = 2 *l* = 0 m = +1 s = –1/2
17. హాలోజన్‌ల ఎలక్ట్రాన్ ఎఫినిటీ క్రమం?
    1) F > C*l* > Br > I
    2) C*l* > F > Br > I
    3) Br > F > I > C*l*
    4) I > Br > C*l* > F
18. అయస్కాంత క్షేత్ర సమక్షంలో వర్ణపట రేఖలు చిన్నచిన్న ఉపరేఖలుగా విడి పోవడాన్ని ఏమంటారు?
    1) స్టార్క్ ఫలితం
    2) కాంప్టన్ ఫలితం
    3) జీమన్ ఫలితం
    4) కాంతి-విద్యుత్ ఫలితం
19. కేంద్రకానికి దగ్గరగా ఉండేది?
    1) 4f 2) 6p 3) 5s 4) 5d
20. బోర్ పరమాణు సిద్ధాంతం తెలిపేది?
    1) క్వాంటం సంఖ్యలు
    2) శక్తి స్థాయిలు
    3) ఉపశక్తి స్థాయిలు
    4) ఆర్బిటాళ్ల ఆకృతులు
21. పరమాణువులో ఎలక్ట్రాన్‌ను కనుగొనే సంభావ్యత అత్యధికంగా ఉన్న ప్రదేశం?
    1) స్థిర కక్ష్య 2) ఆర్బిట్
    3) ఆర్బిటాల్ 4) నోడల్ ప్రదేశం
22. N కక్ష్యలో ఉండే ఎలక్ట్రాన్‌ల గరిష్ఠ సంఖ్య?
    1) 2 2) 8 3) 16 4) 32
23. f ఆర్బిటాళ్లు ఏ కర్పరంలో ఉంటాయి?
    1) K 2) L 3) M 4) N
24. $3d^{10}$ $4s^{1}$ వేలన్సీ ఎలక్ట్రాన్ విన్యాసం ఉండే పరమాణువు?
    1) Ar 2) Cu 3) Cr 4) Zn
25. ప్లాంక్ సమీకరణం?
    1) E = h/υ 2) $E = mc^{2}$
    3) $mc^{2} = h\upsilon$ 4) E = hυ
26. ప్రధాన క్వాంటం సంఖ్య తెలిపే ధర్మం?
    1) కక్ష్యసైజు 2) కక్ష్య శక్తి
    3) 1, 2 4) కక్ష్య ఆకారం
27. బోర్ నమూనా వేటికి వర్తిస్తుంది?
    1) అన్ని పరమాణువులకు
    2) అన్ని ఆర్బిటాళ్లకు
    3) ఒకే ఎలక్ట్రాన్‌ను కలిగిన అయాన్ లేదా పరమాణువుకు
    4) అన్ని అయాన్‌లకు
28. n ప్రధాన క్వాంటం సంఖ్య అయితే అజిముతల్ క్వాంటం సంఖ్య '*l*' గరిష్ఠ విలువ?
    1) n 2) n+1
    3) n–1 4) n–2

సమాధానాలు

1) 4; 2) 2; 3) 4; 4) 3; 5) 3; 6) 2; 7) 1; 8) 3; 9) 2; 10) 2; 11) 4; 12) 3; 13) 2; 14) 3; 15) 1; 16) 3; 17) 2; 18) 3; 19) 1; 20) 2; 21) 3; 22) 4; 23) 4; 24) 2; 25) 4; 26) 3; 27) 3; 28) 3.

శరీరంలో పునరుత్పత్తి శక్తి ఉన్న అవయవం?

జీర్ణనాళంలోని ఏయే భాగాల్లో ఏ జీర్ణక్రియలు జరుగుతాయి? జీర్ణరసాల్లోని ఏ ఎంజైమ్‌లు ఈ చర్యలను నిర్వహిస్తాయి? జీర్ణ గ్రంథులు ఏమిటి? జీర్ణనాళాల క్రమం, నిర్మాణం మొదలైవాటి నుంచి దాదాపు అన్ని పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతున్నారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

జీర్ణ వ్యవస్థ


మనం తీసుకునే ఆహారంలో శోషణ చెందని సంక్లిష్ట అణువులను, శోషణ చెందే సరళ అణువులుగా మార్చే ప్రక్రియను 'జీర్ణక్రియ' అంటారు. ఇది జీర్ణ వ్యవస్థలో జరుగుతుంది. జీర్ణవ్యవస్థలో జీర్ణనాళం, దాని అనుబంధ గ్రంథులు ఉం టాయి. జీర్ణ గ్రంథులు విడుదల చేసే జీర్ణ రసాల్లోని ఎంజైమ్‌లు జీర్ణక్రియను నిర్వహిస్తాయి.

జీర్ణనాళం:

మానవునిలో జీర్ణనాళం నోటితో మొదలై పాయువుతో అంతమౌతుంది. నోరు నోటికుహరంలోకి తెరుచుకుంటుంది. ఇది మళ్లీ గ్రసనిలోకి, తర్వాత ఆహారవాహికలోకి; ఆహారవాహిక జీర్ణాశయంలోకి; జీర్ణాశయం చిన్నపేగులోకి తెరుచుకుంటుంది. చిన్నపేగులో ఆంత్రమూలం, జెజునం, ఇలియం అనే మూడు భాగాలు ఉంటాయి. చిన్నపేగు పెద్దపేగులోకి తెరుచుకుంటుంది. చిన్నపేగు, పెద్దపేగు మధ్య ఉండూకం (అపెండిక్స్) అనే అవశేష అవయవం ఉంటుంది. పెద్దపేగులో కోలన్, పురుష నాళం అనే భాగాలుంటాయి. చివర్లో ఇది పాయువు అనే రంధ్రం ద్వారా తెరుచుకుంటుంది. ఈ జీర్ణనాళంలోని నోటి కుహరం జీర్ణాశయం, ఆంత్రమూలం, జెజునంలలో జీర్ణక్రియ లు జరుగుతాయి. ఇలియం అనే భాగంలో జీర్ణమైన ఆహారం రక్తంలోకి శోషణం చెందుతుంది. జీర్ణంకాని వ్యర్థమంతా పెద్దపేగు ద్వారా సాగుతూ మలంగా మారి విసర్జితమవుతుంది.

నోటి కుహరంలో జీర్ణక్రియ:

నోటి కుహరంలో మూడు జతల లాలాజల గ్రంథులు లాలాజలాన్ని విడుదల చేస్తాయి. లాలాజలం స్వల్ప ఆమ్లస్థితిలో ఉంటుంది. దీంట్లో అమైలేజ్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ఆహారంలోని స్టార్చ్‌ను మాల్టోజ్‌గా మారుస్తుంది. క్షీరదాల్లో నాలుగు జతల లాలాజల గ్రంథు లు ఉంటాయి. నోటిలోని ఆహారం బోలస్ అనే ముద్దగా ఆహారవాహికలో చేరుతుంది. ఆహారవాహిక ప్రదర్శించే పెరిస్టాలిసిస్ అనే కదలికల ద్వారా ఆహారం జీర్ణాశయంలోకి చేరుతుంది.



జీర్ణాశయంలో జీర్ణక్రియ:

జీర్ణాశయం లోపలి తలంలో ఉన్న జఠర గ్రంథుల నుంచి జఠర రసం విడుదలవుతుంది. ఈ జీర్ణరసంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం, పెప్సిన్ ఉంటాయి. పెప్సిన్ అనే ఎంజైమ్ ఆహారంలోని ప్రోటీన్‌లను ప్రోటియేజెస్, పెప్టోన్స్‌గా విచ్ఛిన్నం చెందిస్తుంది.

జెజునంలో జీర్ణక్రియ:

జెజునం అనే చిన్నపేగు రెండో భాగంలో జీర్ణక్రియ పూర్తవుతుంది. జెజునం లోపలి తలంలో ఆంత్రగ్రంథులు విడుదల చేసే ఆంత్రరసంలోని ఎంజైమ్‌లు జీర్ణక్రియను పూర్తిచేస్తాయి. ఆంత్రరసంలోని మాల్టేజ్ అనే ఎంజైమ్ మాల్టోజ్‌ను రెండు గ్లూకోజ్‌లుగా విచ్ఛిన్నం చేస్తుంది. లాక్టేజ్ అనే ఎంజైమ్ లాక్టోజ్‌ను ఒక గ్లూకోజ్, ఒక గాలక్టోజ్‌గా విచ్ఛిన్నం చేస్తుంది. అదేవిధంగా సుక్రేజ్ సమక్షంలో సుక్రోజ్, ఒక గ్లూకోజ్, ఒక ఫ్రక్టోజ్‌గా విచ్ఛిన్నమవుతుంది. ఎరిప్సిన్ ఎంజైమ్ సమక్షంలో పెప్టైడ్‌లు, అమైనో ఆమ్లాలుగా విచ్ఛిన్నం అవుతాయి. ఆంత్రలైపేజ్ సమక్షంలో ట్రైగ్లిసరైడ్స్ అన్నీ కొవ్వు ఆమ్లాలు, గ్లిసరాల్‌గా విచ్ఛిన్నమవుతాయి. ఈవిధంగా జీర్ణమైన ఆహారమంతా చిన్నపేగు మూడో భాగమైన ఇలియంలో రక్తంలోకి శోషణం చెందుతుంది. ఇందుకోసం ఇలియం ఉపరితలమంతా సూక్ష్మ చూషకాలు అనే వేళ్లాకార నిర్మాణాల్లోకి మడతలు పడి ఉంటుంది. ఇవి ఆహార శోషణ ఉపరితల వైశాల్యాన్ని పెంచుతాయి. జీర్ణం కాని వ్యర్థమంతా పాయువు ద్వారా విసర్జితమవుతుంది.

ఆంత్రమూలంలో జీర్ణక్రియ:


జీర్ణాశయంలో జీర్ణక్రియ పూర్తయిన తర్వాత ఆహారం ఆమ్లయుతంగా మారడానికి ఆంత్రమూలంలోకి చేరుతుంది. వెంటనే కాలేయం నుంచి పైత్యరసం, క్లోమం నుంచి క్లోమరసం ఆంత్రమూలంలోకి విడుదలవుతాయి. పైత్యరసంలో ఎంజైమ్‌లు ఉండవు. పైత్యరస వర్ణదాలు, పైత్యరస లవణాలు ఉంటాయి. బైలీరూబిన్, బైలీవర్డిన్ అనే విషరసాయనాలు మలం నుంచి విసర్జితమవుతాయి. సోడియం, పొటాషియంల టారోక్లోరేట్‌లు, గ్లైకోక్లోరేట్‌లు అనేవి పైత్యరస లవణాలు. ఆహారంలోని కొవ్వుల ఎమల్సిఫికేషన్‌ను నిర్వహిస్తుంది.

క్లోమరసంలోని ఎంజైమ్‌లు ఆంత్రమూలంలో జీర్ణక్రియను నిర్వహిస్తాయి. నోటి కుహరంలో జీర్ణం కాని స్టార్చ్‌ను అమిలోప్సిన్ అనే ఎంజైమ్ మాల్టోజ్‌గా విచ్ఛిన్నం చేస్తుంది. ట్రిప్సిన్, కైమోట్రిప్సిన్ అనే ఎంజైమ్‌లు ప్రోటియేజ్‌లు, పెప్టోన్‌లను పెప్టైడ్‌లుగా విచ్ఛిన్నం చేస్తుంది. అదేవిధంగా కొవ్వులను క్లోమరస లైపేజ్ (స్టియాప్సిన్) ట్రైగ్లిజరైడ్స్, కొవ్వు ఆమ్లంగా విచ్ఛిన్నం చేస్తుంది. ఈవిధంగా ఆహారం ఆంత్రమూలంలో జీర్ణమవుతూ క్లోమ, పైత్యరసాలతో కలిసి క్షారయుతంగా మారుతుంది.

దంతాలు:

దవడ ఎముకల్లోని ప్రత్యేక సంచుల లాంటి నిర్మాణాల్లో దంతాలు అమరి ఉంటాయి. క్షీరదాల్లో ఎక్కువగా అసమదంతాలు.. ముఖ్యంగా నాలుగు రకాల దంతాలు ఉంటాయి. కుంతకాలు కొరికే దంతాలు. రదనికలు చీల్చే దంతాలు. ఇవి మాంసాహార జీవుల్లో బాగా అభివృద్ధి చెందుతాయి. అగ్రచర్వణకాలు నమిలే దంతాలు. సాధారణంగా శిశువు పుట్టిన తర్వాత వచ్చేవి పాలదంతాలు. ఇవి 20 ఉంటాయి. ప్రతి దవడ అర్ధభాగంలో రెండు కుంతకాలు, ఒక రదనిక, రెండు చర్వణకాలు ఉంటాయి. ఇవన్నీ ఊడిపోయి మళ్లీ వస్తాయి. ఇలా రెండు సార్లు ఏర్పడే దంతాల సంఖ్య 20. ఆ తర్వాత ఒకే సారి ఏర్పడేవి 12. ఇవ0న్నీ చర్వణకాలు. ఇవి ప్రతి దవడ అర్ధభాగంలో మూడు ఉంటాయి. ఇలా శాశ్వత దంతాలు 32 ఉంటాయి. ప్రతి దవడ అర్ధ భాగంలో రెండు కుంతకాలు, ఒక రదనిక, రెండు అగ్రచర్వణకాలు, మూడు చర్వణకాలు ఉంటాయి. ప్రతి దవడ అర్ధభాగంలోని చివరి చర్వణం జ్ఞాన దంతం. ఇవి మొత్తం నాలుగు ఉంటాయి. 18 నుంచి 31 ఏళ్ల మధ్య ఇవి వస్తాయి. సాధారణంగా దంత నిర్మాణంలో వేరు, మెడ, కిరీటం అనే మూడు భాగాలు ఉంటాయి. బయటకు కన్పించే భాగం కిరీటం. మొత్తం దంతం డెంటిన్ అనే అస్థి పదార్థంతో తయారవుతుంది. కిరీటంపై మెరిసే పింగాణి ((ఎనామిల్) ఉంటుంది. ఇది శరీరంలో అత్యంత గట్టి పదార్థం. దంత విన్యాసాన్ని భిన్నం రూపంలో తెలియజేస్తారు. పైదవడ అర్ధ భాగంలోని దంతాలను కుంతకాలు, రదనికలు, అగ్రచర్వణకాలు, చర్వణకాల క్రమంలో లవంలో, కింది దవడలోని దంతాలను అదే క్రమంలో హారంలో చూపించడాన్నే 'దంతవిన్యాసం' అంటారు

కాలేయం



శరీరంలోని వైవిధ్యమైన విధులను నిర్వహించే అవయవం కాలేయం.

- ఇది శరీరంలో అతి పెద్ద గ్రంథి.
- దీని బరువు 1560 గ్రాములు.
- ఇది విషనిర్మూలన అవయవంగా పనిచేస్తుంది.
- ప్రోత్రాంబిన్, ఫైబ్రినోజన్ అనే రక్త స్కంధన కారకాలు, హెపారిన్ అనే రక్తస్కంధన నివారిణి కాలేయంలోనే ఉత్పత్తి అవుతాయి.
- మూత్రంలో విసర్జించే యూరియా కాలేయంలోనే ఉత్పత్తి అవుతుంది.
- గ్లూకోనియోజెనిసిస్, గ్లైకోజెనిసిస్, గ్లైకోజెనోలైసిస్ ప్రక్రియలు కాలేయంలో జరుగుతాయి.

కొవ్వులో కరిగే విటమిన్‌లు ఎ, డి, ఎఫ్, కెలతోపాటు మరికొన్ని బి-కాంప్లెక్స్ విటమిన్‌లు కాలేయంలో నిల్వ ఉంటాయి.

- మానవ కాలేయంలో నాలుగు లంబికలు ఉంటాయి. క్షీరదాల కాలేయంలో ఐదు లంబికలు ఉంటాయి.
- కాలేయానికి సంబంధించిన శాస్త్రీయ అధ్యయనాన్ని 'హెపటాలజీ' అంటారు.
- ఏకారణం వల్లనైనా కాలేయ విధులకు అవరోధం ఏర్పడితే కామర్లు (జాండిస్) సంభవించే ప్రమాదం ఉంటుంది.
- పిండాభివృద్ధి సమయంలో కాలేయం నుంచి రక్తం, రక్తకణాలు ఏర్పడతాయి.

మాదిరి ప్రశ్నలు

1. శరీరంలో పునరుత్పత్తి శక్తి ఉన్న అవయవం?
   1) క్లోమం 2) కాలేయం
   3) ఉండూకం 4) ప్లీహం
2. చిన్నపేగులోని పొడవైన భాగం?
   1) ఇలియం 2) జెజునం
   3) ఆంత్రమూలం 4) కోలన్
3. పొడవైన రదనికలు ఉన్న జీవి?
   1) సీల్ 2) ఆటర్
   3) వాల్‌రస్ 4) బీవర్
4. కిందివాటిలో అవశేష అవయవం ఏది?
   1) ఉండూకం 2) బాహ్య చెవి
   3) అనుత్రికం 4) పైవన్నీ
5. లాలాజలం pH విలువ?
   1) 5.2 2) 6.7
   3) 7.4 4) 8.0
6. అతి తక్కువ కొవ్వు ఉన్న జీవి?
   1) ఆవు 2) గేదె
   3) మేక 4) ఒంటె
7. పసి పిల్లల జఠర రసంలో ప్రత్యేకంగా కన్పించే ఎంజైమ్?
   1) కెసిన్ 2) రెనిన్
   3) పారాకెసిన్
   4) గ్యాస్ట్రిన్
8. కిందివాటిలో హార్మోన్‌ను గుర్తించండి.
   1) గ్యాస్ట్రిన్
   2) సెక్రిటిన్
   3) ప్యాంక్రియోజైమిన్
   4) పైవన్నీ
9. మానవుడు జీర్ణం చేసుకోలేని పదార్థమేది?
   1) సెల్యూలోజ్ 2) సుక్రోజ్
   3) స్టార్చ్ 4) పైవన్నీ
10. ఏ గ్రంథులను Krypts of Leber-kuhn అంటారు?
    1) లాలా జల గ్రంథులు
    2) క్లోమం 3) జఠర గ్రంథులు
    4) ఆంత్ర గ్రంథులు
11. కిందివాటిలో టేబుల్ షుగర్ ఏది?
    1) మాల్టోజ్ 2) సుక్రోజ్
    3) లాక్టోజ్ 4) స్టార్చ్
12. చిన్న పేగు పొడవు ఎంత?
    1) 6.5 మీ. 2) 8.5 మీ.
    3) 12 మీ. 4) 2 మీ.
13. పిండి పదార్థాలను జీర్ణం చేసే ఎంజైమ్?
    1) ప్రోటియేజెస్ 2) లైపేజెస్
    3) అమైలేజెస్ 4) ఏదీకాదు
14. పిత్తాశయ సంకోచాన్ని ప్రేరేపించే హార్మోన్?
    1) సెక్రిటిన్ 2) గ్యాస్ట్రిన్
    3) ఎంటిరో గ్యాస్ట్రిన్
    4) కొలిసిస్టో కైనిన్

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 4; 5) 2 6) 4; 7) 2; 8) 4; 9) 1; 10) 4 11) 2; 12) 1; 13) 3; 14) 4.

Pointing to a girl, Mr. Suraj said..

Blood Relations

1. P is the brother of Q, M is sister of Q. T is brother of P. How is Q related to T?
   1) Brother 2) Sister
   3) Brother or sister
   4) Data inadequate
   5) None of these

Sol: T and P are brothers of Q
The sex of Q is not given
Therefore, Q is either brother or sister of T

Ans: 3

2. Pointing to a boy, Reema said "He is the son of my grandfather's only child". How is boy related to Reema?
   1) Brother 2) Cousin
   3) Sister 4) Data inadequate
   5) None of these

Sol: Only child of Reema's grandfather means father or mother of Reema.
Therefore, the boy is brother of Reema.

Ans: 1

3. If Ramesh's mother's brother is Alok's father's brother, then Ramesh's mother is Alok's?
   1) Grandmother
   2) Aunt
   3) Cousin
   4) Sister-in-law 5) None of these

Sol: Aunt

Ans: 2


4. B is only child of C's grandfather's only daughter. How is C's father related to B?
   1) Maternal uncle
   2) Paternal Uncle 3) Father
   4) Cannot be determined
   5) None of these

Sol: C's grandfather's only daughter is mother of B.
C is cousin of B. Therefore, C's father is maternal uncle of B.

Ans: 1

5. i) P is the sister of Q
   ii) R is the brother of S
   iii) Q is the mother of R
   iv) T is the father of S
   How is P related to S?
   1) Cousin
   2) Maternal aunt
   3) Niece
   4) Can't be decided
   5) None of these

Sol: P------Q
(f) (f)



P is Maternal Aunt of S.

Ans: 2


6. Pointing to boy Uma said, "He is the son of my mother-in-law's only child. How is the boy related to Uma?
   1) Grandson 2) Son 3) Nephew
   4) Data inadequate
   5) None of these

Sol: Boy is Son of Uma

Ans: 2

7. M is brother of K, P is sister of K, R is father of P. How is K related to R?
   1) Son 2) Daughter
   3) Son or Daughter
   4) Data inadequate
   5) None of these

Sol:



The sex of K is not given
Therefore, K is either son or daughter of R

Ans: 3


8. Pointing to a girl, Mr. Suraj said "She is the only daughter of my father's son-in-law". How is the girl related to Mr. Suraj?
   1) Niece 2) Cousin
   3) Sister 4) Daughter
   5) Can't be determined

Sol: Only daughter of Suraj's brother-in-law is Suraj's niece.

Ans: 1

9. M is brother of K. T is sister of M. J is brother of T. H is father of J. How is K related to H?
   1) Niece 2) Son
   3) Brother 4) Sister
   5) Data inadequate

Sol: Either son or daughter




Ans: 5

Directions (Q.10 & 11): *These questions are based on the following information*
'A × B' means 'A is mother of B'
'A ÷ B' means 'A is son B'
'A + B' means 'A is husband of B'
'A - B' means 'A is sister of B'.

10. Which of the following expressions indicate M is daughter of H?
    1) M – R ÷ H 2) M × R – H
    3) R ÷ M – H 4) H × R – M
    5) None of these

Sol: M – R ÷ H:




Clearly, M is daughter of H

Ans: 1

11. In F ÷ K × V - T, how is V related to F?
    1) Son 2) Niece 3) Nephew
    4) Can't be determined
    5) None of these

Sol: F ÷ K × V - T:




Clearly, V is Sister of F.

Ans: 5

Directions (Q.12 & 13): *These questions are based on the following information*
'P + Q' means 'P is brother of Q'
'P – Q' means 'P is wife of Q'
'P × Q' means 'P is father of Q'
'P ÷ Q' means 'P is daughter of Q'

12. Which of the following expressions indicate T is mother of L?
    1) T – H + L 2) T – H × L
    3) T ÷ H × L 4) T ÷ H + L
    5) None of these


Sol: 2) T – H × L :



Ans: 2

13. In F + M × V ÷ R, How is V related to F?
    1) Daughter 2) Son 3) Niece
    4) Nephew
    5) None of these

Sol: F + M × V ÷ R:






Ans: 3

Directions (Q.14 & 15): *Study the following information carefully and answer the questions given below?*
'P × Q' means 'P is brother of Q'
'P – Q' means 'P is sister of Q'
'P ÷ Q' means 'P is father of Q'
'P + Q' means 'P is mother of Q'

14. Which of the following means 'D is nephew of R'?
    1) D × M ÷ R 2) R - M ÷ D
    3) R – M ÷ D × T
    4) R × M + D 5) None of these


Sol: R – M ÷ D × T:



Ans: 3
Clearly, D is nephew of R.

15. Which of the following means 'M is maternal uncle of T?
    1) M × R + T 2) M × R ÷ T
    3) T × J - N ÷ M 4) M – R + T
    5) None of these

Sol: M × R + T




Clearly, M is maternal uncle of T.

Ans: 1

Directions (Q.16 & 17): *Read the following information carefully and answer the questions which follow:*
'A × B' means 'A is wife of B'
'A + B' means 'A is brother of B'
'A ÷ B' means 'A is daughter of B'
'A – B' means 'A is son of B'

16. Which of the following means 'T is father of P'?
    1) P + Q × R – T
    2) P ÷ R - T × Q
    3) P + Q ÷ R × T
    4) P - Q + T ÷ R
    5) None of these

Sol:




Hence, T is father of P

Ans: 3

17. How is Y related to Z if Y × V + W ÷ Z?
    1) Daughter
    2) Father-in-law
    3) Wife
    4) Daughter - in - law
    5) Can't be determined

Sol: Y × V + W ÷ Z




Clearly, Y is daughter in law of Z.

Ans: 4

Directions (Q.18 & 19): *Read the following information carefully and answer the following questions.*
If 'A × B' means 'A is wife of B'
If 'A + B' means 'A is brother of B'
If 'A ÷ B' means 'A is daughter of B'
If 'A - B' means 'A is son of B'.

18. Which of the following means 'D is father of A'?
    1) A – B × C + D
    2) D ÷ C - B × A
    3) A + B ÷ C × D
    4) D + B × C - A
    5) None of these

Sol:




Hence, D is father of A

Ans: 3

19. How is F related to J if 'F – G ÷ H × J'?
    1) Son 2) Grandson
    3) Son-in-law 4) Father
    5) Grandfather

Sol:




Ans: 2

Directions (Q.20 & 21): *Study the following information and answer the questions that follow.*
M, N, O, P, Q and R are members of a family. There are two married couples. Lawyer is father of Engineer. N is an engineer and is a father of Q. R is grandfather of O and is a lawyer. P is the grandmother of Q and is a housewife. There is one engineer, one lawyer, one teacher, one housewife and two students in the family.

20. Name the two married couples.
    1) NM, OP
    2) NM, RP
    3) OP, MN
    4) MN, QR
    5) MQ, OR
21. What is the profession of M?
    1) Engineer
    2) Lawyer
    3) Housewife 4) Teacher
    5) Student

Sol: (20 & 21): The given information can be depicted as a family tree, which looks like



20. NM, RP:
R is the grandfather of O; P is the grandmother of Q.
Therefore, one of the couples = RP
Obviously, O and Q are students
Therefore, another married couple must be NM.
Ans: 2

21. Teacher.
N is an engineer, R is a lawyer, P is a housewife, O and Q are students. Therefore, M is a teacher.
Ans: 4